
'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 121

శనివారం 22-7-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




భారత్ 438 ఆలౌట్

వెస్టిండీస్‌తో రెండో టెస్టులో కోహ్లి సెంచరీ... రాణించిన జడేజా, అశ్విన్ - 15లో



రికార్డుల ర్యాలీకి 'ఇన్ఫీ' బ్రేక్

సెన్సెక్స్ 888 పాయింట్లు క్రాష్.. 234 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ - 15లో



జ్ఞానవాపిలో శాస్త్రీయమైన సర్వే

కాశీ విశ్వనాథుని ఆలయాన్ని ఆనుకుని ఉన్న జ్ఞానవాపి మసీదులో శాస్త్రీయ సర్వే చేపట్టాలని వారణాసిలోని ఓ కోర్టు ఆదేశాలిచ్చింది.

- వివరాలు 6లో



మోదీతో శ్రీలంక అధ్యక్షుడి భేటీ

శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే మోదీతో భేటీ అయ్యారు. ఆర్థిక భాగస్వామ్య విస్తరణకు ఒక విజన్ డాక్యుమెంట్‌ను ఆమోదించారు.

- వివరాలు 6లో



మోదీ ఇంటిపేరు వ్యాఖ్యల కేసు..

మోదీ ఇంటి పేరు వ్యాఖ్యలపై కేసులో హైకోర్టు తీర్పుని సవాల్ చేస్తూ రాహుల్ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించింది.

- వివరాలు 6లో



ఉప ఎన్నికల్లో సునాక్‌కు నిరాశ

యూకేలో జరిగిన ఉప ఎన్నికలు ప్రధాని రిషి సునాక్‌కు నిరాశను మిగిల్చాయి. కన్జర్వేటివ్ పార్టీ 3 సీట్లలో రెండింటిని కోల్పోయింది.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య పథకానికి కమిటీ



రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు పకడ్బందీగా ఆరోగ్య పథకం అమలుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి హరీశ్ రావు అన్నారు. శుక్రవారం టీఎన్జీఓ సంఘం మంత్రిని కలిసి సమస్యలను దృష్టికి తెచ్చింది.

- వివరాలు 5లో

ఇంటర్ ఆంగ్లంలోనూ ప్రాక్టికల్స్



ప్రస్తుతం ఇంటర్మీడియెట్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీల్లోనే ప్రాక్టికల్స్ పరీక్షలు ఉండగా ఈ ఏడాది నుంచి కొత్తగా ఆంగ్లం సబ్జెక్టులోనూ ప్రాక్టికల్స్ ఉండబోతున్నాయి.

- వివరాలు 5లో

రాజ్యాధికారంలో వాటా ఇవ్వండి



ప్రస్తుత పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లోనే బీసీ బిల్లు ప్రవేశపెట్టి, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు.

- వివరాలు 12లో

ఎన్‌ఐఏ అదుపులో ఆర్కే భార్య శిరీష



మావోయిస్టు అగ్రనేత అక్కిరాజు హరగోపాల్ (రామకృష్ణ అలియాస్ ఆర్కే) సతీమణి శిరీష అలియాస్ పద్మను ఎన్‌ఐఏ ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం ఆలకూరపాడులోని ఆమె ఇంట్లో అదుపులోకి తీసుకుంది.

- వివరాలు 10లో

ఇంటింటి గౌతమ్





భద్రాద్రి పట్టణాన్ని ఆనుకొని చుట్టూ ఉప్పొంగి ప్రవహిస్తున్న గోదావరి

ముసురు తగ్గింది వరద పెరిగింది

- నాలుగు రోజుల తర్వాత శుక్రవారం కాస్త తెరిపి ఇచ్చిన వాన
- రాష్ట్రవ్యాప్తంగా సగటున 4.71 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు
- శని, ఆదివారాల్లో విస్తారంగా వానలు
- శ్రీరాంసాగర్‌లోకి భారీగా ఇన్‌ఫ్లో
- కడెం, ఎల్లంపల్లికి పోటెత్తిన వరద
- భద్రాచలం వద్ద తగ్గిన వరద.. అయినా అప్రమత్తమే!

11లో

'మణిపూర్' రగడ..

పార్లమెంట్‌లో వరుసగా రెండో రోజూ విపక్షాల ఆందోళన

- హింసాకాండపై చర్చకు డిమాండ్
- ప్రధాని మోదీ మౌనం వీడాలని పట్టు
- ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాల హోరు
- స్తంభించిన లోక్‌సభ, రాజ్యసభ
- ఉభయసభలు సోమవారానికి వాయిదా
- ప్రతిపక్ష సభ్యులు అనవసర సమస్యలు సృష్టిస్తున్నారు: రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆగ్రహం



మణిపూర్ అంశంపై శుక్రవారం రాజ్యసభలో ఆందోళన చేస్తున్న ప్రతిపక్ష పార్టీల సభ్యులు

సాక్షి, న్యూఢిల్లీ: మణిపూర్ హింసాకాండ వరుసగా రెండో రోజు శుక్రవారం సైతం పార్లమెంట్‌ను కుదిపేసింది. ఈ అంశంపై తక్షణమే చర్చ ప్రారంభించాలంటూ విపక్షాలు పట్టుబట్టాయి. నినాదాలు, నిరసనలతో హోరెత్తించడంతో ఉభయసభలు స్తంభించాయి. మణిపూర్ అంశంపై చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పలువురు కేంద్ర మంత్రులు ప్రకటించారు. అయినా విపక్షాలు వెనక్కి తగ్గలేదు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెంటనే నోరు విప్పాలని డిమాండ్ చేస్తూ విపక్ష సభ్యులు ఆందోళనకు దిగారు. దీంతో ఎలాంటి కార్యకలాపాలు జరగకుండానే పార్లమెంట్ ఉభయసభలు సోమవారానికి వాయిదా పడ్డాయి. మణిపూర్ అంశంపై 267 నిబంధన కింద పూర్తిస్థాయిలో చర్చించాలని, అనంతరం ప్రధానమంత్రి ప్రకటన చేయాలని ప్రతిపక్షాలు పేర్కొన్నాయి. అయితే, 176 నిబంధన కింద చర్చకు సిద్ధమని కేంద్ర ప్రభుత్వం తేల్చిచెప్పింది. ఇందుకు ప్రతిపక్ష ఎంపీలు అంగీకరించలేదు.

మణిపూర్ రక్తమోడుతోంది

మణిపూర్ అంశంపై లోక్‌సభ, రాజ్యసభలో చర్చించాలని కోరుతూ మంగళవారం ఉదయం ఉభయ సభల ప్రారంభానికి ముందే కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, బీఆర్‌ఎస్ సహా ఇతర పార్టీలు వాయిదా తీర్మానం నోటీసులిచ్చాయి. లోక్‌సభ ఆరంభమైన వెంటనే ప్రతిపక్ష ఎంపీలు తమ స్థానాల్లో లేచి నిల్చున్నారు. ప్లకార్డులు

మిగతా 6వ పేజీలో ▶

హత్యలు, లూటీలు, గృహ దహనాలు

- మే 4న జరిగిన దారుణంపై జూన్ 21న ఎఫ్‌ఐఆర్ నమోదు

6లో

267 వర్సెస్ 176

- 'మణిపూర్'పై ఏ నిబంధన కింద చర్చించాలనే అంశంపై పీటముడి

ఆసరా పింఛన్ రూ.3,016?

ఎన్నికల మేనిఫెస్టోకు తుది మెరుగులు దిద్దుతున్న కేసీఆర్

- దళితబంధు రెండో విడత, గృహలక్ష్మి జాబితాలు...ఇప్పటికే ఉన్న పథకాల లబ్ధి పెంపు.. కొత్త పథకాలకు రూపకల్పన
- మైనారిటీలకూ రూ.లక్ష ఆర్థిక సాయం
- ఉద్యోగులకు రెండో పీఆర్సీ, మధ్యంతర భృతి ప్రకటన
- పథకాల లబ్ధిదారులతో గ్రామాల వారీగా సమావేశాలకు యోచన
- విపక్షాలు ప్రకటిస్తున్న తాయిలాలు, డిక్లరేషన్లపైనా ఫోకస్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రజలను ఆకట్టుకునేలా ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు వ్యూహాలను సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఉన్న పథకాల్లో లబ్ధిని పెంచడం, కొత్త పథకాలను అమలు చేయడంపై దృష్టి సారించారు. ఆసరా పింఛన్లను మరో రూ.వెయ్యి మేర పెంచడం నుంచి స్థలాలున్న పేదలు సొంతిల్లు కట్టుకోవడానికి రూ.3 లక్షలిచ్చే 'గృహలక్ష్మి' పథకాన్ని విస్తారంగా అమలు చేయడం దాకా కీలక అంశాలపై కేసీఆర్ కసరత్తు చేస్తున్నారని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ఎన్నికలకు సంబంధించిన బీఆర్‌ఎస్ మేని ఫెస్టోకు తుదిమెరుగులు దిద్దుతున్నారని అంటున్నాయి. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడే లోపే కొన్ని

మిగతా 2వ పేజీలో ▶


ఇదీ వీళ్ల సంస్కారం!

వెంకటగిరి సభలో ప్రతిపక్షాలపై నిప్పులు చెరిగిన ఏపీ సీఎం వైఎస్ జగన్

వలంటీర్ల వ్యవస్థ వల్ల ప్రభుత్వానికి మంచి పేరు వస్తోందన్న బాధతో, భవిష్యత్‌పై కలత చెందిన చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు, సొంతపుత్రుడు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని, వీరంతా సంస్కార హీనులని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. వెంకటగిరిలో జరిగిన సభలో జగన్ ఏమన్నారంటే..



బాబుగారి వలంటీర్ ఈ దత్తపుత్రుడు.. మన వలంటీర్లు అమ్మాయిలను లోబర్చుకున్నారంటాడా? ఇతను ఇదే కార్యక్రమంగా పెట్టుకుని అమ్మాయిలను లోబర్చుకుని వారిని పెళ్లి చేసుకోవడం, నాలుగేళ్లు కాపురం చేయడం.. మరలా వదిలేయడం.. మళ్లీ ఇంకొకరిని పెళ్లి చేసుకోవడం, మళ్లీ వదిలేయడం.. మళ్లీ పెళ్లి.. మళ్లీ వదిలేయడం.. ఇదే పని. పైగా ఒకరితో వివాహ బంధంలో ఉండగానే ఇంకొకరితో అక్రమ సంబంధం. ఈయన మన వలంటీర్ల క్యారెక్టర్ గురించి మాట్లాడతాడు.



మరో క్యారెక్టర్ వయస్సు 75 ఏళ్లు. అయినా సిగ్గులేదు. టీవీల్లోకి వచ్చి ఒక షోలో మాట్లాడుతూ.. ఆహా బావా.. నువ్వు సినిమాల్లోనే చేశావు. నేను నిజ జీవితంలోనే చేశాను అంటూ.. చేసిన వెధవ పనులను ఆ ముసలాయన గొప్పగా చెప్పుకుంటాడు.



అమ్మాయి కనిపిస్తే చాలు ముద్దన్నా పెట్టాలంట.. లేదా కడుపన్నా చేయాలంటాడు ఇంకొక దౌర్భాగ్యుడు.



పట్టపగలే మందు తాగుతూ పదిమంది అమ్మాయిలతో స్విమ్మింగ్ పూల్ పక్కనే డ్యాన్స్‌లు చేసేవారు ఇంకొకరు. యూట్యూబ్‌లోకి వెళ్లి చూస్తే.. నిస్సిగ్గుగా డ్యాన్స్‌లు చేస్తూ కనిపిస్తాడు.

- వివరాలు 10లో



కవచ్ మరింత భద్రం

- లూప్‌లైన్ వైపూ కన్నేసేలా పరిజ్ఞానానికి పదును
- సిగ్నల్‌కు విరుద్ధంగా, పాయింట్ తప్పుగా మరో లైన్‌కు లింక్ అయి ఉన్నా గుర్తించేలా మార్పులు
- దక్షిణ మధ్య రైల్వే పరిధిలోనే మళ్లీ ట్రయల్స్?
- ఇప్పటికే 15 వందల కిలోమీటర్ల మేర కవచ్ ఏర్పాటు
- దేశంలో పదేళ్లలో 12 వేల కి.మీ. మేర విస్తరించాలని అంచనా -16లో

అదనపు ధాన్యమంతా ఎగుమతులకే

- ఉన్నతస్థాయి సమీక్షలో అధికార యంత్రాంగానికి సీఎం కేసీఆర్ ఆదేశం
- రైతులకు మరింత లాభం చేకూరాలి
- మరో 2 కోట్ల టన్నుల ధాన్యం మిల్లింగ్‌కు తగ్గట్లు కొత్త రైస్‌మిల్లులు
- సీఎంఆర్ సేకరించకుండా ఎఫ్‌సీఐ ఇబ్బంది పెడుతోందని ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: రైతులు పండించిన ధాన్యాన్ని, మిల్లింగ్ చేసిన బియ్యాన్ని సేకరించకుండా ఎఫ్‌సీఐ రాష్ట్రాన్ని ఇబ్బంది పెడుతోందని సీఎం కేసీఆర్ మండిపడ్డారు. కోటీ పది లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం, 4 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లుల్లో ఉందని, ఎఫ్‌సీఐ చర్యలతో ఆహారధాన్యాలు దెబ్బతినే పరిస్థితి నెలకొందని అధికారులు సీఎం దృష్టికి తేవడంతో కేసీఆర్ తీవ్రంగా స్పందించారు. రానున్న రోజుల్లో అదనంగా వరి దిగుబడి కానున్న పరిస్థితుల్లో రైతు పండించిన వరి పంటను పలు రకాల ఆహార ఉత్పత్తులుగా మలిచి ఇతర రాష్ట్రాలకు, దేశాలకు ఎగుమతి చేసేలా యంత్రాంగం చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తద్వారా రైతులకు లాభం చేకూరేలా చూడాలన్నారు. రాష్ట్రంలో ధాన్యం దిగుబడి, సీఎంఆర్ అప్పగింత, బియ్యం తిరస్కరణ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కొత్త మిల్లుల ఏర్పాటుపై సీఎం కేసీఆర్ శుక్రవారం పలువురు మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్షించారు.

అదనపు పంట కోసమే కొత్త మిల్లులు..

'రైతుల సంక్షేమం కోసం భారీగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసి ఇతర రాష్ట్రాలకు, దేశాలకు వరి ఉత్పత్తులు ఎగుమతయ్యేలా చూడాలి. అప్పుడు తెలంగాణ వరికి గిరాకీ పెరిగి రైతులు లాభాలు గడిస్తారు. అదనంగా పండే పంటను దృష్టిలో పెట్టుకొని మాత్రమే నూతనంగా అధునాతన మిల్లులు ఏర్పాటు చేయబోతున్నాం. ఇందుకోసం ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసి విధివిధానాలు ఖరారు చేసి కార్యాచరణ ప్రారంభించనున్నాం. అంతర్జాతీయ స్థాయిలో పేరున్న సటాకె వంటి కంపెనీలతో చర్చించాం. వారితో రేపట్నుంచే ఉన్నతస్థాయి కమిటీ చర్చలు జరిపి ప్రభుత్వానికి నివేదిక అందించాలని ఆదేశించాం' అన్నారు. కాగా, రాష్ట్రంలో అందుబాటులోకి వచ్చిన గౌరవెల్లి, మల్కపేట, బస్వాపూర్ ప్రాజెక్టులతోపాటు మరికొద్ది రోజుల్లో పూర్తికానున్న పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు వల్ల వరి దిగుబడి ప్రస్తుతమున్న ఏటా 3 కోట్ల టన్నుల నుంచి 4 కోట్ల టన్నులకు పెరిగే అవకాశం ఉందన్నారు. సమావేశంలో మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి, సబితా ఇంద్రారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పాల్గొన్నారు.

కమిటీ సభ్యులు వీరే...

రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న రైస్ మిల్లుల సామర్థ్యం కోటి టన్నుల వరకు ఉండగా మరో 2 కోట్ల టన్నుల ధాన్యాన్ని మిల్లింగ్ చేసేలా కొత్త మిల్లుల ఏర్పాటుకు సీఎం కేసీఆర్ ఆదేశించారు. విధివిధానాల ఖరారుకు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సారథ్యంలో కమిటీని ప్రకటించారు. ఇందులో సీఎం కార్యదర్శి స్మితా సబర్వాల్, ఐటీ, పరిశ్రమల ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, టీఎస్‌ఐడీసీ ఎండీ నర్సింహారెడ్డి సభ్యులుగా ఉంటారు.

40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అమ్మేద్దాం!

పౌరసరఫరాల శాఖకు సీఎం ఆదేశం?

రాష్ట్రంలోని రైస్ మిల్లుల్లో నిల్వ ఉన్న ధాన్యంలో 40 లక్షల మెట్రిక్ టన్నులను గ్లోబల్ టెండర్ల ద్వారా విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. మిల్లర్ల సకాలంలో ధాన్యం మిల్లింగ్ చేయకపోవడంతో మిల్లుల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోయాయి. నిర్దేశిత సమయంలో సీఎంఆర్ ఇవ్వకపోవడంతో ఎఫ్‌సీఐ కొర్రీలు పెడుతోంది. దాదాపు 1.10 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం, 4 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లుల్లో నిల్వల నేపథ్యంలో ధాన్యం విక్రయానికి సీఎం కేసీఆర్ ఆదేశించినట్లు తెలిసింది.

బీఆర్‌ఎస్‌ను ఫాం'హౌస్ అరెస్ట్' చేస్తాం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

- ఇక్కడా బుల్డోజర్ సర్కార్ రావాల్సిందే
- అవినీతికి రారాజు కేసీఆర్
- ఏ పార్టీ ఇంత అవినీతికి పాల్పడలేదు
- కల్వకుంట్ల రాజ్యాన్ని కూకటివేళ్లతో పెకలిస్తాం
- పార్టీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన కిషన్‌రెడ్డి

2లో



బాధ్యతలు స్వీకరించిన అనంతరం మాట్లాడుతున్న రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

క్లుప్తంగా...

హయత్‌నగర్ వరకు మెట్రో మార్గం పొడిగించండి

సీఎం కేసీఆర్‌కు ఎంపీ కోమటిరెడ్డి లేఖ



సాక్షి, హైదరాబాద్: ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ (అబ్దుల్లాపూర్ మెట్) వరకు పొడిగించాలని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సీఎం కేసీఆర్‌కు శుక్రవారం ఆయన లేఖ రాశారు. 'హైదరాబాద్ నగరం హయత్‌నగర్ వైపు వేగంగా విస్తరిస్తోంది. చాలామంది ప్రజలు, ఉద్యోగులు ఎల్బీనగర్ వరకు వెళ్లి అక్కడ మెట్రో ఎక్కాల్సి వస్తోంది. ఈ లైన్ పొడిగించే నిమిత్తం కేంద్రానికి ప్రతిపాదనలు పంపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావడం లేదు. జాతీయ రహదారిని విస్తరిస్తే ముందు వాహనాల రద్దీ మరింత పెరగనుంది. అప్పుడు ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు ప్రయాణం దుర్భరమయ్యే అవకాశమున్నందున మెట్రో మార్గాన్ని పొడిగించాలి. ఈ మార్గంలో మెట్రో విస్తరణపై కేంద్రం సానుకూలంగానే ఉంది. ఈ అంశంపై నేను గతంలో కేంద్ర పట్టణాభివృద్ధి వ్యవహారాల మంత్రి హర్దీప్ పూరికి లేఖ కూడా రాశాను. దీనిపై ఆయన స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రూపంలో సమాచారమిచ్చారు. ఈ లేఖపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి' అని సీఎంకు రాసిన లేఖలో కోమటిరెడ్డి కోరారు.

కేటీఆర్ సహచరుల ద్వారా బెదిరిస్తున్నారు

మంత్రి కేటీఆర్‌పై అమిత్‌షా, సీజేఐలకు సుఖేశ్ ఫిర్యాదు

సాక్షి, న్యూఢిల్లీ: మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవితలపై గవర్నర్, సీబీఐ, కేంద్ర హోంశాఖలకు ఫిర్యాదు చేయడంతో కేటీఆర్ తన సహచరులతో బెదిరిస్తున్నారని సుఖేశ్ చంద్రశేఖర్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు లేఖ రాశారు. హవాలా కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న సుఖేశ్ ప్రస్తుతం జైలులో ఉన్న విషయం తెలిసిందే. కేటీఆర్‌పై చేసిన ఫిర్యాదులు వెనక్కి తీసుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని లీగల్ నోటీసులతో బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. వారు తప్పు చేశారు కాబట్టే భయపడి ఫిర్యాదులు వెనక్కి తీసుకోవాలని బెదిరిస్తున్నారన్నారు. తన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకొని సీబీఐతో దర్యాప్తునకు ఆదేశించాలని సుఖేశ్ ఆ లేఖలో కోరారు. సీజేఐకు కూడా సుకేశ్ మరో లేఖ రాశారు.

బీఆర్‌ఎస్‌ను ఫాంహౌస్ అరెస్టు చేస్తాం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న కిషన్‌రెడ్డి. చిత్రంలో బండి సంజయ్, డీకే అరుణ, జవదేకర్, తరుణ్‌చుగ్, ఈటల, రఘునందన్‌రావు తదితరులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో అవినీతి, కుటుంబ, దోపిడీ పాలనకు వ్యతిరేకంగా 'బుల్డోజర్ ప్రభుత్వం' రావాల్సిందేనని కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. 'సీఎం కేసీఆర్ అవినీతికి రారాజు. ఆయన చేయని మాఫియా పని లేదు. దేశంలో ఏ రాజకీయ పార్టీ ఇంత అవినీతికి పాల్పడలేదు. ఈ ప్రభుత్వాన్ని అబిడ్స్ చౌరస్తాలో పాతరేసే దాకా నిద్రపోయేది లేదు. నియంత, దుర్మార్గ, నిరంకుశ కల్వకుంట్ల రాజ్యానికి వ్యతిరేకంగా పోరాటాన్ని మరింత ఉధృతం చేసి కూకటివేళ్లతో పెకిలిస్తాం. ఖబడ్దార్ కేసీఆర్.. బీఆర్‌ఎస్‌ను ఫాంహౌస్ అరెస్టు చేసే సమయం ఆసన్నమైంది..' అని హెచ్చరించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డి శుక్రవారం పార్టీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆ తర్వాత అక్కడ ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. 'తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో జన ప్రభంజనం, నిశ్శబ్ద విప్లవం రానుంది. ఇందులో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కొట్టుకుపోవడం ఖాయం' అని చెప్పారు.

వెయ్యి మంది కేసీఆర్‌లు వచ్చినా...

'వెయ్యి మంది కేసీఆర్‌లు వచ్చి తలకిందులుగా తపస్సు చేసినా, లక్ష మంది అక్బరుద్దీన్, అసదుద్దీన్‌లు వచ్చి తలలు నరుక్కున్నా.. వేలాది మంది రాహుల్ గాంధీలు వచ్చినా 2024లో మోదీ ప్రభుత్వం రాకుండా అడ్డుకోలేరు. ఎంఐఎం, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మూడు పార్టీల్లో దేనికి ఓటేసినా మూడు ముక్కల పార్టీకి వేసినట్లే. ఓల్డ్ సిటీలో ఓ మతతత్వ పార్టీతో పొత్తు పెట్టుకున్న కేసీఆర్.. బీజేపీని మతతత్వ పార్టీ అనడం విడ్డూరం..' అని కిషన్‌రెడ్డి విమర్శించారు.

సమష్టి నిర్ణయాలతో ముందుకెళదాం..

'నేను పార్టీకి అధ్యక్షుడిని కావొచ్చు. సమావేశాలకు అధ్యక్షత వహించవచ్చు. కానీ సీనియర్ నేతలు, పెద్దలు అందరం కలిసి సమష్టి నిర్ణయాలు తీసుకుందాం. కలిసి పోరాటం చేద్దాం..' అని కిషన్‌రెడ్డి చెప్పారు. బీజేపీ ఎప్పుడూ బీఆర్‌ఎస్‌తో పొత్తు పెట్టుకోదని స్పష్టం చేశారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కోసం ఈ నెల 24న జిల్లా కేంద్రాల్లో ధర్నాలకు పిలుపునిస్తున్నామని, 25న ఇందిరాపార్కులో పెద్ద ఎత్తున నిరసన చేపడతామని తెలిపారు.

సంజయ్‌కు మరిన్ని మంచి అవకాశాలు: ప్రకాశ్ జవదేకర్

బండి సంజయ్ రాష్ట్రంలో బీజేపీకి మంచి ఊపు తీసుకొచ్చారని, ఆయనకు పార్టీ మరిన్ని మంచి అవకాశాలు కల్పిస్తుందని బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్ చెప్పారు. మరో నాలుగు నెలల్లో కేసీఆర్‌కు ప్రజలు బై.. బై చెబుతారని, ఇది ఖాయం అని అన్నారు. తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని పార్టీ ప్రధాన కార్యదర్శి తరుణ్ ఛుగ్ చెప్పారు. సామాన్యుల కలలు నెరవేరే రోజు దగ్గర్లోనే ఉందని ఎంపీ డా.కె.లక్ష్మణ్ అన్నారు. పాత కొత్త అనే తేడా లేకుండా అందరూ కలిసి పోరాడి కేసీఆర్‌ను గద్దె దింపాలని జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పిలుపునిచ్చారు.

కేసీఆర్ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలపడం ఖాయం: ఈటల

అందరం కలిసికట్టుగా కేసీఆర్ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలపడం ఖాయమని, రాష్ట్రంలో కాషాయ జెండా ఎగురవేయడం తథ్యమని రాష్ట్ర పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ చెప్పారు. నగరాలకు పరిమితం అనుకున్న పార్టీని బండి సంజయ్ గ్రామస్థాయికి తీసుకెళ్లారని అభినందించారు. కారు (బీఆర్‌ఎస్ గుర్తు) తాళాలు మనం తీసుకోవాలని, తాళాలు తీసుకుంటే కారు ముందుకు వెళ్లదని మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు.

బీఆర్‌ఎస్‌ను ఓడించాలని తెలంగాణ ప్రజలు ఫిక్స్ అయ్యారు

'మేమంతా పోరాటం చేస్తే కేసీఆర్ సీఎం కుర్చీలోకి వెళ్లి కూర్చున్నారు. అందరూ తనకు బానిసలుగా ఉండాలని కోరుకుంటున్నారు. నేను, నా తర్వాత కొడుకు, ఆ తర్వాత మనవడు రాజులుగా ఉంటాం.. మీరెప్పుడూ బానిసలు గానే ఉండాలన్నట్లు సీఎం చూస్తున్నారు. దీనికి వ్యతిరేకంగా బీజేపీ నేతృత్వంలో యుద్ధం ప్రారంభమైంది. బీఆర్‌ఎస్‌ను ఓడించాలని తెలంగాణ ప్రజలు ఫిక్స్ అయ్యారు. కత్తికైనా కనికరం ఉంటుంది కానీ తెలంగాణ ప్రజలకు ఉండదు. రజాకార్లను తరిమిన గడ్డ ఇది. కేసీఆర్ డబ్బు, అధికారం, పోలీసు యంత్రాంగం మా పోరాటాన్ని ఆపలేవు. మమ్మల్ని జైలుకు పంపించినా భయపడేది లేదు. సింహం (బీజేపీ) ఒక అడుగు వెనక్కు వేసిందంటే పది అడుగులు ముందుకు దూకడానికే..' అని కిషన్‌రెడ్డి చెప్పారు.

ఏపీలో పేదలకు 20 లక్షల ఇళ్లు కట్టారు

'కాంగ్రెస్ పార్టీ చేయని మోసం, కుట్ర లేదు. దానిని తలదన్నే విధంగా బీఆర్‌ఎస్ దేశంలోనే అత్యంత అవినీతిమయ ప్రభుత్వంగా మారింది. ఆంధ్రప్రదేశ్‌లో పేదలకు 20 లక్షల ఇళ్లు కడితే పక్క రాష్ట్ర సీఎం కేసీఆర్‌కు సోయి కూడా లేదు. ఉమ్మడి ఏపీలో అప్పటి సీఎం దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి రేషన్‌కార్డులు ఇచ్చారు. ఆ తర్వాత తొమ్మిదేళ్ల కేసీఆర్ హయాంలో ఒక్క కొత్త కార్డు కూడా ఇవ్వకపోవడం దారుణం. 2018 నుంచి కొత్త పెన్షన్లు రాలేదు..' అని అన్నారు.

బాత్రూంలోకి వెళ్లి ఏడ్చా: రాజగోపాల్‌రెడ్డి



'రాష్ట్రంలో బీజేపీకి జోష్ వచ్చిందంటే దానికి కారణం బండి సంజయ్. ఈ రోజు సంజయ్‌ను చూసి కళ్లలో నీళ్లు తిరిగితే బాత్రూంలోకి వెళ్లి ఏడ్చా. కేసీఆర్‌కి వ్యతిరేకంగా సంజయ్ తీవ్రస్థాయిలో పోరాటం చేశారు. సంజయ్‌ను పార్టీ గుండెల్లో పెట్టుకోవాలి. కేసీఆర్ ఢిల్లీ వెళ్లి ఈడీని మేనేజ్ చేశారు.. అందుకే కవిత బయట ఉంది. భవిష్యత్‌లో కేసీఆర్‌ను, ఆయన కొడుకును కూడా కేంద్ర దర్యాప్తు సంస్థలు జైల్లో పెడతాయి. పార్టీ మారతానంటూ నాపై దుష్ప్రచారం చేస్తున్నారు..' అని పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజగోపాల్‌రెడ్డి అన్నారు. బీజేపీ మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్‌రావు, ఎంపీలు ధర్మపురి అర్వింద్, సోయం బాపురావు, పార్టీ నేత పొంగులేటి సుధాకర్ రెడ్డి తదితరులు మాట్లాడారు.

ఢిల్లీ వెళ్లి ఫిర్యాదులు చేయకండి

- కిషన్‌రెడ్డినైనా ప్రశాంతంగా పని చేయనీయండి
- పార్టీ ఈసారి అధికారంలోకి రాకుంటే కష్టం: బండి సంజయ్



భావోద్వేగంగా ప్రసంగిస్తున్న బండి సంజయ్

సాక్షి, హైదరాబాద్: 'కొత్త అధ్యక్షుడినైనా ప్రశాంతంగా పని చేయనీయండి. ఢిల్లీ వెళ్లి ఫిర్యాదులు, రిపోర్టులు ఇవ్వడం మానండి. నమ్ముకుని వెంట వచ్చిన నాయకులు, నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేసే కార్యకర్తల ఆశలను వమ్ము చేయకండి. తెలంగాణలో ఈసారి పార్టీ అధికారంలోకి రాకుంటే కష్టం..' అని రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ చెప్పారు. తనపై కొందరు లేనిపోని ఫిర్యాదులు చేశారని అన్నారు. ఇకనైనా అలాంటి వాటిని పక్కన పెట్టి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం దగ్గర ఏర్పాటు చేసిన సభలో సంజయ్ మాట్లాడారు. 'సీఎం కేసీఆర్ జీవితమంతా మోసాలమయమే. వర్షాలతో ప్రజలు, రైతులు అల్లాడుతుంటే పట్టించుకోని కేసీఆర్.. ఫాంహౌస్‌లో పడుకుని తమాషా చూస్తున్నారు. కొత్త పీఆర్సీని వేస్తున్నట్లు మీడి యాకు లీకులిచ్చి ఉద్యోగులను మరోసారి మోసం చేసేందుకు కుట్ర చేస్తున్నారు. కేసీఆర్ మోసాలను గుర్తించిన ఉద్యోగులు టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఓడించి బీజేపీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డిని గెలిపించారు. పులితోలు కప్పుకున్న గుంట నక్క కేసీఆర్. ఎంఐఎం కోసం మైనారిటీలకు రూ.లక్ష సాయం పేరుతో మోసం చేయాలని చూస్తున్నారు..' అంటూ సంజయ్ ధ్వజమెత్తారు.

నాకు చాలా సంతృప్తినిచ్చింది..

రాష్ట్రంలో బీజేపీని ఈ స్థాయికి తీసుకురావడం తనకు చాలా సంతృప్తినిచ్చిందని, ఇదంతా కార్యకర్తల త్యాగాలు, పోరాటాల వల్లే సాధ్యమైందని సంజయ్ చెప్పారు. కిషన్‌రెడ్డి కమిట్‌మెంట్ ఉన్న నాయకుడని, రాబోయే రోజుల్లో కిషన్‌రెడ్డి నాయకత్వంలో కార్యకర్తలతో పాటు రాష్ట్రంలోని పేదలంతా కుటుంబ పాలనను అంతమొందించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కిషన్ రెడ్డిని ఏ విధంగా అరెస్టు చేసిందో తెలంగాణ సమాజం చూసిందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేసేదాకా సీఎం కేసీఆర్‌ను వదిలిపెట్టే ప్రసక్తే లేదని, ఆయన సంగతి చూస్తామని బండి సంజయ్ అన్నారు.

ఈ 4 నెలల్లోనైనా హామీలు నెరవేర్చండి

- తొమ్మిదేళ్ల అసమర్థ పాలనతో ప్రజలకు తీవ్ర నష్టాలు
- సీఎం కేసీఆర్‌కు కిషన్‌రెడ్డి లేఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ అధికార కాలపరిమితి ముగియనున్న 4 నెలల్లో అయినా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేలా చర్యలు తీసుకోవాలని సీఎం కేసీఆర్‌ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రజలకు సర్కారు ఎన్నో హామీలిచ్చి మోసం చేసిందని ఆరోపించారు. తొమ్మిదేళ్ల అసమర్థ పాలన కారణంగా ప్రజలు తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సీఎంకు కిషన్‌రెడ్డి లేఖ రాశారు. అందులో ప్రజలకు సంబంధించి పలు డిమాండ్లు చేశారు. వీటిని నెరవేర్చాలని, లేకుంటే బీఆర్‌ఎస్ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

ఇవీ డిమాండ్లు..: రైతులకు ఏకమొత్తంలో రూ.లక్ష రుణమాఫీ చేయాలి. రైతులపై పడిన అదనపు వడ్డీ భారాన్ని కూడా ప్రభుత్వమే భరించాలి. • పోడు వ్యవసాయం చేస్తున్న అర్హులైన గిరిజనులను గుర్తించి, తక్షణమే వారికి ఆ భూములపై హక్కులు కల్పిస్తూ పట్టాలివ్వాలి. • నిరుద్యోగులకు తక్షణమే నెలకు రూ.3,016 భృతి ఇవ్వాలి. • రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలి. • కొత్తగా అర్హులైన వారందరికీ తక్షణమే రేషన్‌కార్డులు, పెన్షన్లు మంజూరు చేయాలి. • అర్హతలున్న ప్రతి దళిత కుటుంబానికి తక్షణమే దళితబంధు ఇవ్వాలి. • కులవృత్తులపై ఆధారపడిన వెనుకబడిన వర్గాలకు రూ.లక్ష సాయం ఏమాత్రం సరిపోదు. దీనిని రూ.5 లక్షలకు పెంచాలి. • వెంటనే ఎన్‌ఆర్‌ఐ పాలసీ తీసుకొచ్చి, రూ.500 కోట్లతో ప్రత్యేక నిధి, సెక్రటేరియట్‌లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలి. • ధరణి వల్ల ఉత్పన్నమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలి. నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి.

రాష్ట్ర అధ్యక్షుడిగా నాలుగోసారి..!

- ఉమ్మడి ఏపీలో రెండుసార్లు.. తెలంగాణలో రెండుసార్లు
- భాగ్యలక్ష్మి దేవాలయంలో కిషన్‌రెడ్డి పూజలు
- మహనీయుల విగ్రహాలకు, అమరుల స్తూపం వద్ద నివాళులు



చార్మినార్ వద్ద తల్వార్‌తో కిషన్‌రెడ్డి అభివాదం

సాక్షి, హైదరాబాద్/చార్మినార్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించడం ఇది నాలుగోసారి. ఉమ్మడి ఏపీలో రెండుసార్లు అధ్యక్షుడిగా వ్యవహరించిన కిషన్‌రెడ్డి.. తెలంగాణలో తాజాగా రెండోసారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముందు చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి అమ్మవారి దర్శనం సెంటిమెంట్‌ను కొనసాగిస్తూ అక్కడ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు ఆయనకు కరవాలాన్ని కానుకగా ఇచ్చారు. అనంతరం కిషన్‌రెడ్డి అంబర్‌పేటలో మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ తర్వాత బషీర్‌బాగ్‌లోని శ్రీకనకదుర్గ దేవాలయంలో పూజలు చేశారు. అక్కడికి దగ్గరలోనే ఉన్న బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి, ట్యాంక్‌బండ్ సమీపంలోని డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆ తర్వాత అసెంబ్లీ ఎదుటనున్న సర్దార్ పటేల్ విగ్రహం వద్ద, గన్‌పార్క్‌లో తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. కిషన్‌రెడ్డితో పాటు రాష్ట్ర పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, పార్టీ నేతలు చింతల రామచంద్రారెడ్డి , ఎన్వీఎస్‌ఎస్ ప్రభాకర్, చింతా సాంబమూర్తి, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు ఉన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన నేతలు

అధ్యక్ష బాధ్యతల స్వీకరణకు ముందు పార్టీ కార్యాలయంలో హోమం నిర్వహించారు. బాధ్యతల స్వీకారం సందర్భంగా మాజీ సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ప్రధాన కార్యదర్శి తరుణ్ ఛుగ్, రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాష్ జవదేకర్, పార్టీ నేతలు బండి సంజయ్, నల్లు ఇంద్రసేనారెడ్డి, మురళీధర్‌రావు, ఈటల, రఘునందన్‌రావు, విజయశాంతి, పొంగులేటి సుధాకరరెడ్డి ,వివేక్ వెంకటస్వామి, గరికపాటి మోహన్‌రావు, చాడ సురేష్‌రెడ్డి, కూన శ్రీశైలం గౌడ్, నందీశ్వర్‌గౌడ్, బండా కార్తీక రెడ్డి, తదితరులు కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.

తెలంగాణను వ్యతిరేకించిన వ్యక్తిని

ఎలా ఆహ్వానిస్తారు?

- కిరణ్‌కుమార్‌రెడ్డి రాకపై బీజేపీలో అభ్యంతరాలు!
- అలాంటి సమావేశంలో తానుండలేనన్న విజయశాంతి
- మరికొందరు నేతల్లోనూ వ్యతిరేకత!



సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన రోజే పార్టీ నేతల మధ్య లుకలుకలు బయట పడ్డాయి. కిషన్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి ఉమ్మడి ఏపీ మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డిని ఆహ్వానించడాన్ని, ఆయన సభలో పాల్గొనడాన్ని పార్టీ నేతలు కొందరు తీవ్రంగా వ్యతిరేకించినట్లు తెలిసింది. ఆయనను ఎలా ఆహ్వానిస్తారంటూ మండిపడ్డట్లు తెలిసింది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని తీవ్రంగా వ్యతిరేకించి తెలంగాణకు ఒక్క రూపాయి నిధులు కేటాయించబోమని, ఏమి చేసుకుంటారో చేసుకోండన్న కిరణ్‌కుమార్‌రెడ్డిని ఎలా పిలుస్తారని కొందరు నేతలు పార్టీ నాయకత్వాన్ని పార్టీ జాతీయ కార్యవర్గసభ్యులు కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి, విజయశాంతి, తదితరులు అభ్యంతరం చెప్పినట్టు సమాచారం. ఉద్యమ సమయంలో తనపై కేసులు పెట్టి వేధించిన వ్యక్తిని పిలవడంపై విజయశాంతి నిలదీసినట్టు తెలిసింది. ఇదే తరహాలో రాజ్‌గోపాల్ కూడా అభ్యంతరం వ్యక్తం చేసినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో సభలో పాల్గొన్న విజయశాంతి కొంతసేపటి తర్వాత వెళ్లిపోయారు. అయితే ఆ తర్వాత ఆమె ఒక ట్వీట్ చేశారు. 'కిషన్‌రెడ్డి బాధ్యతల స్వీకార కార్యక్రమం మధ్యలో వచ్చేశానంటూ పాత్రికేయ మిత్రులు నన్ను అడుగుతున్నారు. కానీ అది సరి కాదు. కిషన్‌రెడ్డిని అభినందించి, శుభాశీస్సులు తెలియజేసిన తర్వాతే వచ్చాను. అయితే నాడు తెలంగాణను అత్యంత తీవ్రంగా వ్యతిరేకించి, తెలంగాణ వాదాన్ని ఉక్కుపాదంతో అణిచివేయాలని ప్రయత్నించిన వారు ఉన్నచోట ఉండటం నాకు అసౌకర్యంగా ఉంటుంది. ఆ పరిస్థితి వల్ల ముందుగా వెళ్లవలసి వచ్చింది. అక్కడ చివరి వరకు ఉండటం అసాధ్యం. అందుకే కార్యక్రమం ముగియకముందే వెళ్లిపోవాల్సి వచ్చింది..' అని వివరణ ఇచ్చారు.

నేతల వ్యాఖ్యల కలకలం

కిషన్‌రెడ్డి బీజేపీ పగ్గాలు చేపట్టిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో నేతల ప్రసంగాలు దుమారం రేపుతున్నాయి. సొంత పార్టీలోనే కొందరు తనపై నాయకత్వానికి ఫిర్యాదులు చేశారంటూ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు కలకలం సృష్టించాయి. మరోవైపు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు కూడా చర్చనీయాంశమయ్యాయి. ఢిల్లీ లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కవితను తప్పించేందుకు.. సీఎం కేసీఆర్ ఈడీని మేనేజ్ చేశారని ఆయన అనడం పార్టీ నేతల మధ్య చర్చకు దారితీసింది. కిరణ్‌కుమార్‌రెడ్డి రాకను విజయశాంతి వ్యతిరేకించడం కూడా పార్టీలో చర్చనీయాంశమైంది.

ఆసరా పింఛన్ రూ.3,016?

▶ మొదటి పేజీ తరువాయి

కొత్త పథకాల అమలు కోసం కార్యాచరణ సిద్ధం చేస్తున్నారని పేర్కొంటున్నాయి.

ప్రతిపక్షాలకు దీటుగా ఉండేలా..

కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే యువత, రైతు డిక్లరేషన్లను ప్రకటించింది. ఇతర వర్గాలను ఆకట్టుకునే హామీలు, డిక్లరేషన్లపై కసరత్తు చేస్తోంది. మరోవైపు బీజేపీ కూడా పలు రకాల హామీలను గుప్పిస్తోంది. ప్రజలను ఆకట్టుకునే మార్గాలపై దృష్టిపెట్టింది. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాలు ప్రకటించే హామీలు, మేనిఫెస్టోలకు దీటుగా బీఆర్‌ఎస్ మేనిఫెస్టో ఉండేలా ప్రణాళిక రూపొందుతున్నట్టు పార్టీ వర్గాలు చెప్తున్నాయి. మేనిఫెస్టోలో లేని హామీలను కూడా అమలు చేయడం కేసీఆర్ ప్రభుత్వ ప్రత్యేకత అని, ఎన్నికల షెడ్యూల్ వెలువడే నాటికి అన్ని వర్గాలను సంతృప్తి పరిచేలా తమ కార్యాచరణ ఉంటుందని బీఆర్‌ఎస్ మంత్రి ఒకరు పేర్కొనడం గమనార్హం.

మైనారిటీ వర్గాలకు రూ.లక్ష ఆర్థిక సాయం


రాష్ట్రంలో దళితులకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక చేయూతను అందించే దళితబంధు పథకం 2021లో ప్రారంభమైంది. ఈ పథకాన్ని కొనసాగిస్తూ.. రెండో విడతలో రాష్ట్రంలో 1.30 లక్షల దళిత కుటుంబాలకు లబ్ధి చేకూర్చేందుకు ఎంపిక ప్రక్రియ జరుగుతోంది. ఇదే తరహాలో వెనుకబడిన తరగతుల్లో కులవృత్తులపై ఆధారపడిన 3లక్షల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించే పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే చేపట్టింది. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరుగుతోంది. ఇక సొంత జాగా కలిగిన పేదలు ఇల్లు కట్టుకునేందుకు రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించే 'గృహలక్ష్మి' లబ్ధిదారుల ఎంపికపైనా కసరత్తు జరుగుతోంది. తాజాగా మైనారిటీ వర్గాల వారికి కూడా రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. అధికారులు ఈ పథకానికి సంబంధించిన విధివిధానాలు, లబ్ధిదారుల ఎంపిక మార్గదర్శకాలను రూపొందించే పనిలో ఉన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులను ఆకట్టుకునేలా

తెలంగాణ ఏర్పాటయ్యాక తొలి సవరణ వేతన కమిషన్ (పీఆర్సీ) సిఫార్సుల మేరకు 2018 జూన్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు వేతన సవరణ జరిగింది. తొలి పీఆర్సీ గడువు గత నెలలోనే ముగిసింది. రెండో పీఆర్సీ ఏర్పాటు చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి. ఈ క్రమంలో వీరిని ఆకట్టుకునేలా త్వరలో రెండో పీఆర్సీని ప్రకటించేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. త్వరలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సీఎం కేసీఆర్ భేటీ అయి, మధ్యంతర భృతిపై ప్రకటన చేసే అవకాశం ఉందని బీఆర్‌ఎస్ వర్గాలు చెప్తున్నాయి. ఇక రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో సమావేశాలు ఏర్పాటు చేసిన విధంగా.. ఎన్నికల వేళ గ్రామాల వారీగా లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించినట్టు వెల్లడిస్తున్నాయి.

సామాజిక పెన్షన్ల పెంపు..!

బీఆర్‌ఎస్‌కు అతిపెద్ద ఓటు బ్యాంకుగా భావిస్తున్న సామాజిక (ఆసరా) పింఛన్ల కింద మరింత లబ్ధి చేకూర్చడంపై సీఎం కేసీఆర్ దృష్టి సారించినట్టు సమాచారం. ఇప్పటికే వికలాంగుల పింఛన్‌ను రూ.4,116కు పెంచారు. ఇదే తరహాలో వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళలు తదితర కేటగిరీల వారికి కూడా పింఛన్ మొత్తాన్ని రూ.వెయ్యి మేర పెంచి రూ.3,016 చేయాలన్న ఆలోచన ఉన్నట్టు బీఆర్‌ఎస్ వర్గాలు చెప్తున్నాయి.



The new Seltos is here to take you on an exhilarating drive experience. With an unstoppable attitude, the redesigned Seltos is the new benchmark of badass traits – distinctive design language, connected technology, premium cabin space, and a powerful driving experience. Discover the new Seltos that is here to awaken the badass in you.

Technology. Reborn.

Badass 2.0 redefines the segment, yet again

Dual Screen Panoramic Display



26.03 cm (10.25") HD Touchscreen Navigation + Full Digital Cluster with 26.04 cm (10.25") Color LCD MID give you an immersive and futuristic drive experience.

Most Powerful Turbo Petrol Engine



with 160 ps power, enjoy best-in-class superior performance and fuel efficiency.

Intelligent Dual Zone Fully Automatic Air Conditioner



ensures a comfortable drive for both, the driver and the co-driver.

Voice Activated Dual Pane Panoramic Sunroof



gives you a mesmerising view of the world above.

BOSE Premium Sound System with 8 Speakers



lets you enjoy an elevated audio experience.

Kia Connect* Skill with Amazon Alexa



lets you control your Kia from the comfort of your home.

Host of other Badass Features: Electric Parking Brake with Auto Hold | Smart 20.32 cm (8") Head-up Display | Front Ventilated Seats with 8-Way Power Driver's Seat | Dual Sports Exhaust (1.5 TGDi Only) | Star Map LED Connected Tail Lamps | Sequential LED Turn Indicators | R18 (46.20 cm) Crystal Cut Glossy Black Alloy Wheels | Ambient Mood Lights with LED Sound Mood Lamps | GT Line & X-Line Differentiated Body Kit | Smart Pure Air Purifier with Virus and Bacteria Protection | Star Map Sweeping LED Light Guide | Exclusive Matte Graphite Exterior Color | Premium Sliding Cup Holder Cover

Safety. Reborn.

Badass 2.0 with 17 Autonomous ADAS Level 2 Features^ + Robust 15 Standard Safety Features across variants

Smart Cruise Control with Stop and Go lets you set and maintain any cruising speed for an effortless drive.

Lane Keep Assist and Departure Warning proactively supports in keeping the car within its lane.

Front Collision Warning and Avoidance Assist scans the road ahead to detect and warn you of any impending collision.

Blind Spot Collision Warning looks out for hard-to-spot traffic at the rear of the vehicle.

Leading Vehicle Departure Alert detects and alerts when the vehicle in front begins to move.

Safe Exit Warning alerts in case of an approaching object to ensure you safely exit from the car.

Kia Service

Connected · Adaptive · Responsive · Engage

3 Years Unlimited kms Warranty | Extended Warranty Up to 5 Years | My Convenience Plus Best in Class Cost of Ownership^^ | Scratch Care Program^ | IoT Based Smart Services** | 24x7 | 3 Years Nationwide RSA**

BOOK NOW Call 1800 108 5000 | 093195 91407 | Visit www.kia.com/in | Book Kia Seltos | kiacare@kiaindia.net | Look for "Kia India"@

Scan to know more

Terms & Conditions Apply. *Ex-showroom price all India. The product & feature images shown in this ad is for representation purpose only. Features and specifications as shown may not be part of standard fitment and may vary. The colors shown are subject to availability and may not be available across all variants and may differ slightly from those shown in this ad. Segment is defined as Mid SUV whose length lies between 4 220 - 4 390 mm and width between 1 760 - 1 810 mm. ^Advanced Driver Assistance System (ADAS) is not a substitute for human eye and driver vigilance. It is an assistance feature that enhances driving experience and safety. Effectiveness of ADAS may vary based on actual situation and all objects around vehicle may not be detected. The driver shall remain responsible for safe, vigilant, and attentive driving. *Kia Connect comes with 3-year free subscription. Amazon Alexa device is not a standard car accessory & the customer needs to purchase from a third party. Kia Connect skill features may vary depending on the variant, device compatibility, software, and network availability both in the vehicle and Alexa device. Kia Connect skill is only available in India and can be interacted with in English and Hindi. **RSA coverage across India except Andaman & Nicobar Islands and Lakshadweep. **IoT based workshops for live vehicle tracking for digital experience. ^^Computed cumulatively with all benefits from comprehensive coverage. ^Program coverage includes repair of 1 scratch free cost in an ownership period of 12 months from the date of sale, applicable for all new Seltos retailed up to 31st Dec, 2023. The specifications and features may vary depending on models/ variants. Kia India Pvt. Ltd. (Formerly known as Kia Motors India Private Limited) reserves the right to make any changes with respect to the trims, colors, specifications, Kia Connect features and other details of any model as mentioned in this ad or to discontinue any model without prior notice. For more details visit your local Kia dealership. Kia India Pvt. Ltd. (Formerly known as Kia Motors India Private Limited) urges you to follow traffic rules, these are meant to keep you safe on roads.

FOR INFORMATION CONTACT: TELANGANA: KARIMNAGAR: MALIK KIA, PH: 7730911111, **HYDERABAD: CAR KIA**, JUBILEE HILLS, PH: 7997858880, GACHIBOWLI: PH: 7799906846, **VIHAAN KIA**, KUKATPALLY, PH: 9394812345, **AUTOMOTIVE KIA**, KONDAPUR, PH: 6309908117, NAGOLE, PH: 6309908118, **KHAMMAM: AUTOMOTIVE KIA**, PH: 6309908189, **MAHBUBNAGAR: AUTOMOTIVE KIA**, PH: 9704111425, **NALGONDA: AUTOMOTIVE KIA**, PH: 6309908183, **SECUNDERABAD: VIHAAN KIA**, PH: 9738312345, **WARANGAL: MALIK KIA**, PH: 9703433333, **ANDHRA PRADESH: ANANTAPUR: MGB KIA**, PH: 8333929195, **BHIMAVARAM: SIMHA KIA**, PH: 8688836544, **CUDDAPPAHA: HOSHI KIA**, PH: 8688829739, **GUNTUR: SIMHA KIA**, PH: 8688836566, **KAKINADA: KANTIPUDI KIA**, PH: 7799740208, **KURNOOL: MGB KIA**, PH: 8500963906, **NELLORE: HOSHI KIA**, PH: 8688829718, **RAJAHMUNDRY: KANTIPUDI KIA**, PH: 7799740208, **TIRUPATI: HOSHI KIA**, PH: 8688829739, **VIJAYAWADA: SIMHA KIA**, PH: 8688836501, **VISHAKHAPATNAM: LAKSHMI KIA**, PH: 7997815777,

INNOCEAN-050/23

ప్రత్యక్ష దైవమైన సూర్యుడు మాకు శుభాన్ని కలుగజేయుగాక!
ఆపదల నుండి గరుత్మంతుడు రక్షించి మాకు శుభాన్ని అనుగ్రహించుగాక!
బృహస్పతి ఆధ్యాత్మిక ఐశ్వర్యాన్నిచ్చి మాకు శుభాన్ని ప్రసాదించుగాక!
– హిందూ ధర్మం

సాక్షి

శనివారం, 22 జూలై 2023

లంకకు స్నేహహస్తం

'నేను రణిల్ విక్రమసింఘేను... రణిల్ రాజపక్సను కాదు' అన్నారు శ్రీలంక అధ్యక్షుడు విక్రమసింఘే భారత్ పర్యటనకొచ్చేముందు. అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి ఏడాది కావొస్తుండగా తన తొలి విదేశీ పర్యటనకు ఆయన మన దేశాన్నే ఎంచుకున్నారు. సందర్భం ఏమైనా కావొచ్చుగానీ, రణిల్ అలా వ్యాఖ్యానించక తప్పని పరిస్థితులైతే శ్రీలంకలో ఈనాటికీ ఉన్నాయి. రణిల్‌ను ఇప్పటికీ రాజపక్స ప్రతినిధిగానే చాలామంది పరిగణిస్తున్నారు. నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్నంటి, ఎక్కడా అప్పుపుట్టని స్థితి ఏర్పడిన పర్యవసానంగా నిరుడు జనాగ్రహం కట్టలు తెంచుకుని అప్పటి దేశాధ్యక్షుడు గొటబయ రాజపక్స, ఆయన కుటుంబీకులు దేశం విడిచి పారిపోవాల్సి వచ్చింది. అనంతర కాలంలో ఐఎంఎఫ్ 290 కోట్ల డాలర్ల రుణం ఇవ్వడానికి అంగీకరించాక దేశం కాస్త కుదుటపడిన మాట వాస్తవమే అయినా ఇప్పటికీ సుదీర్ఘ విద్యుత్ కోతలు, ఆహార సంక్షోభం, అధిక ధరలు పీడిస్తున్నాయి. సుమారు 68 శాతం మంది జనాభా అర్ధాకలితో గడుపుతున్నారని గణాంకాలు చెబుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో విక్రమసింఘే భారత పర్యటనకొచ్చారు. ఆపత్సమయాల్లో ఆదుకోవటం నిజమైన మిత్ర ధర్మం. భారత్ ఆ ధర్మాన్ని పాటిస్తోంది. ఆహారం, మందులు, ఇంధనంతో సహా మానవతా సాయం కింద మన దేశం రణిల్ ఏలుబడి మొదలయ్యాక 400 కోట్ల డాలర్ల సహాయం అందించింది. ఆ తర్వాతే ఐఎంఎఫ్ రుణం మంజూరైంది. శ్రీలంక దాదాపు 8,300 కోట్ల డాలర్ల మేర అప్పుల్లో కూరుకుపోగా, అందులో సగం విదేశీ రుణాలే.

హిందూ మహాసముద్రంలో భౌగోళికంగా అత్యంత కీలక ప్రాంతంలో ఉండటం లంకకు వరం. మన దేశం నుంచి ఎప్పటినుంచో సాయం పొందుతున్న శ్రీలంకకు పదిహేనేళ్ల క్రితం చైనా స్నేహ హస్తం అందించటంలోని మర్మం అదే. ఎల్‌టీటీఈని ఎదుర్కొనడానికి కావాల్సిన 370 కోట్ల డాలర్ల విలువైన ఆయుధాలు, మందుగుండు, ఎఫ్ 7 జెట్ ఫైటర్లు, విమాన విధ్వంసక తుపాకులు, జేవై–11 రాడార్ ఇవ్వటంతో లంక, చైనాల మధ్య అనుబంధం పెరిగింది. ఆ తర్వాత వ్యూహాత్మక సహకార భాగస్వామ్యం కింద నాటి అధ్యక్షుడు మహిందా రాజపక్స చైనాకు తలుపులు బార్లా తెరిచారు. నౌకాశ్రయాల కోసం చైనా సాయం తీసుకున్నారు. అప్పటినుంచి కథ అడ్డం తిరిగింది. దేశంలో మౌలిక సదుపాయాల రంగంలో నిర్మించిన 70 శాతం ప్రాజెక్టులు చైనావే. ఒక్క హంబన్‌టోటా నౌకాశ్రయ నిర్మాణం కోసమే ఏటా 3 కోట్ల డాలర్ల వడ్డీ చెల్లించాల్సి వచ్చేది. సింగపూర్‌కు గట్టి పోటీ ఇస్తుందనుకున్న హంబన్‌టోటా నౌకాశ్రయం పడకేసింది. దాన్ని నిర్వహించటం చేతకాక 99 ఏళ్లపాటు చైనాకు ధారాదత్తం చేయడానికి లంక అంగీకరించాల్సివచ్చింది. ఏమైతేనేం శ్రీలంక విదేశీ రుణాల్లో 10 శాతం చైనావే. కానీ నిరుడు ఆర్థిక సంక్షోభం తలెత్తిన సమయంలో ఆ రుణాలపై కనీసం వడ్డీ మాఫీకి కూడా చైనా సిద్ధపడలేదు. ఒక లెక్క ప్రకారం 2025 వరకూ శ్రీలంక ఏటా 400 కోట్ల చొప్పున రుణాలు చెల్లించాల్సిన స్థితిలో పడింది. గత ఏణ్ణర్థంగా సాగుతున్న రష్యా–ఉక్రెయిన్ యుద్ధం దేశాన్ని మరింత కుంగదీసింది. లంకనుంచి తేయాకు దిగుమతుల్లో రష్యా అగ్రభాగాన ఉండేది. కానీ యుద్ధం కారణంగా అవి గణనీయంగా నిలిచిపోయాయి. ఇక అటు రష్యా నుంచీ, ఇటు ఉక్రెయిన్ నుంచీ టూరిస్టుల రాక పడిపోయింది. మన దేశం నుంచీ, ఐఎంఎఫ్ నుంచీ అందుతున్న సాయం లంకను ఇప్పుడిప్పుడే ఒడ్డుకు చేరుస్తోంది. భారత్ నుంచి వెళ్తున్న టూరిస్టుల కారణంగా లంక పర్యాటకం పుంజుకుంటున్నదనీ, దాని విదేశీ మారకద్రవ్య నిల్వలు పెరుగుతున్నాయనీ శుక్రవారం మన విదేశాంగ శాఖ కార్యదర్శి వినయ్ మోహన్ క్వాత్రా అనడంలో అతిశయోక్తి లేదు. మన ఇతిహాసం రామాయణం లంకతో ముడిపడి వుంటుంది. అలాగే బౌద్ధానికి సంబంధించి అనేక చారిత్రక ప్రదేశాలు అక్కడున్నాయి. ఇవన్నీ ఇక్కడినుంచి వెళ్లే యాత్రీకులకు ప్రత్యేక ఆకర్షణ. కానీ నిరంతర విద్యుత్ కోతలు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ) రంగాన్ని కుంగదీస్తున్నాయి. కనీసం జెనరేటర్లతో నడిపిద్దామన్నా ఇంధన కొరత పీడిస్తోంది. దేశ జీడీపీలో ఈ రంగం వాటా 52 శాతం. పరిశ్రమల్లో వీటి వాటా 75 శాతం. ఉపాధి కల్పనలోనూ దీనిదే ఆధిక్యత. అందుకే పెట్రోలియం ఉత్పత్తుల సరఫరా కోసం శ్రీలంకకు పైప్ లైన్ నిర్మించే అంశాన్ని అధ్యయనం చేయాలని రెండు దేశాలూ నిర్ణయించాయి. ద్వైపాక్షిక సంబంధాలను పటిష్టం చేసుకోవటం, ఇంధనం, ఆర్థిక, డిజిటల్ రంగాల్లో భారత్‌తో భాగస్వామ్యం తదితర అంశాల్లో ప్రధాని నరేంద్ర మోదీ, రణిల్ మధ్య ఒప్పందాలు కుదిరాయి.

అయితే ఇరు దేశాల మధ్యా సమస్యలు లేకపోలేదు. లంక ఉత్తర తీరంలోని తమిళ జాలర్ల జీవనానికి భారత్ నుంచి వచ్చే చేపల బోట్లు గండికొడుతున్నాయని లంక ఆరోపిస్తోంది. సరిగ్గా మన ఆరోపణ కూడా ఇలాంటిదే. తమ సాగర జలాల పరిధిలో చేపలు పడుతున్నారన్న సాకుతో తరచు లంక నావికాదళం తమిళ జాలర్లను నిర్బంధిస్తోందనీ, గత రెండేళ్లుగా 619 మంది జాలర్లు అక్కడి జైళ్లలో మగ్గుతున్నారనీ తమిళనాడు సీఎం స్టాలిన్ మోదీ దృష్టికి తీసుకొచ్చారు. గతంలో మన దేశం అప్పగించిన కచ్చాతీవు దీవిని వెనక్కు తీసుకోవాలని కోరారు. ఇక లంక తమిళులకు గతంలో ఇచ్చిన వాగ్దానం మేరకు వారు నివసించే ప్రాంతంలో ఎన్నికలు నిర్వహించాలనీ, స్వయంపాలనకు అవకాశమీయాలనీ, వారు గౌరవప్రదంగా జీవించటానికి తోడ్పడాలనీ మన దేశం అడుగుతోంది. రణిల్ తాజా పర్యటన ఇలాంటి సమస్యల పరిష్కారానికి దోహదపడితే ఇరు దేశాల సంబంధాలూ భవిష్యత్తులో మరింత పటిష్టమవుతాయి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు,
అధిక శ్రావణ మాసం, తిథి: శు.చవితి ఉ.6.15 వరకు
తదుపరి పంచమి, నక్షత్రం: పుబ్బ ప.2.45 వరకు
తదుపరి ఉత్తర, వర్జ్యం: రా.10.35 నుండి 12.21 వరకు,
దుర్ముహూర్తం: ఉ.5.39 నుండి 7.22 వరకు,
అమృతఘడియలు: ఉ.7.40 నుండి 9.26 వరకు.

సూర్యోదయం: 5.39
సూర్యాస్తమయం: 6.33
రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు

ఉమ్మడి బాటలో భిన్నాభిప్రాయాలు

ఆదేశిక సూత్రాలకే పరిమితమైన ఉమ్మడి పౌర స్మృతి(యూసీసీ) అంశం మళ్లీ తెరమీదికొచ్చింది. వివాహం, విడాకులు, వారసత్వం, దత్తత, పోషణ, భరణం వంటి కుటుంబ, వ్యక్తిగత అంశాల్లో ఒకే పౌర నియమాలను రూపొందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆదేశిక సూత్రాలలో చేర్చడమంటే ఒక విస్తృత ప్రయోజనమున్న చట్టాన్ని బీరువాలకు పరిమితం చేయడం కాదనీ, దేశ ప్రజలందరికీ ఒకే చట్టం ఉండాలన్నది ప్రజాస్వామిక వ్యవస్థకు గీటురాయనీ ఒక వాదన. అదే ఆదేశిక సూత్రాలలో ఉన్న సమానత్వం, విద్య, వైద్యం, ఉపాధి వగైరా లాంటి అంశాలకు చట్టాలు ఎందుకు చేయరనీ, ఇది కేవలం ఎన్నికల ఎత్తుగడ మాత్రమేననీ మరొక వాదన.

సమానత్వ సిద్ధాంతం

అభిప్రాయం



పి. వేణుగోపాల్ రెడ్డి

మిగిలిన చట్టాల మాదిరిగానే ఉమ్మడి పౌర స్మృతి(యూసీసీ) కూడా 1948 లోనే రాజ్యాంగంలో ఒక చట్టంగా చోటు చేసుకోకపోవడానికి ప్రధాన కారణం, ఆనాటి పరిస్థితులు. అందరికీ మానసిక సంసిద్ధత సమకూరిన తరువాతనే దానిని తెచ్చే ఆలోచన చేయడం మంచిదన్నది ఒక దశలో రాజ్యాంగ పరిషత్ అనివార్యంగా తీసుకున్న నిర్ణయం. ఫలితంగానే ఆ ఆలోచన ఆదేశిక సూత్రాలకు (44వ అధికరణ) పరిమితమైంది. ప్రపంచ చరిత్రలోనే అత్యంత హింసాత్మక, విషాద ఘట్టంగా చెప్పుకొనే భారతదేశ విభజన, నాటి మత ఉద్రిక్తతలు రాజ్యాంగ పరిషత్ పెద్దలను అలాంటి వాయిదా నిర్ణయానికి పురిగొల్పాయి.

ఆదేశిక సూత్రాలలో చేర్చడమంటే ఒక విస్తృత ప్రయోజనమున్న చట్టాన్ని బీరువాలకు పరిమితం చేయడమైతే కాదు. దేశ ప్రజలందరికీ ఒకే చట్టం ఉండాలన్నది ప్రజాస్వామిక వ్యవస్థకు గీటురాయి. మతసూత్రాల ఆధారంగా పర్సనల్ లా చెల్లుబాటు అయితే రాజ్యాంగమే చెబుతున్న సెక్యులరిస్టు వ్యవస్థలో ఆ భావనకే భంగపాటు. షాబానో విడాకుల కేసు, మనోవర్తి వివాదం మొదలు (1985) ఇటీవలి కాలం వరకు సుప్రీంకోర్టు కూడా ఉమ్మడి పౌర స్మృతి గురించి కేంద్రానికి గుర్తు చేయడమే కాదు, ఒక సందర్భంలో నిష్ఠూరమాడింది కూడా.

రాజకీయ చర్చలు, చట్టసభలలో వాగ్యుద్ధాల స్థాయి నుంచి ఎన్నికల హామీ వరకు ఉమ్మడి పౌర స్మృతి ప్రయాణించింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 1948 నవంబర్ 23న తొలిసారి దీని రూపకల్పన ఆలోచన తెరమీదకు వచ్చింది. రాజ్యాంగ పరిషత్‌లో ఈ ప్రస్తావన తెచ్చినవారు కాంగ్రెస్ సభ్యుడు మీను మసానీ. ఇప్పుడు ఆ పార్టీ ఈ అంశం మీద నీళ్లు నమలడం ఒక వైచిత్రి. అంబేడ్కర్, నెహ్రూ, పటేల్, కృపలానీ వంటి వారంతా దీనిని సమర్థించారు. దీని గురించి ప్రతికూల వైఖరి తీసుకుంటున్నవారు ఈ చట్టం ద్వారా మేలు పొందేది మహిళలే అన్న వాస్తవాన్ని విస్మరించకూడదు. రాజ్యాంగ పరిషత్‌లో హన్సా మెహతా సహా 15 మంది మహిళలు దీని కోసం తపించారు. ఈ స్ఫూర్తి బుజ్జగింపు ధోరణిలో కొట్టుకుపోకుండా చూసుకోవలసిన బాధ్యత ఇవాళ్టి కాంగ్రెస్ పార్టీ నాయకత్వానిదే. ఉమ్మడి పౌర స్మృతితో దేశం సంతరించుకునే అంశాలుగా చెప్పినవి: స్త్రీ పురుష సమానత్వం, జాతీయ సమైక్యత, సమగ్రత, లౌకికవాదం, వ్యక్తిగత హక్కుల రక్షణ, న్యాయవ్యవస్థ ఆధునీకరణ, భిన్న ఆచారాల సమన్వయం. ఇవన్నీ స్వాతంత్ర్యం వచ్చిన ఏడున్నర దశాబ్దాలకు కూడా పౌరులందరికీ సమానంగా లేక పోవడం ఒక దుఃస్థితిని సూచిస్తుంది.



మద్రాస్ నుంచి రాజ్యాంగ పరిషత్‌కు ఎన్నికైన మహమ్మద్ ఇస్మాయిల్ దీన్ని వ్యతిరేకించినవారిలో మొదటివారు. నజీరుద్దీన్ అహ్మద్, మెహబూబ్ అలీ బేగ్, బి.పోకార్ సాహెబ్, అహమ్మద్ ఇబ్రహీం, హస్రత్ మొహానీ ఆయన వెనుక నిలిచారు. ఈ వ్యతిరేకతను వ్యక్తం చేయడానికి వారు ఎన్నుకున్న నినాదం 'ఇంక్విలాబ్ జిందాబాద్'. ఇది కూడా ఒక చారిత్రక వైచిత్రి. వీరి వాదనలోని అంశాలు తమ మత, సాంస్కృతిక అస్తిత్వాన్ని కాపాడుకోవడం, ఉమ్మడి పౌర స్మృతి వస్తే ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లుతుందని చెప్పడం. ఇప్పుడు కూడా అవే కారణాలు వినిపిస్తున్నాయి. అందుకే దీని మీద చర్చ అనివార్యం. ఇందుకు దోహదం చేస్తున్నదే 22వ లా కమిషన్ పిలుపు.

ఏదో ఒక కాలంలో ప్రతి మతం స్త్రీని చిన్నచూపు చూసిన మాట వాస్తవం. ఒకనాడు హిందూధర్మం కూడా ఇలాంటి బంధనాలలోనే ఉన్నా, హిందూ కోడ్‌తో చాలావరకు ఆ దుఃస్థితి నుంచి మహిళకు రక్షణ దొరికింది. ఇలాంటి రక్షణ ఏ మతం వారికైనా లభించాల్సిందే. విడాకులు, వివాహం వంటి వ్యక్తిగత అంశాల్లో దేశ పౌరులందరికీ ఒకే న్యాయం అందించాలన్నదే యూసీసీ ధ్యేయం. విడాకులు పొందిన మహిళ ఎలాంటి ఆంక్షలు లేకుండా పునర్ వివాహం చేసుకునే వెసులుబాటు, దత్తత చట్టం అందరికీ ఒకే విధంగా ఉండడం కూడా ఇందులో భాగమే. ఆస్తిహక్కుకు, వివాహ వయసు 21 సంవత్సరాలు వంటి నియమాలకు మత, వర్గ, ప్రాంతాలతో నిమిత్తం లేకుండా యూసీసీ పాటు పడుతుంది. ఇవన్నీ స్వాగతించవలసిన అంశాలు.

13వ శతాబ్దానికి చెందిన అల్లావుద్దీన్ ఖిల్జీ కూడా ఢిల్లీ మత పెద్దను కాదని షరియాలో మార్పులు తెచ్చాడు. 1937 నుంచి మాత్రమే భారతీయ ముస్లింలు అమలు చేసుకుంటున్న ముస్లిం పర్సనల్ లా విషయంలో ఇంత రాద్ధాంతం చేయడంలో అర్థం కనిపించదు. అలా అని ఆ పర్సనల్ లా యథాతథంగా అమలు చేయగలిగే శక్తి, కాఠిన్యం ఇవాళ వారిలోనూ లేవు. పాకిస్తాన్, ఈజిప్ట్, ట్యునీషియా వంటి దేశాల అనుభవాలు కూడా పర్సనల్ లా శిలాశాసనం కాదనే రుజువు చేస్తున్నాయి. సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ ఇటీవలనే హదిత్ (ముస్లిం న్యాయసూత్రాలు) పునర్ నిర్మాణానికి ఒక సంఘాన్ని నియమించారు. ఈ న్యాయసూత్రాలు ఉగ్రవాదానికి తోడ్పడకుండా ఉండేందుకు ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారని వార్తలు వచ్చాయి. యూసీసీని బీజేపీ తీసుకువచ్చే ప్రయత్నంలో ఉన్నది కాబట్టి అది హిందువుల కోసమేనని చెప్పడం ఆత్మవంచన. రాజ్యాంగ చరిత్ర ఒక మలుపు తీసుకుంటున్న సమయంలో మోకాలడ్డే ప్రయత్నం సరికాదు.

వ్యాసకర్త 'ఏకలవ్య ఫౌండేషన్' వ్యవస్థాపక ఛైర్మన్
pvg2020@gmail.com

ఎన్నికల రాద్ధాంతం

అభిప్రాయం



సంగిరెడ్డి హనుమంత రెడ్డి

''ఒక ఇంట్లో ఒకరికి ఒక చట్టం, మరొకరికి మరొక చట్టం ఉంటే ఆ ఇల్లు నడుస్తుందా? అలాంటి కపట వ్యవస్థతో దేశం ఎలా పనిచేస్తుంది?'' అన్నారు బీజేపీ ఎన్నికల కార్యకర్తల సభలో ప్రధాని మోదీ. ఈ చర్చ సరైన వేదికపై చేయాలి. ప్రజలను రెచ్చగొట్టరాదు. ప్రశాంత జీవనానికీ, భిన్న కుల, మత, జాతి, సంస్కృతుల మధ్య భారతీయతకూ 'భిన్నత్వంలో ఏకత్వం' కారణం. ఈ భిన్నత్వం స్థానంలో వైదిక ఏకత్వాన్ని రుద్దాలన్నది 'సంఘ్' ఆకాంక్ష.

ఈ పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లోనే ఉమ్మడి పౌర స్మృతి(యూసీసీ) చట్టాన్ని తేవాలన్నది మోదీ ఆలోచన. ఎన్నికలకు ముందు ముస్లిం మహిళల న్యాయసాధనకు పూనుకుంటారాయన. హిందూ స్త్రీలను పట్టించుకోరు. సాధికారితకు మహిళా రిజర్వేషన్ చట్టం చేయరు. యూసీసీని అమలు చేయమని సుప్రీంకోర్టు అనేక సందర్భాలలో ఆదేశించినా ప్రభుత్వాలు పట్టించుకోలేదు. 2024 ఎన్నికల లబ్ధికి ఇప్పుడు ఈ చట్టాన్ని ముందుకుతెచ్చారు.

వివాహం, విడాకులు, వారసత్వం, దత్తత, పోషణ, భరణం వంటి కుటుంబ, వ్యక్తిగత అంశాల్లో ఒకే పౌర నియమాలను రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వివిధ మతాల ప్రజలు తరతరాలుగా ఆచరిస్తున్న పద్ధతులు, సంప్రదాయాలు అనేకం ఉన్నాయి. భార్యాభర్తలకు, కూతురు కొడుకులకు వేరువేరు దుస్సంప్రదాయాలున్నాయి. అయితే భావజాలం కుదరని చోట చట్టాలతో, చట్టాలు పనిచేయనిచోట భావజాలంతో వీటిని సరిదిద్దాలి.

ఏకరీతి పౌరసూత్రాల ప్రస్తావన ప్రాథమిక హక్కుల్లో లేదు. రాజ్య విధానాల ఆదేశిక సూత్రాలు ఆసక్తికరమైనవి. వీటి ప్రకారం ప్రభుత్వం శాసన, కార్యనిర్వాహక విధులు నిర్వహించాలి. ఇవి మార్గదర్శకాలే. వీటిని న్యాయవ్యవస్థ ద్వారా అమలుచేయలేము. వీటిని న్యాయస్థానాలలో సవాలు చేయగల చట్టాలను చేయరాదు. సంస్కరణల ద్వారా ఈ సూత్రాలను సాధించాలి. దేశ పౌరులకు ఏకరీతి పౌర నియమావళిని పదిలపర్చే పని రాజ్యం చేయాలని ఆదేశిక సూత్రం 44 చెప్పింది. ఒకేసారి చట్టం చేయరాదనీ, సంస్కరణలతో సాధించాలనీ వివరించింది. ఆదేశిక ఆదేశాలలో సమానత్వం, విద్య, వైద్యం, ఉపాధి, జీవన వేతనాలు, పోషకాహార సరఫరా వగైరా చాలా అంశాలున్నాయి. వీటి అమలుకు మాత్రం చట్టాలు చేయరు.

యూసీసీ అమలులో చిక్కులున్నాయి. దీనిపై ఇప్పటి వరకు జరిగిన రాజ్యాంగ, శాసన చర్చలను పరిగణించాలి. విభిన్న జాతుల, మతాల దేశంలో ఇది ఆచరణ సాధ్యం కాదని తేల్చింది. ఇది కోరదగ్గదే కాని ఐచ్ఛికంగా ఉండాలన్నారు రాజ్యాంగ ముసాయిదా సభ అధ్యక్షులు అంబేడ్కర్. యూసీసీ కంటే వివిధ కుటుంబ సంస్కరణలు స్త్రీ, శిశువుల శ్రేయస్సుకు హామీనివ్వగలవు. యూసీసీ ముస్లింల పైనే కాదు, ఇతర అల్పసంఖ్యాక వర్గాలపై, గిరిజనులపై కూడా దుష్ప్రభావం చూపుతుంది. ఇది అనవసరం, అవాంఛనీయం అని 21వ లా కమిషన్ చెప్పింది. అయినా మరలా 22వ లా కమిషన్‌కు నివేదించడం, అదీ 30 రోజుల స్వల్ప వ్యవధిలో ప్రభావితుల అభిప్రాయాలు కోరడం ఆశ్చర్యం.

అన్ని మతాల వ్యక్తిగత చట్టాలు మధ్యయుగ మహిళా ద్వేషాలే. ఈ విషయంపై చర్చ జరగదు. 'సంఘ్' ముస్లిం వ్యక్తి చట్టాలనే విమర్శిస్తుంది. వైదికమత నియంతృత్వాన్ని స్థాపిస్తుంది. మత స్వేచ్ఛ హక్కునిచ్చే అధికరణ 25, మత సంస్థల స్థాపన, నిర్వహణ హక్కులను కల్పించే అధికరణ 26, మత మైనారిటీలకు ప్రత్యేక హక్కులనిచ్చిన అధికరణ 29లను యూసీసీ బలహీనపరుస్తుంది.

ఉన్న చట్టాలను అమలుచేస్తూనే ఏకీకృతాన్ని సాధించవచ్చు. హిందువులకు కులరహిత ఏకరీతి సూత్రాలను శాసించాలి. ఆ తర్వాతే ఆదేశిక సూత్రాల జోలికి పోవాలి. మోదీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని, రాజ్యాంగ హక్కులను, ప్రజాస్వామ్య విలువలను, దేశ సమాఖ్య తత్వాన్ని, సమానత్వ అధికరణలను తుంగలో తొక్కింది. అధికరణ 47 ప్రకారం ప్రజారోగ్యానికి పోషకాహార స్థాయి, జీవన ప్రమాణాలను పెంచాలి. ఆరోగ్యానికి హానికరమైన మత్తుపానీయాలను, మాదక ద్రవ్యాలను నిషేధించాలి. యూసీసీ కంటే ఇవి చాలా ముఖ్యం.

సంఘ్‌కు ముస్లింల గుంపు కావాలి. వారిని చూపి హిందుత్వవాదులను రెచ్చగొట్టాలి. అయితే ప్రతిపక్షాలు దీనికి లౌకిక పౌర ప్రత్యామ్నాయ విరుగుడు పద్ధతులను చేపట్టలేదు. ఇప్పుడు విడవమంటే పాముకు కోపం, కరవమంటే కప్పకు కోపం. యూసీసీ వద్దంటే ముస్లింవాదులనీ, వైదిక వ్యతిరేకులనీ నింద. సమర్థిస్తే ముస్లిం వ్యతిరేకులనీ, వైదికవాదులనీ ముద్ర.

చట్టసభలో ఒక బిల్లును ప్రవేశపెట్టే ముందు దాని ముసాయిదాను సమర్పించాలి. ఆ అంశంలో వాస్తవ పరిస్థితిని తెలపాలి. సంబంధిత గణాంకాలను జోడించాలి. ఆ చట్ట ప్రయోజనాలను వివరించాలి. మోదీ ప్రభుత్వం ఏ చట్టంలోనూ రాజ్యాంగబద్ధంగా ఇవ్వవలసిన ఈ వివరాలను బిల్లుకు జోడించలేదు. ఇల్లు, దేశం ఒకటి కావనీ; రాజ్యాంగ సమానత్వ అమలే ప్రజాస్వామ్యమనీ, పాలకవర్గ కపటమే దేశాన్ని దిగజార్చిందనీ ప్రధాని గ్రహించాలి. కుటుంబ అంశాల్లో ప్రతి మతం పురుషాధిక్య రాజ్యమే. దీన్ని మతాలన్నీ సరిదిద్దుకోవాలి. ఎన్నికల్లో యూసీసీ ప్రభావం లేకుండా చేయాలి.

వ్యాసకర్త ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి
మొబైల్: 949020 4545

సోషల్ మీడియా

అసలు రహస్యం



మణిపూర్ మంటల వెనుక ఉన్నది జాతుల హింస కాదనీ, గనుల కోసం ఆ ప్రాంతాన్ని తవ్వడానికి వీలుగా గిరిజనులను అక్కడినుంచి తరమడమనీ ఒక చిన్న పిల్లాడు అన్నాడు. కొన్ని శక్తులేవో కచ్చితంగా దీన్నుంచి లాభం పొందనున్నాయి.

– వీనా బక్షి, దర్శకురాలు

వదిలించుకున్నాను!



నేను పొగ తాగడం మానేసి ఏడాది పైనే అవుతోంది. అది మనిషిని నిర్వీర్యం చేసే ప్రాణాంతక వ్యసనం. సిగరెట్లకు దూరంగా ఉంటున్న ప్రతి క్షణానికీ నేను కృతజ్ఞుడిని. పొగ తాగడంలో ఏ స్టైలూ లేదూ, అదేమీ 'కూల్' పనీ కాదు. అది మనసుకూ, శరీరానికీ అనారోగ్యకరమైనది మాత్రమే. చెప్పాలంటే ఇప్పటికీ నేను వ్యసనంతో పోరాడుతున్నాను. కానీ చావడం కంటే ఈ పోరాటాన్నే కోరుకుంటాను.

– హన్సల్ మెహతా, దర్శకుడు

అగ్నిధారలు కురిపించిన సున్నితుడు!

సాగరమంత సాహితీ సృజనకారుని ముఖచిత్ర పరిచయం దుస్సహం. ఏం తెలుసని చెప్పాలి? ఎంత తెలుసునని వివరించాలి? శృంగారం, భక్తి, ప్రేమ, విరహం, అగ్నిధారలు, వెన్నెల మెరుపులు, సముద్ర గర్భం లోతు, సాయం సంధ్యా సమయపు ఆహ్లాదం, మంచు, పులుగు, పుష్ప సౌకుమార్యం... ఇంత వైవిధ్య భరితం ఆయన కవిత్వం! ఒక్క మాటలో ఆయనే తన ఆత్మకథలో... ఓ కవితా చివురును 'అంతా నేనే... అన్నీ నేనే / అలుగు నేనే... పులుగు నేనే/ వెలుగు నేనే... తెలుగు నేనే' అని చెప్పుకున్నారు. ఆయనే... 'అగ్నిధార' కురిపించిన దాశరథి కృష్ణమాచార్యులు.



దాశరథి

దాశరథి 1925 జులై 22న నేటి మహబూబాబాద్ జిల్లా చిన్న గూడురులో జన్మించారు. నాటి హైదరాబాద్ నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాల్లో పాల్గొన్నారు. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ'ని నినదించిన, 'అగ్నిధార' లను కురిపించిన కవి. తెలంగాణ ప్రజల కన్నీళ్ళను కలంతో ప్రపంచానికి అందించిన మానవతా వాది. మహాకవి ఇక్బాల్ రాసిన 'ఏ పొలమున నిరుపేదకు దొరకదో తిండి / ఆ పొలమున గల పంటను కాల్చేయండి' అనే ఓ విప్లవ గీతం ఆయనలో ఉద్రేకాన్నీ, కవిత వెనుక ఐక్యతా సహజమైన సున్నిత ఆత్మనూ తాను పట్టుకొని మురిసి పోయానని' చెప్పుకొన్న ఔన్నత్యం ఆయనది.

'ఓ నిజాము పిశాచమా కానరాడు నిన్ను బోలిన రాజు మాకెన్నడేని' అని గర్జించిన కంఠం కూడా కృష్ణమాచార్యవారిదే. దాశరథి కృష్ణమాచార్యులు వైవిధ్యమైన వస్తువులతో కథలు, నాటికలు; 1960–78 సంవత్సరాల మధ్య 124 చిత్రాలకు కొన్ని వందల గీతాలు, కవితలు కాక 'మీర్జా గాలిబ్' రచించిన ఉర్దూ గజల్స్‌ను తెలుగులో 'గాలిబ్ గీతాలు'గా వెలువరించారు. ఉద్యమ నేపథ్యమున్న కవి భక్తిని కూడా అంతే ఆర్ద్రంగా ఆవిష్కరించడం చదువరికి రసానుభూతిని అందిస్తుంది. ఆయన రాసిన సినిమా పాటలు 'ఖుషీ, ఖుషీగా నవ్వుతూ', 'కన్నయ్యా నల్లని కన్నయ్యా, 'ఒక పూల బాణం'.'విన్నవించుకోనా' 'ఆవేశం రావాలి ఆవేదన కావాలి', 'ననుపాలింపగ నడచి'... ఇలా ప్రతీపాట ఓ పూలచెండు పరిమళం. ఓ ప్రశ్నల పరంపర. ఒక శృంగార రసవద్ఘట్టం.'ఆ చల్లని సముద్ర గర్భం' అనే గీతంలో ఆయన లేవనెత్తిన ప్రశ్నలు దశాబ్దాలు గడచినా... ప్రశ్నలుగానే మిగిలిపోవటం పాలకుల చేతకానితనమేమో. 'అన్నార్తులు అనాథలుండని ఆ నవయుగ మదెంతదూరం' అని ప్రశ్నిస్తారు. నిజమే. (నేటికి కూడా) అదెంత దూరమో!

'చిన్న చిన్న దేవుళ్ళు చిల్లర మల్లర దేవుళ్ళు/ చేయిచాపు దేవుళ్ళు/ శతకోటి దేవుళ్ళు'... ఇవి ఆయన రచించిన భక్తి గీతంలోని పంక్తులు. సమాజంలో పవిత్రమైన కోరికలు లేని భక్తి కన్నా స్వార్థ పూరిత భక్తిని ఆయన పరోక్షంగా ప్రకటించటంలో 'వేదన' ఇందులో కనిపిస్తుంది. దశాబ్దాలు గడచినా ప్రభుత్వాల 'రూపు మారింది. పాలకుల తరం మారింది. కాని... ప్రజల తలరాతల్లో మార్పు రాలేదు. హిట్లర్ ఉన్నానంటున్నాడు. ఉన్నానంటున్నాడు/ నయా నయా ఫాసిస్టులు భువిలో / నాట్యం చేస్తూ వస్తున్నారు. కాకుంటే ఆకారాలు మారాయి' అన్న దాశరథి వ్యాఖ్యానాలు నిత్యసత్యాలు. ఆయన కవిత్వం అజరామరం.

– భమిడిపాటి గౌరీశంకర్, తెలుగు ఉపన్యాసకులు
(నేడు దాశరథి కృష్ణమాచార్య జయంతి)

కులగణనే బీసీల ఉన్నతికి మార్గం!

సమకాలీన రాజకీయాలను అర్థం చేసుకోలేని సగటు మానవుని జీవితం శూన్యం. అవును ఇది సత్య సమీపం. ఈమధ్య హైదరాబాద్ రవీంద్రభారతిలో ఒక విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నేషనల్ కన్వెన్షన్ జరిగింది. దీనిని నిర్వహించినది ఒక విద్యార్థి సంఘమే కావొచ్చు కానీ ఈ కన్వెన్షన్‌లో వారి ప్రధాన డిమాండ్ కులగణన. ఒక రాజకీయ పార్టీ చేయాల్సిన ప్రధాన డిమాండ్‌ని విద్యార్థి సంఘం చేసిందంటే ఆ కుల గణనకి ఎంతటి ప్రాధాన్యం ఉందో కేంద్ర ప్రభుత్వం ఆలోచించాలి. ఈ సమావేశానికి భారాస పార్టీకి చెందిన మంత్రి శ్రీనివాస్ గౌడ్, డీఎంకే ఎంపీ విల్సన్, రాజ్యసభ సభ్యులు–బీసీల నాయకుడు ఆర్ కృష్ణయ్య, కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ వీహెచ్, దాసోజు శ్రవణ్ వంటి రాజకీయ నాయకులు బీసిల ఆత్మ గౌరవానికీ, అధికారానికీ ప్రతినిధులుగా హాజరయ్యి కుల గణన ప్రాముఖ్యతను వేనోళ్ల వినిపించారు. ఈ వినికిడిని గనక బీజేపి వినకపోతే, విన్నా, కులగణన చేపట్టకపోతే ఈసారి ఎన్నికల్లో దానికి ఎదురీతే.

ప్రజలే అధికారానికి మూలమని రాజ్యాంగం చెబుతోంది. ఆ ప్రజలలో అత్యధికులు వెనుకబడిన తరగతుల వారైనప్పుడు వారికి అధికారంలో తగినవాటా లేకపోవడం అన్యాయమే. బీసీలకు రాజకీయ స్పృహ లేకపోవడమే అధికారం చేజిక్కించుకోవడంలో వారి వెనుకబాటు తనానికి కారణం. జాతీయ స్థాయిలో పలు కమిటీలు, కమిషన్‌లు ఇచ్చిన నివేదికలను పరిశీలిస్తే దేశ ప్రజలలో సగానికి పైగా అధికారానికి దూరంగా ఉన్న జనాభాలో ఓబీసీ జనాభానే అధికంగా ఉన్నది.

ఎన్నికైన ప్రజాప్రతినిధి ఎవరైనా, ఆయనకు ఎన్నికలో పెద్దపీట వేసిన ఓటర్లు మాత్రం కచ్చితంగా వెనుకబడిన తరగతుల వారేనన్నది నమ్మదగిన నిజం. 'మాది మాకివ్వండి', 'మా వాటా ఎంతో మాకు తేల్చండి', 'మేమెంతో మాకంత' అనే నినాదాలను ఎన్ని విధాలుగా అడిగినా, అరిచినా ఏ ప్రభుత్వమూ పట్టించుకోవడం లేదు. దేశంలో యాభై శాతానికి పైగా ఉన్న ఓబీసీ జనాభాను గణిస్తే వారి సంఖ్య తెలిసి చైతన్యవంతులై రాజ్యాధికారాన్ని ఆశిస్తారనీ, విద్యా, ఉద్యోగ రంగాలలో సరైన రిజర్వేషన్లను ఆ ప్రాతిపదికనే పెంచమంటారనీ, అలా చేస్తే జ్ఞానాన్ని సాధించి ప్రశ్నిస్తారనీ ఆధిపత్య కులాల నేతృత్వంలోని ప్రభుత్వాలు భావించి ఉండవచ్చు. అందుకే ఈ దాటవేత ధోరణి.

ఇపుడు ఎన్నికల గాలి ఓటర్లకు అతి దగ్గరగా వీస్తుండడంతో



భారతీయ జనతా పార్టీ మతాన్నీ, మతానికి ప్రతీకలైన దైవాలనూ మళ్లీ తెరపైకి తీసుకొస్తోంది. కానీ భాజపా పన్నాగంలో దక్షిణ భారతీయులు పడిపోరని కర్ణాటక ఎన్నికల ఫలితాలే చెబుతున్నాయి.

హిందూ మత రక్షణ, హైందవ ధర్మ సంరక్షణ, భారతీయ సనాతన పరిరక్షణ అని చెప్పుకుంటూ వస్తున్న భాజపా సాధారణ ఎన్నికలలో గెలిచేందుకు హిందూ మతాన్ని ప్రధాన అస్త్రంగా వాడుకుంటోంది. ఆ పార్టీ ఆడుతున్న రాజకీయ నాటకంలో మతమెపుడూ ప్రధాన పాత్రనే పోషిస్తోంది. పైపెచ్చు హిందూ మతాన్ని ఆరాధించే వారిని రెచ్చగొడుతూ ఈ పార్టీ చాలా సునాయాసంగా ప్రభుత్వ పీఠాలను అధిరోహిస్తోంది. భాజపా ఇప్పుడు తెలంగాణలో ఏ అస్త్రాన్ని ప్రయోగించాలా అని తీవ్రమైన ఆలోచనలు చేస్తోంది.

భాజపాకు పునాది రాళ్ళు పడినప్పటి నుండి ఏనాడూ ఓబీసీ జనాభా గురించి పట్టించుకోలేదు. ఆ మాటకొస్తే మరే నిమ్న కులాల గురించి కూడా పట్టించుకోలేదు. గత కొన్నాళ్లుగా మణిపూర్‌లో రగులుతున్న వివాదానికి కారణమూ ఈ కులమే. అందుకని భాజపా, మతాన్ని తన గుప్పిట్లో పెట్టుకొని కులాన్ని మాత్రం ఆమడ దూరం పెడుతోంది. అయినా ప్రజలు భాజపాకే ఎందుకు ఓట్లు వేస్తున్నారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. దీనికి సమాధానం, హిందూ మతం అనే వృక్షానికి పెరిగిన కొమ్మలే ఈ కులాలు కదా... అందుకని తాము ఏ కులం వారమైనా తామంతా హిందూవులం అనే భావన చాలా మందిలో నాటుకుపోయింది. ఈ భావననే భాజపా క్యాష్ చేసుకొని అతి సునాయాసంగా అధికారమనే అందలమెక్కుతోంది.

దేశ వ్యాప్తంగా కుల గణన చేపట్టాలని స్థానిక పార్టీలు, కుల సంఘాలు, విద్యార్థి సంఘాలు ఎన్ని సమావేశాలు పెట్టినా ఆ పార్టీ మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు ఉండిపోతోంది.

పాలించేది ఏ పార్టీ అయినా అది ఓబీసీలను పట్టించుకుంటే మళ్ళీ గెలిచేందుకు దానికి అవకాశాలు మెండుగా ఉంటాయి. ఈ దృష్ట్యా చూస్తే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ పదవులలో బీసీలకు ప్రాధాన్యత ఇస్తూ వస్తున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి బీసీలకు కొద్దోగొప్పో పదవులు ఇస్తూనే ఉన్నారు. కర్ణాటకలో అధికంగా బీసీ కులాలు ఉన్నందునే బీసీ బిడ్డ అయిన సిద్ధరామయ్య కాంగ్రెస్ ముఖ్యమంత్రి కాగలిగారు. ఈ అన్ని ఉదాహరణలను చూసైనా భారతీయ జనతా పార్టీ బీసీలకు తగిన న్యాయం చేయాలి. అందుకు మొదటి చర్య బీసీల కుల గణన చేపట్టడమే!

– నవోదయ

ఇంటర్ ఆంగ్లంలోనూ ప్రాక్టికల్స్

మొత్తం 20 మార్కులు కేటాయింపు

- ఈ ఏడాది నుంచే ఫస్టియర్‌కు అమలు
- విద్యార్థుల్లో ఆంగ్లంపై పట్టు పెంచేందుకు బోర్డు నిర్ణయం



ఇంగ్లిష్ సబ్జెక్టులో ప్రాక్టికల్స్ ఈ విధంగా....

అంశం	నిర్వహణ విధానం	ప్రశ్నల సంఖ్య	మార్కులు	సమయం నిమిషాలు)
కమ్యూనికేటివ్ ఫంక్షన్	మౌఖిక	4	4	60
జామ్ (జస్ట్ ఏ మినిట్)	మౌఖిక	1	4	30
పాత్ర పోషణ (రోల్ ప్లే)	మౌఖిక	1	4	60
లిజనింగ్ కాంప్రహెన్షన్	రాత	4	4	60
రికార్డు పుస్తకం	రాత	–	4	–

సాక్షి, హైదరాబాద్: ఇప్పటివరకు ఇంటర్మీడియెట్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీల్లోనే ప్రాక్టికల్స్ పరీక్షలు ఉండగా ఈ ఏడాది నుంచి కొత్తగా ఆంగ్లం సబ్జెక్టులోనూ ప్రాక్టికల్స్ పరీక్షలు ఉండబోతున్నాయి. మొత్తం నాలుగు విభాగాలుగా ప్రాక్టికల్స్‌ను విడగొట్టి ఒక్కో విభాగానికి 4 మార్కులు చొప్పున కేటాయించనున్నారు. దీంతోపాటే మొదట్నుంచీ క్లాస్ వర్క్ మాదిరి రికార్డు రాయడాన్ని చేర్చనున్నారు. దీనికి కూడా 4 మార్కులు ఇవ్వనున్నారు. మొత్తం 20 మార్కులకు ప్రాక్టికల్స్ ఉంటాయి. ఇందులో విద్యార్థులు కనీసం 7 మార్కులు తెచ్చుకోవాలి. థియరీని 80 మార్కులకు నిర్వహించనుండగా అందులో కనీసం 28 మార్కులు రావాలి. ఈ ఏడాది ఇంటర్ ప్రథమ సంవత్సరంలోనే ప్రాక్టికల్స్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఇందుకోసం ఇప్పటికే కసరత్తు చేపట్టిన ఇంటర్ బోర్డు... నిపుణుల చేత ఆంగ్ల ప్రాక్టికల్ విధానంపై వివరాలను క్రోడీకరించి ముఖ్య విషయాలను పరిగణనలోకి తీసుకుంది. ఆంగ్ల భాష కీలకమైనది కావడం, ఇంటర్ పూర్తయినా విద్యార్థులకు దీనిపై పట్టులేకపోవడంతో ప్రాక్టికల్స్‌ను అనివార్యంగా భావిస్తోంది. కేంద్ర, రాష్ట్ర అధ్యయనాలు సైతం ఇంటర్ విద్యార్థులు ఆంగ్లంపై పట్టు సాధించాలని చెబుతుండటం, విదేశీ విద్యకు వెళ్లేందుకూ ఆంగ్లంపై పట్టు అనివార్యం కావడంతో ఈ దిశగా చర్యలు చేపట్టింది.

కాలేజీలకు సూచనలు...

ఆంగ్ల సబ్జెక్టులో ప్రాక్టికల్స్ విధానంపై క్షేత్రస్థాయిలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకొనేందుకు ఇంటర్ బోర్డు సిద్ధమవుతోంది. పరీక్షలకు కావల్సిన సమయం ఉన్నప్పటికీ బోధన సమయంలోనే విద్యార్థులను సిద్ధం చేయాలని అధికారులు భావిస్తున్నారు. ప్రాక్టికల్స్ ఆవశ్యకత, సన్నద్ధత ఎలా ఉండాలనే దానిపై ప్రతి కాలేజీలోనూ అవగాహన కల్పించాలని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీలను ఉన్నతాధికారులు ఆదేశించారు. ప్రధానంగా కమ్యూనికేషన్ స్కిల్స్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని సూచిస్తున్నారు. తరగతి గదిలో పరస్పర సంభాషణలు, ఏదైనా అంశంపై మాట్లాడించే పద్ధతిని అనుసరించాలని సూచించారు. వారానికి ఒక గంటపాటు ఈ తరహా కసరత్తు చేయాలని పేర్కొన్నారు. ఆంగ్లంలో ధారాళంగా చదవడం, రాయడం కూడా అభివృద్ధి చేయాలన్నారు. దీంతోపాటే స్పెల్లింగ్‌లపైనా పట్టు సాధించేలా ప్రోత్సహించాలని, ఆంగ్ల దినపత్రికలను చదవడం ద్వారా దీన్ని పెంచాలని భావిస్తున్నారు.

కోవిడ్ దెబ్బతో సాధ్యమా?

ఇంగ్లిష్ సబ్జెక్టులో ప్రాక్టికల్స్ నిర్వహణ సాధ్యాసాధ్యాలపై అధ్యాపకుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. గత రెండేళ్లుగా టెన్త్‌లో కోవిడ్ ప్రభావం కన్పిస్తోంది. లెర్నింగ్ లాస్ ఎక్కువగా ఉందని విద్యాశాఖ సైతం పేర్కొంది. ముఖ్యంగా ఆంగ్ల భాషలో గ్రామర్, స్పెల్లింగ్‌లపై విద్యార్థులు సరైన స్థాయిలో పట్టు సాధించలేదనే భావన సర్వత్రా వ్యక్తమవుతోంది. ఇంటర్ ప్రాక్టికల్స్‌లోకి తీసుకొనే అంశాలన్నీ గ్రామర్‌తో ముడివడి ఉన్నాయి. గ్రామర్‌లో బేసిక్స్ లేకుండా సరైన కమ్యూనికేషన్ స్కిల్స్‌ను గుర్తించడం కష్టమని అధ్యాపకులు అంటున్నారు. రోల్ ప్లే, లిజనింగ్ కాంప్రహెన్షన్‌లోనూ విద్యార్థులు వెనుకబడొచ్చని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేక శిక్షణ ఇస్తాం



ఇంగ్లిష్ సబ్జెక్టులో ప్రాక్టికల్స్ నిర్వహణపై రాష్ట్ర వ్యాప్తంగా శిక్షణ ఇస్తాం. ఇంటర్ అడ్మిషన్లు పూర్తయ్యాక ప్రతి జిల్లాలోనూ సబ్జెక్టు లెక్చరర్లకు ప్రత్యేక శిక్షణ నిర్వహిస్తాం. విద్యార్థులను అన్ని విధాలా సిద్ధం చేయడం దీని ముఖ్యోద్దేశం. ప్రాక్టికల్స్ కొత్తగా చేపడుతున్నా విద్యార్థులను మానసికంగా సిద్ధం చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటాం.

– జయప్రదాబాయ్, ఇంటర్ పరీక్షల విభాగం ముఖ్య అధికారి

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య పథకానికి ప్రత్యేక కమిటీ

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు పకడ్బందీగా ఆరోగ్య పథకం(హెల్త్ స్కీం) అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం టీఎన్జీఓ గౌరవాధ్యక్షుడు దేవీప్రసాద్ ఆధ్వర్యంలో ఉద్యో గులు, పెన్షనర్లు మంత్రి హరీశ్‌రావును కలిశారు. ఉద్యోగుల హెల్త్ స్కీం, ఇతర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం ఎంప్లాయ్ ఫ్రెండ్లీ ప్రభుత్వంగా ఖ్యాతి గడించిందని, ఉద్యోగులు, పెన్షనర్ల అన్ని సమస్యలు పరిష్కరించేందుకు సీఎం కె.చంద్రశేఖర్‌రావు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం ఎంప్లాయీ హెల్త్ స్కీం(ఈహెచ్‌ఎస్)ను మరింత పకడ్బందీగా అమలు చేసేందుకు ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల ప్రతినిధులు సభ్యులుగా ప్రత్యేకంగా ఓ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ స్కీమ్‌ద్వారా అత్యున్నత వైద్య సేవలు ఎలాంటి అంతరాయం లేకుండా అందుబాటులోకి వస్తాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధుల విడుదలలో మొండి వైఖరి ప్రదర్శిస్తున్నప్పటికీ సీఎం కేసీఆర్ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంపై చిత్తశుద్ధితో ఉన్నారన్నారు. మంత్రిని కలిసిన వారిలో రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులున్నారు.

ఇబ్బందులు తొలగిస్తామన్నారు..

అన్ని ఆస్పత్రుల్లో నగదు రహిత ఈహెచ్‌ఎస్ కార్డుల అమలుకు త్వరలోనే కమిటీని ఏర్పాటుచేసి, ఇబ్బందులు తొలగిస్తామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు హామీ ఇచ్చారని తెలంగాణ ప్రభుత్వ పెన్షన్‌దారుల సంయుక్త కార్యాచరణ కమిటీ చైర్మన్ లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి సుభాకర్ తెలిపారు. ఈ మేరకు వారు శుక్రవారం మంత్రి హరీశ్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. అలాగే పెండింగ్ డీఏల విడుదల కోసం సీఎం కేసీఆర్ ఆలోచిస్తున్నారని, ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్ జమ చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు.

అప్పులు తీర్చడానికి నేరం... తప్పు చేశానని ఆత్మహత్య!

- జూబ్లీహిల్స్‌లో మహిళను నిర్బంధించి రూ.10 లక్షలు వసూలు
- ఈ కేసులో రాజేష్‌ను మేలో అరెస్టు చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు
- 20 రోజుల క్రితం బెయిల్‌పై వచ్చిన నాటి నుంచి తీవ్ర డిప్రెషన్
- అపరాధభావంతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న వైనం



ఆత్మహత్య చేసుకున్న రాజేష్ యాదవ్

రాంగోపాల్‌పేట్: అప్పుల భారం నుంచి బయటపడటానికి నేరం చేసిన ఓ యువకుడు బెయిల్‌పై బయటకు వచ్చాడు. తప్పు చేశాననే అపరాధ భావంతో తీవ్ర డిప్రెషన్‌లోకి వెళ్లాడు. చివరకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఉదంతం గోపాలపురం పోలీసుస్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకోగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం... మాదాపూర్‌లోని ఓ సంస్థలో కస్టమర్ కేర్ స్పెషలిస్టుగా పని చేసిన రెజిమెంటల్ బజార్ వాసి రాజేష్ అప్పుల నుంచి బయటపడటంతో పాటు తేలిగ్గా డబ్బు సంపాదించడం కోసం నేరాలు చేయాలని నిర్ణయించుకున్నాడు. ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో ఉన్న క్రైమ్ సిరీస్‌లు వరుసపెట్టి చూసిన ఇతగాడు దోపిడీ చేయాలని నిర్ణయించుకున్నాడు. వాటి ద్వారానే ఏ ఆధారాలు దొరక్కుండా ఎలా చేయాలో కూడా నేర్చుకున్నాడు. మూడేళ్ల క్రితం మరో సంస్థలో పని చేసిన ఇతగాడిని నిత్యం కంపెనీ క్యాబ్ వచ్చి పికప్ చేసుకుని వెళ్లేది. ప్రతి రోజూ జూబ్లీహిల్స్ రోడ్ నెం.52లో మరికొందరినీ ఈ క్యాబ్ ఎక్కించుకునేది. అప్పట్లో రాజేష్ ప్రతి రోజూ అక్కడ ఉన్న వ్యాపారి ఎస్ఎస్ఎన్ రాజు ఇంటిని చూసేవాడు. దాని తీరుతెన్నులు, వచ్చిపోయే వాళ్లు ఇప్పటికీ గుర్తుండిపోవడంతోనే ఆ ఇంటిని టార్గెట్ చేసుకున్నాడు. నేరం చేయడానికి ఒక రోజు ముందు రెక్కీ చేశాడు. ఈ ఏడాది మే 12 అర్ధరాత్రి దాటాక ఆ ఇంట్లోకి ప్రవేశించి, గర్భిణిగా ఉన్న రాజు కుమార్తె నవ్య మెడపై కత్తి పెట్టి రూ.20 లక్షలు డిమాండ్ చేశాడు. ఆమె తమ ఇంట్లో ఉన్న రూ.2 లక్షలకు అదనంగా మరో చోట ఉన్న భర్త నుంచి మరో రూ.8 లక్షలు తెప్పించి ఇచ్చింది. చివరకు నవ్య ఫోన్ నుంచి క్యాబ్ బుక్ చేసుకుని పరారయ్యాడు. ఇతడిని అరెస్టు చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు జైలుకు పంపారు. ఈ కేసులో బెయిల్ పొందిన రాజేష్ 20 రోజుల క్రితమే బయటకు వచ్చారు. అప్పటి నుంచి అపరాధభావంతో బయటకు కూడా వెళ్లకుండా ముభావంగా ఉంటున్నాడు. ఈ కారణంగానే డిప్రెషన్‌లోకి కూడా వెళ్లాడు. గురువారం ఇతడి తల్లిదండ్రులు ఆస్పత్రికి వెళ్లగా సోదరుడు బయటకు వెళ్లాడు. ఇలా ఇంట్లో ఎవరూ లేని సమయంలో రేకుల షెడ్డులో ఐరన్ రాడ్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మరణించినట్లు ధ్రువీకరించారు.

దోస్త్, ఇంజనీరింగ్ షెడ్యూల్‌లో మార్పులు

సెల్ఫ్ రిపోర్టింగ్, కాలేజీల్లో రిపోర్టు చేసే తేదీల పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో దోస్త్, ఇంజనీరింగ్ సీట్ల సెల్ఫ్ రిపోర్టింగ్ తేదీలను మార్చారు. అన్ని ప్రాంతాల్లో ఇంటర్నెట్ పనిచేయకపోవడం, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను 'సాక్షి' శుక్రవారం వెలుగులోకి తెచ్చింది. దీంతో అధికారులు స్పందించి దోస్త్ షెడ్యూల్‌ను మార్చారు. మూడవ విడత సెల్ఫ్ రిపోర్టింగ్‌కు ఆఖరి తేదీని ఈనెల 21 నుంచి 26కు పొడిగించగా.. కాలేజీల్లో రిపోర్టు చేసే తేదీలను 22 నుంచి 26కు మార్చారు. ఇంట్రా కాలేజీలో బ్రాంచీల మార్పునకు 28 చివరి తేదీ ఉండగా, దీన్ని 31 వరకు పొడిగించారు. ఇంజనీరింగ్ తొలి దశ సీట్లను ఇటీవల కేటాయించారు. ఈనెల 22కు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉండగా.. ఈ తేదీని 23కు మార్చారు. అయితే వరస సెలవు దినాల నేపథ్యంలో ఈ తేదీని మరింత పొడిగించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఇవే నాకు చివరి ఎన్నికలు

డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్

కురవి (మహబూబాబాద్ జిల్లా): 'ఇవే నాకు ఆఖరి ఎన్నికలు. మళ్లీ ఐదేళ్లకు వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను. ప్రజలు ఆశీర్వదించాలి'అని డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ ప్రజలను కోరారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంతోపాటు తులిస్యా తండా, లింగ్యా తండా గ్రామాల్లో శుక్రవారం ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా కురవిలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ..కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు తనను గెలిపించాలన్నారు. కాగా, తులిస్యా తండాలో ఎమ్మెల్యేను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అడ్డుకోగా పోలీసులు వారిని చెదరగొట్టారు. ఎమ్మెల్యే వెళ్లిపోయాక ఆయన ఆవిష్కరించిన అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని కాంగ్రెస్ కార్యకర్తలు ధ్వంసం చేశారు.

267 X 176

సెక్షన్ 267 కింద చర్చకు విపక్షాల పట్టు

176 కింద చర్చిద్దామంటున్న ప్రభుత్వం... దాంతో ప్రతిష్టంభన

మణిపూర్ అమానవీయ ఘటనపై పార్లమెంటులో చర్చించాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం అంగీకరించినప్పటికీ ఏ నిబంధన కింద చర్చించాలన్న దానిపై పీటముడి నెలకొంది. 267 కింద మణిపూర్‌పై రాజ్యసభలో పూర్తి స్థాయిలో చర్చ జరిపి తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తనంతట తానుగా ఒక ప్రకటన చేయాలని విపక్ష పార్టీలు పట్టుబడుతున్నాయి. దానికి బదులుగా నిబంధన 176 కింద చర్చకు సిద్ధమని కేంద్రం తేల్చి చెప్పింది. దీంతో పార్లమెంటులో వాయిదాల పర్వం కొనసాగుతోంది. ఈ రెండు నిబంధనలకున్న ప్రాథమికమైన తేడా చర్చా సమయం. నిబంధన 267 కింద సుదీర్ఘంగా చర్చించే అవకాశం ఉంటే, నిబంధన 176 కింద స్వల్పకాలిక చర్చ మాత్రమే జరుగుతుంది.

–సాక్షి, నేషనల్ డెస్క్



రూల్ 267

■ రూల్స్ ఆఫ్ ప్రొసీజర్ అండ్ కండక్ట్ ఆఫ్ బిజినెస్ ఇన్ ది కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్ (రాజ్యసభ) ప్రకారం రూల్ 267 కింద చర్చ సుదీర్ఘంగా సాగుతుంది. ఆ రోజు ఏదైనా అంశంపై చర్చకు సభ్యులు ముందుగా నోటీసులు ఇచ్చి ఉంటే రాజ్యసభ చైర్మన్ వాటిని పూర్తిగా రద్దు చేసి దేశ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై చర్చకు అనుమతినిస్తారు. ఈ చర్చ సందర్భంగా సభ్యులు ప్రభుత్వాన్ని ఏదైనా ప్రశ్నించే అవకాశం లభిస్తుంది. చర్చ ఎన్ని గంటలు కొనసాగించాలన్న దానిపై ప్రత్యేకంగా ఎలాంటి నిబంధనలు లేవు. చర్చ జరపడానికి తీర్మానం, దానిపై ఓటింగ్ వంటి వాటికి అవకాశం ఉంటుంది.

రూల్ 176

■ స్వల్పకాలిక వ్యవధిలో ముగిసే చర్చలు 176 నిబంధన కింద జరుపుతారు. ఈ నిబంధన కింద రెండున్నర గంటలకు మించి చర్చ కొనసాగదు. ఈ నిబంధన కింద సభ్యుడెవరైనా అప్పటికప్పుడు రాజ్యసభ సెక్రటరీ జనరల్‌కు నోటీసు ఇవ్వొచ్చు. ఆ నోటీసులో చర్చకు గల కారణాలు వివరించాలి. ఆ నోటీసుకి మద్దతుగా మరో ఇద్దరు సభ్యులు సంతకాలు చేయాలి. రాజ్యసభ చైర్మన్ చర్చకు అంగీకరించిన తర్వాత ఆ రోజైనా, ఆ మర్నాడైనా చర్చకు అనుమతినిస్తారు. ఈ చర్చకు సంబంధిత మంత్రి మాత్రమే సమాధానమిస్తారు. ఇదంతా రెండున్నర గంటల్లోనే ముగిసిపోతుంది. లాంఛనంగా తీర్మానం, దానిపై ఓటింగ్ వంటివి ఉండవు.

గతంలో 267 కింద చర్చ జరిగిందా?

పార్లమెంటు రికార్డుల ప్రకారం రూల్ 267 కింద 1990 నుంచి 2016 వరకు 11 సార్లు చర్చలు జరిగాయి. 2016లో చివరిసారిగా పెద్ద నోట్ల రద్దుపై అప్పటి రాజ్యసభ చైర్మన్ హమీద్ అన్సారీ రూల్ 267 కింద చర్చకు అనుమతినిచ్చారు. ఆ తర్వాత ఇప్పటివరకు ఆ నిబంధన కింద ఏ నోటీసును చైర్మన్ అనుమతించలేదు. గత శీతాకాల సమావేశాల్లో వాస్తవాధీన రేఖ వెంబడి చైనా పెత్తనం పెరిగిపోవడం, ధరల పెరుగుదల వంటి అంశాలపై చర్చించడానికి రూల్ 267 కింద విపక్ష సభ్యులు ఇచ్చిన నోటీసుల్ని ఎనిమిది సార్లు రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌కార్ తోసిపుచ్చారు. ఈ నిబంధన కింద చర్చకు అనుమతిస్తే సభలో గందరగోళం నెలకొనడం మినహాయించి సమగ్రమైన చర్చ జరిగే అవకాశం లేదని ఆయన అభిప్రాయపడుతున్నారు. రోజంతా సభా కార్యక్రమాలన్నీ రద్దు చేసి అత్యవసరంగా చర్చ జరిపే ప్రజా ప్రాముఖ్యత అంశాలు ఉండవని కొందరు అధికార పక్ష ఎంపీలు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. మణిపూర్‌పై స్వల్పకాలిక చర్చ జరిపి కేంద్రం హోంశాఖ మంత్రి అమిత్ షాతో సమాధానమివ్వాలని అధికార పక్షం భావిస్తూ ఉంటే, ప్రతిపక్షాలు సుదీర్ఘంగా చర్చించాక ప్రధాని నరేంద్ర మోదీయే బదులివ్వాలన్న పట్టుదలతో ఉన్నాయి. ఎవరికివారే మెట్టు దిగకపోవడంతో సభా కార్యక్రమాలు తుడిచిపెట్టుకుపోతున్నాయి.

'మణిపూర్' రగడ..

▶ మొదటి పేజీ తరువాయి

ప్రదర్శించారు. మణిపూర్ రక్తమోడుతోంది అని పేర్కొన్నారు. మణిపూర్‌లో కొనసాగుతున్న దారుణ హింసపై తక్షణమే చర్చ చేపట్టాలని పట్టుబట్టారు. ప్రధాని మోదీ మౌనం వీడాలని, సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ బిగ్గరగా నినాదాలు చేశారు. శాంతించాలంటూ విపక్షాలకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పదేపదే విజ్ఞప్తి చేశారు. సభ సక్రమంగా కొనసాగడం, ప్రశ్నోత్తరాలు నిర్వహించడం మీకు ఇష్టం లేదా? అంటూ ప్రతిపక్షలపై అసహనం వ్యక్తం చేశారు. నినాదాలతో సమస్యకు పరిష్కారం లభించదని, చర్చలే అందుకు మార్గమని సూచించారు. సభా కార్యక్రమాలకు ఆటంకం కలిగించవద్దని కోరారు. అయినప్పటికీ ప్రతిపక్ష ఎంపీలు వెనక్కి తగ్గలేదు. ఈ సమయంలో మాట్లాడేందుకు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు స్పీకర్ అనుమతి ఇచ్చారు. మణిపూర్ ఘటనలపై చర్చకు తాము సిద్ధమేనని రాజ్‌నాథ్ స్పష్టం చేశారు. ''మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించడం చాలా హేయమైన చర్య అని, ఈ ఘటన యావత్ దేశం తలదించుకునేలా చేసిందని ప్రధానమంత్రి మోదీ స్వయంగా చెప్పారు. మణిపూర్ అంశంపై చర్చించాలని ప్రభుత్వం కోరుకుంటోంది. అయినా ప్రతిపక్షాలు పార్లమెంట్‌లో చర్చ జరగకుండా గందరగోళం సృష్టిస్తున్నాయి. ఈ అంశంపై చర్చకు విపక్షాలు సీరియస్‌గా లేవని భావిస్తున్నా'' అని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. ప్రతిపక్షాలు వెనక్కి తగ్గకపోవడంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 12 గంటల దాకా వాయిదా వేశారు. సభ పునఃప్రారంభమైన తర్వాతా గందరగోళం కొనసాగుతుండడంతో స్పీకర్ స్థానంలో ఉన్న రాజేంద్ర అగర్వాల్ లోక్‌సభను సోమవారానికి వాయిదా వేశారు.



లోక్‌సభలో ప్యానెల్ స్పీకర్ రాజేంద్ర అగర్వాల్‌కు అతి సమీపంలో ప్లకార్డుల ప్రదర్శన

రాజ్యసభలోనూ ఆందోళన

మణిపూర్ అంశంపై చర్చకు రాజ్యసభలోనూ విపక్షాలు పట్టుబట్టాయి. సభా కార్యకలాపాలను అడ్డుకున్నాయి. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ డెరెక్ ఓబ్రియాన్ పార్లమెంట్‌లో ఉపయోగించే పదాలపై పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తారు. మణిపూర్ సమస్యపై మాట్లాడేందుకు సభలో ప్రధానమంత్రి ఉండాలని గురువారం ప్రతిపక్షాలు కోరాయని అన్నారు. అయితే ప్రధానమంత్రి, మణిపూర్ అనే పదాలను రికార్డు నుండి తొలగించారని సభాపతి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమయంలో ఢిల్లీ ఆర్డినెన్స్ బిల్లు సహా మణిపూర్ అంశంపై విపక్షాలు ఆందోళన కొనసాగించడంతో రాజ్యసభ తొలుత మధ్యాహ్నం 2.30 గంటల దాకా, ఆ తర్వాత సోమవారానికి వాయిదా పడింది.

లోక్‌సభలో 'ఇండియా' ప్లకార్డులు

ప్రతిపక్ష కూటమి 'ఇండియా' ప్లకార్డులు తొలిసారిగా శుక్రవారం లోక్‌సభలో దర్శనమిచ్చాయి. మణిపూర్ హింసపై ప్రధానమంత్రి సమాధానం చెప్పాలంటూ విపక్ష సభ్యులు ఈ ప్లకార్డులను సభలో ప్రదర్శించారు. 'ఇండియా సమాధానం కోరుతోంది. మౌనాన్ని కాదు', 'పార్లమెంట్‌లో ప్రధాని మాట్లాడాలని ఇండియా కోరుతోంది' అని రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు.

క్లుప్తంగా...

జ్ఞానవాపి మసీదులో శాస్త్రీయ సర్వే

వారణాసి: యూపీలోని కాశీలో ప్రఖ్యాత కాశీ విశ్వనాథుని ఆలయాన్ని ఆనుకుని ఉన్న జ్ఞానవాపి మసీదులో శాస్త్రీయ సర్వే చేపట్టాలని వారణాసిలోని ఓ కోర్టు శుక్రవారం ఆదేశాలిచ్చింది. హిందూ ఆలయ ప్రాంతంలోనే మసీదు నిర్మాణం జరిగిందా అనే విషయం నిర్ధారించేందుకు శాస్త్రీయమైన సర్వే చేపట్టాలంటూ కొందరు హిందూ భక్తులు వేసిన పిటిషన్‌ను జడ్జి ఏకే విశ్వేశ్ సమర్థించారు. ఈ నెల 14వ తేదీ వరకు హిందు, ముస్లిం వర్గాల వాదనలను విన్న కోర్టు తాజాగా తీర్పు వెలువరించింది. మసీదు కాంప్లెక్స్‌లో సర్వే చేపట్టాలంటూ పురావస్తు శాఖ(ఏఎస్‌ఐ)ని ఆదేశించింది. అవసరమైతే తవ్వకాలు కూడా జరిపేందుకు అనుమతినిచ్చింది. తదుపరి విచారణను ఆగస్టు 4వ తేదీకి వాయిదా వేసింది. అయితే, దీనిని ముస్లిం వర్గం వ్యతిరేకించింది. ఏఎస్‌ఐ సర్వే కారణంగా మసీదు కాంప్లెక్స్‌కు నష్టం జరిగే అవకాశం ఉందని తెలిపింది. వారణాసి కోర్టు ఉత్తర్వులను ఎగువ కోర్టులో సవాల్ చేస్తామని మసీదు యాజమాన్యం తరఫు లాయర్ తౌహీద్ ఖాన్ చెప్పారు.

దేశంలోని కోర్టుల్లో 6.36 లక్షల పెండింగ్ కేసులు

న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా ఉన్న వివిధ కోర్టుల్లో 6.36 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు కేంద్రం తెలిపింది. ఇందులో ఆర్థిక శాఖకు సంబంధించినవే 1.79 లక్షల వరకు ఉన్నాయంది. లోక్‌సభలో శుక్రవారం ఓ ప్రశ్నకు న్యాయశాఖ మంత్రి అర్జున్‌రాం మేఘ్‌వాల్ ఈ మేరకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. మొత్తం 6,36,605 పెండింగ్ కేసుల్లో ఆర్థిక శాఖతో సంబంధమున్నవి 1.79 లక్షల కేసులు కాగా, రక్షణ శాఖకు సంబంధించినవి 87 వేలు, విద్యాశాఖకు సంబంధించిన 17 వేల కేసులు ఉన్నాయని వివరించారు.

పాక్‌లో ముగ్గురు హిందూ బాలికల కిడ్నాప్

కరాచీ: పాకిస్తాన్‌లోని సింధ్ ప్రావిన్స్‌లో హిందూ వ్యాపారి ముగ్గురు కూతుళ్లను కిడ్నాప్ చేసి, బలవంతంగా మతం మార్చి ముగ్గురు యువకులు వారిని పెళ్లిళ్లు చేసుకున్నారు. పాకిస్తాన్ దరేవార్ ఇతేహాత్ సంస్థ చీఫ్ శివ కచ్చి ఈ విషయం తెలిపారు. ధార్కి ప్రాంతానికి చెందిన హిందూ వ్యాపారి లీలా రామ్ ముగ్గురు కూతుళ్ల చాందిని, రోష్ని, పరమేశ్ కుమారిలను కొందరు అపహరించుకుపోయారు. బలవంతంగా ఇస్లాంలోకి మార్చి అపహరించిన ముగ్గురు ముస్లింలు వారిని పెళ్లిళ్లు చేసుకున్నారని శివ కచ్చి చెప్పారు.

భారత్, శ్రీలంకల మధ్య విజన్ డాక్యుమెంట్

ప్రధాని మోదీతో శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమ్ సింఘే భేటీ

న్యూఢిల్లీ: భారత్‌లో రెండు రోజుల పర్యటనకు వచ్చిన శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమ్ సింఘే శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఇరువురు నేతల మధ్య విస్తృత స్థాయిలో చర్చలు జరిగాక ఆర్థిక భాగస్వామ్య విస్తరణకు ఒక విజన్ డాక్యుమెంట్‌ను ఆమోదించారు. ఈ మేరకు ప్రధాని మోదీ ఒక పత్రికా ప్రకటనని విడుదల చేశారు. గత ఏడాది శ్రీలంక ఆర్థిక సంక్షోభంలో మునిగిపోయి ఉన్నప్పుడు భారత్ ఒక స్నేహితుడిలా ఆదుకుందని, ఇరు దేశాల మధ్య భద్రత, అభివృద్ధి ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నందున అన్నింటిని దృష్టిలో పెట్టుకొని ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. శ్రీలంకతో ఆర్థిక భాగస్వామ్యం పెంపొందించుకోవడానికి విజన్ డాక్యుమెంట్‌ను ఆమోదించడంతో పాటు పర్యాటకం, వాణిజ్యం, విద్యుత్, ఉన్నత విద్య, నైపుణ్యాల అభివృద్ధి, అనుసంధానం వంటి రంగాల్లో పరస్పరం సహకరించుకోవడానికి ఇరు దేశాలు అంగీకరించాయి. నావికా బలగం, వైమానిక దళం, ఇంధనం, ప్రజల మధ్య అనుసంధానం వంటివి కూడా బలోపేతం చేసే దిశగా ఇరు దేశాలు అడుగులు వేస్తున్నాయి. మరోవైపు శ్రీలంకలో తమిళుల ఆకాంక్షలను తీర్చడానికి సహకరించాలని ప్రధాని మోదీ విక్రమ్ సింఘేను కోరారు. మత్స్యకారుల అంశంలో మానవీయ కోణంలో ఆలోచిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



ఢిల్లీలో ప్రధాని మోదీతో విక్రమ్ సింఘే కరచాలనం

వివేక్ ఒబెరాయ్‌కి రూ.1.55 కోట్ల టోకరా



ముంబై: సామాన్యులే కాదు, ప్రముఖులు సైతం ఆర్థిక నేరాల బారినపడుతున్నారు. ఇదే తరహాలో బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ రూ.1.55 కోట్లు పోగొట్టుకున్నారు. ఈవెంట్, సినీ నిర్మాణ సంస్థలో పెట్టుబడులు పెట్టాలని, మంచి లాభాలు వస్తాయంటూ ఓ సినీ నిర్మాత, వివేక్ ఒబెరాయ్ ఇద్దరు వ్యాపార భాగస్వాములు నమ్మించారు. ఒబెరాయ్ రూ.1.55 కోట్లు పెట్టుబడిగా పెట్టారు. కానీ, ఆ సొమ్మును ముగ్గురు వ్యక్తులు సొంతానికి వాడుకున్నారు. ఈ మోసంపై పోలీసులకు ఫిర్యాదు చేయగా ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేశారు. సదరు ఈవెంట్, సినీ నిర్మాణ సంస్థలో వివేక్ ఒబెరాయ్ భార్య కూడా భాగస్వామిగా ఉన్నారు.

30న పీఎస్‌ఎల్‌వీ సీ-56 ప్రయోగం

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లోని మొదటి ప్రయోగవేదిక నుంచి ఈనెల 30న ఉదయం 6.30 గంటలకు పీఎస్‌ఎల్‌వీ సీ-56 ప్రయోగాన్ని నిర్వహించనున్నామని షార్ వర్గాలు తెలిపాయి. ఈ ప్రయోగాన్ని ఈనెల 23న నిర్వహించాల్సి ఉంది. చంద్రయాన్-3 మిషన్‌ను లూనార్ ఆర్బిట్‌లోకి పంపే ప్రక్రియలో ఇస్రో శాస్త్రవేత్తలంతా నిమగ్నమై ఉండడంతో ఈ ప్రయోగాన్ని 30కి పొడిగించారు. ఈ ప్రయోగంలో 422 కిలోలు బరువు కలిగిన సింగపూర్‌కు చెందిన ఏడు ఉపగ్రహాలను రోదసీలోకి పంపనున్నారు. 351 కిలోల డీఎస్-ఎస్ఏఆర్ (షార్ట్ ఫర్ సింథటిక్ అపార్చర్ రాడార్) అనే ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్, 23.58 కిలోలు బరువు కలిగిన ఆర్కేడ్, 23 కేజీల వెలాక్స్-ఏఎం, 12.8 కిలోలు బరువు కలిగిన ఓఆర్‌బీ-12 స్ట్రైడర్, 3.84 కేజీల బరువున్న గలాసియా-2, 4.1 కేజీల బరువైన స్కూబ్-11, 3.05 కేజీల నులయన్ అనే ఉపగ్రహాలను లోయర్ ఎర్త్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టనున్నారు. ఈ ప్రయోగం పూర్తిగా వాణిజ్యపరమైంది కావడం విశేషం.

హత్యలు, లూటీలు, గృహ దహనాలు

- మణిపూర్‌లోని బి.ఫైనోమ్ గ్రామంలో రెచ్చిపోయిన అల్లరిమూక
- మహిళలను నగ్నంగా ఊరేగించడానికి ముందు రాక్షసకాండ
- మే 4న జరిగిన దారుణంపై జూన్ 21న ఎఫ్ఐఆర్ నమోదు



మణిపూర్‌లో నిందితుడి ఇంటికి నిప్పుపెడుతున్న స్థానికులు

ఇంఫాల్: మణిపూర్‌లో ఇద్దరు గిరిజన మహిళల పట్ల అల్లరిమూక సాగించిన అమానుష కాండ దేశవ్యాప్తంగా సంచలనాత్మకంగా మారింది. మే 4న జరిగిన ఈ దురాగతం సోషల్ మీడియా ద్వారా ఈ నెల 19న బాహ్య ప్రపంచానికి తెలిసింది. కాంగ్‌పోక్పీ జిల్లాలోని బి.ఫైనోమ్ గ్రామంలో ఆ రోజు దాదాపు వెయ్యి మందితో కూడిన అల్లరిమూక పెను విధ్వంసమే సృష్టించినట్లు ఎఫ్ఐఆర్‌ను బట్టి తెలుస్తోంది. మధ్యాహ్నం 3 గంటల సమయంలో పోలీసుల కళ్లెదుటే ఈ దారుణం చోటుచేసుకోవడం గమనార్హం. మే 4న జరిగిన ఈ దురాగతంపై జూన్ 21న సైకుల్ పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదయ్యింది. మహిళలను నగ్నంగా ఊరేగించడానికి ముందు సాయుధ దుండగులు గ్రామంలో రాక్షసంగా వ్యవహరించారు. తుపాకులు ధరించి, ఊళ్లోకి ప్రవేశించారు. ఇళ్లను లూటీ చేశారు. నగదు, ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఆహార ధాన్యాలు దోచుకున్నారు. పశువులను సైతం లాక్కెళ్లారు. తర్వాత ఇళ్లకు నిప్పుపెట్టారు. వాహనాలను ధ్వంసం చేశారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. ఊళ్లో ఈ ఘోరాన్ని కళ్లారా చూసిన ఐదుగురు వ్యక్తులు రక్షణ కోసం పోలీసుల వద్దకు చేరుకున్నారు. అక్కడికి వచ్చిన ముష్కరులు ఆ ఐదుగురిపై దాడి చేశారు. ఇద్దరు గిరిజన మహిళలను అపహరించి, నగ్నంగా మార్చారు. ఊరేగింపుగా పొలాల్లోకి తీసుకెళ్లారు. వారి శరీర భాగాలను తడుముతూ, సెల్‌ఫోన్లలో చిత్రీకరిస్తూ రాక్షసానందం పొందారు. ఓ మహిళపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. 21 ఏళ్ల బాధిత యువతి సోదరుడిని కొట్టి చంపారు. తన సోదరిని అల్లరిమూక నుంచి కాపాడుకొనేందుకు అతడు ప్రయత్నించడమే ఇందుకు కారణం. దుండగులు తొలుత వారి తండ్రిని హత్య చేశారు.

గిరిజనుడి తల నరికివేత

మణిపూర్‌లో పోలీసుల సమక్షంలోనే దాదాపు వెయ్యి మంది సాయుధ ముష్కరులు ఇద్దరు గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటన దేశ ప్రజలను దిగ్భ్రాంతికి గురి చేసింది. మణిపూర్‌లో జరిగిన మరో దారుణం తాజాగా వెలుగులోకి వచ్చింది. కుకీ గిరిజన తెగకు చెందిన డేవిడ్ థీక్ అనే వ్యక్తి తలను నరికేసి, చేతితో తీసుకెళ్తున్న భయానక వీడియో సోషల్ మీడియాలో ప్రత్యక్షమయ్యింది. బిష్ణుపూర్ జిల్లాలో ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఈ నెల 2వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు జరిగిన ఘర్షణలో డేవిడ్ థీక్‌ను ప్రత్యర్థి వర్గం హత్య చేసింది. ఈ ఘర్షణలో డేవిడ్‌తోపాటు మొత్తం ముగ్గురు చనిపోయారు. డేవిడ్ తలను వెదురు కర్రలతో చేసిన కంచెపై పడేసిన దృశ్యం వీడియోలో కనిపించింది.

లేఖలు రాసినా అధికారులు స్పందించలేదు

జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖా శర్మ వెల్లడి

న్యూఢిల్లీ: మణిపూర్‌లో మహిళలపై హింసను అరికట్టడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ గత మూడు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వ అధికార యంత్రాంగాన్ని మూడుసార్లు కోరారని, లేఖలు రాశానని, అయినా స్పందన రాలేదని జాతీయ మహిళా కమిషన్(ఎన్‌సీడబ్ల్యూ) చైర్‌పర్సన్ రేఖా శర్మ శుక్రవారం చెప్పారు. మణిపూర్‌లో మహిళల పట్ల జరుగుతున్న దురాగతాలపై తమకు ఎన్నో ఫిర్యాదులు అందాయని తెలిపారు. అయితే, ఇద్దరు గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించడంపై జూన్ 12న ఎన్‌సీడబ్ల్యూకు ఫిర్యాదు అందిందని, అయినా చర్యలు తీసుకోలేదంటూ వచ్చిన వార్తలను ఆమె ఖండించారు. ఆ దారుణ ఘటనపై తమకు సమాచారం లేదని వెల్లడించారు. మే 4న జరిగిన ఘోర సంఘటనను సుమోటోగా విచారణకు స్వీకరించామని తెలిపారు. సంబంధిత అధికారుల నుంచి వివరణ కోరామని పేర్కొన్నారు. మహిళలపై అకృత్యాలను ఆపాలంటూ మణిపూర్ అధికారులకు తాను రాసిన లేఖలను రేఖాశర్మ బయటపెట్టారు. మే 18న, 29న, జూన్ 19న ఆమె ఈ లేఖలు రాశారు.

11 రోజులపాటు పోలీసు కస్టడీకి నలుగురు నిందితులు

మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన కేసులో ఇప్పటివరకు నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం కోర్టులో ప్రవేశపెట్టగా, నలుగురు నిందితులను 11 రోజులపాటు పోలీసు కస్టడీకి అప్పగిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు థౌబాల్ జిల్లాలోని వాంగ్‌జింగ్ గ్రామంలో ఇంకా అరెస్టు కాని ఓ నిందితుడి ఇంటిని స్థానికులు శుక్రవారం మధ్యాహ్నం ధ్వంసం చేసి నిప్పుపెట్టారు. ప్రస్తుతం ఆ నిందితుడు పరారీలో ఉన్నాడు.

బాధితురాలు మాజీ సైనికుడి భార్య

యుద్ధంలో పాల్గొని దేశాన్ని కాపాడాను గానీ మణిపూర్‌లో ముష్కరమూక నుంచి తన భార్యను రక్షించుకోలేకపోయానని మాజీ సైనికుడొకరు ఆవేదన వ్యక్తం చేశాడు. అతడు అస్సాం రెజిమెంట్‌లో సుబేదార్‌గా సేవలందించాడు. మే 4న మణిపూర్‌లో అల్లరిమూక నగ్నంగా ఊరేగించిన ఇద్దరు గిరిజన మహిళల్లో ఒక బాధితురాలు తన భార్యేనని చెప్పాడు. తాను కార్గిల్ యుద్ధంలో పాల్గొన్నానని, పాకిస్తాన్ సైన్యంతో పోరాడానని తెలిపాడు. మే 4న జరిగిన భయానక సంఘటనను గుర్తుచేసుకున్నాడు. తన భార్యతోపాటు ఇంటిని, తోటి గ్రామస్తులను రక్షించలేకపోయానని కన్నీటి పర్యంతమయ్యాడు.

మోదీ ఇంటిపేరు వ్యాఖ్యల కేసు

రాహుల్ గాంధీ పిటిషన్‌పై విచారణ ఆగస్టు 4కి వాయిదా



న్యూఢిల్లీ: మోదీ ఇంటి పేరు వ్యాఖ్యలపై పరువు నష్టం కేసులో తనకి పడిన రెండేళ్ల జైలు శిక్షను నిలిపివేయడానికి నిరాకరించిన హైకోర్టు తీర్పుని సవాల్ చేస్తూ కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం విచారించింది. ఈ కేసులో ప్రతివాదులైన గుజరాత్ మాజీ మంత్రి పూర్ణేశ్ మోదీ, గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వాలను నోటీసులు పంపింది. దీనిపై రెండు వారాల్లోగా స్పందించాలని ఆదేశించిన జస్టిస్ బి.ఆర్. గవాయ్, జస్టిస్ పి.కె. మిశ్రాలతో కూడిన సుప్రీం బెంచ్ తదుపరి విచారణను ఆగస్టు 4కి వాయిదా వేసింది. రాహుల్ గాంధీ తరఫున కోర్టుకు హాజరైన సీనియర్ అడ్వొకేట్ అభిషేక్ సింఘ్వీ గత 111 రోజులుగా రాహుల్ ఎంతో వ్యథ అనుభవిస్తున్నారని, ఇప్పటికే ఒక పార్లమెంట్ సెషన్‌కు దూరమయ్యారని కోర్టుకు చెప్పారు. రాహుల్ గాంధీపై అనర్హత వేటు పడడంతో ఎంపీగా ఆయన కోల్పోయిన వయనాడ్ నియోజకవర్గం ఎన్నికల నోటిఫికేషన్ ఏ క్షణంలోనైనా రావచ్చునని, అందుకే త్వరితగతిన ఈ కేసుని విచారించాలని కోరారు.

సోషల్ మీడియా యాక్టివ్ యూజర్లు 500 కోట్లు

న్యూఢిల్లీ: సోషల్ మీడియా వినియోగదారుల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. ఇంటర్నెట్ సదుపాయం అందరికీ అందుబాటులోకి రావడంతో ప్రపంచవ్యాప్తంగా 500 కోట్ల మంది సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటున్నారని తాజా అధ్యయనంలో వెల్లడైంది. అంటే ప్రపంచ జనాభాలో 64% మంది సామాజిక మాధ్యమాల్లో అత్యధికంగా కాలం గడుపుతున్నారు. గత ఏడాదితో పోల్చి చూస్తే వినియోగదారులు 3.7% పెరిగినట్టు డిజిటల్ అడ్వయిజరీ సంస్థ కెపియోస్ అధ్యయనంలో వెల్లడైంది.

- తూర్పు, మధ్య ఆఫ్రికా దేశాల్లో సోషల్ మీడియా యూజర్ల సంఖ్య తక్కువగా ఉంది. ప్రతీ 11 మందిలో ఒక్కరికే సోషల్ మీడియాలో ఖాతాలున్నాయి.
- భారత్‌లో ప్రతీ ముగ్గురిలో ఒకరు సోషల్ మీడియాలో చురుగ్గా ఉన్నారు
- రోజుకి సగటున 2 గంటల 26 నిమిషాలు సోషల్ మీడియాలో గడుపుతున్నారు
- బ్రెజిల్ వాసులు అత్యధికంగా సగటున 3 గంటల 49 నిమిషాలు సోషల్ మీడియాలో ఉంటే, జపాన్ వాసులు అత్యంత తక్కువగా గంటలోపు మాత్రమే సోషల్ మీడియాని చూస్తున్నారు.
- సోషల్ మీడియా యూజర్లకి దాదాపుగా ఏడు యాప్స్‌లో ఖాతాలుంటున్నాయి. వీటిలో వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ట్విటర్ ప్రధానమైనవి.

బీజేపీని ఇండియా ఓడించడం ఖాయం

నేను ఎలాంటి పదవినీ ఆశించడం లేదు: మమతా బెనర్జీ



కోల్‌కతా: 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా (ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్, ఇంక్లూజివ్ అలయెన్స్) కూటమి బీజేపీని తప్పక ఓడిస్తుందని టీఎంసీ అధినేత్రి, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు. అమరుల వార్షిక దినోత్సవ ర్యాలీలో ఆమె ప్రసంగించారు. 'బీజేపీని ఓడించేందుకు 26 రాజకీయ పార్టీలు ఏకం కావడం సంతోషంగా ఉంది. వారందరికీ ధన్యవాదాలు. ఇకపై బీజేపీ హారేగా.. భారత్ జీతేగా అనేదే మా నినాదం. మా భవిష్యత్ కార్యక్రమాలన్నీ ఇండియా వేదికగానే జరుగుతాయి'అని ఆమె స్పష్టం చేశారు. కూటమి గెలుపుపైనే తన దృష్టంతా ఉందని, ఏ పదవినీ ఆశించడం లేదని తెలిపారు. దేశంలో శాంతిని, బీజేపీ ఓటమినే తాము కోరుకుంటున్నామన్నారు. ప్రజలు బీజేపీని అధికారం నుంచి తొలగించాల్సిన సమయం ఆసన్నమైందని మమత తెలిపారు. 2024లోనూ బీజేపీయే మళ్లీ అధికారంలోకి వస్తే దేశంలో ప్రజాస్వామ్యం ఉండదన్న విషయం మనందరం గుర్తుంచుకోవాలని చెప్పారు. మణిపూర్ సంక్షోభంపై ఆమె తీవ్రంగా స్పందించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న 'బేటీ బచావో' మన కూతుళ్లను కాపాడుకుందాం పథకం ఇప్పుడు 'బేటీ జలావో' మన కూతుళ్లను కాల్చివేద్దాంగా మారిందన్నారు. ప్రతిపక్ష కూటమిలోని నేతలంతా మణిపూర్ ప్రజలకు అండగా నిలుస్తారని చెప్పారు.

400 కిలోల టమాటాలు చోరీ

పుణే: టమాటాల ధర ఆకాశాన్నంటుతున్న వేళ ఈ కూరగాయ దొంగతనాలు కూడా పెరుగుతున్నాయి. మహారాష్ట్రలోని పుణేకు చెందిన ఓ రైతు ఇంట్లో ఉంచిన నాలుగు క్వింటాళ్ల టమాటాలను దొంగలు ఎత్తుకుపోయారు. ఈ మేరకు షిరూర్ తహశీల్‌కు చెందిన రైతు అరుణ్ ధోమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం తన పొలంలో పండించిన 400 కిలోల టమాటాలను కోసి 20 క్రేట్లలో ఇంటికి తీసుకువచ్చాడు. తెల్లారాక చూస్తే అవి కనిపించలేదు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం టమాటా కిలో ధర రూ.100 నుంచి రూ.200 వరకు పలుకుతోంది. ఇటీవలి పుణేకే చెందిన ఓ రైతు తను పండించిన 18 వేల క్రేట్ల టమాటాలను రూ.3 కోట్లకు అమ్మి వార్తల్లోకెక్కిన విషయం తెలిసిందే.

ఉప ఎన్నికల్లో రిషి సునాక్‌కు నిరాశ

లండన్: యూకేలో తాజాగా జరిగిన ఉప ఎన్నికలు భారత సంతతికి చెందిన ప్రధానమంత్రి రిషి సునాక్‌కు నిరాశను మిగిల్చాయి. ఎన్నికలు నిర్వహించిన మూడు సీట్లలో రెండింటిని అధికార కన్జర్వేటివ్ పార్టీ కోల్పోయింది. అతికష్టమ్మీద మాజీ ప్రధాని బోరిస్ జాన్సన్‌కు చెందిన ఉక్స్‌బ్రిడ్జి అండ్ సౌత్ రుయిస్లిప్ స్థానాన్ని నిలబెట్టుకోగలిగింది. పార్టీ గేట్ కుంభకోణం ఆరోపణలపై బోరిస్ జాన్సన్ రాజీనామా చేసిన విషయం తెలిసిందే. వచ్చే ఏడాది జాతీయ ఎన్నికలు జరగనున్న వేళ ఈ ఫలితాలు అధికార పార్టీలో కలవరం కలిగిస్తున్నాయి. ఉత్తర ఇంగ్లండ్‌లోని సెల్బీ అండ్ ఎయిన్‌స్టీ నియోజకవర్గంలో 20 వేల మెజారిటీతో ప్రతిపక్ష లేబర్ పార్టీకి చెందిన 25 ఏళ్ల కీర్ మాథెర్ రికార్డు విజయం సాధించారు. బోరిస్ జాన్సన్ సన్నిహితుడు నిగెల్ ఆడమ్స్ రాజీనామాతో ఈ సీటుకు ఎన్నిక జరిగింది. సోమర్సెట్ అండ్ ఫ్రోమ్ ఉప ఎన్నికలో లిబరల్ డెమోక్రాట్ సారా డైక్ 21 వేలకు పైగా ఓట్లతో విజయం సాధించారు.

కార్మికుల్లో నైపుణ్యాలు పెంచాలి

- నూతన సాంకేతికతల వినియోగంలో శిక్షణ ఇవ్వాలి
- జీ-20 కార్మిక మంత్రుల సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ



ఇండోర్: అత్యాధునిక సాంకేతికతలను వినియోగించడంలో ఉద్యోగులకు, కార్మికులకు తగిన శిక్షణ ఇవ్వాలని, వారిలో నైపుణ్యాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. కొత్త తరం కార్మికులకు కొత్త తరం విధానాలను అందుబాటులోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. శుక్రవారం మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జీ-20 దేశాల కార్మిక, ఉద్యోగ కల్పన శాఖ మంత్రుల సదస్సులో ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా భవిష్యత్తులో మొబైల్ వర్క్‌ఫోర్స్ అనేది వాస్తవ రూపం దాల్చబోతోందని ఉద్ఘాటించారు. ప్రస్తుతం కొనసాగుతున్న నాలుగో పారిశ్రామిక విప్లవ హయాంలో ఉద్యోగాల సృష్టికి టెక్నాలజీకి ఒక ముఖ్యమైన సాధనంగా మారిందని గుర్తుచేశారు. నూతన ఉద్యోగాల కల్పనలో ఇకపైకూడా టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. భవిష్యత్తులో ఉద్యోగులకు, కార్మికులకు స్కిల్లింగ్, రీ-స్కిల్లింగ్, అప్‌స్కిల్లింగ్ అనేది కీలకం కాబోతోందని అభిప్రాయపడ్డారు. ఆధునిక సాంకేతికతల వినియోగంలో నైపుణ్యాలు తప్పనిసరిగా పెంచుకోవాలని సూచించారు. వర్క్‌ఫోర్స్‌ను నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. ఇందులో భాగంగా భారత్‌లో 'స్కిల్ ఇండియా మిషన్' ప్రారంభించామని తెలియజేశారు.

నైపుణ్యాలను పంచుకోవాలి

నైపుణ్యాలను అభివృద్ధి చేయడంతోపాటు వాటిని ఇతర దేశాలతో పంచుకొనే విషయంలో జీ-20 దేశాలు చొరవ తీసుకోవాలని ప్రధాని మోదీ విజ్ఞప్తి చేశారు. దీనివల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. నైపుణ్యాల సమాచారం ఇచ్చిపుచ్చుకోవాలన్నారు. భారత్‌లో కోవిడ్-19 వ్యాప్తి ఉధృతంగా ఉన్న సమయంలో ఫ్రంట్‌లైన్ ఆరోగ్య సిబ్బంది, ఇతర ఉద్యోగులు, కార్మికులు ఎనలేని సేవలు అందించారని, వారు తమ నైపుణ్యాలను, అంకితభావాన్ని ప్రదర్శించారని మోదీ కొనియాడారు. సేవా సంస్కృతిని చాటిచెప్పారని, సాటి మనుషుల పట్ల కరుణ కురిపించారని ప్రశంసించారు. నైపుణ్యం కలిగిన కార్మికులను ప్రపంచానికి అందించగల అతిపెద్ద దేశంగా ఎదిగే సామర్థ్యం భారత్‌కు ఉందని స్పష్టం చేశారు. సాంకేతికతలో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయని, టెక్నాలజీ ఆధారిత ఉద్యోగాలను సృష్టించడంలో భారత్‌కు అపార అనుభవం ఉందని వెల్లడించారు. నైపుణ్యాభివృద్ధిపై తాము ప్రత్యేకంగా దృష్టి పెట్టామని చెప్పారు. కౌశల్ వికాస్ యోజన కింద కృత్రిమ మేధ, రోబోటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, డ్రోన్స్ వంటి రంగాల్లో నైపుణ్యాలు పెంచుతున్నామని పేర్కొన్నారు. ఈ-శ్రమ్ పోర్టల్‌లో 21.8 కోట్ల మంది కార్మికులు నమోదయ్యారని మోదీ తెలిపారు.

సాక్షి కరీంనగర్

శనివారం । 22 । జూలై । 2023



మత్తడి దూకుతున్న కొత్తపల్లి చెరువు



కరీంనగర్ రూరల్: ఉధృతంగా ఇరుకుల్లవాగు



నగునూరు పాతరోడ్డు పైనుంచి ప్రవహిస్తున్న వరద



రామడుగు: నిండిన గుండి చెరువు



శంకరపట్నం: మునిగిన అర్కండ్ల లోలెవల్ బ్రిడ్జి



రామడుగు: వరదనీరు చేరడంతో కూలిన బావి

వాన.. వరద

- తెల్లవార్లు దంచికొట్టిన వాన
- రికార్డుస్థాయిలో వర్షపాతం నమోదు
- గుండిలో 21.3 సెంటీ మీటర్ల వర్షం
- చెరువులు కళకళ... వాగులు గలగల
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్ కర్ణన్
- ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నంబర్ **18004254731**

కరీంనగర్‌అర్బన్/కరీంనగర్‌రూరల్/కొత్తపల్లి/రామడుగు/గంగాధర/శంకరపట్నం: ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్లుగా తెల్లవార్లు కురిసిన వర్షానికి జిల్లాలోని చెరువులు కళకళలాడుతున్నాయి. వాగులు.. వంకలు గలగలా పారుతున్నాయి. కాజ్‌వేలు పొంగిపొర్లు తుండగా.. చెరువు మత్తళ్ల వద్ద చేపలు ఎదురెక్కుతున్నాయి. జిల్లాలో తొలిసారి రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదుకాగా.. గురువారం మధ్యాహ్నం నుంచి శుక్రవారం ఉదయం వరకు దంచికొట్టింది. 24గంటల వ్యవధిలో రామడుగు మండలం గుండిలో 21.3సె.మీ వర్షపాతం నమోదైంది.

చెరువులు.. ప్రాజెక్టులకు జలకళ

జిల్లాలో 1,336 చెరువులుండగా భారీ వర్షాలు కురియడంతో సగానికి పైగా అలుగు పారుతున్నాయి. మరిన్ని చెరువులు నిండుకుండను తలపిస్తున్నాయి. ఇక మధ్యమానేరు నుంచి నీటిని వదలగా ఎల్‌ఎండీలో భారీగా వరద నీరు చేరుతోంది. మానేరువాగు, గుండివాగులో ప్రవాహం పెరిగింది.

వర్షపాతం ఇలా..

జిల్లాలోని గంగాధరలో 15.8, బూరుగుపల్లి 14.3, అర్నకొండ(చొప్పదండి) 9.6, కరీంనగర్ అర్బన్ 9.5, ఆసిఫ్‌నగర్(కొత్తపల్లి) 8.5, దుర్శేడ్(కరీంనగర్ రూరల్) 7.8, వెదురుగట్టు(చొప్పదండి) 7.5, పోచంపల్లి(మానకొండూరు) 6.2, గట్టుదుద్దెనపల్లి(మానకొండూరు) 5.3, తాడికల్(శంకరపట్నం) 4.5, వెంకెపల్లి(సైదాపూర్), శంకరపట్నం 4.4, చిగురుమామిడి 4.3, ఈదులగుట్టిపల్లి, గన్నేరువరం 4.2, తిమ్మాపూర్ 3.5, ఇల్లందకుంట 3, జమ్మికుంట 2.9, హుజూరాబాద్‌లో 2.7సెం.మీల వర్షపాతం నమోదైంది.

విరిగిన ఆరుస్తంభాలు

జిల్లావ్యాప్తంగా ఆరు విద్యుత్ స్తంభాలు విరిగినట్లు కరీంనగర్ సర్కిల్ ఎస్‌ఈ వి.గంగాధర్ తెలిపారు. కరీంనగర్ రూరల్ డివిజన్ పరిధిలోని సీతారాంపూర్ శివారులో 11 కేవీ స్తంభంచెట్లపై ఒరుగగా, చింతకుంటలో 11కేవీ విద్యుత్‌లైన్‌లో సాంకేతిక లోపం ఏర్పడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని, రాత్రంతా శ్రమించి శుక్రవారం ఉదయం వరకు విద్యుత్‌ను పునరుద్ధరించామని ఎస్‌ఈ వివరించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్తంభాలు, వైర్లు తాకొద్దని ఈ సందర్భంగా కోరారు.

అలర్ట్‌గా ఉండండి

భారీవర్షాల దష్ట్యా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆర్వీ కర్ణన్ ఆదేశించారు. శుక్రవారం ఆర్డీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో భారీవర్షాలు కురిసే అవకాశముందని, అధికారులంతా అప్రమత్తతో, అందుబాటులో ఉండాలని సూచించారు. వర్షాల క్రమంలో ఎవరూ సెలవులో వెళ్లకుండా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రత్యేక సిబ్బందిని కేటాయించి టోల్‌ఫ్రీ నంబర్ 18004254731 అందుబాటులో ఉంచామని తెలిపారు. పురాతన, శిథిల భవనాల గోడలు కూలే పరిస్థితులు ఉంటే గుర్తించి నివాసితులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. చెరువులు, వాగుల్లోకి ప్రజలు వెళ్లకుండా అప్రమత్తం చేయాలన్నారు. అనంతరం లోయర్ మానేరు డ్యాం ప్రధాన గేట్ల వద్ద నీటి సామర్థ్యాన్ని పరిశీలించారు. ఎప్పటికప్పుడు నీటి నిల్వలను పరిశీలించాలని, భారీగా నీరు వచ్చి ప్రమాదస్థాయిని దాటినట్లయితే గేట్లను ఎత్తడానికి సిద్ధంగా ఉండాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు.

- గంగాధర, రామడుగు మండలాల్లోని గట్టుభూత్కూర్, హిమ్మత్‌నగర్, వెలిచాల, వెదిర గొలుసుకట్టు చెరువుల్లోంచి కొత్తపల్లి పెద్ద చెరువులోకి భారీగా వరద చేరుతోంది. దీంతో కొత్తపల్లి– చింతకుంట లోలెవల్ కల్వర్టుపై క్రమంగా వరద ఉధృతి పెరుగుతోంది. కొత్తపల్లి చెరువు, వెలిచాల బైపాస్‌లోని లోలెవల్ వంతెన వద్ద చేపల వేట జోరుగా సాగింది.
- కరీంనగర్ మండలంలోని వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. నగునూరు పాతరోడ్డు పైనుంచి వరదపారుతోంది. ఇరుకుల్ల వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దుర్శేడ్ వైకుంఠధామం నీటమునిగింది.
- చెర్లభూత్కూర్ శివారులోని పోచమ్మ ఒర్రె ఉప్పొంగడంతో గుజ్జులపల్లె, ప్రశాంత్‌నగర్, ఐతరాజ్‌పల్లె, చామనపల్లి శివారులోని లోలెవల్ కల్వర్టు వరదనీళ్లలో మునగడంతో బహదూర్‌ఖాన్‌పేటకు రాకపోకలు నిలిచిపోయాయి.
- రామడుగు మండలం గుండిలో దాదాపు 10గంటల పాటు వర్షం కురిసింది. గ్రామంలో 213.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మండలంలో నాలుగు ఇళ్లు పాక్షికంగా ధ్వంసం అయ్యాయి. దేశరాజ్‌పల్లి పరిధిలోని ఔదరిపల్లిలో ఉన్న అవుసలకుంటకు గండి పడి పలువురు రైతుల బావులు కూలాయి.
- గంగాధర మండలం గట్టుభూత్కూర్‌లో బొల్లబత్తిని రాజమల్లు, ఒద్యారంలో ములుకుంట్ల దేవమ్మకు చెందిన ఇండ్లు కూలిపోయాయి. నాగిరెడ్డిపూర్‌లో పురుషోత్తం దేవయ్య ఇంటిపై పిడుగుపడి గోడ కూలింది. శంకరపట్నం మండలం అర్కండ్లవాగుపై లోలెవల్ బ్రిడ్జి శుక్రవారం వరదనీటిలో మునిగిపోయింది.



వెలిచాల కాజ్‌వే నుంచి పారుతున్న వరద, చేపలు పడుతున్న మత్స్యకారులు



కొత్తపల్లి వద్ద పెద్దపెద్ద చేపలతో యువకులు



ఎల్‌ఎండీ నీటిమట్టాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కర్ణన్



గోపాల్‌పూర్‌లో కూలిన ఇల్లు

విపత్తు యోధులు సిద్ధం

- వరదలను ఎదుర్కొనేందుకు ఫైర్‌సర్వీస్ సమాయత్తం
- సిబ్బందికి సెలవులు రద్దు
- స్పీడ్‌బోట్లు, వాహనాలు, ఎక్విప్‌మెంట్ సిద్ధం
- ఎల్‌ఎండీలో రెస్క్యూ ఆపరేషన్ మాక్‌డ్రిల్
- శిథిలాల్లో చిక్కిన వారిని రక్షించే ప్రత్యేక కెమెరాలు



ఎల్‌ఎండీలో మాక్‌డ్రిల్ చేస్తున్న అధికారులు

24 గంటలు అందుబాటులో..



ప్రభుత్వ ఆదేశాల మేరకు మేం 24 గంటలపాటు విధుల్లోనే ఉంటున్నాం. సిబ్బంది సెలవులు రద్దుచేసుకున్నారు. ప్రజలు ఎక్కడ నీటిలో చిక్కుకున్నా.. కాపాడేందుకు, లోతట్టు ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉన్నాం. – **వెంకన్న, డీఎఫ్‌వో**

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్రంలో జోరుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అన్నిశాఖలతోపాటే కీలకమైన ఫైర్‌సర్వీసు కూడా సిద్ధమైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అగ్నిమాపక సిబ్బందికి సెలవులు రద్దు చేసింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా లీవుల్లో ఉన్న సిబ్బంది అంతా వెంటనే వచ్చి విధుల్లో చేరారని, 24 గంటలపాటు అందుబాటులో ఉన్నామని డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ (డీఎఫ్ఓ) తగరం వెంకన్న వెల్లడించారు. ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా ఎక్కడ ఎలాంటి వరదలు వచ్చినా.. లోతట్టు ప్రాంతాలు జలమయం అయినా.. వెంటనే అందుబాటులో ఉండేలా అన్నిఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ నీటిపారుదల, రెవెన్యూ, పోలీసులతో సంప్రదింపులు జరుపుతున్నారు. వారి వద్దఉన్న మ్యాన్ పవర్, ఎక్విప్‌మెంట్, యాక్షన్ ప్లాన్‌ని డీఎఫ్‌వో వెంకన్న ప్రభుత్వానికి సమర్పించారు.

ప్రత్యేక ఎక్విప్‌మెంట్..

ఫైర్‌సర్వీస్ వద్ద లైఫ్‌జాకెట్లు, ఇన్‌ఫ్లేటబుల్ బోట్లు, స్విమ్మర్లు, గ్లోవ్స్, రోప్స్, కరీంనగర్, మానకొండూరు, చొప్పదండి, హుజూరాబాద్, జమ్మికుంట, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లిలో ఫైర్‌సర్వీస్ అధికారులు డీజీపీ ఆదేశాల మేరకు అత్యవసర సేవల్లో ఇప్పటికే చేరిపోయారు. ముఖ్యంగా ఎగువమానేరు, మధ్యమానేరు, లోయర్‌మానేరు, ఎల్లంపల్లి, గోదావరి పరీవాహక ప్రాంతాల వద్ద అగ్నిమాపక సిబ్బందిని మోహరించారు. వానల తీవ్రత, మిడ్‌మానేరులో పరీవాహక ప్రాంతాల ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కొత్తబోటు కొనేందుకు ఎస్పీ కూడా సుముఖత వ్యక్తం చేశారని అధికారులు వెల్లడించారు. ఎల్‌ఎండీలో అగ్నిమాపక అధికారులు మాక్‌డ్రిల్ ప్రారంభించారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన అగ్నిమాపక అధికారులు అవసరాన్ని బట్టి సింగరేణి రెస్క్యూ బృందాలను వినియోగించుకునే వీలుంది.

విక్టిమ్ లొకేషన్ కెమెరా..

కరీంనగర్ అగ్నిమాపక కేంద్రంలో విక్టిమ్ లొకేషన్ కెమెరా అందుబాటులో ఉంది. వరద ఉధృతికి పాత ఇళ్లు కూలితే.. శిథిలాల్లో చిక్కుకున్న బాధితులను గుర్తించేందుకు ఉపయోగపడే కెమెరా ఇది. సుమారు 10 మీటర్ల కింద శిథిలాల్లో చిక్కుకున్న మనుషులు, జంతువులు.. ఏవైనా సరే దీని ద్వారా నేరుగా చూసే వీలు చిక్కుతుంది. అదేవిధంగా దీనిలో ఉండే కేబుల్ కెమెరా ద్వారా శిథిలాలకు రంధ్రం చేసిచూసే వీలుంటుంది. ఈ కెమెరా దాదాపు రూ.12 లక్షల విలువ చేస్తుందని అధికారులు తెలిపారు.

సిటీ ఇళ్లల్లోకి వర్షం నీళ్లు



టవర్‌సర్కిల్‌లో బోళ్ల దుకాణంలోకి చేరిన వరద



ముకరంపురలో జలమయమైన వీధి

- ముకరంపురలో జలమయంగా వీధులు
- కిసాన్‌నగర్, కాశ్మీర్‌గడ్డలో కూలిన ఇళ్లు
- పడిపోయిన ధన్గర్‌వాడీ పాఠశాల గోడ
- టవర్‌సర్కిల్‌లో షాప్‌ల్లోకి నీళ్లు

కరీంనగర్ కార్పొరేషన్: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల ప్రభావం నగరంపై కొనసాగుతోంది. లోతట్టు ప్రాంతాలతో పాటు, చాలా వీధులు, రోడ్లు జలమయమయ్యాయి. కిసాన్‌నగర్‌లో శిథిలావస్థలో ఉన్న ఇల్లు పాక్షికంగా కూలడంతో, నగరపాలకసంస్థ సిబ్బంది పూర్తిగా తొలగించారు. కాశ్మీర్‌గడ్డలో రేకుల ఇల్లు కూలిపోవడంతో మేయర్ యాదగిరి సునీల్‌రావు ఆర్థిక సహాయం అందించారు. టవర్ సర్కిల్‌లోని చారిత్రిక ధన్గర్‌వాడీ పాఠశాల గోడ పడిపోయింది. ముకరాంపుర, హౌసింగ్ బోర్డుకాలనీ, శర్మనగర్ తదితర ప్రాంతాల్లో వరదనీళ్లు ఇండ్లల్లోకి చేరాయి. టవర్‌సర్కిల్‌లోని పలు దుకాణాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

నగర వాసులను వర్షాలు, వరదలు వెన్నాడుతున్నాయి. వరుసగా కురిసిన వర్షాలతో లోతట్టు ప్రాంతాలతో పాటు, చాలా చోట్ల రోడ్లు, వీధులు జలయమయ్యాయి. డ్రైనేజీల కనెక్టివిటీ సరిగా లేకపోవడం, చాలా చోట్ల డ్రైనేజీలు శిథిలావస్థకు చేరడం, కొన్నిచోట్ల అసలు డ్రైనేజీలు లేకపోవడంతో రోడ్లు, వీధుల్లో వరదనీళ్లు చేరిపోయాయి. ముకరాంపురలోని టూటౌన్‌పోలీసు స్టేషన్ పక్కనున్న వీధిపూర్తి జలమయంగా మారింది. పక్కనే ఉన్న నాలానిర్వహణ లేని ఫలితంగా గతంలో చాలాసార్లు ఇబ్బంది పడ్డ కాలనీ వాసులకు, గురు, శుక్రవారాల్లో మళ్లీ ఆ తిప్పలు తప్పలేదు. వీధితో పాటు ఇండ్లల్లోకి డ్రైనేజీ నీళ్లు, వరదనీళ్లు చేరడంతో, కాలనీవాసులు శుభ్రం చేసుకోవడానికి గంటలపాటు శ్రమించాల్సి వచ్చింది. ఇక హౌసింగ్ బోర్డుకాలనీ పల్లపు ప్రాంతంలోని ఇండ్లల్లోకి వరదనీళ్లు చేరాయి. టవర్‌సర్కిల్‌లో పలు షాప్‌ల్లోకి వరదనీళ్లు పోవడంతో వ్యాపారులకు నష్టం వాటిల్లింది. శిథిలావస్థలో ఉన్న దన్గర్‌వాడీ పాఠశాల భవనం గోడ కూలిపోయింది. గోడ పక్కనే ఉన్న విద్యుత్ స్తంభంపై పడిపోవడంతో, సిబ్బంది వచ్చిగోడను తొలగించారు. చాలాచోట్ల కార్పొరేటర్లు సహాయక చర్యలు చేపట్టారు. ఇండ్లు, వీధులు, రోడ్లపై నిలిచిన నీళ్లను మళ్లించడంతో పాటు, డ్రైనేజీల్లో మట్టి,చెత్త తొలగించి వరద నీళ్లు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టారు.

కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలి

డివిజన్ పరిధిలో వరదనీళ్లు షాప్‌లు, ఇండ్లల్లోకి వచ్చాయని, ధన్గరివాడీ పాఠశాల గోడ కూలినప్పటికి నగరపాలకసంస్థ కమిషనర్, అధికారులు స్పందించలేదని 49వ డివిజన్ కార్పొరేటర్ కమల్‌జీత్‌కౌర్ సోహన్‌సింగ్ వాపోయారు. తనపై వ్యక్తిగత కక్షతోనే అధికారులు స్పందించలేదని, ఈ విషయాన్ని మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళుతానన్నారు. స్మార్ట్‌సిటీ కాంట్రాక్టర్ నాణ్యత లేకుండా చేసిన పనుల వల్లనే టవర్‌సర్కిల్‌లో ఈ పరిస్థితి తలెత్తిందని ఆరోపించారు. రూ.వేయి కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేసిన స్మార్ట్‌సిటీ కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు.

– **కమల్‌జీత్‌కౌర్ సోహన్‌సింగ్**

వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలి

- సీజనల్ వ్యాధులపై కలెక్టర్ సమీక్ష



కరీంనగర్‌టౌన్: వర్షాకాలంలో ప్రబలే వ్యాధులపై వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆర్వీ.కర్ణన్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్య కార్యక్రమాల ప్రగతిపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్‌వ్యాధులు, జ్వరాలు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. పల్లె దవాఖానాల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రూరల్‌ప్రాంతాల్లో వానలకు పాములు సంచరించే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున యాంటీ స్నేక్‌కిట్‌లు అందుబాటులో ఉంచాలన్నారు. ఇకపై జిల్లాలో ప్రతీ సోమవారం నుంచి శుక్రవారం వరకు డ్రైడే, ర్యాపిడ్ ఫీవర్ సర్వే కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. మెడికల్ ఆఫీసర్లందరూ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆరోగ్యకేంద్రాల్లో ఆందుబాటులో ఉండాలని ఆదేశించారు. డెంగీపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. డీఎంహెచ్‌వో లలితాదేవి, డీపీవో వీరబుచ్చయ్య, మున్సిపల్ కమిషనర్ సేవాఇస్లావత్, మెడికల్ సూపరింటెండెంట్ కృష్ణప్రసాద్, డీడబ్ల్యూవో సంధ్యారాణి, సీడీపీవో సబితాకుమారి పాల్గొన్నారు.

దళితబంధులో మామూళ్ల లొల్లి!

- ఇటీవల సస్పెండ్ అయిన ఓ జూనియర్ అసిస్టెంట్
- తన పైఅధికారిని వదిలి తనపై చర్యలా అంటూ గగ్గోలు
- అరెస్టుకు భయపడి లాంగ్‌లీవ్‌లో వెళ్లిన మరో ఉద్యోగి

సాక్షి ఎఫెక్ట్

సాక్షిప్రతినిధి,కరీంనగర్: దళితబంధులో మామూళ్ల రగడ రాజుకుంటోంది. క్లస్టర్లలో అవినీతి క్రమంలో కలెక్టర్ ఆర్వీ కర్ణన్ కొరఢా ఝుళిపించిన విషయం తెలిసిందే. హుజూరాబాద్ డివిజన్‌లో ఓ ఉద్యోగిని సస్పెండ్ చేయగా సదరు ఉద్యోగి నిత్య ఆవేదన పలు అనుమానాలకు తావిస్తోంది. 'దళిత బంధులో అవినీతి జాడలు' శీర్షికన సాక్షిలో ఈనెల 3న కథనం ప్రచురితమైంది. ఇదే ఘటనలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో ఉద్యోగిపై ఏసీబీ నిఘా పెరిగింది. ఈక్రమంలో సదరు అధికారి లాంగ్‌లీవ్‌లో వెళ్లడం గమనార్హం. దళిత వర్గాలకు ప్రయోజనం చేకూర్చాల్సిన దళితబంధు కొందరు అవినీతిపరులకు కల్పతరువులా మారడం, కొందరు అధికారులతో పాటు సిబ్బంది కూడ పర్సంటేజీలు మాట్లాడుకుని లబ్ధిదారుల వద్ద వీలైనంత పిండేస్తున్నారు. దళిత బంధులో లబ్ధిదారునికి రూ.10 లక్షలు ఇస్తుండగా అందులో పర్సంటేజీల రూపేణా సుమారు రూ.3 నుంచి 4 లక్షల వరకు మామూళ్లదే పైచేయిగా మారుతోంది. మామూళ్లకు సహకరిస్తేనే మంజూరవుతుండటం వంటి ఘటనల క్రమంలో ఫిర్యాదులు, ఆరోపణలక్రమంలో కలెక్టర్ ఆదేశాలతో జెడ్పీ సీఈవో ఇటీవల ఓ ఉద్యోగిని సస్పెండ్ చేశారు. మామూళ్లలో సింహభాగంపై అధికారిదేనని, అలాంటపుడు తనని మాత్రమే ఎలా బాధ్యుడిని చేస్తారని సదరు ఉద్యోగి వాపోతున్నారు.



హుజూరాబాద్ మున్సిపల్ కార్యాలయం

పర్సంటేజీలో మీకు కూడా భాగముంది కదా ? మిమ్మల్నెందుకు సస్పెండ్ చేస్తలేరు? సదరు అధికారిని ముఖాముఖిగా నిత్యం కార్యాలయానికి వచ్చి నిలదీస్తుండటం అవినీతి తీవ్రతను చాటుతోంది. మద్యం సేవించి కార్యాలయంలో అవినీతిపై ఆవేదన వ్యక్తం చేస్తుండగా విషయం ఉన్నతాధికారుల వరకు చేరినట్లు సమాచారం.

క్లుప్తంగా

సైబర్ నేరాలపై వెంటనే కేసు నమోదు చేయాలి

• సీపీ ఎల్. సుబ్బారాయుడు



మాట్లాడుతున్న సీపీ సుబ్బారాయుడు

కరీంనగర్‌క్రైం: సైబర్ నేరాలు జరిగిన వెంటనే కేసులను నమోదు చేయాలని సీపీ ఎల్.సుబ్బారాయుడు ఆదేశించారు. కమిషనరేట్‌కేంద్రంలో శుక్రవారం నేరసమీక్ష నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ.. సైబర్‌నేరాలపై సత్వరమే కేసు నమోదు చేయడం ద్వారా తస్కరించబడిన డబ్బు లావాదేవీలు నిలుపుదల చేసి, బాధితులకు అందజేసే అవకాశముంటుందని తెలిపారు. నేరాలు జరిగేందుకు ఆస్కారం ఉన్నప్రాంతాల్లో గస్తీ ముమ్మరం చేయాలని అన్నారు. పనిచేయని సీసీ కెమెరాలకు వెంటనే మరమ్మతు చేయించాలని తెలిపారు. పోలీస్‌స్టేషన్లో ఏర్పాటుచేసిసిన సీసీ కెమెరాలు ప్రతిరోజూ పనిచేసే విధంగా చూసుకోవాలని సూచించారు. గంజాయి, మత్తుపదార్థాల అక్రమ రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని అన్నారు. ఆకస్మిక తనిఖీలతో అక్రమ కార్యకలాపాలు నియంత్రణలోకి వస్తాయని సూచించారు. గత ఎన్నికల సందర్భంగా నమోదైన కేసులు పరిష్కరించబడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీసీపీలు ఎస్.శ్రీనివాస్, జి.చంద్రమోహన్, అడిషనల్ డీసీపీ భీంరావు, ట్రైనీ ఐపీఎస్ అధికారి గీత్ మహేశ్ బాబా సాహెబ్, ఏసీపీలు పాల్గొన్నారు.

డబుల్ డెక్కర్ స్కైవే ఏర్పాటుకు సానుకూలం

• ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్


రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసిన కేటీఆర్, వినోద్(ఫైల్)

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: హైదరాబాద్‌లోని జేబీఎస్ నుంచి శామీర్‌పేట మధ్యలో డబుల్ డెక్కర్ స్కైవే నిర్మాణంతో కరీంనగర్–హైదరాబాద్ మధ్యలో ప్రయాణానికి మహర్దశ కలగనుంది. ఇటీవల ఈ ప్రతిపాదనను కేంద్రం వద్ద ఉంచినప్పుడు కేంద్రం సానుకూలత వ్యక్తం చేశారని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్ శుక్రవారం వెల్లడించారు. డబుల్ డెక్కర్ స్కైవే మూడంచెల పద్ధతి ఉంటుందని, పైభాగంలో మెట్రో రైలు, మధ్యలో ఫ్లైఓవర్, కింది భాగంలో రోడ్డు ఉంటుందని వివరించారు. పనులు పూర్తిఅయ్యే నాటికి దాదాపు ఐదువేల కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నట్లు వివరించారు. కరీంనగర్ మార్గంలో హైదారాబాద్ నుంచి శామీర్‌పేట వరకు 18.5 కిలో మీటర్ల డబుల్ డెక్కర్ స్కైవే నిర్మాణంతో సిద్దిపేట, కరీంనగర్ జిల్లా, పెద్దపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లా ప్రజలకు హైదరాబాద్ కు సాఫీగా రాకపోకలు సాగించేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇటీవల మంత్రి కేటీఆర్, ఎంపీలు కొత్త ప్రభాకర్ రెడ్డి, రంజిత్ రెడ్డిలతో కలిసి తాను కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తో జరిపిన చర్చల ఫలితంగా ఈ ప్రతిపాదనలు కొలిక్కి వచ్చినట్లు తెలిపారు.

పీటీఐలపై కనికరం చూపరా!

• రాష్ట్రమంతా ఓ న్యాయం... జిల్లాకో న్యాయమా
• రీఎంగేజ్‌లో తీవ్ర జాప్యం
• జిల్లాలో 81మంది ఎదురుచూపులు


చర్చలు జరుపుతున్న ఉపాధ్యాయ నాయకులు

కరీంనగర్: జిల్లాలో విద్యాశాఖ వ్యవహరిస్తున్న తీరుతో జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్ల(పీటీఐ) పరిస్థితి ముందు నొయ్యి... వెనక గొయ్యి అన్న చందంగా తయారైంది. విద్యార్థులకు సృజనాత్మతకను వెలికి తీసి సహ పాఠ్యాంశాలు బోధించడానికి ప్రభుత్వం ఆర్ట్, వర్క్, మ్యూజిక్, ఫిజికల్ ఎడ్యుకేషన్ బోధించడానికి పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు(పీటీఐ)ను ఏటా నియమిస్తోంది. పీటీఐలను రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పాఠశాలల ప్రారంభం రోజే రీఎంగేజ్ చేసుకొని విధుల్లోకి తీసుకున్నారు. కరీంనగర్ జిల్లాలో మాత్రం పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్ల ఫైల్ విద్యాశాఖ అధికారి కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయానికి రావడం, పోవడమే తప్పా.. రీఎంగేజ్ ఉత్తర్వులు రాకపోవడంతో అసలేం జరుగుతుందో తెలియక పీటీఐలు అయోమయంలో ఉన్నారు.

• రాష్ట్రవ్యాప్తంగా విద్యాశాఖలో పనిచేస్తున్న పీటీఐలను ప్రభుత్వం ఏటా విద్యాసంవత్సరం చివరి పనిదినం రోజున తొలగించి మళ్లీ నియమిస్తుంది.
• ప్రభుత్వాదేశానుసారం డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్లు ప్రతిఏడాది వీరికి రీఎంగేజ్ ఆర్డర్ఇవ్వగానే అన్ని జిల్లాల్లో పీటీఐలు విధులకు హాజరవుతూ వారివారి పాఠశాలల ద్వారా సంబంధిత పత్రాలు డీఈవో కార్యాలయానికి పంపిస్తారు.
• జిల్లాలో కమిషనర్, పీడీ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. ఏటా ఇదే తంతు కొనసాగుతోంది. కలెక్టర్ అప్రూవల్ అయ్యాక పాఠశాలకు వెళ్లాలని చెబుతూ ఫైల్‌ను ప్రతిఏడాది 20 నుంచి 40రోజులు ఆలస్యం చేస్తుండడంతో వేతనాలు కోల్పోతున్నారు.
• ఆర్ట్, క్రాఫ్ట్, పీఈటీ విభాగంలో జిల్లాలో మొత్తం 81 మంది పీటీఐలుగా పనిచేస్తున్నారు. వీరికి వేతనం నెలకు రూ.11,700లు చెల్లిస్తున్నారు.
• పీటీఐలను కావాలని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలు ప్రారంభమై 40 రోజులు గడుస్తున్నా రీ ఎంగేజ్ చేసుకోకపోవడంతో పీటీఐలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
• దీంతో మేమేం పాపం చేశామంటూ కలెక్టరేట్ చుట్టూ , విద్యాశాఖాధికారికి చుట్టూ ప్రదక్షిణలు చేయడమే వారి వంతుగా మారింది. వివిధ రంగాలలో విద్యార్థులకు సృజనాత్మకతను బోధిస్తున్న తమకు ప్రభుత్వం చాలీచాలనీ వేతనాలు ఇవ్వడం ఇబ్బందిగా ఉందని వాపోతున్నారు.
• ప్రభుత్వం తమను పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లుగా నియమించిన పుల్‌టైంగా పనిచేస్తున్నామని ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా కనీసం వేతనాలు పెంచాలని పీటీఐలు డిమాండ్ చేస్తున్నారు.
• తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని పేర్కొనడంతో తమ ఉద్యోగాలు ఎప్పుడు పర్మినెంట్ అవుతాయోనని పీటీఐలు ఎదురుచూస్తున్నారు.
• ఏపీ ప్రభుత్వంతో పాటు ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలు పీటీఐలకు రూ.15 వేల నుంచి రూ.20 వేలకు పైగా వేతనం పెంచి ఇస్తున్నారని, తమకు కూడా ప్రభుత్వం వేతనాలు పెంచాలని వారు కోరుతున్నారు.

రాష్ట్రానికో న్యాయం.. జిల్లాకో న్యాయమా?



పార్ట్‌టైం టీచర్లను రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పాఠశాలల ముగింపు రోజు తొలగించడం... పునః ప్రారంభం రోజు రీఎంగెజ్ చేసుకోవడం ఆనవాయితీ. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పీటీఐలను రీఎంగెజ్ చేసుకొని ఉత్తర్వులు ఇచ్చిన ప్రభుత్వం జిల్లాలో మాత్రం ఆర్ట్, వర్క్, మ్యూజిక్, పీఈటీలను, భవిత కేంద్రాల్లో పనిచేస్తున్న 22 మంది ఐఆర్‌పీలను రీఎంగెజ్ చేసుకోవడం విచారకరం.రాష్ట్రానికో న్యాయం... జిల్లాకో న్యాయమా... జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని పీటీఐలకు ఉత్తర్వులు జారీ చేయాలి.

– ముస్కు తిరుపతిరెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు

• పీటీఐల రీఎంగెజ్ ఉత్తర్వుల విషయంపై జిల్లా విద్యాశాఖ అధికారిని సంప్రదించగా కలెక్టర్ అప్రూవల్ అయ్యాక విధుల్లోకి తీసుకుంటామని తెలిపారు.

గుండెపోటుతో కరీంనగర్ డీఐఈవో మృతి


నివాళి అర్పిస్తున్న కలెక్టర్ కర్ణన్


నివాళి అర్పిస్తున్న విద్యాజేఏసీ చైర్మన్, అధ్యాపకులు


రాజ్యలక్ష్మి(ఫైల్)

కరీంనగర్: కరీంనగర్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి(డీఐఈవో) టి.రాజ్యలక్ష్మి శుక్రవారం ఉదయం 10.20 నిమిషాలకు గుండెపోటుతో మృతి చెందారు. ఉదయం వారి నివాసంలో ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గత మూడున్నరేళ్లగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న రాజ్యలక్ష్మి టైపిస్టుగా ఉద్యోగంలో చేరి జూనియర్ లెక్చరర్‌గా, ప్రిన్సిపల్‌గా, డీఐఈవోగా సేవలందించారు. భర్త పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో చేసి గతంలోనే పదవీ విరమణ పొందారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. స్వస్థలం సిరిసిల్ల జిల్లా అయినప్పటికి 30ఏళ్ల క్రితం ఉద్యోగరీత్యా కరీంనగర్‌లోని చైతన్యపురిలో స్థిరపడ్డారు. రాజ్యలక్ష్మి భౌతికకాయానికి కలెక్టర్ ఆర్వీ కర్ణన్, అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి, తదితరులు నివాళి అర్పించారు.

దొంగతనం కేసులో ముగ్గురి అరెస్ట్



పెగడపల్లి(ధర్మపురి): అయితిపల్లి గ్రామంలో హార్వెసర్ల చైన్లు(గొలుసులు) దొంగిలించిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు మల్యాల సీఐ కోటేశ్వర్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఎస్సై సతీశ్‌తో కలిసి సీఐ వివరాలను వెడించారు. హార్వెసర్ల చైన్లు చోరీకి గురైనట్లు యాజమానులు ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్సై.. సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో శుక్రవారం నందగిరి ప్రాంతంలో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు దొంగల సమాచారం అందింది. దీంతో అయితిపల్లి గ్రామానికి చేరుకున్న పోలీసు సిబ్బందికి ఇదే మండలంలోని నందగిరి గ్రామానికి చెందిన ఎండీ షబీర్, గర్వంద వేణు, సామవేని వెంకటేశ్ తారసపడ్డారు. పోలీసులను చూసి పరుగెత్తే ప్రయత్నం చేశారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. వారిచేతిలోని సంచులను తనిఖీ చేశారు. అందులో సుమారు రూ.1.20 లక్షల విలువైన హార్వెస్టర్ చైన్లు(గొలుసులు) లభించాయి. వారిని విచారించగా హార్వెస్టర్ చైన్లు దొంగిలించినట్లు అంగీకరించారు. ముగ్గురు నిందితులను కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ వివరించారు. నిందితులను పట్టుకునేందుకు కృషి చేసిన సీఐ కోటేశ్వర్, ఎస్సై సతీశ్, ఏఎస్సై సత్తయ్య, పీసీలు వెంకటేశ్, ఎల్లయ్య, సంపత్‌ను ఎస్పీ భాస్కర్, డీఎస్పీ వెంకటస్వామి అభినందించారు.

అసెస్మెంట్ల దాఖలుకు ఈనెల చివరి వరకు గడువు


మాట్లాడుతున్న ప్రత్యూష్

విద్యానగర్(కరీంనగర్): 2022–23 ఆర్థిక సంవత్సర అసెస్మెంట్స్ దాఖలుకు ఈ నెల 31వరకు గడువు ఉందని ఆదాయ పన్నుశాఖ కరీంనగర్ రేంజ్ అసిస్టెంట్ కమిషనర్ సరస ప్రత్యూష్ తెలిపారు. శుక్రవారం కరీంనగర్‌లోని ఆదాయపన్ను శాఖ కార్యాలయంలో టాక్స్ అకౌంటెంట్లు, ప్రాక్టీషనర్లకు అవగాహన సమావేశం జరిగింది. ప్రత్యూష్ మాట్లాడుతూ.. అసెస్మెంట్స్ దాఖలకు ఈనెల చివరి వరకు అవకాశం ఉన్నందున త్వరగా చేయాలని ఆయన కోరారు. ఆదాయపు పన్ను చెల్లింపుదారులు మినహాయింపులు, తగ్గింపులను తప్పుడుగా దాఖలు చేసి వాటి ఆధారంగా రిఫండ్లను క్లెయిమ్ చేస్తున్నట్లు విచారణలో వెల్లడైందని, ఇటువంటివారు తప్పులు సరిదిద్దుకుని మళ్లీ రిటర్న్స్ ఫైల్ చేయాలని సూచించారు. ఆదాయపన్ను చెల్లింపుదారులైన ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేట్ సంస్థల ఉద్యోగులు, వ్యాపారుల్లో కొందరు రిటర్న్స్ దాఖలు చేసిన టీడీఎస్‌ల్లో 75 నుంచి 90శాతం రీఫండ్‌క్లైమ్ చేసినట్లు తమ విచారణలో వెల్లడైందన్నారు. అలాంటి వారికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. నోటీసులు అందుకున్న వారు మళ్లీ సరైన రిటర్న్స్ దాఖలు చేస్తున్నరని, ఆదాయపుపన్ను చెల్లింపుదారులు ఇటువంటి మోసపూరిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆదాయపు పన్ను అధికారి దుర్గాప్రసాద్, ఐటీ ఇన్స్‌పెక్టర్ వంశీ, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య


ఈశ్వరి మృతదేహం

జమ్మికుంట: కుటుంబ సమస్యలతో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. జమ్మికుంట పోలీసుల వివరాల మేరకు.. ములుగు జిల్లా మంగపేట మండలం జబ్బోనిగూడెం గ్రామానికి చెందిన కొప్పుల ఈశ్వరి(44)– సాంబయ్య దంపతులు మూడేళ్ల క్రితం మండలంలోని వావిలాలకు వలస వచ్చారు. వ్యవసాయ భూమి కౌలుతీసుకుని సాగు చేసుకుంటున్నారు. ఇటీవల ఇంట్లో ఈశ్వరి డబ్బులు దాచింది. అవి కనిపించకపోవడంతో దంపతుల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన ఈశ్వరి గురువారం పురుగుల మందు తాగింది. స్థానికులు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ చనిపోయింది. సాంబయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు.

ప్రజాసమస్యలపై పోరాడుదాం

• సీపీఐ జాతీయకార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి


మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

పెద్దపల్లిరూరల్: ప్రజాసమస్యలపై పోరాడేందుకు పార్టీ శ్రేణులంతా సన్నద్ధం కావాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. పెద్దపల్లిలో శుక్రవారం కోడం స్వామి అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమయ్యారని ఆరోపించారు. ప్రజాసమస్యలను ఎంచుకుని వాటి సాధనకు పోరాటాలు చేయాల్సిన అవసరముందన్నారు. ఈనెల 26 నుంచి 30 వరకు సేవ్ ఆర్టీసీ పేరుతో డిపోల ముందు ధర్నాలు చేయాలని పిలుపునిచ్చారు. వచ్చే నెల 7న ప్రజాసమస్యలపై కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాలను చేపట్టాలన్నారు. మణిపూర్‌లో జరుగుతున్న ఘటనలకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి తాంద్ర సదానందం, నాయకులు కలవేన శంకర్, రాజారత్నం, ఉదయ్, మానస్‌కుమార్, మాటేటి శంకర్, శ్రీనివాసరెడ్డి, గట్టయ్య, లెనిన్, సృజన్, అశోక్, లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

‘బహుజన రణభేరీ’ విజయవంతం చేయండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

చొప్పదండి: అగస్టు 6న చొప్పదండి పట్టణంలో నిర్వహించే బహుజన రణభేరీని విజయవంతం చేయాలని బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కోరారు. పెద్దపల్లి జిల్లాలో పర్యటిస్తున్న ప్రవీణ్‌కుమార్‌ను చొప్పదండి నియోజకవర్గ బీఎస్‌పీ నేతలు కలిసి రణభేరీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మేకల రవిందర్, నల్లాల శ్రీనివాస్, అక్కి బాలకిషన్, కొంకటి శేఖర్, మంద రవిందర్, కాంపెల్లి రాజు, నాగుల మహేశ్, నల్లాల రాజేందర్, ఇరుగురాల రమేశ్, షమీమ్, కాంత, మనోహర్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాఖలో ‘భానమతి’ భయం

• వేములవాడ ఉద్యోగికి బెదిరింపు లేఖ
• కరీంనగర్‌లో కుటుంబికుల ఫిర్యాదు
• కేసు నమోదు చేసిన పోలీసులు
• జిల్లాలో వైరల్ అవుతున్న ఎఫ్ఐఆర్

సిరిసిల్లక్రైం: శాస్త్రీయతతో ప్రాణాలను కాపాడే వైద్యులు ఉండే వైద్యశాఖలోని ఉద్యోగులు భానమతి(చేతబడి) పేరిట బెదిరింపులకు పాల్పడగా పోలీసులను ఆశ్రయించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాజన్నసిరిసిల్ల జిల్లాలోని వేములవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేసే ఉద్యోగికి అదేశాఖలో పనిచేసే మరో ఉద్యోగికి ఉన్న విభేదాలను సరిచేయడానికి చేతబడిని ఎంచుకోవడం, ప్రాణభయం ఉందని బాధిత ఉద్యోగి కుటుంబీకులు ఠాణా మెట్లు ఎక్కడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఎఫ్ఐఆర్ కాపీ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. వివరాలు ఇలా ఉన్నాయి. సిరిసిల్ల వైద్య ఆరోగ్యశాఖలోని సూపరింటెండెంట్ తమ్మిశెట్టి నాగరాజు డిప్యూటేషన్‌పై వేములవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్నాడు. పదోన్నతి విషయంలో మరొకరితో వివాదం ఉంది. దీనికి సంబంధించిన అన్ని అంశాలను కోర్టుకు సమర్పించగా కోర్టు నాగరాజు పదోన్నతికి అనుకూలంగా తీర్పు వచ్చింది. ఇది అమలుకావడం లేదని నాగరాజు మరో పిటిషన్ వేశాడు. ఇదిలా ఉండగా ఈనెల 5న నాగరాజు నివాసానికి ఓ ఉత్తరం వచ్చింది. ఈనెల 17లోగా కోర్టులోని కేసు వాపస్ తీసుకోవాలని లేకుంటే ఇంట్లోని వారందరికీ భానమతి(చేతబడి) చేయించి చంపేస్తామని బెదిరింపులు ఉన్నాయి. అంతేకాదు నాగరాజు లంచగొండి, కోర్టులో తప్పుడు కేసులు వేస్తాడని, అమ్మాయిలను మోసం చేస్తాడని రాసి ఉంది. వెంటనే నాగరాజు భార్య లెటర్ వచ్చిన ఏరియాలోని పోస్టాఫీస్ సీసీ పుటేజీలు కావాలని హైదరాబాద్ హెడాఫీస్‌కు విన్నవించడి.. వారు సీసీ పుటేజీలు ఇచ్చారు. సీసీపుటేజీల్లో జగిత్యాల వైద్యశాఖలో పనిచేసే సూపరింటెండెంట్ అహ్మద్ హుస్సేన్‌గా గుర్తించారు. కోర్టు కేసులో గెలిచి నాగరాజుకు పదోన్నతి వస్తే అదే శాఖలో పనిచేసే అహ్మద్ హుస్సేన్ పదోన్నతికి ఆటంకం కలుగుతుందన్న దురుద్దేశ్యంతోనే చేతబడి పేరిట బెదిరింపు లేఖ రాసినట్లు కరీంనగర్ టూ టౌన్‌లో నాగరాజు భార్య ఈనెల 11న ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వైద్యశాఖలో ఉన్న ఇద్దరు ఉద్యోగులు మూఢనమ్మకాల పేరిట బెదిరింపులు చేసుకోవడం చర్చనీయాంశమైంది.

కుక్కల దాడిలో 12 మందికి గాయాలు

కోరుట్ల: పట్టణంలోని పలు ప్రాంతాల్లో కుక్కలు చెసిన దాడుల్లో 12 మంది గాయాలపాలయ్యారు. శుక్రవారం గోదాం రోడ్డు, కల్లూర్‌రోడ్డు, గాంధీ రోడ్డులో కుక్కలు స్వైరవిహారం చేశాయి. వాటి దాడుల్లో అబ్దుల్ ఖాలిక్(5), సత్తార్ (28), దీపాంకిత(10), అతఖ(7), ధన్‌రాజ్(34), సాయిపల్లవి(7), జోయ (8), మిథ్యు(27), అయాన్(7), దక్షిత(7), మురళి(12), దామోదర్(9) గాయపడ్డారు. వారందిరికీ స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేశామని సూపరింటెండెంట్ సునీత తెలిపారు. 12 మందిలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయని పేర్కొన్నారు. మిగతా వారికి స్వల్ప గాయాలుకాగా చికిత్సచేసి ఇళ్లకు పంపించామని వివరించారు. పట్టణ ప్రజలను కుక్కల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

బండి సంజయ్‌ని పదవి నుంచి తప్పించారని..


చికిత్స పొందుతున్న అజయ్‌వర్మ


మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలింపు

• ప్రధాన అనుచరుడు సొల్లు అజయ్‌వర్మ ఆత్మహత్యాయత్నం
• పురుగుల మందుతాగడంతో పరిస్థితి విషమం.. హైదరాబాద్ తరలింపు

గన్నేరువరం(మానకొండూర్): రాష్ట్ర అధ్యక్షుడి హోదా నుంచి బండి సంజయ్‌ని తప్పించారని మనోవేదన చెందిన అతని ప్రధాన అనుచరుడు గన్నేరువరం మండలం గునుకుల కొండాపూర్‌కు చెందిన సొల్లు అజయ్‌వర్మ శుక్రవారం తన వ్యవసాయక్షేత్రంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ విషయాన్ని ఫోన్‌ద్వారా తన మిత్రులు కొంకటి అనిల్, బోయిని అభిషేక్‌కు చెప్పడంతో వెంటనే కారులో తీసుకెళ్లి కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ క్రమంలో ఆత్మహత్యాయత్నానికి గల కారణాలకు సంబంధించిన ఓ వీడియో విడుదల చేశారు. బండి సంజయ్ అధ్యక్షపదవి చేపట్టినప్పటి నుంచి మహా సంగ్రామయాత్రతో పార్టీని గల్లీగల్లీలో విస్తరించాడని, పదిహేనేళ్లుగా సంజయ్ వెంటనే నడుస్తున్నట్లు అజయ్ వర్మ వీడియోలో పేర్కొన్నాడు. అధిష్టానం అధ్యక్ష పదవి నుంచి తొలగించడం బాధాకరమని, ఆ బాధతో తాను బాత్‌రూంలోకి వెళ్లి ఏడ్చానని, సోషల్ మీడియాలో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వాఖ్యలు విన్న తరువాత మరింత కుమిలిపోయానని ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతోనే తాను పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించానని తెలిపారు. తన చావుతోనైనా సంజయ్‌కి కేంద్రమంత్రి పదవితో పాటు సీఎం అభ్యర్థిగా ప్రకటించాలని కోరాడు. విషయం తెలుసుకున్న ఎంపీ బండి సంజయ్ ఫోన్‌లో డాక్టర్లతో, బీజేపీ నాయకులతో మాట్లాడారు. అజయ్‌వర్మను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. అజయ్‌వర్మ మానకొండూర్ నియోజకర్గం నుంచి బీజేపీ టికెట్ ఆశిస్తున్నాడు.

క్రీడాపోటీలను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న జీవీ రామకృష్ణారావు

మానకొండూర్: ఆగస్టు 5,6 తేదీల్లో మానకొండూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు కోరారు. సుడా క్యాంపు కార్యాలయంలో ఇషా ఫౌండేషన్ వారు ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వాలీబాల్, త్రోబాల్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని, 14 సంవత్సరాల నుంచి 80సంవత్సరాలు వృద్ధులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని అన్నారు. గెలుపొందిన వారికి ప్రైజ్‌మనీ ఉంటుందని అన్నారు. ఆసక్తి కలవారు 72074 39500 సెల్ నెంబరును సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇషా ఫౌండేషన్ సభ్యులు శ్రావణ్, కమ్యూనిటీ కోర్డినేటర్ జ్యోతి మహిళలు పాల్గొన్నారు.

రీజినల్ స్పోర్ట్స్‌మీట్‌లో కేవీ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ శేషసాయి

తిమ్మాపూర్: కేంద్రీయ విద్యాలయ కరీంనగర్ పాఠశాలకు చెందిన విద్యార్థులు రీజినల్ స్పోర్ట్స్ మీట్‌లో ప్రతిభ చాటారు. హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో కరీంనగర్ కేంద్రీయ విద్యాలయానికి చెందిన ఐదుగురు విద్యార్థులు పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ శేషసాయి తెలిపారు. అండర్–17 అథ్లెటిక్స్‌లో తానాజీ సిల్వర్, బ్రాంజ్ మెడల్, రిమ్షా 2 కాంస్య, ఒక వెండి పతకం, మణిదీప్ ఒక కాంస్య పతకం సాధించారు. చెస్‌లో పవన్ కాంస్య పతకం సాధించాడు. స్కేటింగ్‌లో విశ్రుథ్ వెండి, కాంస్య పథకాలు సాధించినట్లు వివరించారు. పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పీఈటీ ప్రియాంక, విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.

నలుగురు ఎస్సైలకు సీఐలుగా పదోన్నతి

గోదావరిఖని: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నలుగురు ఎస్సైలకు సీఐలుగా పదోన్నతి కల్పిస్తూ మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ఆదేశాలు చేశారు. కరీంనగర్‌లో విధులు నిర్వహిస్తున్న కె.అంజయ్య, సిరిసిల్లకు చెందిన జి.శ్రీనివాస్, రామగుండంకు చెందిన ముస్కెం శ్రీనివాస్, జోన్–3 రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన లింగంపెల్లి నరేందర్‌కు పదోన్నతి లభించింది.

గుమ్లాపూర్ రైతుల ఉద్యమబాట

• ఎమ్మెల్యే రవిశంకర్‌కు వినతిపత్రం


ఎమ్మెల్యే రవిశంకర్‌కు ఆయన నివాసంలో వినతి పత్రం అందిస్తున్న రైతులు

చొప్పదండి: గ్రామంలోని చెరువులను నింపేందుకు మండలంలోని గుమ్లాపూర్ రైతులు జేఏసీగా ఏర్పడి పోరుబాట పట్టారు. లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంప్‌హౌజ్ ద్వారా గ్రామంలోని పెద్ద చెరువును యుద్ధ ప్రాతిపాదికన నింపాలని డిమాండ్ చేస్తు శుక్రవారం గ్రామంలోని పాఠశాల సమీపంలో సమావేశమయ్యారు. లిఫ్టు ద్వారా గ్రామంలోని చెరువులు నింపే వరకు పోరాటం కొనసాగించాలని నిర్ణయించారు. గాయత్రి పంప్‌హౌజ్ నీటితో గ్రామంలోని చెరువులు, కుంటలు నింపాలని కోరుతూ ఫ్లెక్సీలను రూపొందించి వాహనాల్లో బూర్గుపల్లిలోని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ నివాస గృహానికి తరలివెళ్లారు. గాయత్రి పంప్‌హౌజ్ ద్వారా చెరువులు నింపాలని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. పంప్‌హౌజ్ నుండి చెరువు నింపేందుకు అవసరమైన సామగ్రిని వారంరోజుల లోగా సమకూర్చాలని ఎమ్మెల్యేను రైతులు కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో సుమారు 200 మందికి పైగా రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఏసీపీకి శుభాకాంక్షలు



పుష్పగుచ్ఛం ఇస్తున్న సంపత్‌రావు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ టౌన్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన నరేందర్‌ను శుక్రవారం దుర్శేడ్ ఉపసర్పంచు సుంకిశాల సంపత్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఏసీపీకి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నేత్రాల సేకరణ



సర్టిఫికెట్ అందిస్తున్న దృశ్యం

కరీంనగర్‌రూరల్: మండలంలోని గుంటూరుపల్లిలో శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందిన యాదమ్మ నేత్రాలను లయన్స్‌క్లబ్ ఆఫ్ గుంటూరుపల్లి ఆధ్వర్యంలో సేకరించారు. డాక్టర్ సతీశ్ యాదమ్మ నేత్రాలను సేకరించి హైదరాబాద్‌లోని ఎల్‌వీ.ప్రసాద్ కంటి ఆస్పత్రికి పంపించారు. క్లబ్‌సభ్యులు భూమయ్య, రవి, శ్రీధర్, రాజు,శంకర్‌మృతురాలి కుమారులు మధు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యరామారావుకు ఘన నివాళి



నివాళి అర్పిస్తున్న కార్పొరేటర్ తదితరులు

సప్తగిరికాలనీ: వాణికేతన్ విద్యాసమితి వ్యవస్థాపకుడు సీహెచ్.అయోధ్య రామారావు జయంతిని శుక్రవారం వాణికేతన్ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వాల రమణారావు కేక్‌కట్‌చేసి పాఠశాలలో మొక్కలు నాటారు. పాఠశాలలో 10జీపీఏ సాధించిన విద్యార్థులకు పారితోషికం అందించారు. కార్యక్రమంలో చీటి విజయరామారావు, పాఠశాల డైరెక్టర్ రేణుక, దీపిక, రంగారావు, నారాయణరెడ్డి, నీలకంఠం, మలహర్‌రావు, ప్రసాద్‌రావు, అజిత్‌రావు, రోహిత్‌రావు, పాల్గొన్నారు.

దరఖాస్తుకు గడువు పెంచాలి

విద్యానగర్: కేసీఆర్ కా తోఫా పథకం ద్వారా మైనార్టీ మహిళలకు పంపిణీ చేసే కుట్టుమిషన్ల దరఖాస్తుల స్వీకరణ గడువును పెంచాలని ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ రాష్ట్ర ప్రభుత్వానికి శుక్రవారం విజ్ఞప్తి చేశారు. కురుస్తున్న వర్షాలతో దరఖాస్తుదారులు ఆదాయం సర్టిఫికెట్లు సకాలంలో పొందలేక పోయారని మరో 10 రోజులు గడువు పెంచాలని కోరారు.

పేదలకు అన్నదానం



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పబ్బతి రంగారెడ్డి శుక్రవారం ఆరెపల్లి రైల్వేగేట్ సమీపంలోని నిరుపేద కుటుంబాలకు అరటిపండ్లు అందించారు. అనంతరం మహిళలు, చిన్నారులకు అన్నదానం చేశారు. ఎలబోతారం మాజీ ఉపసర్పంచ్ సుద ర్శన్‌రెడ్డి, శ్రావణ్ పాల్గొన్నారు.

'ప్రాథమిక పాఠశాలలను నీరుగార్చొద్దు'

కరీంనగర్: ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేయొద్దని ఎస్‌జీటీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు అనుమాండ్ల అనిల్‌కుమార్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి ఎండీ. జమీల్, కోశాధికారి పి.నర్సింహాచారి పేర్కొన్నారు. ప్రభుత్వం ఓవైపు ప్రైమరీ విద్యను బలోపేతం చేస్తుంటే 'తొలిమెట్టు' కార్యక్రమాలు ఏర్పాటుచేసి శిక్షణ ఇస్తూ ఉపాధ్యాయులను నియమించకపోవడం విచారకరమన్నారు. ప్రైమరీ పాఠశాలల్లో రేషనలైజేషన్ పేరుతో టీచర్లను తగ్గించే ప్రక్రియను ఉపసంహరించుకోవాలన్నారు. ప్రతి ప్రైమరీ పాఠశాలకు పీఎస్ హెచ్ఎంను, ఆయాను నియమించాలని, సబ్జెక్టుకు ఒక టీచర్ చొప్పున నలుగురు ఎస్‌జీటీలను ప్రైమరీ పాఠశాలల్లో నియమించాలని డిమాండ్ చేశారు.

మందుబాబులతో పరేషాన్!

- గిద్దెపెరుమాళ్ల మైదానంలో అసాంఘిక కార్యకలాపాలు
- మద్యం, గంజాయి సేవిస్తున్న మందుబాబులు
- వాకింగ్ ట్రాక్‌పైనే మద్యం బాటిళ్లు
- మైదానంవైపు రాని పోలీసులు!



గిద్దె పెరుమాండ్ల ఆలయం వెనుక మైదానం

సాక్షి ఫోకస్

కరీంనగర్‌క్రైం: చీకటి పడితే చాలు ఇక్కడ మందుబాబులు ప్రత్యక్షమవుతున్నారు. మద్యం, సిగరేట్లు, గంజాయి తాగడానికి అడ్డాగా స్థానిక గిద్దెపెరుమాళ్ల నగర్ మైదానం వేదికైంది. బృందాలుగా వచ్చి మై దానం చుట్టూ కూర్చుండి మద్యం తాగి బాటిళ్ల పగులగొట్టి అక్కడేపడేస్తున్నారు. మరికొందరు ఏ కంగా వాకింగ్ ట్రాక్ పైనే మద్యం సీసాలు పడేస్తున్నారు. దీంతో స్థానిక ప్రజలు చీకటి పడితే భయటకు వచ్చేందుకు జంకుతున్నారు. పలుమార్లు వాకింగ్ ట్రాక్‌పై బీరు బాటిళ్లు పగులగొట్టి పడేయడంతో వాకర్లకు ఇబ్బందులు తలెత్తిన సందర్భాలు అనేకం ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు.

పోలీసుల నిఘా కరువు...

కరీంనగర్‌లోని స్థానిక గిద్దె పెరుమాళ్ల ఆలయం వెనుకవైపునున్న మైదానంలో చాలామంది ఉదయం, సాయంత్రం వాకింగ్ చేయడం, పొద్దంతా పిల్లలు ఆటలు ఆడుకుంటుంటారు. కానీ సాయంత్రమైతే అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారుతుంద ని స్థానికులు అంటున్నారు. ఇంత జరుగుతున్నా పో లీసులు ఇటు వైపుగా రావడం లేదని, పలుమార్లు పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని అంటున్నారు. పొద్దంతా ఆయా ప్రాంతాల్లో నిఘాపెడుతున్న బ్లూకోల్ట్ సిబ్బంది సాయంత్రం అటువైపుగా వెళ్లకపోవడంతో చీకటిపడగానే గిద్దెపెరుమాళ్ల మైదానం మందుబాబులకు అడ్డాగా మారుతోంది. ఇకనైనా పోలీసులు నిఘాపెంచి మందుబాబులు, ఆకతాయిల భరతం పట్టాలని ప్రజలు కోరుతున్నారు.

లైట్లు ఏర్పాటు చేస్తున్నాం



గిద్దె పెరుమాళ్ల మైదానంలో మద్యంతాగుతున్నట్లు చాలాసార్లు ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. దీంతో వాకింగ్ చేసేవాళ్లు రావడం లేదు. లైట్లు లేకపోవడంతో ఇటూ వైపు వచ్చే పరిస్థితి లేదు. పరిస్థితిని మేయర్‌కు విన్నవించడంతో గ్రౌండ్‌లో 40 విద్యుత్ స్తంభాలు, గ్రౌండ్ చుట్టూ లైట్లు, గేట్లు ఏర్పాటుచేశారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.

– మర్రి సతీశ్, కార్పొరేటర్ భర్త

నిఘా పెంచాం



నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చీకటి పడితే నిత్యం బ్లూకోల్ట్ సిబ్బంది పలు ప్రాంతాల్లో నిఘా పెంచుతున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యంతాగే వారిపై చర్యలు తీసుకుంటున్నాం. గిద్దెపెరుమాళ్లనగర్ మైదానంలో నిత్యం మద్యంతాగుతున్నారని సమాచారం వచ్చింది. ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి మందుబాబులు, ఆకతాయిల ఆటకట్టిస్తాం.

– రవికుమార్, వన్‌టౌన్, సీఐ



మైదానంలో పగులగొట్టిన బీరుసీసాలు



సీసాలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది



పార్కులో పడేసిన టిన్‌లు

'మణిపూర్' ఘటనపై ఆగ్రహ జ్వాలలు



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కరీంనగర్/విద్యానగర్: మణిపూర్ ఘటనపై జిల్లా వ్యాప్తంగా నిరసనలు కొనసాగాయి. భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో నగరంలోని తెలంగాణచౌక్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు శనిగరపు రజినీకాంత్ మాట్లాడుతూ మణిపూర్‌లో 80 రోజులుగా అల్లర్లు జరుగుతున్నా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నోరు విప్పకపోవడం సిగ్గుచేటని అన్నారు. మహిళలపై దాడులు, ఊరేగింపు చేయడం దేశంమొత్తం తలదించుకునే విషయమన్నారు. జిల్లా అధ్యక్ష,కార్యదర్శి కాంపెల్లి అరవింద్, గజ్జెల శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు రోహిత్, సహాయ కార్యదర్శి వినయ్ తదితరులు పాల్గొన్నారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక అన్ని రాష్ట్రాల్లో మహిళలపై దాడులు పెరుగుతున్నాయని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి నాగమణి ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించారని దేశమంతా మండిపడుతుంటే, భారత రెజ్లర్లను లైంగికంగా వేధించిన బ్రిజ్‌బూషణ్‌కు బెయిల్ ఇవ్వడం సిగ్గుచేటు అన్నారు.

నిందితులను శిక్షించాలి

మణిపూర్‌లో ఇద్దరు మహిళలను వివస్త్రలను చేసి, ఊరేగించిన ఘటనను కరీంనగర్ డివిజన్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఖండించారు. నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. కన్వీనర్ జి.వాణి, సభ్యులు సూర్యకళ, సుధారాణి, శ్రీలత తదితరులు ఉన్నారు. మణిపూర్ ఘటనపై తక్షణమే విచారణ చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అఖిలభారత యువజన సమైక్య ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్ ప్రకటనలో డిమాండ్ చేశారు.

'అసత్య ఆరోపణలు మానుకోవాలి'

తిమ్మాపూర్: కాంగ్రెస్ నాయకులు అసత్య ఆరోపణలు మానుకోవాలని మన్నెంపల్లి సర్పంచ్ మేడి అంజయ్య, బీఆర్ఎస్ ఎస్సీసెల్ మండల మండల అధ్యక్షుడు మురళి, వంతడుపుల సంపత్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం మాట్లాడారు. సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ దళిత బాంధవులు అని, దళితుల ఆత్మ గౌరవానికి ప్రతీకగా హైదరాబాద్ నడిబొడ్డున భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని సీఎం కేసీఆర్ నెలకొల్పారని, దళితబంధుతో ఎన్నో కుటుంబాలకు లబ్ధిచేకూర్చారని పేర్కొన్నారు. మానకొండూర్ నియోజకవర్గం అభివృద్ధి, ప్రజా శ్రేయస్సు ధ్యేయంగా ఎమ్మెల్యే పనిచేస్తున్నారని అన్నారు ప్రతి గ్రామంలో ఎస్సీ హాల్ కమ్యూనిటీ హాల్, నియోజకవర్గంలో మరో 1,100 మందికి దళితబంధు పథకం అమలు చేయడానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకుల ఆరోపణలు దిగజారుడుకు నిదర్శనంగా నిలుస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో నేదునూరి సర్పంచ్ శంకర్, అంబేడ్కర్ సంఘం జిల్లా నాయకుడు లక్ష్మణ్, జలపతి, బాబు, అంజి, సంపత్, తిరుపతి, అశోక్, నందకిషోర్, సాగర్, రమేష్, అజయ్, సంపత్, రాజమల్లయ్య, కనకయ్య, ప్రభాకర్, తిరుపతి, మల్లేశ్, నరేష్ సతీష్, అశోక్, అభిషేక్ పాల్గొన్నారు.

మత్తడి దుంకుతున్న చెరువులు



దేవంపల్లి గ్రామ శివారులోని పాల చెరువు

మానకొండూర్: మండలంలోని దేవంపల్లి గ్రామ శివారులోని పాల చెరువు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నిండి మత్తడి దూకుతోంది. ఎగువ నుంచి వరదనీరు భారీగా వస్తోంది. మండలంలో ఏటా మత్తడి దూకే చెరువు ఇదే. దీంతో మత్స్యకారులు చేపల వేట మొదలుపెట్టారు.

వ్యర్థాలు డంప్ చేస్తున్నా పట్టింపేది..?



తిమ్మాపూర్: ఎల్ఎండీలో కొంతమంది వ్యర్థాలను డంప్ చేస్తున్నారు. కరీంనగర్ పట్టణవాసులతో పాటు తిమ్మాపూర్ మండలానికి చెందినవారు ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను జలాశయం అంచున పడేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలోకి నీరు చేరుతుండడంతో వ్యర్థాలు పైకి తేలుతున్నాయి. దీంతో నీరు కలుషితమవుతోందని పర్యావరణవేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేపలు పట్టేవారితో పాటు ప్రజలకు వ్యర్థాలతో ముప్పు పొంచి ఉందని పేర్కొంటున్నారు. ప్రాజెక్టు పర్యవేక్షణ అధికారుల నిర్లక్ష్యంతోనే ఇలా జరుగుతోందని పలువురు ఆరోపిస్తున్నారు.

వర్షాలతో తలెత్తిన సమస్యలు పరిష్కరిస్తాం



కూలిన రేకుల ఇంటిని పరిశీలిస్తున్న మేయర్

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలో వర్షాలతో ఏర్పడుతున్న సమస్యలను సత్వరమే పరిష్కరిస్తున్నట్లు మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ 24గంటలు అందుబాటులో ఉందన్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న 33వ డివిజన్‌లో శుక్రవారం పర్యటించారు. వర్షానికి కూలిన రేకుల ఇంటిని, శిథిలావస్థలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. వీరంతా అద్దెఇళ్లల్లో ఉండేందుకు నాలుగు నెలల అద్దెడబ్బులు స్వయంగా చెల్లించారు. వర్షాలకు కురుస్తున్న ఇళ్లపై టార్పాలిన్ కవర్లు సొంత డబ్బులతో కొనుగోలుచేసి అందించారు. గృహలక్ష్మి పథకంలో రూ.3లక్షలు అందేలా చూస్తానని హామీఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపడుతున్నామన్నారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్‌తో పాటు అధికారుల, సిబ్బంది సహాయక చర్యలు చేపడుతున్నారన్నారు. లోతట్టు ప్రాంతాల్లో చిన్నచిన్న సమస్యలు తలెత్తినప్పటికీ, ఎక్కడా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. డ్రెయినేజీ సామర్థ్యం సరిపోక రోడ్లపై దాదాపు 15 నిమిషాలు నీరు నిలిచి మళ్లీ యథాస్థితికి చేరిందన్నారు. అలకాపురి, జ్యోతినగర్, ఆర్టీసీ వర్క్‌షాప్ ప్రాంతాల్లో గతంలో ఇళ్లల్లోకి నీళ్లు చేరేవని, డ్రెయినేజీ నిర్మించాక ఆ పరిస్థితి లేదన్నారు. ఇందిరానగర్, శర్మానగర్ ప్రాంతంలో మాత్రం కొంత వరద సమస్య తలెత్తడం తమ దృష్టికి వచ్చిందని, త్వరలో సమస్య పరిష్కరిస్తామన్నారు.

'ఇంజినీరింగ్ అధికారులను సస్పెండ్ చేయాలి'



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కరీంనగర్ కార్పొరేషన్: నగర పాలక సంస్థలో అవినీతికి పాల్పడుతున్న ఇంజినీరింగ్ అధికారులను సస్పెండ్ చేయాలని సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, సహాయకార్యదర్శి పైడిపల్లి రాజు డిమాండ్ చేశారు. నగరంలోని అభివృద్ధి పనుల్లో అవినీతికి పాల్పడుతున్న అధికారులపై చర్యతీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నగరపాలకసంస్థ కార్యాలయ ప్రధాన ద్వారం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంట్రాక్టర్లతో కుమ్మక్కైన ఇంజినీరింగ్ అధికారులు నాసిరకం పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. ఎక్కడా పనులను తనిఖీచేయడం లేదన్నారు. ఇష్టం వచ్చినట్లు అంచనాలు పెంచుతూ, అడ్డగోలుగా బిల్లులు వసూలుచేస్తూ కోట్లాది రూపాయలు దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. జంక్షన్‌ల నిర్మాణంలో పెద్దఎత్తున అవినీతి చోటుచేసుకుందని, నగర పాలకసంస్థ చరిత్రలోనే ఇంత పెద్ద అవినీతి ఎప్పుడూ జరగలేదన్నారు. అంచనాలకు మించి బిల్లులు చెల్లిస్తున్న డీఈని సస్పెండ్ చేయాలని డిమాండ్‌చేశారు. లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో దశల వారీగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు చిన్నవేణి ఐలయ్య, హేమంత్, పాశం బాపురెడ్డి, సందీప్‌రెడ్డి, గూళ్ల సాంబరాజు, బిజిగిరి కిరణ్, ప్రవీణ్, రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్, వినోద్‌కుమార్ చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు, కార్యకర్తలు

కరీంనగర్: పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు చేపట్టడంపై బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జక్కుల నాగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం వినోద్‌కుమార్ నివాసం ఎదుట సీఎం కేసీఆర్, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. చాలా ఏళ్లుగా కారుణ్య నియామకాలు పెండింగ్‌లో ఉన్నాయని, వారి కుటుంబ సభ్యులు నాలుగేళ్ల క్రితం బోయినపల్లి వినోద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారన్నారు. వారు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి కారుణ్య నియామకాలు ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయో వివరాలు సేకరించి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారన్నారు. దీంతో జీవో 79 ద్వారా 1266 మందికి కారుణ్య నియామకాల ఉద్యోగాలను కల్పించారన్నారు. దీంతో సీఎం కేసీఆర్, కారుణ్య నియామకాలకు కృషిచేసిన బోయినపల్లి వినోద్ కుమార్‌కు రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మార్షల్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు దూలం సంపత్‌గౌడ్, గందె కల్పన, రుద్రరాధ, సరస్వతీ రేణుక, రజిని, పుష్పలత, ఆరెపల్లి సాయికృష్ణ, సంగు వేణు, ప్రభాకర్ పాల్గొన్నారు.

బీజేపీ అగ్రనేతల అరెస్టులపై నిరసన



కోర్టు చౌరస్తాలో బీజేపీ నేతల నిరసన

కరీంనగర్‌టౌన్: కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు హైదరాబాద్ నగరంలోని బాట సింగారంలో డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలించడానికి వెళ్లారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ సర్కార్ అక్రమంగా అరెస్టు చేసినందుకు నిరసనగా నగరంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద శుక్రవారం బీజేపీ పశ్చిమ జోన్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లు పూర్తిచేసిన వాటిని అర్హులైన నిరుపేదలకు పంపిణీచేయాలని, అసంపూర్తి నిర్మాణాలను పూర్తిచేసి నిరుపేదలకు అందించాలన్నారు. ఇంటిస్థలం ఉన్న అర్హులైన పేదలకు రూ. మూడులక్షలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మామిడి రమేశ్, ఎడమ సత్యనారాయణరెడ్డి, జాడిబాల్‌రెడ్డి, జానపట్ల స్వామి, ధర్మారం వెంకటస్వామి, పెద్దపల్లి జితేందర్, చిట్టారెడ్డి లక్ష్మణరావు, గుండారపు సంపత్, వంగల రవికుమార్, శ్రీకాంత్, ఈరెడ్డి తిరుమలరెడ్డి, రతన్ సింగ్,రవినాయక్, రాములు, న్యాత ప్రవీణ్, కోడూరి శివకృష్ణ, రాజేందర్ పాల్గొన్నారు.

ట్రస్మా, నీసా సభ్యులకు ఘనస్వాగతం



ప్రసాద్‌రావును సన్మానిస్తున్న ట్రస్మా సభ్యులు


కరీంనగర్: ప్రైవేట్ విద్యావ్యవస్థలో నూతన ఒరవడి సృష్టించే కార్యక్రమంలో భాగంగా ఈనెల మొదటి వారంలో లండన్‌లోని కేంబ్రిడ్జ్, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయాలను సందర్శించి విద్యాసదస్సులో పాల్గొన్న నీసా అధ్యక్షుడు కులుభూషణ్ శర్మ ఆధ్వర్యంలోని 22మంది భారత బృందంలో తెలంగాణ విద్యావేత్తలుగా తమ వాణి వినిపించి రాష్ట్రానికి తిరిగివచ్చిన పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఈ.ప్రసాదరావు, డాక్టర్ జేఎస్ పరంజ్యోతి, కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డికి శుక్రవారం హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు ఘన స్వాగతం పలికారు. అనంతరం పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ.ప్రసాద్‌రావును ట్రస్మా సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావుతో పాటు ట్రస్మా సంఘం రాష్ట్ర సలహాదారులు సొగాని కొమురయ్య, కరీంనగర్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసరావు, జిల్లా సలహాదారులు బి.రమణరావు, పట్టణ సలహాదారులు జగన్మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.


చెట్లకొమ్మలు తొలగింపు

తిమ్మాపూర్: మండల కేంద్రంలోని రవాణాశాఖ కార్యాలయం ఎదురుగా రాజీవ్ రహదారిని కమ్మేస్తున్న చెట్ల కొమ్మలను హెచ్‌కేఆర్ సిబ్బంది శుక్రవారం తొలగించారు. రాజీవ్ రహదారిని కమ్మేస్తున్న చెట్ల కొమ్మలు శీర్షికన శుక్రవారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన తిమ్మాపూర్ సర్కిల్ సీఐ ఇంద్రసేనారెడ్డి హెచ్‌కేఆర్ నిర్వాహకులతో మాట్లాడారు. అనంతరం సిబ్బంది ఉదయం మండల కేంద్రానికి చేరుకుని రోడ్డుపైకి వచ్చిన చెట్ల కొమ్మలు తొలగించారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన 'సాక్షి'కి వాహనదారులు, ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.

బస్టాండ్‌లో భౌభౌ











శుక్రవారం తెల్లవారు జామున కరీంనగర్ బస్టాండ్‌లో వీధికుక్కలు ఇలా...

రాష్ట్రంలో అతిపెద్ద బస్టాండ్‌లలో కరీంనగర్ ప్రయాణ ప్రాంగణం రెండోది. ఉత్తర తెలంగాణకు తలమానికం కూడా.. హైదరాబాద్‌లోని గౌలిగూడ బస్టాండ్ తర్వాత నిత్యం వేలాది మంది ఇక్కడినుంచే రాకపోకలు సాగిస్తుంటారు. వివిధ పనులు.. బంధుత్వాలు.. వ్యాపారలావాదేవీల నిమిత్తం తెలంగాణ, ఆంధ్రాతోపాటు.. మహారాష్ట్ర, కర్ణాటక, బిహార్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాలకు ప్రయాణం చేస్తుంటారు. అంతేకాదు.. రౌండ్ ద క్లాక్ ప్రయాణికులతో కిక్కిరిసి కనిపిస్తుంది. ఇదే సమయంలో.. పగలు, రాత్రి తేడా లేకుండా బస్టాండ్‌లో కుక్కలు విపరీతంగా సంచరిస్తున్నాయి. ప్రయాణికుల మధ్యే తిరుగుతున్నాయి. భౌభౌ అంటూ ఎగబడుతున్నాయి. ఎక్కడ దాడి చేస్తాయోననే భయంతో చిన్నారులు, మహిళలు, వృద్ధులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుంటున్నారు. శునకాలు బస్టాండ్‌లోకి రాకుండా చర్యలు తీసుకోవాల్సిన ఆర్టీసీ అధికారులు.. పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. – సాక్షి, కరీంనగర్ డెస్క్

కేంద్రం నయాపైసా ఇవ్వలేదు..

- మోదీ సర్కారుకి ఎన్నో అంశాల్లో మద్దతు ఇచ్చాం.. కానీ ఏ ఒక్క హామీ నెరవేర్చలేదు: మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ఎన్నో అంశాల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చినా విభజన చట్టంలో పేర్కొన్న ఏ ఒక్క హామీనెరవేర్చ లేదని మంత్రి కేటీరామారావు అన్నా రు. నీతి ఆయోగ్ సిఫారసు చేసిన ప్పటికీ తెలంగాణకు కేంద్రం నయాపైసా ఇవ్వడం లేదన్నారు. మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభి వృద్ధి కేంద్రంలో శుక్రవారం 'అభయ్ త్రిపాఠీ స్మారక ఉపన్యాసం'లో భాగంగా 'కొత్త రాష్ట్రం.. సవాళ్లు' అనే అంశంపై కేటీఆర్ ప్రసంగించారు. రాష్ట్రం నుంచి కేంద్రానికి వెళ్లే మొత్తంలో తిరిగి 46% మాత్రమే రాష్ట్రా నికి వస్తోందన్నా రు. ప్రతీ జిల్లాలో వైద్య కళాశాల ఏర్పాటు చేసిన రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని పేర్కొన్నారు.

ఐటీలో బెంగుళూరును అధిగమించాం

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగం పురోగతి ద్వారా యువత ఆలోచన ధోరణిలో మార్పు వచ్చిందన్నారు. 30 ఏళ్ల వయసులోపే ఐటీ ఉద్యో గులు సొంత ఇళ్లు కొనుగోలు చేస్తుండటమే దీనికి నిదర్శనంగా కేటీఆర్ పేర్కొన్నారు. ఐటీ ఉద్యోగాల కల్పనలో బెంగుళూరును హైదరాబాద్ రెండేళ్లుగా అధిగమిస్తోందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు నినాదంతో ఉద్య మించి సాధించిన తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర, సమీకృత, సమతుల అభివృద్ధిని సాధించామని మంత్రి కేటీ రామారావు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సందర్భంగా ఎదురైన సవాళ్లు, సందేహా లను పటాపంచలు చేసి అందరూ శాంతియుత వాతావరణంలో జీవించేలా పాలన సాగుతోందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు మూలంగా ఉత్తర తెలంగాణ సస్యశ్యామలమైందని, మిషన్ భగీరథ లాంటి పథకాలను కేంద్రం, ఇతర రాష్ట్రాలు కాపీ కొడుతున్నాయని కేటీఆర్ అన్నారు.

ఇదీ వీళ్ల సంస్కారం!

చంద్రబాబు, దత్తపుత్రుడు, సొంతపుత్రుడు, బావమరిది క్యారెక్టర్ ఏంటో ప్రజలకు బాగా తెలుసు

- వెంకటగిరి సభలో ప్రతిపక్షాలపై నిప్పులు చెరిగిన ఏపీ సీఎం జగన్

సాక్షి, తిరుపతి : వలంటీర్ల వ్యవస్థ వల్ల ప్రభుత్వానికి మంచి పేరు వస్తోందన్న బాధతో, భవిష్యత్‌పై కలత చెందిన చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు, సొంతపుత్రుడు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని, వీరంతా సంస్కార హీనులని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. ఎండైనా, వానైనా, చలైనా, వరదలొచ్చినా, పండగ రోజైనా, సెలవురోజైనా నిక్కచ్చిగా సేవ చేస్తున్న వలంటీర్ల క్యారెక్టర్‌పై దుష్ప్రచారం చేయడం దుర్మార్గమని నిప్పులు చెరిగారు. చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు, సొంతపుత్రుడు, బావమరిది క్యారెక్టర్ ఏంటో ప్రజలకు బాగా తెలుసన్నారు. తిరుపతి జిల్లా వెంకటగిరిలో శుక్రవారం ఆయన వైఎస్సార్ నేతన్న నేస్తం ఐదో విడత నిధుల విడుదల కార్యక్రమంలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. కొనివిషయాలు మాట్లాడకూడదనుకున్నా పరిస్థితులు చూసినప్పుడు తప్పడం లేదన్నారు. ఎక్కడైనా మంచి చేస్తున్న వ్యవస్థలను, మనుషుల్ని సంస్కారం ఉన్న ఏ ఒక్కరూ అవమానించరని, కానీ మంచి చేస్తున్న మన వలంటీర్ల గురించి ఇటీవల సంస్కారం కోల్పోయి కొందరు మాట్లాడుతున్నందు వల్ల ఈ మాటలు చెప్పాల్సి వస్తోందని చెప్పారు. వలంటీర్లంతా మన ఊళ్లో, మన కళ్లెదుటే నాలుగేళ్లుగా కనిపిస్తున్నారని, మనందరికీ తెలిసిన వాళ్లేనన్నారు. ఒకటో తేదీ రాగానే సూర్యోదయాన్ని కన్నా ముందే చిక్కటి చిరునవ్వుతో తలుపుతట్టి,



తిరుపతి జిల్లా వెంకటగిరిలో శుక్రవారం వైఎస్సార్ నేతన్న నేస్తం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీ సీఎం వైఎస్ జగన్

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

గుడ్ మార్నింగ్ చెబుతూ ఇదిగో మీ పెన్షన్ అంటూ అవ్వాతాతలను చిరునవ్వులతో పలరించే కుటుంబ సభ్యులు మన వలంటీర్లు అని చెప్పారు. అవినీతికి, వివక్షకు తావు లేకుండా, మనందరి ప్రభుత్వం తీసుకొస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రతి గడప వద్దకూ.. కాళ్లకు బలపం కట్టుకుని మరీ వెళ్లి.. కులం, మతం, వర్గం, ప్రాంతం చివరకు వారు ఏ పార్టీ వారు అని కూడా చూడకుండా అవ్వాతాతలకు మేలు చేస్తున్న మనవళ్లు, మనవరాళ్ల వ్యవస్థపై కొందరు తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తప్పుడు మాటలకు స్క్రిప్ట్ ఈనాడు రామోజీరావుది అయితే నిర్మాత చంద్రబాబు.. నటన, మాటలు, డైలాగులు అన్నీ దత్తపుత్రుడివి అని తెలిపారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

నిస్సిగ్గు రాతలు


- వలంటీర్లు స్త్రీలను లోబర్చుకుంటారని ఒకరంటారు. గ్రామ వలంటీర్లు అమ్మాయిలను హ్యూమన్ ట్రాఫికింగ్ చేస్తున్నారు.. ముంబయికో, ఎక్కడికెక్కడికో పంపించేస్తున్నారు అని ఇంకొకరు నిస్సిగ్గుగా అంటారు. దీన్ని తాటికాయంత అక్షరాలతో ఈనాడు పత్రిక, సిగ్గులేని ఆంధ్రజ్యోతి పత్రిక, ఇంకో సిగ్గులేని టీవీ-5 మీడియా రాస్తాయి. ఇటివంటి వారంతా బురద జల్లుతారు. అబద్ధాలకు రెక్కలు తొడుగుతారు.
- 2.60 లక్షల మంది మన పిల్లలు గ్రామ స్థాయిలో సేవలందిస్తున్నారు. ఇందులో 60 శాతం నా చెల్లెమ్మలే. మన వలంటీర్లు అంతా కూడా చదువుకున్న సంస్కారవంతులే. వీరంతా సేవా భావంతో పని చేస్తున్నారు. ఇలాంటి మన సేవామిత్రలు, సేవారత్నాలు, సేవా వజ్రాలు అయిన మన వలంటీర్ల కేరెక్టర్‌ను తప్పుపట్టింది ఎవరో తెలుసా?
- ఒకరు పదేళ్లుగా చంద్రబాబుకు వలంటీర్‌గా పని చేస్తున్న ప్యాకేజీ స్టార్. ఇంకొకరు చంద్రబాబు నాయుడు. మరొకరు ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5. వీరంతా ఒక గజదొంగల ముఠా. వీళ్లు వలంటీర్ల క్యారెక్టర్ గురించి మాట్లాడుతున్నారు. వలంటీర్ పిల్లల కేరెక్టర్ ఎలాంటిదో అదే గ్రామంలో వారి సేవలందుకుంటున్న కోట్ల మందికి తెలుసు.

వీరికి మంచి చేసిన చరిత్రే లేదు

- ఎందుకు ఈ స్థాయికి దిగజారిపోయారంటే వీరికి మంచి చేసిన చరిత్ర లేదు. ఫలానా మంచి చేశాం.. అందుకే మాకు తోడుగా ఉండండి అని చెప్పుకోవడానికి కూడా ఒక్కటంటే ఒక్కటి మంచి చేసిన చరిత్ర లేదు. ఉన్నదంతా వంచన, వెన్నుపోట్లు మాత్రమే. ఇదీ వీళ్ల జీవిత చరిత్ర.

రూ.5 కోట్లు ఇవ్వకుంటే అంతుచూస్తా

- ఓ బిల్డర్‌ను బెదిరించిన ఇంజనీరింగ్ కాలేజీ డైరెక్టర్
- బాధితుడి ఫిర్యాదుతో నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు



చంద్రశేఖర్

బంజారాహిల్స్: 'నీపై చాలా ఫిర్యాదులు ఉన్నాయి. వాటిపై అధికారులు దృష్టిపెట్టారు. నాకు రూ.5 కోట్లిస్తే అధికారులతో మాట్లాడి సెటిల్ చేయిస్తా' అంటూ ఓ బిల్డర్‌ను పలుమార్లు డబ్బు డిమాండ్ చేసిన బాచుపల్లిలోని డీఆర్‌కే ఇంజనీరింగ్ కాలేజీ డైరెక్టర్ మన్నెం చంద్రశేఖర్ (44)ను బంజారాహిల్స్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బాధితుడి కథనం ప్రకారం బంజారాహిల్స్ రోడ్ నంబర్ 2లోని లుంబినీ మాల్‌లో ఉన్న శుభగృహ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ నంబూరి కల్యాణ చక్రవర్తి (40)కి మన్నెం చంద్రశేఖర్ అనే వ్యక్తి జూన్ నుంచి తరచూ ఫోన్లు చేస్తూ రూ. 5 కోట్ల కోసం డిమాండ్ చేయడం మొదలు పెట్టాడు. అయితే దీన్ని కల్యాణ్ చక్రవర్తి పెద్దగా పట్టించుకోకపోవడంతో డబ్బివ్వ కుంటే చంపేస్తానని బెది రించసాగాడు. గత నెల 6న మరోసారి ఫోన్ చేసి తాను పార్క్ హయత్‌లో ఉన్నానని.. అక్కడికి వచ్చికలవకుంటే చాలా ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని హెచ్చరించాడు. దీంతో కల్యాణ్ చక్రవర్తి హోటల్‌కు వెళ్లి చంద్రశేఖర్‌ను కలవగా మరోసారి డబ్బు కోసం పట్టుబట్టాడు. బాధితుడు అక్కడి నుంచి వెళ్లిపోయేందుకు ప్రయత్నించగా ఇప్పటికిప్పుడు రూ. 3 కోట్లు అయినా ఇవ్వకుంటే అంతుచూస్తానని బెదిరించాడు. దీంతో మన్నెం చంద్రశేఖర్‌పై చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. ఐపీసీ సెక్షన్ 387, 506 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కిడ్నీ రాకెట్‌పై చార్జ్‌షీట్

వరంగల్ సీఐడీ పోలీసులు చార్జ్‌షీట్ దాఖలు

అశ్వారావుపేట: అంతర్జాతీయ కిడ్నీ రాకెట్‌కు సంబంధించిన కేసులో వరంగల్ సీఐడీ పోలీసులు చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలు శుక్రవారం 'సాక్షి'కి అందాయి. 2016లో భద్రాది కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం నాయుడుపేటకు చెందిన ముప్పా నరేష్ బెట్టింగ్, ఇతర వ్యసనాలకు లోనయ్యాడు. డబ్బు కోసం కిడ్నీ అమ్మాలని అనుకున్నాడు. ఓ ముఠాను సంప్రదించగా, ఆ ముఠా సభ్యులు పరీక్షలు చేయించగా, అవసరమైన ఓ వ్యక్తికి నరేష్ కిడ్నీ సరిపోయింది. అయితే కిడ్నీ మార్పిడికి ఇక్కడి చట్టాలు అనుమతించలేదు. దీంతో నరేష్‌ను హైదరాబాద్ నుంచి చెన్నైకు, అక్కడి నుంచి శ్రీలంక తీసుకెళ్లి ఆపరేషన్ ద్వారా కిడ్నీ మార్పిడి చేశారు. ఈ విషయం కొన్నాళ్ల తర్వాత బయటపడగా, దమ్మపేట పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కాగా, విచారణకు తమిళనాడు వెళ్లి వస్తుండగా జరిగిన ప్రమా దంలో దమ్మపేటకు చెందిన కానిస్టేబుల్ గోవిందు మృతి చెందగా మరో కానిస్టేబుల్ ఆంగోతు శ్రీను తీవ్ర గాయాలతో బయటపడ్డాడు. ఇదే ఘటనలో సీఐ కొండ్రు శ్రీను కూడా గాయాలయ్యాయి. అప్పట్లో ఈ కేసు తీవ్ర సంచలనం సృష్టించింది. తాజాగా సీఐడీ నమోదు చేసిన చార్జ్‌షీట్‌లో ఏ1గా ముప్పా నరేష్ పేరును చేర్చగా, సిద్దూ అలియాస్ కాస్పరాజు సురేష్, కురప్పన్నం బాలుస్వామి అలియాస్ కుమార్, చెన్నైకు చెందిన గోపీకృష్ణ, శ్రవణ్‌కుమార్, కొలంబోకు చెందిన కార్తీక్, కోకకంటి కిషోర్‌కుమార్‌రెడ్డి, అమ్రిష్ ప్రతాప్, డి.మరిముత్తుతోపాటు ఉరేష్‌బాయ్ అమృత్‌బాయ్ ప్రజాపతి అలియాస్ సురేష్ ప్రజాపతి పేర్లను కూడా పొందుపరిచారు.

24, 25న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదల

తిరుమల: తిరుమల శ్రీవారి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల ఆగస్టు, సెప్టెంబర్ నెలల కోటాను ఈ నెల 25న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. అదనపు కోటా కింద 4 వేల టికెట్లను విడుదల చేస్తుంది. అలాగే అక్టోబర్ నెలకు సంబంధించి రోజుకు 15,000 టికెట్లు చొప్పున విడుదల చేయనుంది. కాగా, ఈ నెల 24వ తేదీన ఉదయం 11 గంటలకు అక్టోబర్ నెలకు సంబంధించిన శ్రీవాణి ట్రస్ట్ టికెట్లను ఆన్‌లైన్ లో విడుదల చేయనుంది. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు వయోవృద్ధులు, వికలాంగుల దర్శన టికెట్ల కోటాను కూడా విడుదల చేస్తుంది. టీటీడీ వెబ్‌సైట్ https://tirupatibalaji.ap.gov.inలో దర్శన టికెట్లు బుక్ చేసుకోచ్చు.

ఎన్‌ఐఏ అదుపులో ఆర్కే భార్య శిరీష

ప్రకాశం జిల్లా ఆలకూరపాడులోని ఇంట్లో అదుపులోకి

- కొద్దిసేపు టంగుటూరు పోలీసుస్టేషన్‌లో ఉంచిన ఎన్‌ఐఏ
- అక్కడి నుంచి వేరే ప్రాంతానికి తరలింపు
- అరెస్టుకు కారణాలు, ఎక్కడికి తీసుకెళ్లారో చెప్పని ఎన్‌ఐఏ బృందం



టంగుటూరు: మావోయిస్టు అగ్రనేత అక్కిరాజు హరగోపాల్ (రామకృష్ణ అలియాస్ ఆర్కే) సతీమణి శిరీష అలియాస్ పద్మని కేంద్ర దర్యాప్తు సంస్థ జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) శుక్రవారం సాయంత్రం ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం ఆలకూరపాడులోని ఆమె ఇంట్లో అదుపులోకి తీసుకుంది. మూడు ప్రైవేటు కార్లలో ఆలకూరపాడుకు చేరుకున్న ఎన్‌ఐఏ బృందం ఇంటి పనుల్లో ఉన్న ఆమెను సాయంత్రం 6 గంటల సమయంలో అదుపులోకి తీసుకుని, బలవంతంగా కారులో తరలించేందుకు ప్రయత్నించింది. ఎందుకు అరెస్టు చేస్తున్నారని ఆమె కుటుంబ సభ్యులు ప్రశ్నించినా సమాధానం చెప్పలేదు. అనంతరం ఆమెను టంగుటూరు పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి, ఐదు నిమిషాలు అక్కడ ఉంచారు. అనంతరం సింగరాయకొండ సీఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్సై శ్రీరామ్, ఒంగోలు దిశ ఎస్సై ఫిరోజ్ ఫాతిమాల సమక్షంలో ఆమెను అక్కడ నుంచి ప్రత్యేక వాహనాల్లో తరలించారు. ఎక్కడికి తీసుకెళ్లారన్నది తెలియరాలేదు. ఈ సమాచారాన్ని పోలీసులు గోప్యంగా ఉంచారు. ఆమెను ఏ కారణాలతో అదుపులోకి తీసుకున్నారో కూడా వెల్లడించలేదు.

గతంలోనూ తనిఖీ

ఆర్కే 2021 అక్టోబర్ 16న అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుమారుడు మున్నా సైతం ఉద్యమ బాటలో నడిచి ఎదురు కాల్పుల్లో మరణించాడు. ఆ తర్వాత 2022లో ఆలకూరపాడులో శిరీష ఇంట్లో ఎన్‌ఐఏ బృందం ఓసారి తనిఖీలు చేసింది. మావోయిస్టులకు సహకరించడం, నగదు సమకూర్చడం, వైద్య విద్యార్థినితో దళాలకు వైద్యం చేయించి, దళం వైపు ఆకర్షించేలా చేయడంలో శిరీషకు సంబంధం ఉందన్న ఆరోపణలతో 2022 జూలై 19న ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన ఎన్‌ఐఏ బృందం ఆమె ఇంట్లో తనిఖీ చేసింది. ఆ సమయంలో శిరీష వైద్యం నిమిత్తం విజయవాడ వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉంది. దీంతో విరసం నేత కళ్యాణరావును తీసుకొచ్చారు. శిరీష లేకుండా తలుపులు తీయడానికి ఆయన నిరాకరించడంతో తహసీల్దార్, వీఆర్వో సమక్షంలో తాళం పగలగొట్టారు. శిరీష ఇంటి నుంచి సాధారణ షాపుల్లో దొరికే కొన్ని పుస్తకాలు, పలు సీడీలను స్వాధీనం చేసుకున్నారు.

ఇది అక్రమ అరెస్టు: కళ్యాణరావు

శిరీషను ఎన్‌ఐఏ అదుపులోకి తీసుకొన్నట్లు తెలుసుకున్న విప్లవ రచయితల సంఘం నేత గంగుల కళ్యాణరావు హుటాహుటిన స్టేషన్‌కు వచ్చారు. కళ్యాణరావు, ఇతర బంధువులు ఎస్సై శ్రీరామ్‌తో మాట్లాడారు. అనంతరం కళ్యాణరావు మీడియాతో మాట్లాడుతూ.. శిరీషను అక్రమంగా అరెస్టు చేశారని తెలిపారు. ఎన్‌ఐఏ బృందం తమ కుటుంబానికి ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా శిరీషను బలవంతంగా తీసుకెళ్లిందని, ఎక్కడ ఉంచారన్నదీ ఇప్పటివరకు తెలపకపోవడం దారుణమని చెప్పారు. ఎవరినైనా అరెస్టు చేసే ముందు కుటుంబ సభ్యులకు తెలపాలని అన్నారు. శిరీషను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శిరీషపై పెట్టినవన్నీ బూటకపు కేసులేనని అన్నారు.

కార్మికుల క్షేమం పట్టదా?

- మండిపడుతున్న వెల్ఫేర్ బోర్డు కమిటీలు
- సమస్యలతో సతమతమవుతున్న ఆర్టీసీ ఉద్యోగులు
- ఎక్కడి సమస్యలు అక్కడే అడిగేవారే కరువు
- యూనియన్ల లేమితో దిక్కుతోచని కార్మికులు



కరీంనగర్: ఆర్టీసీ యూనియన్లు జేఏసీగా ఏర్పడి కార్మికుల సమస్యల పరిష్కారానికి నాలుగేళ్ల క్రితం 52 రోజులు సమ్మెచేయడంతో ప్రభుత్వం ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలు రద్దుచేసిన విషయం తెలిసిందే. ఆర్టీసీ సిబ్బంది సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు సంక్షేమ బోర్డులు ఏర్పాటుచేసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 11 డిపోల్లోని సంక్షేమ బోర్డు సభ్యులు నామమాత్రంగా మారడంతో ఉద్యోగుల సమస్యలు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నచందంగా తయారైంది. యూనియన్ల వ్యవస్థ లేకపోవడంతో గతంలో లాగా సమ్మెలు, ధర్నాలు చేసి యాజమాన్యంపై ఒత్తిడి పెంచే పరిస్థితి కూడా లేకుండాపోయింది. దీంతో ఆందోళనలు చేపడితే తమ ఉద్యోగాలు ఎక్కడ పోతాయోనన్న భయంతో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఇదే అదునుగా భావించిన ఆర్టీసీ యాజమాన్యం సిబ్బందిని కరివేపాకుల్లా చూస్తున్నారు. దీంతో హక్కుల మాట దేవుడెరుగు కానీ ఉద్యోగం ఉంటే అదే పదివేలు అన్నచందంగా కార్మికలోకం తయారైంది. ప్రభుత్వం యూనియన్ల స్థానంలో వెల్ఫేర్ బోర్డులు ఏర్పాటుచేసి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాయనుకున్న సంక్షేమ బోర్డులు ఆదిశగా చర్యలు చేపట్టకపోవడంతో ఉద్యోగులు అసంతృప్తితో ఉన్నారు. మరోవైపు బోర్డు సభ్యులు సైతం ఉద్యోగులకు ఏమీ చేయలేకపోయామనే వేదనలో ఉన్నారు. దీంతో ఆర్టీసీ ఏర్పాటుచేసిన వెల్ఫేర్ బోర్డు కమిటీలు నామమాత్రంగా ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

నామమాత్రంగానే కమిటీలు....

తమ సమస్యల పరిష్కారానికి ఆర్టీసీ కార్మికులు 2019 అక్టోబర్ 5 నుంచి 52 రోజులు సమ్మెచేపట్టారు. సుదీర్ఘ సమ్మెతో ఇబ్బంది పడిన ప్రయాణికులు ఆర్టీసీ సిబ్బంది, ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ క్రమంలో సర్కారుతో చర్చలకు వెళ్లిన కార్మికులకు ప్రభుత్వం పలు హామీలు ఇచ్చింది. వాటిలో ఆర్టీసీలో కార్మికులు ఉండరని.. అందరూ ఉద్యోగులేనని.. వారి సమస్యల పరిష్కారానికి సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈనేపథ్యంలో 2020 జనవరి 1నుంచి ఉమ్మడి జిల్లాలోని 11 డిపోల్లో సంక్షేమ బోర్డులు ఏర్పాటయ్యాయి. సంక్షేమబోర్డులో ఉద్యోగుల్లో నుంచి ఇద్దరు సభ్యులు, డిపో గ్యారేజ్ ఇన్‌చార్జీ, డిపో ట్రాఫిక్ ఇన్‌చార్జీ, డిపో మేనేజర్ అధికారిగా ఉంటారు. వీరు ప్రతీవారం డిపోలో సమావేశమై ఉద్యోగుల బాగోగులు చూస్తారు. డిపోల్లో వారానికి ఒకరోజు, నెలలో నాలుగు రోజులు సమావేశాలు ఏర్పాటు చేసి నెలకోసారి రీజినల్ మేనేజర్(ఆర్ఎం)తో సమావేశం అవుతారు. ఉద్యోగులు తమ సమస్యలను సంక్షేమ బోర్డుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రత్యేకంగా ఫిర్యాదులు ఈ-బాక్సులు ఏర్పాటుచేశారు. సిబ్బంది తమ వివరాలతో పాటు సమస్యలు రాతపూర్వకంగా ఆ బాక్సులో వేయాల్సి ఉంటుంది. సమస్యలు వారి పరిధిలోవైతే పరిష్కరిస్తారు. తమ పరిధిలో లేని వాటిని ఆర్ఎం, బస్‌భవన్(ఎండీ) కార్యాలయాల దృష్టికి తీసుకెళతారు. అయితే పలు డిపోల్లో ఈ బాక్సులు డీఎం కార్యాలయం సమీపంలో ఉండడంతో ఫిర్యాదు పత్రాలు వేసేందుకు ఉద్యోగులు జంకుతున్నారు. వారానికి కాకుండా నెలకోసారి నామమాత్రంగా సమావేశాలు నిర్వహించి సంతకాలు తీసుకుని పంపిస్తున్నారని, తమ సమస్యలు వినకుండా సంస్థ నిర్ణయాలను తెలిపేందుకు మాత్రమే సమావేశాలు నిర్వహిస్తున్నారని ఉద్యోగులు వాపోతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా...	
డిపోలు	11
బస్సులు	651
డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బంది	4100


ఆటకెక్కిన హామీలు....

ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం సమ్మె విరమణ సందర్భంగా ఇచ్చిన హామీలు ఆటకెక్కాయనే ఆరోపణలున్నాయి. సమస్యలను పట్టించుకునే వారు లేక ఉద్యోగులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. సమ్మె విరమణ తర్వాత మహిళా సిబ్బంది కోసం విశ్రాంతి గదులు ఏర్పాటుచేశారు. కానీ సరైన ప్రణాళిక లేకుండా నిర్మించడంతో అవి నిరుపయోగంగా మారాయి. మహిళా ఉద్యోగులకు రాత్రి 8గంటల లోపు విధులు ముగించాలన్న నిబంధన ఎక్కడా అమలు కావడం లేదు. మూడు పీఆర్సీలు, మూడు డీఏలు పెండింగ్‌లో ఉండడంతో పాటు సీసీఎస్ రుణాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు నూతన నియామకాలు లేక వయసు పైబడిన ఉద్యోగులపై పనిఒత్తిడి పెరిగి అనారోగ్యంపాలవుతున్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఏడాదిన్నరైనా సెటిల్‌మెంట్ చేయకపోవడంతో డిపోల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని వేడుకుంటున్నా పట్టించుకోవడం లేదని, చిన్న, చిన్న తప్పిదాలకు, కార్మికులకు మెమోలు జారీచేస్తున్నారని, విధుల్లో నుంచి తొలగించే చర్యలు ఎక్కువయ్యాయని కార్మికులు వాపోతున్నారు.

23న రాష్ట్రస్థాయి టేబుల్‌టెన్నిస్ పోటీలు

- ఇప్పటికే 400కు పైగా ఎంట్రీలు
- విజేతలకు రూ.25 వేల నగదు

కరీంనగర్‌స్పోర్ట్స్: ఉత్తర తెలంగాణ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలను కరీంనగర్‌లోని జీఎస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 23న గణేశ్‌నగర్‌లోని జీఎస్ అకాడమీలో నిర్వహిస్తున్నట్లు రాఘవేంద్ర హాస్పిటల్స్ వైద్యుడు శరత్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం వివరాలు వెల్లడించారు. రాష్ట్రస్థాయిలో టేబుల్‌టెన్నిస్ పోటీలు జీఎస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీల నిర్వహణతో ఎంతోమంది క్రీడాకారులు వెలుగులోకి వస్తారని, తమ నైపుణ్యం ప్రదర్శిస్తారన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లాస్థాయి క్రీడాకారులు సత్తా చాటి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తేవాలన్నారు. టోర్నీ డైరెక్టర్ గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ.. అండర్ 13, 16, 19 కేటగిరీల్లో సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో బాలబాలికలు, పురుషులు, మహిళలకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు రూ. 25వేల నగదు, ట్రోఫీ, సర్టిఫికెట్లు అందిస్తున్నామన్నారు. క్రీడాకారులు 22వ తేదీ లోపు ఎంట్రీలు నమోదు చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల నుంచి సుమారు 400 ఎంట్రీలు వచ్చాయన్నారు. సమావేశంలో టోర్నీ ఆర్గనైజర్ సురేందర్‌సింగ్, కోఆర్డినేటర్ మద్దెల వికాస్, రాఘవేంద్ర హాస్పిటల్ అడ్మిన్ డి.వెంకట్రావు, రజనీకాంత్, కంకటి అనూప్‌కుమార్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు.



వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ శరత్ కుమార్‌రెడ్డి

బడికి అరుదైన గుర్తింపు

- ప్రజల భాగస్వామ్యం.. దాతల సహకారంతో సమగ్ర అభివృద్ధి
- ఇంపాక్ట్, ఇన్‌ఫ్లూయెన్స్, ఇన్‌స్పిరేషన్ బుక్‌లో చోటు
- పెంచికల్‌పాడ్ పాఠశాలకు అవకాశం



పాఠశాలలో ప్రజల భాగస్వామ్యం గురించి తెలుసుకుంటున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి


కుంటాల: గ్రామస్తుల సహకారం.. దాతల చేయూత.. ఉపాధ్యాయుల మెరుగైన బోధనతో నిర్మల్ జిల్లా కుంటాల మండలం పెంచికల్‌పాడ్ పాఠశాలకు అరుదైన గుర్తింపు దక్కింది. రాష్ట్ర విద్యా పరిశోధనా శిక్షణా సంస్థ(ఎస్‌సీఈఆర్టీ), జాతీయ విద్యా పరిశోధన సంస్థ న్యూఢిల్లీ(ఎన్‌ఐఈపీఏ) ప్రభుత్వ పాఠశాలల్లో ఐదేళ్లలో నిర్వహించిన వినూత్న కార్యక్రమాలపై సర్వే చేపట్టారు. వినూత్న బోధన, ప్రజల భాగస్వామ్యం విభాగంలో పాఠశాలకు ఇంపాక్ట్, ఇన్‌ఫ్లూయెన్స్, ఇన్‌స్పిరేషన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 26 పాఠశాలల్లో చేపట్టిన కార్యక్రమాలను ప్రచురించిన పత్రిక కథనాలను పరిగణలోకి తీసుకున్నారు. 2023 సంవత్సరానికి చెందిన పుస్తకంలో పెంచికల్‌పాడ్ పాఠశాలకు చోటు దక్కింది. ప్రజల భాగస్వామ్యం, విద్యాప్రమాణాల పెంపు, సమగ్ర అభివృద్ధి అంశాల్లో ఈ పాఠశాలను ఎంపిక చేశారు.

ఐక్యతను చాటిన గ్రామస్తులు..

పెంచికల్‌పాడ్ పాఠశాల గ్రామస్తులు ఐక్యంగా ఉండి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. ప్రైవేటు పాఠశాలలకు తమ విద్యార్థులను పంపబోమని తీర్మానించారు. 2015లో పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా ఎల్లన్న బాధ్యతలు చేపట్టారు. పాఠశాలలో చేరిన సమయంలో కేవలం 20 మంది విద్యార్థులు ఉండగా, ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా తమ పాఠశాలలో చేరాలని పోషకులకు సూచించినా ఆసక్తి చూపలేదు. ఇద్దరే ఉపాధ్యాయులు ఉండడం, పాఠశాల పైకప్పు పెచ్చులూడిందని, ఆంగ్లంలో బోధన లేదని చాలామంది తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించలేదు. ఈ క్రమంలో 30 మంది విద్యార్థులు గురుకుల, ఆదర్శ, ఇతర పాఠశాలలకు ఎంపికయ్యారు. సాధించిన ఫలితాలను సామాజిక మాధ్యమాల్లో పొందుపరిచారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులను నమ్మకం కలిగించింది. వీడీసీ, స్వచ్ఛంద సంస్థలు ఈ పాఠశాలకు సహాయ సహకారాలు అందించారు.


దాతల సహాయార్థం..

పాఠశాల కథనాలకు ముగ్ధులైన గ్రామీణ సపోర్ట్ ఫౌండేషన్ చైర్మన్ కదారి నరేష్ తనవంతుగా విద్యార్థులను ప్రోత్సహిస్తూ వస్తున్నారు. తల్లి దండ్రులతో కలిసి సహాయ సహకారాలు అందిస్తానని హామీని ఇచ్చారు. డిజిటల్ కంప్యూటర్, గ్రంథాలయ, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ప్రతి భ కనబరిచిన విద్యార్థులకు ఏటా రూ.2 వేల చొప్పున ఇద్దరు విద్యార్థులకు సహాయం అంది స్తూనే ఉన్నారు. గ్రామ విద్యాప్రాజెక్టు ద్వారా ముగ్గురు వలంటీర్లను నియమించి నెలకు రూ.4 వేల చొప్పున వేతనం అంది స్తున్నారు. నరేష్‌ను పలువురు ఆదర్శంగా తీసుకున్నారు. ఎన్నారై శ్రావణ్ తెడ్ల 4 ట్యాబులు, ప్రాజెక్టర్, పరివర్తన పరివార్ స్వచ్ఛంద సంస్థ అధిపతులు స్ఫూర్తి కొలిపాక, వినయ్ వంగల, సుదీప్త్, నాగరాజు కలిసి పాఠశాలలో గ్రంథాల ఏర్పాటు చేయగా, ఎస్పీ ప్రవీణ్‌కుమార్ ఇటీవల ప్రారంభించారు. ఇందుకు స్పందించిన అమెరికా దేశస్తురాలు మెచ్చెల్లి స్టెపియన్ 50 కుర్చీలు, మాజీ ఎంపీటీసీ చంద్రకాంత్ రూ. 10 వేల నగదు, పోస్టు నర్సయ్య రూ.10 వేలను పాఠశాల అభివృద్ధికి అందజేశారు. పంచాయతీ కార్యదర్శి చాట్ల గాయత్రి, ఏఈవో గణేష్, గంగారెడ్డి బెంచీలు విరాళంగా అందజేశారు.



గ్రంథాలయాన్ని ప్రారంభించిన ఎస్పీ


ప్రైవేటుకు పంపబోమని..



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులను కోరాం. పాఠశాలలో అన్ని వసతులు ఉన్నాయని గుర్తించాం. ప్రైవేట్ పాఠశాలలకు పంపబోమని తీర్మానం చేశాం. దీనికి కట్టుబడి గ్రామస్తులు ప్రభుత్వ పాఠశాలకు పంపుతున్నాం.

– బాబారావు, ఎస్‌ఎంసీ చైర్మన్


ఐక్యత చూసే సహాయం...



పెంచికల్‌పాడ్ గ్రామస్తుల ఐక్యతను చూసి పాఠశాలలో చేస్తున్న కార్యక్రమాలపై స్పందించా. తమ వంతుగా విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తున్న. పాఠశాలకు అరుదైన గౌరవం దక్కడం అభినందనీయం.

– కదారి నరేశ్, గ్రామీణ్ సపోర్ట్ చైర్మన్

సమష్టి కృషితో..



ఎనిమిదేళ్ల క్రితం మా పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరినా తల్లిదండ్రులు ఆసక్తి చూపలేదు. ఏటా సాధిస్తున్న ఫలితాలతో నమ్మకం పెరిగింది. పాఠశాలలో అమలు చేస్తున్న కార్యక్రమాలను పత్రిక, సామాజిక మాధ్యమాల్లో పొందుపర్చడం ద్వారా దాతలు ముందుకు వచ్చి పాఠశాల అభివృద్ధికి కృషి చేశారు.

– మాదరి ఎల్లన్న, హెచ్ఎం

'కడెం' రక్షణకు కదిలిన యువకులు



అనుకున్నట్టే అయింది.. గతేడాది వచ్చిన భారీ వరదలతో గుణపాఠం నేర్వని అధికారుల తీరుతో కడెం ప్రాజెక్టుకు మళ్లీ ముప్పు ఏర్పడింది. ఉదయం 6 గంటలకు 73 వేలు ఉన్న ఇన్‌ఫ్లో.. 8 గంటలకు ఒక్కసారిగా 1,61,800 క్యూసెక్కులకు పెరిగింది. ఈ క్రమంలో గేట్లు తెరిచేందుకు అధికారులు ప్రయత్నించగా.. మొరాయించాయి. ప్రాజెక్టు ప్రైవేటు టెక్నీషియన్ సునీల్ ఎంత ప్రయత్నించినా సాధ్యం కాలేదు. అక్కడే ఉన్న ఎంపీపీ అలెగ్జాండర్ వెంటనే స్థానిక యువకులకు ఫోన్‌చేసి పరిస్థితిని వివరించారు. స్పందించిన 50 మంది వెంటనే ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. హ్యాండిల్ తిప్పుతూ(మాన్యువల్‌గా) రెండు గంటలు శ్రమించి నాలుగు వరద గేట్లను ఎత్తి ప్రాజెక్టును ప్రమాదంలో నుంచి బయటపడేశారు.

– కడెం



వాగు అవతల తల్లి.. ఇవతల కొడుకు

కొందుర్గు (రంగారెడ్డి జిల్లా): వరదనీరు తల్లీకొడుకుల హృదయాలను తల్లడిల్లేలా చేసింది. బేకరీలో పనికి వెళ్లిన ఓ తల్లి వర్షం కారణంగా మధ్యాహ్నమే తిరిగి ఇంటికి పయనంకాగా దారి మధ్యలో వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వాగుకి ఇవతలే ఆగిపోయింది. కాగా, తల్లి వాగు వద్దే ఆగిపోయిందని తెలుసుకుని కంగారుపడ్డ కొడుకు అక్కడకు చేరుకుని తల్లిరాక కోసం తల్లడిల్లిపోయాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం చెర్కుపల్లికి చెందిన గుర్రంపల్లి చిన్నమ్మ శుక్రవారం యథావిధిగా షాద్‌నగర్‌లోని ఓ బేకరీలో పనికి వెళ్లింది. అయితే వర్షం కారణంగా మధ్యాహ్నమే తిరిగి ఇంటికి పయనమైంది. ఈ క్రమంలో కొందుర్గులో బస్సు దిగి నడుచుకుంటూ ఇంటికివెళ్తుండగా శివారులోని వాగు ఉధృతి ఒక్కసారిగా పెరిగిపోయింది. దీంతో ఆమె అక్కడే ఒడ్డున ఆగిపోయింది. చిన్నమ్మ వాగు వద్ద ఉందని తెలుసుకున్న కుమారుడు రోహిత్ వాగు వద్దకు వచ్చి తల్లిరాకకోసం తల్లడిల్లిపోయాడు. సుమారు మూడు గంటల ఉత్కంఠ అనంతరం వాగు ఉధృతి తగ్గుముఖం పట్టడంతో చిన్నమ్మను స్థానికులు నెమ్మదిగా అవతలి ఒడ్డుకు చేర్చారు. దీంతో తల్లీకొడుకుల నిరీక్షణ ఫలించింది.



వరద నీటికి ఎదురీదిన లేగదూడ

నిజామాబాద్ జిల్లా కందకుర్తి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి నది మధ్యలో ఓ లేగదూడ చిక్కుకుంది. సుమారు అర కిలోమీటరు వెడల్పున ప్రవాహంలో ఈదుకుంటూ వచ్చి కందకుర్తి వంతెన వద్ద ఒడ్డుకు చేరుకుంది. స్థానిక రైతులు దాన్ని చేరదీసి గోదావరికి అవతలి పక్కన గల గ్రామాలకు సమాచారం అందించారు.



ముసురు తగ్గింది

నాలుగు రోజుల తర్వాత శుక్రవారం కాస్త తెరిపి ఇచ్చిన వాన

రాష్ట్రవ్యాప్తంగా సగటున 4.71 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు

బంగాళాఖాతంలో అల్పపీడనంతో శని, ఆదివారాల్లో విస్తారంగా వానలు



ఆదిలాబాద్ జిల్లా కొండాపూర్‌లో వరద ధాటికి కొట్టుకుపోయిన రహదారి



ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం మర్లపల్లి శివారులో పొలంలో మేట వేసిన ఇసుక

సాక్షి, హైదరాబాద్/సాక్షి నెట్‌వర్క్: వరుసగా 4 రోజులపాటు రాష్ట్రమంతా కురిసిన వానలు శుక్రవారం కాస్త తెరిపినిచ్చాయి. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో పలుచోట్ల ఓ మోస్తరు వానలు పడగా.. మిగతాచోట్ల స్వల్పంగా జల్లులు కురిశాయి. ఆకాశం మాత్రం పూర్తిగా మేఘాలతోనే నిండిపోయింది. ఉష్ణోగ్రతలు కూడా సాధారణం కంటే తక్కువగా నమోదయ్యాయి. చల్లటిగాలులు వీస్తున్నాయి. అయితే వర్షాలు కాస్త తగ్గినా పలుచోట్ల ఉప నదులు, వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తూనే ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో రోడ్లు కోతకు గురయ్యాయి.

19శాతం అధికంగా వర్షపాతం

బంగాళాఖాతం పరిసరాల్లో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో 4 రోజులుగా కురుస్తున్న వానలతో రాష్ట్రంలో అధిక వర్షపాతం నమోదైంది. నైరుతి సీజన్‌లో శుక్రవారం నాటికి 27.39 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 32.64 సెంటీమీటర్లు కురిసింది. అంటే 19% అధికంగా వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలోని 4 జిల్లాల్లో అత్యధికంగా, 12 జిల్లాల్లో అధికంగా, 16 జిల్లాల్లో సాధారణ స్థాయిలో వర్షపాతం నమోదుకాగా.. ఒక్క ఖమ్మం జిల్లాలో ఇంకా లోటు ఉన్నట్టు వాతావరణ శాఖ వెల్లడించింది.

లోకరిలో 8.33 సెంటీమీటర్ల వాన

శుక్రవారం రాష్ట్రంలో అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లా గడిగుడ మండలం లోకరిలో 8.33 సెంటీమీటర్లు, నిజామాబాద్ జిల్లా కోటగిరిలో 7.4, ఆదిలాబాద్ జిల్లా నార్నూరులో 6.58 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. చాలాచోట్ల మోస్తరు వర్షాలు నమోదైనట్లు వాతావరణ శాఖ ప్రకటించింది.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆగమాగం

భారీ వర్షాల కారణంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో జనం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. బోథ్, సిరికొండ, ఇంద్రవెల్లి, నార్నూర్, ఇచ్చోడ మండలాల్లో వాగులు ఉప్పొంగడంతో 20 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పంట పొలాల్లోకి వరద నీరు చేరింది. బోథ్ మండలం మర్లపెల్లిని పెద్దవాగు బ్యాక్ వాటర్ ముంచెత్తింది. 36 కుటుంబాలను స్థానిక పాఠశాలలోని సహాయ శిబిరానికి తరలించారు. బోథ్, భీంపూర్ మండలాల్లో మూడు ఇళ్లు కూలిపోయాయి. బోథ్ నుంచి నిగిని వెళ్లే రోడ్డు కొట్టుకుపోయింది. బజార్‌హత్నూర్ మండలంలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మంచిర్యాల జిల్లా పరిధిలోని కోటపల్లి, వేమనపల్లి మండలాల్లో కల్వర్టులపై నుంచి వరద ప్రవహించి రాకపోకలు నిలిచిపోయాయి. సింగరేణి ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది.

- మంజీరా నదిలో వరద పెరగడంతో నిజామాబాద్ జిల్లా సాలూర శివార్లలోని అంతర్రాష్ట్ర వంతెన నీట మునిగింది. అధికారులు వంతెనకు ఇరువైపులా అడ్డుకట్ట కట్టి రాకపోకలను నిలిపివేశారు.
- ఘనపురం ఆనకట్ట పొంగి పొర్లుతుండటంతో మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయం జలదిగ్బంధంలో చిక్కుకుంది.

కాల్వలో పడి ఒకరి మృతి.. వాగులో మరొకరు గల్లంతు

భారీ వర్షాలతో వాగులు, వంకలు ఉప్పొంగుతుండటం ప్రమాదకరంగా మారింది. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం ధనోర(బి)లో జూపాక రాజేశ్వర్ (52) అనే వ్యక్తి వరద కాల్వలో పడి మృతి చెందాడు. వికారాబాద్ జిల్లా తాండూరు మండలం సంగెంకలాన్‌లో పెంటప్ప(45) అనే దినసరి కూలీ సమీప బంధువు అంత్యక్రియల్లో పాల్గొని తిరిగి వస్తూ బండలవాగులో కొట్టుకుపోయాడు.

మరో రెండ్రోజులు భారీ వర్షాలు

వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతోందని, దానికి అనుబంధంగా మరో ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని.. వీటి ప్రభావంతో తెలంగాణవ్యాప్తంగా శని, ఆదివారాల్లో వానలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. పలుచోట్ల మోస్తరు వర్షాలు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఆదివారం ఉత్తర తెలంగాణలోని కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో అతిభారీ వర్షాలు పడొచ్చని హెచ్చరించింది.

జిల్లాల వారీగా సగటు వర్షపాతం

(గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు.. సెం.మీ.లలో)

జిల్లా	వర్షపాతం		
మహబూబ్‌నగర్	8.50	కామారెడ్డి	4.85
మెదక్	8.03	సిద్దిపేట	4.66
వికారాబాద్	7.93	కొత్తగూడెం	4.62
మల్కాజిగిరి	7.71	వనపర్తి	4.48
రంగారెడ్డి	7.54	ములుగు	4.28
హైదరాబాద్	7.18	భువనగిరి	4.18
నారాయణపేట్	7.08	మంచిర్యాల	4.11
కరీంనగర్	6.99	జనగామ	4.03
సంగారెడ్డి	6.02	ఆసిఫాబాద్	3.99
భూపాలపల్లి	5.82	హనుమకొండ	3.89
జగిత్యాల	5.66	మహబూబాబాద్	3.51
వరంగల్	5.64	నిజామాబాద్	3.21
రాజన్న సిరిసిల్ల	5.54	సూర్యాపేట	2.85
నిర్మల్	5.32	ఖమ్మం	2.83
ఆదిలాబాద్	5.22	జోగుళాంబ గద్వాల	2.80
పెద్దపల్లి	5.17	నాగర్‌కర్నూల్	2.15
		నల్లగొండ	1.90

వర్షాలు, వరదలపై సీఎం సమీక్ష

ఎడతెరిపి లేని వానలు, వరద నేపథ్యంలో సీఎం కేసీఆర్ శుక్రవారం సచివాలయంలో సమీక్షించారు. ప్రాణహిత, ఇతర ప్రవాహాలు, భద్రాచలం వద్ద ముంపు పరిస్థితిపై ఆరా తీశారు. పరిస్థితులు అదుపులోనే ఉన్నాయని సీఎస్ శాంతి కుమారి వివరించారు. మరో రెండు రోజులు వానల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశించారు.



ఎడ్లబండిలో మృతదేహాన్ని వాగు దాటించి..

ఆదిలాబాద్ జిల్లా తోయగూడకు చెందిన కోడప రంబాబాయి (56) శుక్రవారం తెల్లవారుజామున రిమ్స్ ఆస్పత్రిలో మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని స్వగ్రామానికి తరలిస్తున్న అంబులెన్స్.. గిన్నెర పంచాయతీ పరిధిలోని మర్కగూడ వాగు పొంగిపొర్లుతుండటంతో ఆగిపోయింది. దీంతో గ్రామస్తులు ఎడ్లబండిలో మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి అంత్యక్రియలు పూర్తిచేశారు.



ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో దిగువకు పరవళ్లు తొక్కుతున్న వరద నీరు

వరద పెరిగింది



శ్రీరాంసాగర్‌లోకి లక్షా 40వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

- పూర్తిగా నిండిన కడెం.. ఎల్లంపల్లికి భారీగా వరద
- భద్రాచలం వద్ద తగ్గిన వరద.. అయినా అప్రమత్తమే!
- ఎగువ నుంచి పెరుగుతున్న ప్రవాహాలు
- భారీ వర్షాలతో కడెం ప్రాజెక్టుకు ఒక్కసారిగా వరద
- గేట్లన్నీ ఎత్తివేసేందుకు అధికారుల ప్రయత్నం
- నాలుగు గేట్లు మొరాయించడంతో టెన్షన్

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం వానలు కాస్త తగ్గినా వరద మాత్రం పెరిగింది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తెలంగాణలోని గోదావరి పరీవాహక ప్రాంతాల్లో పడిన వానలతో చిన్న ప్రాజెక్టులన్నీ నిండిపోయి ఎగువ గోదావరిలోకి ప్రవాహం పోటెత్తుతోంది. శ్రీరాంసాగర్, ఎల్లంపల్లి ప్రాజెక్టుల్లోకి భారీ వరద వస్తోంది. దిగువ గోదావరిలో భద్రాచలం వద్ద నది మట్టం శుక్రవారం ఉదయం వరకూ పెరిగి.. ఆ తర్వాత మెల్లగా తగ్గుముఖం పట్టినా, ఎగువ నుంచి వస్తున్న ప్రవాహాలతో మళ్లీ పెరిగిపోయే పరిస్థితి నెలకొంది. దీనితో అధికారులు ముందు జాగ్రత్త చర్యలను కొనసాగిస్తున్నారు. ఎల్లంపల్లి దిగువన నది తీరం, వాగులు నదిలో కలిసే ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు.

ఎగువ గోదావరికి జలకళ

ప్రాణహిత, ఇంద్రావతి, తాలిపేరు వంటివి ఉప్పొంగి దిగువ గోదావరి ఇప్పటికే పోటెత్తగా.. మహారాష్ట్ర నుంచి కాళేశ్వరం ప్రాజెక్టు వరకు ఉన్న ఎగువ గోదావరికి కూడా జలకళ వచ్చింది. మహారాష్ట్రలో కురుస్తున్న వానలతో శుక్రవారం మధ్యాహ్నం నుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద పోటెత్తింది. లక్షా 40 వేల క్యూసెక్కుల ప్రవాహం వస్తుండటంతో నీటి మట్టం వేగంగా పెరుగుతోంది. ప్రాజెక్టు పూర్తిమట్టం 1091 అడుగులు (90 టీఎంసీలు)కాగా.. శుక్రవారం రాత్రి 10 గంటలకు 1,077.4 అడుగుల (45.78 టీఎంసీలు)కు చేరిందని అధికారులు తెలిపారు. ఇక దిగువన ఎల్లంపల్లి ప్రాజెక్టుకు కూడా భారీగా ఇన్‌ఫ్లో వస్తోంది. కడెం ప్రాజెక్టు పూర్తిగా నిండిపోయి గేట్లన్నీ ఎత్తివేయడంతో 1.47 లక్షల క్యూసెక్కులు, ఇతర వాగుల నుంచి సుమారు లక్ష క్యూసెక్కులు కలిపి రెండున్నర లక్షల క్యూసెక్కుల మేర వరద ఎల్లంపల్లికి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి మట్టం 20.17 టీఎంసీలుకాగా... 18.29 టీఎంసీల మేర నిల్వ ఉంచారు. ప్రాజెక్టు 25గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్టుగా విడుదల చేస్తున్నారు. ఇక కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ బ్యారేజీ నుంచి 5.33 లక్షలు, తుపాకులగూడెం నుంచి 7.93 లక్షలు, సీతమ్మసాగర్ నుంచి 8.56 లక్షల క్యూసెక్కులు దిగువకు వెళ్తున్నాయి. ఆ వరద అంతా పోలవరానికి చేరుతోంది. ఆ ప్రాజెక్టు 48 గేట్లు ఎత్తి 7,75,079 క్యూసెక్కులను వదులుతున్నారు. ధవళేశ్వరం బ్యారేజీకి ఏకంగా 9,84,970 క్యూసెక్కుల వరద వస్తుండగా.. గోదావరి డెల్టాకు 11,100 క్యూసెక్కులను విడుదల చేస్తూ, మిగతా నీటిని సముద్రంలోకి వదిలేస్తున్నారు.

కృష్ణా, ఉప నదులకు పెరిగిన ప్రవాహాలు

కర్ణాటక, మహారాష్ట్రతోపాటు తెలంగాణలోని పరీవాహక ప్రాంతాల్లో వానలతో కృష్ణా నది, దాని ఉప నదులకు ప్రవాహాలు పెరిగాయి. ఆల్మట్టి డ్యామ్‌లోకి 70,780 క్యూసెక్కుల ప్రవాహం ఉండగా, నీటి నిల్వ 38.40 టీఎంసీలకు చేరింది. తుంగభద్ర డ్యామ్‌కు 13,340 క్యూసెక్కుల ప్రవాహం ఉండగా నీటి నిల్వ 13.72 టీఎంసీలకు చేరుకుంది. శ్రీశైలానికి ప్రవాహాలు మొదలుకాలేదు. మూసీ ప్రాజెక్టులోకి 4,052 క్యూసెక్కుల వరద వస్తుండగా.. ముందుజాగ్రత్తగా 4,962 క్యూసెక్కులను వదులుతున్నారు. దీనితోపాటు స్థానిక వాగుల నీరు కలిసి నాగార్జునసాగర్‌లోకి 5,988 క్యూసెక్కుల వరద చేరుతోంది.

మళ్లీ భయపెట్టిన కడెం

కడెం: నిర్మల్ జిల్లా పరిధిలోని కడెం ప్రాజెక్టుకు శుక్రవారం వరద పోటెత్తడం, నీటిని దిగువకు వదిలే గేట్లు మొరాయించడం మరోసారి ఆందోళన రేకెత్తించింది. గత ఏడాది జూలై 13న ఒక్కసారిగా వచ్చిన భారీ వరదతో కడెం ప్రాజెక్టు తెగిపోయే పరిస్థితి ఏర్పడటం, పదులకొద్దీ గ్రామాలు కొట్టుకుపోతాయన్న భయాందోళన నెలకొనడం తెలిసిందే. ఇప్పుడు అంతకన్నా తక్కువే వరద వచ్చినా గేట్లు మొరాయించడం దడ పుట్టించింది.

స్థానిక యువకులను పిలిపించి..

కడెం ప్రాజెక్టుకు శుక్రవారం ఉదయం 6 గంటలకు 73వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. అయితే ఎగువన భారీ వర్షాలతో 8గంటలకల్లా వరద 1,61,800 క్యూసెక్కులకు పెరిగింది. అప్రమత్తమైన అధికారులు 9 వరద గేట్లను ఎత్తి 1,39,983 క్యూసెక్కులను దిగువకు వదిలారు. కానీ ఇన్‌ఫ్లో ఇంకా పెరుగుతుండటంతో మరిన్ని గేట్లు ఎత్తేందుకు ప్రయత్నించారు. కానీ నాలుగు గేట్లు తెరుచుకోకుండా మొరాయించాయి. ప్రాజెక్టు ప్రైవేటు టెక్నీషియన్ సునీల్ పలుమార్లు గేట్లు ఎత్తేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. అక్కడే ఉన్న ఎంపీపీ అలెగ్జాండర్ వెంటనే స్థానిక యువకులకు ఫోన్ చేసి పరిస్థితిని వివరించారు. దీంతో 50 మందికిపైగా వెంటనే ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. గేట్ల హ్యాండిల్స్‌ను చేతులతో తిప్పుతూ రెండు గంటలపాటు శ్రమించి.. నాలుగు వరద గేట్లను ఎత్తారు. ఇదే సమయంలో ఇన్‌ఫ్లో కూడా తగ్గడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.



మొరాయించిన ఓ గేటును స్థానికుల సాయంతో మ్యాన్యువల్‌గా ఎత్తుతున్న అధికారులు

పనిచేయని స్థితిలో నాలుగు గేట్లు!

కడెం ప్రాజెక్టుకు మొత్తం 18 గేట్లు ఉన్నాయి. గత ఏడాది వచ్చిన భారీ వరదతో 2, 3వ గేట్ల కౌంటర్ వెయిట్స్ కొట్టుకుపోయాయి. 13వ నంబర్ గేటు ఓ వైపు వంగిపోయింది. 18 నంబర్ గేటుకు, కౌంటర్ వెయిట్‌కు అనుసంధానంగా ఉండే ఉక్కు రోప్ (తాడు) గురువారం ఉదయం గేటు ఎత్తే క్రమంలో తెగిపోయింది. ఇవి పనిచేయవు. మరమ్మతులు చేయాల్సి ఉంది. వీటికితోడు తాజాగా మరో నాలుగు గేట్లు మొరాయించాయి. దీనితో 1,80,000 క్యూసెక్కుల మేర వచ్చిన ప్రవాహాన్ని దిగువకు వదిలేందుకు అధికారులు తంటాలు పడ్డారు. ఇలాంటి సమయంలో 2 లక్షల క్యూసెక్కులకుపైగా ఇన్‌ఫ్లో వస్తే ప్రాజెక్టుకు ముప్పు తప్పదన్న ఆందోళన వ్యక్తమవుతోంది. దెబ్బతిన్న గేట్లకు వెంటనే పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

భద్రాచలం వద్ద తగ్గిన వరద.. అయినా..

దిగువ గోదావరిలో వరద కాస్త శాంతించింది. భద్రాచలం వద్ద శుక్రవారం ఉదయం 43.90 అడుగులకు చేరిన గోదావరి చాలాసేపు అదేస్థాయిలో కొనసాగింది. రాత్రి 7 గంటల సమయానికి వరద 8.5 లక్షల క్యూసెక్కులకు, నీటి మట్టం 41.04 అడుగులకు తగ్గింది. దీనితో మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. కానీ ఎల్లంపల్లి నుంచి వదులుతున్న నీరు, స్థానిక ప్రాజెక్టుల నుంచి, వాగుల నుంచి చేరుతున్న వరద, మళ్లీ వానలు కురుస్తుండటంతో అధికారులు ముందు జాగ్రత్త చర్యలను కొనసాగించారు. సీఎం కేసీఆర్ సూచనల మేరకు మంత్రి పువ్వాడ అజయ్ భద్రాచలంలోనే ఉండి వరద సహాయక కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. వరద భారీగా పెరిగే పరిస్థితి నెలకొంటే.. ముందస్తుగానే ముంపు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు.


మూసీ నదిలో చిక్కుకున్న ఐదుగురు వ్యక్తులు

నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం తెట్టెకుంటకు చెందిన జంగిలి రమేశ్, బుర్రి నగేశ్, జంగిలి సైదులు, గుండెబోయిన వెంకన్న, ధనావత్ సైదాలు చేపలు పట్టేందుకు మంగళిదుబ్బతండా సమీపంలోని మూసీ నదిలోకి వెళ్లారు. ఒక్కసారిగా నదిలో ప్రవాహం పెరగడంతో మధ్యలోనే చిక్కుకు పోయారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని లైఫ్ జాకెట్లు, తాళ్ల సాయంతో వారిని సురక్షితంగా బయటికి తీసుకొచ్చారు.



కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని చెరువులు పొంగి నీళ్లు ఏరులై కిందగా పారుతూ కొత్తపల్లి చెరువుకు వస్తున్నాయి. కొత్తపల్లి వెలిచాల ప్రధాన రోడ్డుపై లోలెవల్ రహదారి ఉండడంతో ఈ రహదారి పై నుంచి నీరు పోతోంది. రోడ్డుపై నుండే వరద నీరు మోకాలి ఎత్తు వరకు పారుతుండడంతో గ్రామస్తులు, మత్స్యకారులు చేపలు పడుతున్నారు.


- సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్ -



జలజల జలపాతం..

నాలుగైదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలతో రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల జలపాతాలు పరవళ్లు తొక్కుతున్నాయి. ఉప నదులు, వాగులు ఉప్పొంగి ప్రవహిస్తూ.. అంతెత్తు నుంచి ఎగసిపడుతున్న జలధారలు కనువిందు చేస్తున్నాయి. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల పరిధిలో జలపాతాలు ఆకట్టుకుంటున్నాయి. అయితే వరద భారీగా ఉండటంతో చాలా చోట్ల జలపాతాల సమీపంలోకి పర్యాటకులు వెళ్లకుండా నిషేధించారు. కాస్త దూరం నుంచి చూడగల ప్రాంతాలకు మాత్రమే అనుమతి ఇస్తున్నారు. వర్షాలు ఆగిపోయి, వరద తగ్గుముఖం పట్టాక జలపాతాల వద్దకు అనుమతి ఇస్తామని ప్రకటించారు.

- సాక్షి నెట్‌వర్క్ -



ములుగు జిల్లా ముత్యం ధార




ములుగు జిల్లా బొగత



ములుగు జిల్లా దుసపాటి లొద్ది



ఆదిలాబాద్ జిల్లా పొచ్చెర



మహబూబాబాద్ జిల్లా భీమునిపాదం

అదనపు ధాన్యమంతా ఎగుమతులకే

అదనంగా పండే వరిని ఆహార ఉత్పత్తులుగా మలిచి ఎగుమతి చేసేలా చర్యలు చేపట్టండి

- ఉన్నతస్థాయి సమీక్షలో అధికార యంత్రాంగానికి సీఎం కేసీఆర్ ఆదేశం
- రైతులకు మరింత లాభం చేకూరేలా చూడండి
- పెద్ద ఎత్తున ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు చేయనున్నట్లు వెల్లడి
- మరో 2 కోట్ల టన్నుల ధాన్యం మిల్లింగ్‌కు తగ్గట్లుగా కొత్త రైస్‌మిల్లులు
- సీఎంఆర్ సేకరించకుండా ఎఫ్‌సీఐ ఇబ్బంది పెడుతోందని ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: రైతులు పండించిన ధాన్యాన్ని, మిల్లింగ్ చేసిన బియ్యాన్ని సేకరించకుండా ఎఫ్‌సీఐ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేస్తోందని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోటీ పది లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం, నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లుల్లో ఉందని, ఎఫ్‌సీఐ చర్యలతో ఆహారధాన్యాలు దెబ్బతినే పరిస్థితి నెలకొందని అధికారులు సీఎం దృష్టికి తేవడంతో కేసీఆర్ తీవ్రంగా స్పందించారు. రానున్న రోజుల్లో అదనంగా వరి దిగుబడి కానున్న పరిస్థితుల్లో రైతు పండించిన వరి పంటను పలు రకాల ఆహార ఉత్పత్తులుగా మలిచి ఇతర రాష్ట్రాలకు, దేశాలకు ఎగుమతి చేసే విధంగా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తద్వారా రైతులకు మరింత లాభం చేకూరేలా చూడాలన్నారు. రాష్ట్రంలో ధాన్యం దిగుబడి, సీఎంఆర్ అప్పగింత, బియ్యం తిరస్కరణ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కొత్త మిల్లుల ఏర్పాటుపై సీఎం కేసీఆర్ శుక్రవారం పలువురు మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్షించారు.

అదనంగా పండే పంట కోసమే కొత్త మిల్లులు...

''రైతుల సంక్షేమం కోసం పెద్ద ఎత్తున ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసి ఇతర రాష్ట్రాలకు, దేశాలకు వరి ధాన్యం ఉత్పత్తులు ఎగుమతయ్యేలా చూడాలి. అప్పుడు తెలంగాణ వరికి గిరాకీ పెరిగి రైతులు లాభాలు గడిస్తారు. అదనంగా పండే పంటను దృష్టిలో పెట్టుకొని మాత్రమే నూతనంగా అధునాతన మిల్లులు ఏర్పాటు చేయబోతున్నాం. ఇందుకోసం ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసి విధివిధానాలు ఖరారు చేసి కార్యాచరణ ప్రారంభించనున్నాం. అంతర్జాతీయ స్థాయిలో పేరున్న సటాకె వంటి కంపెనీలతో చర్చించాం. వారితో రేపట్నుంచే ఉన్నతస్థాయి కమిటీ చర్చలు జరిపి ప్రభుత్వానికి నివేదిక అందించాలని ఆదేశించాం''అని పేర్కొన్నారు. కాగా, రాష్ట్రంలో అందుబాటులోకి వచ్చిన గౌరవెల్లి, మల్కపేట, బస్వాపూర్ తదితర ప్రాజెక్టులతోపాటు మరికొద్ది రోజుల్లో పూర్తి కానున్న పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు వల్ల వరిధాన్యం దిగుబడి ప్రస్తుత మున్న ఏటా 3 కోట్ల టన్నుల నుంచి 4 కోట్ల టన్నులకు పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, ఎంపీ దామోదర్‌రావు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

కమిటీ సభ్యులు వీరే...

రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న రైస్ మిల్లుల సామర్థ్యం కోటి టన్నుల వరకు ఉండగా మరో 2 కోట్ల టన్నుల వరి ధాన్యాన్ని మిల్లింగ్ చేసే దిశగా కొత్త మిల్లులను ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. ఇందుకు సంబంధించి విధివిధానాల ఖరారు కోసం ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సారథ్యంలో కమిటీని ప్రకటించారు. ఇందులో సీఎం కార్యదర్శి స్మితా సబర్వాల్, ఐటీ, పరిశ్రమల ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ అనిల్ కుమార్, టీఎస్ఐడీసీ ఎండీ నర్సింహారెడ్డి సభ్యులుగా ఉండనున్నారు.

40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అమ్మేద్దాం!

రాష్ట్రంలోని రైస్ మిల్లుల్లో ఉన్న ధాన్యంలో 40 లక్షల మెట్రిక్ టన్నులను గ్లోబల్ టెండర్ల ద్వారా విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. మిల్లర్లు సకాలంలో ధాన్యం మిల్లింగ్ చేయకపోవడంతో మిల్లుల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోయాయి. నిర్దేశిత సమయంలో సీఎంఆర్ ఇవ్వకపోవడంతో ఎఫ్‌సీఐ కొర్రీలు పెడుతోంది. దాదాపు 1.10 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం, 4 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లుల్లో నిల్వల నేపథ్యంలో ధాన్యం విక్రయానికి సీఎం ఆదేశించినట్లు తెలిసింది.

పెట్టుబడిదారుల సొమ్ముతో మనీలాండరింగ్

సాక్షి, హైదరాబాద్: మనీలాండరింగ్‌కు పాల్పడ్డ హైదరాబాద్ సంస్థ ఫార్మ్యాక్స్ ఇండియా లిమిటెడ్‌పై దర్యాప్తులో భాగంగా లండన్‌కు చెందిన అరుణ్ పంచారియా, సంజయ్ అగర్వాల్‌తోపాటు ఇండియా ఫోకస్ కార్డినల్ ఫండ్ కంపెనీకి చెందిన రూ. 59.37 కోట్ల విలువైన స్థిర, చరాస్తులను అటాచ్ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శుక్రవారం తెలిపింది. విదేశాల్లోని భారతీయ పెట్టుబడిదారుల చేత షేర్లు కొనిపించి ఆ సొమ్ము కొట్టేసేందుకు ఫార్మ్యాక్స్ కంపెనీ డైరెక్టర్లు మోర్తాల శ్రీనివాస్‌రెడ్డి, మోర్తాల మల్లారెడ్డిలతో కలసి అరుణ్ పంచారియా కుట్రపన్నినట్లు పేర్కొంది. ఇందుకోసం అరుణ్ పంచారియా తనకు పరిచయమున్న పాన్ ఏసియా అడ్వైజర్స్ లిమిటెడ్, ఇండియా ఫోకస్ కార్డినల్ ఫండ్ అండ్ వింటేజ్ ఎఫ్‌జెడ్‌ఈలకు చెందిన సంజయ్ అగర్వాల్, జలజ్ బాత్రా తదితరులు పలువురి నుంచి గ్లోబల్ డిపాజిటరీ రిసిప్ట్స్ పేరుతో 2010లో రూ. 318 కోట్లు సేకరించారు. నిబంధనల ప్రకారం ఆ సొమ్మును భారత్‌లోని బ్యాంకులో జమ చేయాల్సి ఉండగా దాన్ని ఆస్ట్రియాలోని ఫార్మ్యాక్స్ ఇండియా లిమిటెడ్‌కు చెందిన యూరామ్ బ్యాంకు ఖాతాకు మళ్లించారు. అలాగే అందులోంచి 50 శాతానికిపైగా సొమ్మును వింటేజ్ ఎఫ్‌జెడ్‌ఈ తీసుకున్న రుణానికి పూచీకత్తుగా సమర్పించారు. దీనిపై తెలంగాణ పోలీసులు జలజ బాత్రా, అరుణ్ పంచారియా, సంజయ్ అగర్వాల్, ముఖేశ్ చౌదరియా, ఇతరులపై కేసులు నమోదు చేశారు.

న్యాయవాద రక్షణ చట్టం తేవాలి: బార్ కౌన్సిల్



సాక్షి, హైదరాబాద్: దేశంలో న్యాయవాద రక్షణ చట్టం తేవాలని, న్యాయవాదులందరికీ ఆరోగ్య బీమా వర్తింపజేయాలని కేంద్రం న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్‌ని తెలంగాణ బార్ కౌన్సిల్ కోరింది. ఈ మేరకు బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి, వైస్‌చైర్మన్ సునీల్ గౌడ్‌తో పాటు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పి.విష్ణువర్ధన్ రెడ్డి ఢిల్లీలో మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశారు.

అర్హతలున్న గెస్ట్ లెక్చరర్లను కొనసాగించాలి: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: అర్హతలున్న 1,654 మంది గెస్ట్ లెక్చరర్లను కొనసాగించాలని, వీరు లేని ప్రాంతాల్లో కొత్త నియామకాలు చేయవచ్చని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. రాష్ట్రంలోని 405 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 1,654 మంది గెస్ట్ లెక్చరర్లుగా పనిచేస్తున్నారు. అయితే ప్రభుత్వం వీరి స్థానంలో మళ్లీ నియామకాలు చేపట్టేందుకు జూలై 18న నోటిఫికేషన్ ఇచ్చింది. ప్రస్తుతం పని చేస్తున్న వారు తిరిగి దరఖాస్తు చేసుకునేందుకు అనుమతిచ్చింది. అయితే ఏళ్లుగా పని చేస్తున్న తమను కాదని మళ్లీ నియామకాలు చేపట్టడం రాజ్యాంగ విరుద్ధమని.. ఆర్టికల్ 14, 16, 21ను ఉల్లఘించడమేనని పేర్కొంటూ గెస్ట్ లెక్చరర్లు హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ మాధవీదేవి.. మెరిట్ ఆధారంగానే వీరిని నియమించారు కదా, ఇప్పుడెందుకు మారుస్తున్నారని ప్రశ్నించారు. ఏదేమైనా లెక్చరర్‌కు అర్హతలు ఉండి, ఎలాంటి ఫిర్యాదు లేని వారిని కొనసాగించాలని, ఇతర చోట్ల కొత్త వారిని తీసుకోవచ్చని మధ్యంతర ఉత్తర్వులిచ్చారు. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. కాగా, హైకోర్టు ఉత్తర్వుల పట్ల గెస్ట్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దామెర ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి దార్ల భాస్కర్ హర్షం వ్యక్తంచేశారు. అధికారుల నిర్ణయంతో 1,654 మంది రోడ్డున పడే ప్రమాదం ఉన్న క్రమంలో గెస్ట్ లెక్చరర్లంతా విద్యామంత్రి ఇంటి వద్ద, ఇంటర్ బోర్డు కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు. చివరికి హైకోర్టు తమకు ఊరటనిచ్చిందని తెలిపారు.

నిరుద్యోగ సమస్యలపై 1న ఏబీవీపీ చలో హైదరాబాద్



సాక్షి, బంజారాహిల్స్: నగరంలోని సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఆగస్టు ఒకటో తేదీన విద్యార్థి, నిరుద్యోగ యువత సమస్యలపై చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ జీవన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి అనుమతివ్వాలని కోరుతూ విద్యార్థుల బృందం శుక్రవారం సీపీ సీవీ ఆనంద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించినట్లు ఆయన పేర్కొన్నారు. 'దగాపడ్డ తెలంగాణ విద్యార్థి, మార్పు కోసం–మహా ఉద్యమం'లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

గొర్రెలు, బర్రెలు కాదు.. రాజ్యాధికారంలో వాటా ఇవ్వండి

- ఈ పార్లమెంటు సమావేశాల్లోనే బీసీ బిల్లు పెట్టండి
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జంతర్ మంతర్ వద్ద భారీ నిరసన
- మద్దతు తెలిపిన పలువురు ఎంపీలు, నేతలు



జంతర్‌మంతర్ వద్ద నిరసనలో పాల్గొన్న ఆర్. కృష్ణయ్య, నారాయణ తదితరులు

సాక్షి, న్యూఢిల్లీ: ప్రస్తుత పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లోనే బీసీ బిల్లు ప్రవేశపెట్టి... చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, ప్రైవేటు రంగంలో బీసీ, ఎస్సీ ఎస్టీలకు రిజర్వేషన్లు పెట్టాలని కోరుతూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. బీఎస్పీ ఫ్లోర్ లీడర్ శ్యామ్ సింగ్, ఎంపీ బినోయ్ విశ్వమ్, సీపీఐ జాతీయ నాయకులు నారాయణ, మల్లు రవి మద్దతు తెలిపారు. వందలాది మంది సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, బీసీ సంఘాల నాయకులు ఈ భారీ ప్రదర్శనలో పాల్గొన్నారు. 'ఓట్లు బీసీలవి– సీట్లు అగ్రకులాలవా.. రాజ్యాధికారంలో వాటా కావాలి' అంటూ నినాదాలు చేశారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణ, ప్రధాన కార్యదర్శి నందగోపాల్ రాజ్ కుమార్, నేతలు గోవింద్, కర్రి వేణు మాధవ్, బాషయ్య, పరశురామ్ నాయకత్వం వహించారు.

బీసీలను శాశ్వత బిచ్చగాళ్లను చేస్తున్నారు: కృష్ణయ్య

ధర్నాను ఉద్దేశించి ఆర్.కృష్ణయ్య ప్రసంగిస్తూ అన్ని రంగాలలో అభివృద్ధి చెందిన అగ్రకులాలకు ఒకే రోజులో బిల్లు పెట్టి ఆఘమేఘాల మీద 10 శాతం రిజర్వేషన్లు పెట్టారని... కానీ బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు పెట్టాలని 30 ఏళ్లుగా పోరాడుతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. బీసీలకు రాజ్యాధికారంలో వాటా ఇవ్వకుండా గొర్రెలు – బర్రెలు పందులు – పెన్షన్లు ఇచ్చి ఓట్లు వేయించుకొని బీసీలను శాశ్వత బిచ్చగాళ్లను చేస్తున్నారని విమర్శించారు.

ద.మ.రైల్వే డీఆర్‌ఎంగా భరతేశ్‌కుమార్ జైన్



సాక్షి, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్‌గా భరతేశ్ కుమార్‌జైన్ శుక్రవారం సికింద్రాబాద్ సంచాలన్ భవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇండియన్ రైల్వేస్ సర్వీస్ ఆఫ్ ఇంజనీరింగ్ (ఐఆర్ఎస్ఈ) 1992 బ్యాచ్‌కి చెందిన ఆయన రూర్కీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి సివిల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీతోపాటు ఢిల్లీ ఐఐటీ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఇప్పటివరకు ఆగ్నేయ రైల్వేలో చీఫ్ ఇంజనీర్ (జనరల్)గా పనిచేశారు. గతంలో కోల్‌కతాలోని ఆగ్నేయ రైల్వే జనరల్ మేనేజర్ సెక్రెటరీగా పనిచేశారు. దాదాపు 167 కి.మీల డబ్లింగ్, గేజ్ మార్పిడి వంటి నాలుగు ప్రాజెక్టులు ఆయన ఆధ్వర్యంలో పూర్తయ్యాయి.

సాగర్ స్పిల్‌వే పనుల్లో జాప్యం

వ్యవసాయ పనులకు వెళుతున్న కూలీలు



ఎనిమిదవ గేటు దిగువన సాగుతున్న గుంతలు పూడ్చే పనులు

నాగార్జునసాగర్: కూలీలు దొరక్క నాగార్జునసాగర్ స్పిల్‌వే పనుల్లో జాప్యం జరుగుతోంది. ఇటీవల వర్షాలు బాగా కురుస్తుండటంతో కూలీలు తమ సొంత వ్యవసాయ పనులకు వెళుతున్నారు. మరో పక్క కృష్ణానదిలో వరదలు మొదలయ్యాయి. స్పిల్‌వే పైభాగంలో 26 రేడియల్ క్రస్ట్‌గేట్లు ఉండగా ప్రస్తుతం 11 గేట్ల దిగువన గల స్పిల్‌వే ప్రాంతంలో దాదాపు పని పూర్తయ్యిందని అధికారులు చెపుతున్నారు. కూలీలతో కాంక్రీట్ వేయించి పూడ్చాల్సిన చిన్న గుంతలు మిగిలి ఉన్నాయి. 1, 2, 3, 4, 5, 6, 7, 8 రేడియల్ క్రస్ట్‌గేట్ల కింద మరమ్మతు పనులన్నీ అలాగే ఉన్నాయి. ప్రస్తుతం కూలీలతో 8వ రేడియల్ క్రస్ట్‌గేటు కింద ఉన్న గుంతలను కాంక్రీట్‌తో నింపే పనులు శుక్రవారం మొదలయ్యాయి. ఆవలివైపు నుంచి ఉన్న 26, 25, 24, 23 రేడియల్ క్రస్ట్‌గేట్ల దిగువన పనిఅంతా అలాగే ఉంది. పెద్దపెద్ద గుంతలు ఉన్నాయి. కాగా, డ్యామ్ దిగువన గల కృష్ణానది తీరంలోని నాగార్జునపేట, జమ్మనకోట తండాలకు చెందిన వారే మొదటి నుంచీ స్పిల్‌వే మరమ్మతు పనులు చేస్తున్నారు. ప్రస్తుతం వారంతా వ్యవసాయ పనుల్లో నిమగ్నం కావడంతో కూలీల కొరత ఉన్నట్లు తెలుస్తోంది.

గౌరవెల్లిని ఆపేయండి

పనులు కొనసాగించొద్దు.. నీళ్లు నిల్వ చేయొద్దు

- ఇప్పటికే పనులు పూర్తయి నీటిని నిల్వ చేసి ఉంటే కాల్వలకు విడుదల చేయొద్దు
- తెలంగాణకు గోదావరి బోర్డు ఆదేశం
- ఎన్జీటీ సూచనలతో రాష్ట్రానికి లేఖ

సాక్షి, హైదరాబాద్: గౌరవెల్లి రిజర్వాయర్ పనులను తక్షణమే నిలుపుదల చేయాలని, ఒక వేళ పనులు పూర్తయితే నీటిని నిల్వ చేయొద్దని తెలంగాణ రాష్ట్రాన్ని గోదావరి నది యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ) ఆదేశించింది. ఇప్పటికే నీటిని నిల్వ చేసి ఉంటే కాల్వలకు విడుదల చేయొద్దని కోరింది. ఈ మేరకు గోదావరి బోర్డు సభ్య కార్యదర్శి ఆర్.అళగేషన్ శుక్రవారం రాష్ట్ర నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ కుమార్‌కు లేఖ రాశారు. పర్యావరణ అనుమతి తీసుకోకుండా గౌరవెల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని చేపట్టడాన్ని సవాలు చేస్తూ జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్జీటీ)లో దాఖలైన కేసులో గోదావరి బోర్డు ప్రతివాదిగా ఉంది. ఎన్జీటీ ఆదేశాల మేరకు గౌరవెల్లి రిజర్వాయర్ పనులపై యథాస్థితిని కొనసాగించాలని, కొత్త పనులు చేపట్టరాదని తాజాగా గోదావరి బోర్డు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది.

''ఆ క్లాజుల ప్రకారం నడుచుకోవాలి''

గోదావరి బోర్డు అధికార పరిధిని నిర్దేశిస్తూ 2021 జూలై 15న కేంద్ర జలశక్తి శాఖ జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లోని క్లాజులు 1(డీ)(3), 2(ఎఫ్), 2(జీ) ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం నడుచుకోవాలని స్పష్టం చేసింది. క్లాజు 1(డీ) ప్రకారం అనుమతి లేని ప్రాజెక్టులకు గోదావరి బోర్డు, అపెక్స్ కౌన్సిల్, టెక్నికల్ అడ్వైజరీ కమిటీ(టీఏసీ)ల నుంచి అనుమతులు పొందే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేసింది. ప్రాజెక్టుల సామర్థ్యం పెంపు, ఇతర మార్పులు, రెగ్యులేటర్లు, అప్రోచ్ చానల్, సొరంగం పనులు, డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థ పనులు చేపట్టాలన్నా గోదావరి బోర్డు, టీఏసీ, అపెక్స్ కౌన్సిల్ అనుమతులు తప్పనిసరి అని గుర్తు చేసింది. క్లాజు 2(ఎఫ్) ప్రకారం అనుమతి లేని ప్రాజెక్టుల పనులు నిలుపుదల చేసి, గెజిట్ విడుదలైన ఆరు నెలల్లోపు అనుమతులు తెచ్చుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. క్లాజు 2(జీ) ప్రకారం అనుమతి రాని ప్రాజెక్టులను వినియోగించుకోకుండా పక్కనబెట్టాల్సి ఉంటుందని తెలిపింది.

రాష్ట్రం వచ్చాక పెరిగిన గౌరవెల్లి సామర్థ్యం

ఉమ్మడి రాష్ట్రంలో ఇందిరమ్మ వరద కాల్వ ప్రాజెక్టులో భాగంగా 1.04 టీఎంసీల సామర్థ్యంతో గౌరవెల్లి రిజర్వాయర్‌ను నిర్మించారు. తెలంగాణ వచ్చాక ప్రాజెక్టుల రీడిజైనింగ్‌లో భాగంగా గౌరవెల్లి సామర్థ్యాన్ని 8.5 టీఎంసీలకు పెంచాలని నిర్ణయం తీసుకున్నారు. ఇందుకోసం 1960 ఎకరాలను సేకరించారు. రిజర్వాయర్ పనులు పూర్తి కాగా, 1.02 టీఎంసీలను నింపారు. రిజర్వాయర్ సామర్థ్యం 8.5 టీఎంసీలకు పెరిగినా ప్రధాన కాల్వ సామర్థ్యం 1.04 టీఎంసీలే ఉంది. పర్యావరణ అనుమతులు లేకుండా ప్రాజెక్టు పనులు చేపట్టారని గ్రామస్తులు కొందరు కేసు వేయగా, ఎన్జీటీ గతంలో ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

క్లుప్తంగా...

నేడు విద్యా సంస్థలకు సెలవు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా శనివారం కూడా ప్రభుత్వం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించింది. విద్యా శాఖమంత్రి సబితా ఇంద్రారెడ్డి ఉన్నతాధికారులతో శుక్రవారం సమీక్షించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈమేరకు మంత్రి కార్యాలయం శుక్రవారం వెల్లడించింది.

సాగర్ నుంచి తెలంగాణకు 8.5 టీఎంసీలు

సాక్షి, హైదరాబాద్: నాగార్జునసాగర్‌లో శుక్రవారానికి కనీస నీటిమట్టానికి ఎగువన లభ్యతగా ఉన్న 12.731 టీఎంసీల్లో జూలై అవసరాలకు ఏపీకి 4.2 టీఎంసీలు, జూలై నుంచి సెప్టెంబర్ వరకు అవసరాలకు తెలంగాణకు 8.5 టీఎంసీల నీటిని వాడుకోవడానికి కృష్ణా నది యాజమాన్య బోర్డు అనుమతిచ్చింది. ఆ మేరకు నీటిని విడుదల చేయాలని నాగార్జునసాగర్ సీఈని ఆదేశిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. నాగార్జునసాగర్ నుంచి కుడి కాలువకు తాగునీటి అవసరాల కోసం 5 టీఎంసీలు విడుదల చేయాలని ఏపీ ఈఎన్సీ సి.నారాయణరెడ్డి.. సాగు, మిషన్ భగీరథ, హైదరాబాద్ తాగునీటి అవసరాలకు 10 టీఎంసీలు కేటాయించాలని తెలంగాణ ఈఎన్సీ మురళీధర్ కృష్ణా బోర్డుకు ప్రతిపాదనలు పంపారు. వాటిపై ఈనెల 18, 19న కృష్ణా బోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పురే నేతృత్వంలో ఏపీ, తెలంగాణ ఈఎన్సీలతో కూడిన త్రిసభ్య కమిటీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చించింది.

'గృహలక్ష్మిలో దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్!'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గృహలక్ష్మి పథకంలో దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ అమలు చేయాలనే వినతికి సీఎం కేసీఆర్ సానుకూలంగా స్పందించినట్లు రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి తెలిపారు. సచివాలయంలో సీఎం కేసీఆర్‌ను శుక్రవారం కలిసిన వాసుదేవరెడ్డి దివ్యాంగులకు సంబంధించిన పలు అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. బధిరుల కోసం ప్రత్యేక డిగ్రీ కళాశాల ఏర్పాటు, దివ్యాంగుల పథకాల అమలుకు ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని కోరారు. వినతిపత్రంలో పేర్కొన్న అంశాలపై చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారిని సీఎం ఆదేశించారు. దివ్యాంగుల ఆసరా పెన్షన్‌ను రూ.4,116కు పెంచినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

'దేశంలో దళిత, గిరిజనులకు రక్షణ లేదు'



సాక్షి, న్యూఢిల్లీ: బీజేపీ ప్రభుత్వంలో, ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశంలో గిరిజనులు, దళితుల పట్ల హింస రోజురోజుకూ పెరుగుతోందని, ఆయా వర్గాలకు రక్షణ లేకుండా పోయిందని బీఆర్ఎస్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. ఆజాద్ సమాజ్ పార్టీ అధినేత, భీమ్ ఆర్మీ వ్యవస్థాపకుడు చంద్రశేఖర్ ఆజాద్‌పై జరిగిన దాడికి నిరసనగా ఢిల్లీ జంతర్‌మంతర్‌లో శుక్రవారం నిరసన చేపట్టారు. బీఆర్ఎస్ ఎంపీలు కొత్త ప్రభాకర్ రెడ్డి, వెంకటేశ్ నేత, మన్నె శ్రీనివాస్‌రెడ్డి, రాములు హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆజాద్‌పై కాల్పులు జరిపిన వారిని వెంటనే పట్టుకోవా లని డిమాండ్ చేశారు. ఆజాద్‌కు వెంటనే భద్రత కల్పించా లని కోరారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం: ఆర్‌ఎస్పీ



జూలపల్లి (పెద్దపల్లి): ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫల మైందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. శుక్రవారం మండలంలోని గ్రామాల్లో బహుజన రాజ్యా ధికార యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా బాలరాజు పల్లెలో మహాత్మా జ్యోతిబా పూలే, జూల పల్లిలో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మండల కేంద్రంలో జరిగిన బహిరంగ సభ, మీడియా సమావేశంలో మాట్లాడారు. పేదలకు రూ.15 వేల కోట్లతో డబుల్ బెడ్‌రూం ఇళ్లు కడతామని మాటతప్పడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. 60 మంది ఎమ్మెల్యేలు ఉండాల్సిన సభలో 23 మందే ఉన్నారని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లు ఎందుకు పెంచడం లేదని, ప్రగతి భవన్‌లో బీసీ ఉద్యోగులు ఎందుకు లేరని ప్రశ్నించారు.

సీడీఎంఏగా సుదర్శన్‌రెడ్డికి పూర్తి అదనపు బాధ్యతలు

సాక్షి, హైదరాబాద్: మునిసిపల్ పరిపాలన డైరెక్టర్, కమిషనర్(సీడీఎంఏ)గా పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ కార్యదర్శి సి.సుదర్శన్‌రెడ్డికి ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. సీడీఎంఏగా ఉన్న సత్యనారాయణ గత నెల 30న పదవీ విరమణ చేయడంతోపాటు 'రెరా'చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి ఈ శాఖ అదనపు బాధ్యతలను ప్రభుత్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శి అరవింద్‌కుమార్ పర్యవేక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో సుదర్శన్‌రెడ్డికే పూర్తి అదనపు బాధ్యతలు(ఎఫ్ఏసీ) అప్పగిస్తూ సీఎస్ శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

జలజల జలపాతం..



మహబూబాబాద్ జిల్లా పాండవుల జలపాతం



ఆదిలాబాద్ జిల్లా కొర్టికల్



పెద్దపల్లి జిల్లా గౌరిగుండాల



ఆదిలాబాద్ జిల్లా కుంటాల



కుమురంభీం జిల్లా గుండాల



లంక సీత వయసు 81.
ఢిల్లీతో 61 ఏళ్ల అనుబంధం.
ఢిల్లీలో ఉండనని ఏడ్చిన రోజులు...
ఇంత నగరంలో ఎలా జీవించాలి...
అనే ఆందోళన.
జీవించడం ఎలాగో నేర్పిన గురువుది కూడా
ఆ నగరమే.
తెలుగుదనంతో ఢిల్లీలో అడుగు పెట్టిన
నాటి తరం అమ్మాయి.
తనలాగ ఎందరో...
వాళ్లకు బతికే దారేది... అనుకుంది.
అలాంటి అభాగ్యులకు అక్క అయింది...
వారి జీవికకు దారి చూపిస్తోంది.

బడుగు జీవుల దారిదీపం ఈ పెద్దక్క

ఆంధ్రప్రదేశ్, పశ్చిమగోదావరి జిల్లా, తణుకులో పుట్టిన లంక సీత దేశ రాజధానితో ముడివడిన తన జీవిత గమనాన్ని సాక్షితో పంచుకున్నారు. ''నేను పుట్టింది అమ్మమ్మగారింట్లో తణుకులోనే, కానీ సొంతూరు నర్సాపురం. నాన్న ఉద్యోగరీత్యా నా చదువు కొంత కాలం నర్సాపురం, మరికొంత కాలం తణుకులో అమ్మమ్మగారింట్లో సాగింది. నాకు చదువంటే ఎంత ఇష్టమంటే ఇంగ్లిష్ పరీక్ష రాయడానికి టేబుల్ అందకపోతే నిలబడి పరీక్ష రాశాను తప్ప పరీక్ష మానలేదు. ఎస్ఎస్ఎల్‌సీ తర్వాత అనుకోకుండా పెళ్లి సంబంధం రావడం, మంచి సంబంధం, అబ్బాయికి సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగం అని పెళ్లి చేసి మా వారితో పాటు నన్ను ఢిల్లీకి పంపించారు మా వాళ్లు. పంజాబీల ఇంట్లో అద్దెకుండేవాళ్లం. ఇంగ్లిష్ అయితే నెగ్గుకొచ్చేదాన్ని, కానీ హిందీ అక్షరం కూడా మాట్లాడలేని పరిస్థితి. నాకు ఢిల్లీ అలవాటయ్యే లోపే భూకంపం వచ్చింది. మా ఓనర్ నన్ను గట్టిగా పిలుస్తూ పంజాబీలో, హిందీలో ఏదో చెప్తోంది. అర్థం చేసుకునే లోపు ఆవిడే వచ్చి బయటకు లాక్కు వెళ్లింది. ఆ తర్వాత తెలిసింది నాకు అది భూకంపం అని. ఢిల్లీలో ఉండనని ఏడవడం అప్పుడు మొదలైంది. ఆ తర్వాత ఒక రోజు కడుపు నొప్పి కారణంగా మా వారిని హాస్పిటల్‌లో చేర్చారు. అది గుండెనొప్పి అని ఆయన దూరమైన తర్వాత తెలిసింది నాకు. కంపాషన్ గ్రౌండ్స్‌లో నాకు ఉద్యోగం ఇచ్చారు. ఉద్యోగంలో చేరిన తర్వాత ఇల్లు దాటి ఢిల్లీ వీధులు, సిటీ బస్సులతో నా జీవన యానం మొదలైంది. ఆఫీసులో ఉన్నా సరే నా కళ్లు వర్షించడానికి సిద్ధంగా ఉన్న నీలిమేఘాల్లా ఉండేవి. ఉద్యోగంలో పని నేర్చుకోవడం, ప్రైవేట్‌గా చదువుకోవడం మొదలు పెట్టిన తర్వాత నా మీద నాకు నమ్మకం కలిగింది. నా కళ్లు కన్నీళ్లను మరచిపోయాయి.

మళ్లీ చదువు!

ఇంటర్, బీఏ, ఎంఏ, ఆ తర్వాత జర్నలిజం చేశాను. చైనా సామాజిక జీవనం పట్ల అధ్యయనం చేయాలనే ఉద్దేశంతో చైనీస్ భాష నేర్చుకోవడానికి లింగ్విస్టిక్స్‌లో చేరాను. కానీ ఉద్యోగంలో ప్రమోషన్ తర్వాత పని భారం కారణంగా ఇతర వ్యాపకాల మీద దృష్టి పెట్టలేకపోయాను. ఆర్థిక, సామాజిక పరిశోధన రంగంలో పని చేశాను. సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్‌గా ఉన్న సమయంలో అమ్మ కోసం నాలుగేళ్ల ముందే రిటైర్మెంట్ తీసుకున్నాను. ఉద్యోగంలో నా పని సామాజిక స్థితిగతుల మీద అధ్యయనం కావడంతో 2002లో సైరస్ (సీత ఆల్ ఇండియా రీసెర్చ్ అండ్ సోషల్ సర్వీసెస్) స్థాపించి విశ్రాంత జీవితాన్ని సమాజం కోసమే అంకితం చేశాను.

మహిళ పరిస్థితి మారలేదు!

ప్రభుత్వ ఉద్యోగం ఉండి కూడా దేశ రాజధాని నగరంలో నన్ను నేను నిలబెట్టుకోవడానికి ఎంత కష్టపడాల్సి వచ్చిందో నాకు తెలుసు. నాలాగ తన కాళ్ల మీద తాము నిలబడాల్సిన స్థితిలో ఉన్న మహిళల కోసం ఏదైనా చేయాలనిపించింది. మహిళలు, యువకులు, వృద్ధులకు కూడా ఉపయోగపడేవిధంగా సైరస్ పేరుతో స్వచ్ఛంద సంస్థను స్థాపించాను. మహిళలకు ఉద్యోగ ప్రయత్నాల్లో సహాయం చేయడం, ఉపాధి మార్గాలను తెలియచేసి సహకారం అందించడం, తాగుబోతు భర్తల కారణంగా బాధలు పడుతున్న వాళ్లకు ఆసరాగా నిలవడం, మగవాళ్లకు కౌన్సెలింగ్ ఇచ్చి తాగుడుకు బానిసలు కాకుండా కుటుంబం పట్ల బాధ్యతగా వ్యవహరించే వరకు పర్యవేక్షిస్తూ ఆ కుటుంబాలను నిలబెట్టడం వంటి ప్రయత్నాలు మొదలుపెట్టాం. పిల్లలకు పోషకాహారం అందించడం, స్కూలుకి పంపేలా చూడడం, వృద్ధుల ఆరోగ్య సంరక్షణతోపాటు వారిని సమాజంలో ఉత్సాహంగా పాల్గొనేటట్లు చేయడం, యువతను చైతన్యవంతం చేయడం వంటి కార్యక్రమాలతో పని చేస్తోంది సైరస్.

వర్తమానమే ప్రధానం!

మా సైరస్ సంస్థలో పన్నెండు మందిమి ఉన్నాం. మేమందించే మా సేవలలో మాకు సహకరించే డాక్టర్లు, లాయర్‌లు, టీచర్‌లు, వాలంటీర్‌లున్నారు. మేము ఎవరి దగ్గరా ఆర్థిక సహకారం తీసుకోలేదు. మా కార్యక్రమాలకు వస్తురూపేణా సహకరించేవాళ్లున్నారు. నా పెన్షన్‌లో సగం ఈ సర్వీస్‌కే ఖర్చవుతుంది. నాకు పిల్లలు లేరు. పిల్లలతో కలిసి గడపడానికి ఎప్పుడూ ఏదో ఒక కార్యక్రమం చేస్తూ నా పిల్లలకే చేసినట్లు సంతోషపడుతుంటాను. సమాజానికి సేవ చేయడంతో పాటు తెలుగు కథలు, వ్యాసాలు రాయడం, అనేక ప్రదేశాల్లో పర్యటించడం, పరిశోధన వ్యాసాలు రాయడం నా హాబీలు. నేను నమ్మే తాత్వికత ఒక్కటే... 'గతాన్ని మార్చలేం. అందుకే గతంలో జరిగిన చేదు సంఘటనల గుర్తు చేసుకుంటూ మనసు పాడు చేసుకోకూడదు. భవిష్యత్తులో ఏం జరుగుతుందో ఊహించలేం. మనం వండుకున్న అన్నాన్ని తినే వరకు ఉంటామో లేదో మనకే తెలియదు. అలాంటప్పుడు భవిష్యత్తు కోసం ఆలోచిస్తూ ఉండడం వృథా. ఇక వర్తమానమే ప్రధానం. వర్తమానంలో జీవించాలి' ఇదే నన్ను నడిపిస్తున్న చోదక శక్తి'' అన్నారు లంక సీత.

– వాకా మంజులారెడ్డి
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

లెప్రసీ ఆశ్రమం దత్తత

వైజాగ్‌లో వొకేషనల్ సెంటర్ ప్రారంభించి చదువు మానేసిన వాళ్లకు కుట్లు, అల్లికలతోపాటు టైలరింగ్, వెదురుతో కళాకృతుల తయారీ, టీవీ మెకానిజం, ఏసీ రిపేర్‌లలో సర్టిఫికేట్ కోర్సులు నిర్వహించాం. కరోనా వరకు నిరంతరాయంగా సాగాయి. ఇప్పుడు వాటిని తిరిగి గాడిలో పెట్టాలి. హైదరాబాద్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌లలో మెడికల్ క్యాంపులు పెట్టి అవసరమైన వారిని అనంతర చికిత్స కోసం ఉచితంగా వైద్యమందించే హాస్పిటల్స్‌తో అనుసంధానం చేస్తాం. రిపబ్లిక్ డే, ఇండిపెండెన్స్ డే, గాంధీ జయంతి, చిల్డ్రన్స్ డే వంటి సందర్భాల్లో పిల్లలకు పోటీలు నిర్వహిస్తాం. ఢిల్లీలో అల్పాదాయ వర్గాలు నివసించే నాలుగు కాలనీలు, ఒక లెప్రసీ ఆశ్రమాన్ని దత్తత తీసుకున్నాం. దుస్తులు, పాత్రలు, బ్యాండేజ్ క్లాత్, మందులు పంపిణీ చేస్తాం. దత్తత తీసుకున్న కాలనీల పిల్లలకు స్కూలుకు వెళ్లడానికి అవసరమైన సమస్తం సమకూరుస్తున్నాం.

– లంక సీత, ప్రెసిడెంట్, సైరస్ స్వచ్ఛంద సంస్థ





మహిళలు, పిల్లలకోసం సేవా కార్యక్రమాలు

న్యూస్‌మేకర్ - జ్యోతి



అదిగో మన పి.టి.ఉష

విశాఖ తీరంలో ఒక సెక్యూరిటీ గార్డ్ కడుపున పరుగుల కెరటం పుట్టింది.
పి.టి. ఉషలా హర్డిల్స్‌లో అద్భుత ప్రతిభ చూపుతోంది.
బ్యాంకాక్‌లో జరిగిన 25వ ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో
జ్యోతి యర్రాజీ మహిళల 100 మీటర్ల హర్డిల్స్ రేసులో గోల్డ్ మెడల్ సాధించింది.
50 ఏళ్ల ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ చరిత్రలో 100 మీటర్ల హర్డిల్స్‌లో
స్వర్ణ పతకం సాధించిన తొలి భారతీయ అథ్లెట్‌గా జ్యోతి యర్రాజీ నిలిచింది.
త్వరలో ప్రపంచ చాంపియన్‌షిప్‌లోనూ ఆమె మెరిస్తే తెలుగు ఖ్యాతి మరింత రెపరెపలాడనుంది.

జూలై 13, గురువారం. బ్యాంకాక్‌లో ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో 100 మీటర్ల హర్డిల్స్ పోటీ.

ట్రాక్ మీద జ్యోతి యర్రాజీ చిరుతలా సిద్ధంగా ఉంది. కాని ఆ రోజు వాతావరణం ఆమె పక్షాన లేదు. వాన పడటం వల్ల ట్రాక్ తడిగా ఉంది. 100 మీటర్ల హర్డిల్స్‌ను జాతీయ స్థాయిలో 12.82 సెకన్లలో పూర్తి చేసి రికార్డు సాధించి ఉంది జ్యోతి. ఇప్పుడు అంతకన్నా తక్కువ సమయంలో పూర్తి చేస్తే మరో రికార్డు స్థాపించవచ్చు. పోటీ మొదలైంది. అందరూ వాయువేగంతో కదిలారు. వింటి నుంచి సంధించిన బాణంలా జ్యోతి దూసుకుపోతోంది. హర్డిల్స్ మీదుగా లంఘిస్తూ గాలిలో పక్షిలా సాగుతోంది. కాని 6వ హర్డిల్‌కు వచ్చేసరికి తడి వల్ల కొద్దిగా రిథమ్ తప్పింది. వెంటనే సర్దుకుని పోటీని 13.09 సెకన్లలో పూర్తి చేసి మొదటిస్థానంలో నిలిచింది. 50 ఏళ్లుగా సాగుతున్న ఆసియా అథ్లెటిక్స్‌లో 100 మీటర్ల హర్డిల్స్‌లో తొలి స్వర్ణపతకం సాధించిన ఘనమైన రికార్డు ఇప్పుడు జ్యోతి వశమైంది. బుడాపెస్ట్‌లో జరగనున్న ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఎంపికైంది. అక్కడ ప్రతిభ చూపి ఆ తర్వాత పారిస్ ఒలింపిక్స్‌కు క్వాలిఫై కావడం కోసం ఇదే 100 మీటర్ల హర్డిల్స్‌ను 12.77 సెకన్లలో పూర్తి చేయగలిగితే చాలు ఆ పోటీల్లో పాల్గొని ఒలింపిక్స్ విజేతగా నిలిచే అవకాశం కూడా ఉంటుంది. అందుకే క్రీడాభిమానులు ఆమెపై ఆశలు పెట్టుకున్నారు. ఆమెను హర్షధ్వానాలతో ప్రోత్సహిస్తున్నారు.





● కుటుంబ సభ్యులతో జ్యోతి

సెక్యూరిటీ గార్డు కూతురు

జ్యోతి యర్రాజీ విశాఖ పోర్ట్ స్కూల్‌లో చదువుకుంది. ఆటలు తెలిసిన కుటుంబం కాదు. తండ్రి సూర్యనారాయణ సెక్యూరిటీ గార్డ్. తల్లి ఒక ప్రయివేటు ఆస్పత్రిలో ఆయాగా పని చేసేది. వారిరువురికీ కుమార్తెను చదివించడమే ఎక్కువ. స్పోర్ట్స్‌లో ప్రవేశపెట్టడం కష్టం. కాని జ్యోతి డ్రిల్ పీరియడ్‌లో తోటి పిల్లలతో పరుగెత్తేది. పాఠశాలకు చేరువలోనే విశాఖ పోర్ట్ స్టేడియం ఉండటంతో అక్కడ సీనియర్ అథ్లెట్ల ప్రాక్టీస్‌ను పరిశీలించడం దినచర్యగా చేసుకుంది. తొలుత సబ్ జూనియర్ స్థాయిలో అంతర పాఠశాలల అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొనేది. 2015 రాష్ట్రస్థాయి పోటీల్లో పసిడి పతకం సాధించడంతో తోటి అథ్లెట్ల సలహాతో హైదరాబాద్‌లోని స్పోర్ట్స్ హాస్టల్‌లో కోచ్ రమేష్ వద్ద శిక్షణ పొందింది. ఆమె ఆర్థిక స్థితి చూసి ఊరు వెళ్లాలంటే రమేషే డబ్బు ఇచ్చేవారు. అలాగే ఆమె సీనియర్ కర్నాటపు సౌజన్య (అప్పట్లో సికింద్రాబాద్–లింగంపల్లి రూట్ టి.సిగా పని చేసేది) కూడా ఆర్థికంగా సాయం చేసేది. జూనియర్ స్థాయి వరకే అక్కడ సదుపాయం ఉండటంతో సీనియర్స్ స్థాయిలో గుంటూరులోని అథ్లెటిక్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీకి వచ్చింది. విదేశీ కోచ్‌ల ప్రోత్సాహం దక్కడంతో నేషనల్స్ మెడల్ సాధించగలిగినా సెంటర్ కొనసాగకపోవడంతో అన్వేషణ తిరిగి మొదలైంది.

మలుపుతిప్పిన భువనేశ్వర్

అయితే జ్యోతి ప్రతిభ జాతీయ స్థాయిలో తెలియడం వల్ల 2019లో రిలయన్స్ ఆధ్వర్యంలో ఒడిశాలోని భువనేశ్వర్‌లో నడిచే అథ్లెటిక్స్ హై–పెర్ఫార్మెన్స్ సెంటర్ నుంచి ఆమెకు పిలుపు వచ్చింది. 5.9 అడుగుల ఎత్తు, పొడుగు కాళ్లు ఉన్న జ్యోతికి వంద మీటర్ల పరుగుతో పాటు హర్డిల్స్‌లో కూడా శిక్షణనివ్వడం మొదలుపెట్టాడు ఇంగ్లండ్ నుంచి వచ్చిన కోచ్ జేమ్స్ హిల్లర్. దాంతో కర్ణాటకలో జరిగిన ఆల్ ఇండియా ఇంటర్–యూనివర్సిటీ అథ్లెటిక్స్ మీట్‌లో 100 మీటర్ల హర్డిల్స్‌ను 13.03 సెకన్లతో పూర్తి చేసి స్వర్ణం గెలుచుకుంది జ్యోతి. 2020 ఫిబ్రవరిలో జరిగిన ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో మరో స్వర్ణం వచ్చింది. 2022 సెప్టెంబర్‌లో గుజరాత్‌లో జరిగిన జాతీయ పోటీల్లో 12.79 సెకన్లతో రికార్డు స్థాపించింది. ఇప్పుడు బ్యాంకాక్ ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 'ఫాస్టెస్ట్ ఆసియన్ ఉమెన్ ఇన్ హండ్రెడ్ మీటర్స్ హర్డిల్స్' రికార్డు స్థాపించింది. ఆమెకు జాతీయ క్రీడల మంత్రి అనురాగ్ ఠాకూర్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, రిలయన్స్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ నీతా అంబానీ అభినందనలు తెలియచేశారు.

– డాక్టర్ మాడిమి సూర్యప్రకాశరావు,
సాక్షి విశాఖ స్పోర్ట్స్

● గెలుపు దారి

బుడి బుడి నడకల నుంచి సూపర్ స్పీడ్ వరకు...



తన బృందంతో అనుశ్రీ గోయెంకా



● అనుశ్రీ

కొన్ని సంవత్సరాల క్రితం... స్టాన్‌ఫోర్డ్(యూఎస్)లో యూత్ ఫెయిల్యూర్ స్టార్టప్‌ల గురించి పాల్ గ్రహమ్ విశ్లేషణాత్మకమైన ప్రసంగం ఇచ్చాడు. 'స్టార్టప్‌కు సంబంధించిన సమస్త విషయాలపై దృష్టి పెడుతున్నారు. ప్రజలు బాగా కోరుకునేది ఏమిటి అనే కీలకమైన విషయాన్ని మాత్రం మరిచిపోతున్నారు' పాల్ గ్రహమ్ అన్నప్పుడు హాల్‌లో చప్పట్లు మారుమోగాయి.

ఆ ప్రేక్షకులలో అనుశ్రీ గోయెంకా ఉంది.

అనుశ్రీకి గ్రహమ్ ఉపన్యాసం ఎంతో స్ఫూర్తిని ఇచ్చింది.

అహ్మదాబాద్‌లో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ చేసిన అనుశ్రీ మానిటర్ గ్రూప్‌లో కన్సల్టెంట్‌గా అయిదు సంవత్సరాలు పనిచేసింది. ఆ తరువాత స్క్రోల్ మీడియా, స్విగ్గీలో పని చేసింది. ఉద్యోగం యాంత్రికం అనిపించిందో, ఇంతకంటే చేయడానికి ఏం లేదు.. అనే నిర్లిప్తత ఆవహించిందో తెలియదు కానీ చేస్తున్న ఉద్యోగాన్ని వదిలి కొత్త దారిలోకి వచ్చింది.

'వ్యాపారంపై నా ముద్ర ఉండాలి. అది నాకు సంతోషం కలిగించేలా ఉండాలి' అనుకుంటూ రంగంలోకి దిగింది అనుశ్రీ.

పది సంవత్సరాలు కార్పొరేట్ ప్రపంచంలో పనిచేసిన అనుశ్రీ గ్రహమ్ ప్రసంగాన్ని పదేపదే గుర్తు తెచ్చుకుంటూ బెంగళూరు కేంద్రంగా 'స్పార్క్ స్టూడియో'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రయాణం మొదలుపెట్టింది. 'స్పార్క్ స్టూడియో' అనేది పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఎక్‌స్ట్రా కరిక్యులర్ లెర్నింగ్ అండ్ కమ్యూనికేషన్ ప్లాట్‌ఫామ్.

మొదట 'స్పార్క్ స్టూడియో' ఐడియాను శ్రేయోభిలాషులు, ఇండస్ట్రీ ఎనలిస్ట్‌లకు చెప్పినప్పుడు– 'సక్సెస్ కావడం కష్టం' అంటూ ఎన్నో కారణాలు చెప్పారు.

అయినా వెనకడుగు వేయలేదు అనుశ్రీ.

'మన దేశంలో హై–క్వాలిటీ ఆర్ట్స్, లిబరల్ ఎడ్యుకేషన్‌కు కొరత ఉంది' తాను తరచుగా విన్న మాట 'స్పార్క్ స్టూడియో'కు శ్రీకారం చుట్టడానికి కారణం అయింది. పిల్లలకు ఆన్‌లైన్ బోధన చేయడానికి 'స్పార్క్ స్టూడియో' ద్వారా దేశవ్యాప్తంగా పేరున్న పెయింటర్‌లు, మ్యూజిషియన్‌లు, ఇతర ఆర్టిస్ట్‌లను ఒకే వేదిక మీదికి తీసుకు వచ్చింది అనుశ్రీ.

'స్పార్క్ స్టూడియో' ప్రారంభమైన కొద్ది నెలల తరువాత...

'ఎక్‌స్ట్రా కరిక్యులర్ మార్కెట్‌లో విపరీతమైన పోటీ ఉంది. మీరు చాలా ఆలస్యంగా దీనిలోకి అడుగు పెట్టారు. ఇప్పటికే ఎంతోమంది సక్సెస్ సాధించారు. ఇప్పుడు మీరు కొత్తగా వచ్చి చేసేదేమిటి?' ఇలాంటి కామెంట్స్ ఎన్నో వినిపించాయి.

'వంద వ్యాపారాల్లో నీదొకటి అయినప్పుడు దానిపై నీదైన ముద్ర, శైలి ఉండాలి' అని గ్రహమ్ చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. తన స్నేహితులైన కౌస్తుబ్ ఖడే, జ్యోతిక సహజనందన్, నమిత గోయెంకాలతో ఒక టీమ్‌గా ఏర్పడింది అనుశ్రీ.

'నేను బాగా పేరున్న స్కూల్‌లో చదువుకున్నాను. అయితే హై–క్వాలిటీ ఆర్ట్స్ కరికులమ్‌కు అక్కడ చోటు లేదు. స్పార్క్ స్టూడియో ద్వారా విద్యార్థులకు ఉపయోగపడే నిర్మాణాత్మకమైన కరికులమ్‌ను డిజైన్ చేశాము. పిల్లలు యానిమేషన్, మ్యూజిక్, ఫొటోగ్రఫీ...ఎన్నో నేర్చుకోవచ్చు. తమ పిల్లలు ఎన్నో కళలు నేర్చుకోవచ్చు అనే ఆలోచన తల్లిదండ్రులకు బాగా నచ్చింది. ఆర్ట్స్, మ్యూజిక్ ద్వారా పిల్లల్లో భాషా నైపుణ్యం, జ్ఞాపకశక్తి పెరుగుతుంది అని ఎంత నచ్చజెప్పినా, వారు డబ్బు ఖర్చు చేయడానికి సిద్ధంగా లేకపోవడం అసలు సమస్య. మార్కెట్ అంటే ఇదే అనే విషయం ఆలస్యంగా అర్థమైంది. ఇలా ఎన్నో విలువైన పాఠాలు నేర్చుకున్నాను' అంటుంది అనుశ్రీ.

రెండు సంవత్సరాల 'స్పార్క్ స్టూడియో' ప్రయాణం లాభాలు లేవు, నష్టాలు లేవు అన్నట్లుగా ఉండేది. అప్పటికే కొన్ని ప్రసిద్ధ ఎక్‌స్ట్రాకరిక్యులర్ ఎడ్‌టెక్ స్టార్టప్‌లు మూత పడ్డాయి. ఈ నేపథ్యంలో 'ఏం మిస్ అవుతున్నాం' అంటూ ఆలోచిస్తున్న సమయంలో అనుశ్రీకి తట్టిన ఐడియా....పబ్లిక్ స్పీకింగ్ కోర్స్, ఇంగ్లిష్ కమ్యూనికేషన్. ఈ రెండు అంశాలు చేర్చడంతో అప్పటి వరకు బుడి బుడి నడకల 'స్పార్క్ స్టూడియో' వేగం పుంజుకుంది.

సక్సెస్‌ఫుల స్టార్టప్‌గా నిలిచింది.

'నమ్మకమే వెన్నెముకగా ఉన్న వ్యాపారం ఇది. నమ్మకాన్ని డబ్బుతో కొనలేము. కష్టపడి సంపాదించుకోవాలి' అంటుంది అనుశ్రీ గోయెంక.

సక్సెస్ అనేది రాత్రికి రాత్రి వచ్చేది కాదు. నిద్రలేని రాత్రులు ఎన్నో గడపాల్సి ఉంటుంది. తీసుకున్న నిర్ణయాలను పునఃసమీక్షించుకోవాల్సి ఉంటుంది.

ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ, విజయం కోసం ఎదురు చూస్తూ ఏఐ ఇంగ్లిష్ ట్యూటర్ స్టార్టప్ 'స్పార్క్ స్టూడియో' ద్వారా ఘన విజయం సాధించింది అనుశ్రీ గోయల్...

> నమ్మకమే వెన్నెముకగా ఉన్న వ్యాపారం ఇది. నమ్మకాన్ని డబ్బుతో కొనలేము. కష్టపడి సంపాదించుకోవాలి.
> – అనుశ్రీ గోయెంకా

కిచెన్ టిప్స్

● కాయగూరలు తరిగే చెక్కని నిమ్మచెక్కతో రుద్ది కాసేపయ్యాక కడిగేయండి. మరకలు పోతాయి. ఎప్పుడైనా దానిపై మాంసం కోసినా.. నిమ్మచెక్కతో రుద్దాలి. క్రిములు వృద్ధి చెందకుండా ఉంటాయి ● నిమ్మచెక్కలని సన్నగా తరిగి కాసిని నీళ్లలో వేసి ఆ పాత్రని మైక్రో ఓవెన్‌లో కొన్ని నిమిషాలు ఉంచి తీసేయండి. అలా చేస్తే దుర్వాసనలు తొలగిపోవడంతో పాటూ లోపల పడి ఉన్న పదార్థాలని శుభ్రం చేయడం కూడా తేలికవుతుంది ● ఫ్రిజ్‌లో ఓ మూలగా నిమ్మచెక్కని పెట్టి చూడండి. అందులోంచి వచ్చే దుర్వాసనలు పోతాయి. ● స్టీలు కుళాయిలపై నీటిమరకలు పడుతుంటాయి. అవి తెల్లగా మారాలంటే వాటిని నిమ్మచెక్కతో రుద్ది కడిగితే చాలు.



బ్యూటిప్

అరటి తొక్కతో సహా పండుని ముక్కలుగా తరిగి పేస్టు చేయాలి. ఈ పేస్టుకు రెండు టీస్పూన్ల పచ్చి పాలు పోసి మరోసారి గ్రైండ్ చేసి పదిహేను నిమిషాలు రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి. తరువాత ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు పూతలా వేసుకుని, ఇరవై నిమిషాలు ఆరాక కడిగేయాలి. అరటి పండులో ఉన్న విటమిన్ బి 6, బి12, ప్రోటీన్, ఫైబర్, మెగ్నీషియం, పొటాషియం చర్మానికి పోషణ అందించి ఆరోగ్యంగా ఉంచుతాయి. ఈ ప్యాక్‌ను వారానికి రెండుసార్లు వేసుకోవడం వల్ల ముఖ చర్మం నిగారింపుని సంతరించుకుంటుంది.







చినుకుల్లోనూ చింత ఉండదిక

ఈ ఆహారం తింటే...

నిన్న మొన్నటి దాకా చెమటలు పట్టించిన ఎండలు కాస్తా ఇప్పుడు మబ్బుల వెనక దాక్కుని, వానలు కురిపిస్తున్నాయి. వానలు ఆహ్లాదం గానే ఉంటాయి. అయితే సరైన జాగ్రత్తలు తీసు కోకపోతే వ్యాధులను కూడా వెంట మోసు కొస్తాయి. ఈ అనారోగ్యాలతో పోరాడ టానికి. రోగనిరోధకశక్తి బలంగా ఉండటం చాలా ముఖ్యం. వర్షాకాలంలో వ్యాధి నిరోధక శక్తిని మరింత పెంచుకోవడానికి నిత్యం తీసుకునే ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవడం అవసరం. ఆ మార్పులేమిటో, ఈ సీజన్‌లో ఏ ఆహారం తీసుకుంటే మంచిదో చూద్దాం...



ముసురు పట్టినప్పుడు వేడి వేడి టీ, కాఫీలు తాగుతుంటారు. అయితే వాటికి బదులు గ్రీన్ టీ, బ్లాక్ టీ, హెర్బల్ టీ వంటివి తీసుకోవాలి. దాంతోపాటు అల్లం, మిరియాలు, తేనెతో తయారు చేసిన టీ సేవిస్తే.. ఆరోగ్యానికి చాలా మంచిది. అదేవిధంగా బజ్జీలు, పునుగులు, బోండాలకు బదులు వేడి వేడి ఉగ్గాణి, సెనగ, పెసర గుగ్గిళ్లు, చుడువా, సగ్గుబియ్యం కిచిడీ మంచిది. పుదీనా, తులసి ఆకుల్లో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ గుణాలు అధి కంగా ఉంటాయి కాబట్టి వీటితో కషాయం కాచుకుని తాగితే మంచిది. రాగులు, సోయా బీన్స్, పెసలు, మొక్కజొన్న వంటి పప్పుధాన్యాలను ఆహారంలో భాగంగా చేసుకుంటే ఎలాంటి అనారోగ్య సమస్యలూ దరిచేరవు. వీటితోపాటు పోషక విలువలు ఎక్కువగా ఉండే కూరగాయలు, పండ్లు అంటే దానిమ్మ, ఆపిల్, స్ట్రాబెర్రీ, అరటి, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, బచ్చలి కూర వంటివి తీసుకుంటే మంచిది.



అల్లం: ఇది శరీర కణ జాలాలకు పోషకాలను సమీకరించడానికి, సరఫరా చేయడానికి తోడ్పడుతుంది. ఈ రోజుల్లో జలుబు, దగ్గు వంటి సమస్యలు సర్వసాధారణం. అల్లం కఫాన్ని తగ్గిస్తుంది కాబట్టి అల్లం టీ తాగితే జలుబు, దగ్గు దూరం అవుతాయి. ఫ్లూతో పోరాడటానికి అల్లం తోడ్పడుతుంది. అల్లంలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు రోగనిరోధక శక్తినీ మెరుగుపరుస్తాయి. టీలు, సూప్‌లు, కూరల్లో అల్లాన్ని ఎక్కువ ఉపయోగిస్తే వ్యాధి నిరోధక తను పెంచుకోవచ్చు.



నేరేడు పండు... ఈ పండులో ఉండే విటమిన్ సి, యాంటీ ఆక్సి డెంట్లు, ఖనిజాలూ ఫైటోకెమికల్సూ రోగనిరో ధక శక్తిని మెరుగుపరుస్తాయి. నేరేడులో క్యాల రీలు తక్కువ. వానాకాలంలో వచ్చే అతిసార, కలరా వ్యాధులతో పాటు ఇతరత్రా ఇన్ఫెక్షన్లకీ నేరేడు ఔషధంలా పనిచేస్తుంది.

తులసి... ఈ కాలంలో రోజూ తులసి ఆకులను నమలడం ద్వారా అనారోగ్యాల నుంచి రక్షణ పొందవచ్చు. ఐదు తులసి ఆకు లను రాత్రంతా నీటిలో నానబెట్టి.. మరుసటి రోజు ఉదయం పరగడుపునే ఆ ఆకులు తిని.. నీటిని తాగాలి. తులసి రోగనిరో ధక వ్యవస్థను బూస్ట్ చేస్తుంది.



నిమ్మ... నిమ్మరసంలో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. ఇది శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేసి రోగనిరో ధక శక్తిని పెంపొందిస్తుంది. అంతేకాదు, శరీ రంలో తెల్ల రక్త కణాల ఉత్పత్తిని పెంచు తుంది. ఇది ఇన్ఫెక్షన్లు, అంటువ్యాధుల నుంచి శరీరాన్ని రక్షిస్తుంది.

మిరియాలు... నల్ల మిరియాలలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో సహాయ పడతాయి. జీవక్రియలను పెంచు తాయి. దగ్గు, గొంతు నొప్పి ఉన్నట్లయితే నల్ల మిరియాలను పొడి చేసి నిద్రవేళకు ముందు వేడి పాలలో కలుపుకొని తాగితే ఆరోగ్యానికి చాలా మంచిది.



పసుపు... పసుపులో యాంటీ బాక్టీరి యల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సి డెంట్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరాన్ని అనేక వ్యాధుల నుంచి రక్షించడంలో సహా యపడతాయి. రోజూ రాత్రిపూట చిటికెడు పసుపు కలిపిన వేడి పాలు తాగితే రోగనిరోధక శక్తి పెరుగు తుంది.

వీటికి దూరంగా ఉండటం మేలు!

రోగనిరోధక శక్తిని బలోపేతం చేయాలంటే చక్కెర పదార్థాలకి దూరంగా ఉండాలి. ముఖ్యంగా ఐస్ క్రీం, కేక్, క్యాండీ, చాక్లెట్, కూల్‌డ్రింక్స్ తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి తగ్గుతుంది. అలాగే ఉప్పు ఎక్కువగా ఉండే ఆహారాలు ఆరోగ్యానికి చాలా హాని కలిగిస్తాయి. రోగనిరోధక శక్తిని బలహీనప రుస్తాయి. చాలామంది ప్యాక్ చేసిన ఆహా రాలని తినడానికి ఎక్కువగా ఇష్టపడు తారు. కానీ ఇవి ఆరోగ్యానికి మంచివి కావు. అధిక ఉప్పు ఆటో ఇమ్యూన్ వ్యాధి ప్రమాదాన్ని పెంచుతుంది. అలాగే ఆల్క హాల్, ధూమపానం కూడా శరీరాన్ని బల హీనంగా మారుస్తాయి. అందుకే వీటికి వీలైనంత దూరంగా ఉంటే మేలు.



దాల్చిన చెక్క... అద్భుత ఔషధ గుణాలెన్నో దాగి ఉన్న దాల్చిన చెక్క మధుమేహులకు రక్తంలో చక్కెర శాతాన్ని తగ్గిస్తుంది. రోజూ గ్లాసు పాలలో దాల్చిన చెక్క పొడి కలుపుకొని తాగితే రోగనిరో ధక శక్తి పెరుగుతుంది. అంతేకాదు, శరీరంలో ఉండే కొవ్వు శాతాన్ని తగ్గించే గుణం దీనిలో ఇమిడి ఉంది.



లవంగం... ఇది రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి పనిచేస్తుంది. వర్షాకాలంలో లవం గాలను తీసుకుంటే గొంతు నొప్పి వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు.

దిండు లేకుండా పడుకోలేరా?

రాత్రిపూట నిద్రించేటప్పుడు చాలా మంది తలకింద దిండు పెట్టుకొని పడుకుంటారు. అయితే తక్కువ ఎత్తు ఉన్న దిండు ఫరవాలేదు కానీ, పెద్ద దిండు పెట్టుకో వడం వల్ల చాలా ఆరోగ్య సమస్యలు ఏర్పడు తాయి. ఇది మొదట్లో తెలియదు కానీ కొన్ని రోజులు గడిచిన తర్వాత ముందుగా మెడ నొప్పి ఎదురవుతుంది. ఈ నొప్పి దీర్ఘకాలికంగా వేధిస్తుంది. కొంతమందికి ఉదయం నిద్రలేవగానే వెన్నులో నొప్పితో బాధపడతారు. మీకు ఇలాంటి సమస్య ఎదురైతే పడుకునేటప్పుడు మీరు ఎత్తయిన దిండు ఉపయోగి స్తున్నట్లు లెక్క. దీనివల్ల వెన్నెముక వంగిపోతుంది. డిస్క్‌లలో దూరం పెరిగి వెన్నునొప్పి వస్తుంది. అందువల్ల దిండు లేకుండా నిద్రించడం అలవాటు చేసుకో వాలి.



తలలో రక్త ప్రసరణ జరగదు: ఎత్తయిన దిండు పెట్టుకొని నిద్రపోతే తలకి రక్త సర ఫరా సరిగ్గా జరగదు. రాత్రిపూట చాలా గంటలు ఇలాగే ఉండటం వల్ల రక్త సరఫరా లేక జుట్టుకు సరైన పోషణ లభించదు. దీనివల్ల జుట్టు రాలే సమస్య మొదలవుతుంది. అంతేకాదు, తరచు తలనొప్పి వస్తుంది. లావుపాటి దిండు పెట్టుకొని నిద్రించడం వల్ల శరీరంలోని కొన్ని భాగాలకి రక్త సరఫరా సరిగ్గా అందక తిమ్మిర్ల సమస్యలు ఏర్పడుతాయి. అందువల్ల మెడనొప్పి ఉండకూడదంటే తక్కువ ఎత్తు ఉండే చిన్న దిండుని ఉపయోగించాలి లేదంటే మెత్తటి టవల్ లేదా పలుచటి దుప్పటిని మడత పెట్టి తలకింద పెట్టుకోవడం ఉత్తమం.

బడికి వెళ్లనని మారాం చేస్తున్నారా?

ఉదయాన్నే పిల్లల్ని తయారు చేసి స్కూలుకు పంపించడం పేరెంట్స్‌కు పెద్దపని. ఇంతకంటే వాళ్లను నిద్రలేపడం అతిపెద్ద టాస్క్. ఎంత లేపినా నిద్ర లేవరు. కింద స్కూల్ ఆటోనో, బస్సో వచ్చి హారన్ కొడుతుంటుంది. కానీ వీళ్లు లేవరు. వీళ్లను తొందరగా నిద్ర లేపాలంటే ఇలా ప్రయత్నించి చూడండి....



సమస్యను అర్థం చేసుకోవాలి
ముందుగా నిద్ర లేవడానికి ఏమైనా ఇబ్బంది పడుతు న్నారేమో గమనించాలి. రాత్రి సరిగా పడుకున్నారా లేదా... అసలు నిద్రపట్టలేదా... ఇంకేదైనా సమస్య ఉంటే అనునయంగా అడిగి తెలుసుకోవాలి.

సరిపోయిందా లేదా?
స్కూలుకెళ్లే పిల్లలు కనీసం పది గంటలు నిద్రపోవాలి. గేమ్స్, ఫోన్లు చూస్తూ సరిగా పడుకోరు. రోజూ ఒక నిర్దేశిత సమయాన్ని కేటాయించి వాళ్లు కచ్చితంగా పడుకునేలా చేయాలి.

ప్రేమతో లేపాలి
ఉదయం ఎంత ఉత్సాహంగా లేస్తే రోజంతా అలానే గడు స్తుంది. అందుకే పిల్లలు త్వరగా లేవకపోయినా ప్రేమగా నిద్రలేపాలి. పిల్లలకు అర్థమయ్యే ప్రేమ భాషలోనే నిద్ర లేపాలి. ఇందుకోసం వాళ్లకు నచ్చే మంచి విషయాలు, స్కూలుకు వెళ్లడం ఎంతముఖ్యమో ప్రేమతో చెప్పాలి.

ఇష్టమైన ఫుడ్
పిల్లలు ఇష్టంగా తినే ఆహారాన్ని బ్రేక్‌ఫాస్ట్‌లో ఇవ్వాలి. అది తినడం కోసం అయినా త్వరగా నిద్ర లేస్తారు. ఈ నాలుగు చిట్కాలు ప్రయత్నిస్తే మీ సమస్య తీరినట్టే.

హెల్త్ టిప్స్

మందారం ఆకుల్ని నూరి షాంపూగా వాడితే జుత్తు బాగా పెరుగుతుంది. చుండ్రు నివారణలోనూ, తెల్ల వెంట్రు కల నిరోధకంలోనూ సాయమవు తుంది. కప్పు నీటిలో ఒక మందార పువ్వు వేసి మరిగించి ఆ నీళ్లను తాగితే రక్తంలో ఐరన్ పెరు గుతుంది.

కరివేపాకులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్క లంగా ఉంటాయి. ఓ 10 ఆకులతో పేస్ట్ తయారు చేసి మజ్జిగలో కలిపేసు కుని రోజూ తాగితే కాలేయం వ్యర్థపదా ర్థాల నుంచి రక్షణ పొందుతుంది. రోజూ ఓ 8 ఆకుల్ని మిరియాలతో కలిపి తింటే ముక్కులో వచ్చే అలర్జీలు తగ్గిపోతాయి.

రోజూ రెండు మూడు పుదీనా ఆకుల్ని నమిలి మింగుతుంటే జీర్ణశక్తి పెరిగి, కడుపు ఉబ్బరం, తేన్పులు తగ్గుతాయి. శ్వాసకోశాల శక్తి పెరుగుతుంది.

వేపాకు, యాంటీ సెప్టిక్‌గానూ, క్రిమి సంహారిణి గానూ బాగా పనిచేస్తుంది. వేపాకు పొడిని నీళ్లల్లో కలిపి చల్లితే ఎన్నో రకాల క్రిమి కీటకాలు దూరంగా వెళ్లిపోతాయి. వేపా కుల్ని నీటిలో వేసి మరిగించి స్ప్రే చేస్తే దోమల బెడద తప్పుతుంది. వేపాకు పొడిని పేస్ట్‌గా చేసి వాడితే పలు రకాల చర్మ సమస్యలు, మొటిమలు, ఎగ్జిమాల బాధలు తప్పుతాయి.

పసుపును పేస్ట్‌గా రోజూ ముఖానికి వాడితే, ముఖం మీద ఉండే సన్నని వెంట్రుకలు రాలిపో తాయి. అలాగే మొటిమలు, మచ్చలు కూడా మాయమవుతాయి. ఇది గొప్ప యాంటీ ఆక్సిడెంటు కాబట్టి రోజు మొత్తంలో ఒక టీ స్పూను దాకా కడుపులోకి తీసుకోవచ్చు.

సినిమా

అంతం ఆరంభమవుతుంది!


● ప్రభాస్

వెండితెరపై ప్రభాస్ కల్కి అవతారం ఎత్తారు. ప్రభాస్, కమల్‌హాసన్, అమితాబ్ బచ్చన్, దీపికా పదుకోన్, దిశా పటానీ ముఖ్య తారలుగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో 'ప్రాజెక్ట్ కె' వర్కింగ్ టైటిల్‌తో ఓ సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ రూపొందుతున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం అమెరికాలో జరుగుతున్న 'శాన్ డియాగో కామిక్ కాన్ – 2023' వేడుకలో ఈ సినిమాకు 'కల్కి 2898 ఏడీ' టైటిల్‌ను ఖరారు చేసినట్లు శుక్రవారం వెల్లడించి, గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేశారు. 'ప్రపంచాన్ని చీకటి కమ్మేసినప్పుడు ఒక శక్తి ఉద్భవిస్తుంది. అప్పుడు అంతం ఆరంభం అవుతుంది' అన్నట్లుగా ఈ వీడియోలో ఉంది. ఈ వేడుకలో కమల్‌హాసన్ మాట్లాడుతూ– ''మేం స్టోరీలు చేస్తుంటే వారు (ఆడియన్స్) మమ్మల్ని స్టార్స్ చేస్తున్నారు. 'కల్కి 2898 ఏడీ'లో పెద్ద విజన్ ఉంది. ఈ సినిమాలో భాగం కావడం గౌరవంగా ఉంది'' అన్నారు. ''ఈ సినిమాలో నాగ్ అశ్విన్ నా క్యారెక్టర్‌ను డిజైన్ చేసిన తీరు బాగా నచ్చింది. సినిమాలో స్ట్రాంగ్ ఎమోషన్స్ ఉన్నాయి'' అన్నారు ప్రభాస్. ''ఈ సినిమా నాకో అద్భుతమైన అనుభవం. దీని వెనక గొప్ప పరిశోధన ఉంది'' అని వర్చ్యువల్‌గా అమితాబ్ బచ్చన్ మాట్లాడారు. ''నేను సైన్స్ ఫిక్షన్, పురాణాలను ఇష్టపడతాను. మహా భారతం, స్టార్ వార్స్... రెండింటినీ చూస్తూ, వింటూ పెరిగాను. ఈ రెండు ప్రపంచా లను కలిపే ఒక గొప్ప సినిమా చేయాలనుకున్నప్పుడు 'కల్కి 2898 ఏడీ' పుట్టింది'' అన్నారు నాగ్ అశ్విన్. ''ఈ సినిమా మాకు గర్వ కారణం'' అన్నారు నిర్మాత అశ్వనీదత్. ఈ వేడుకలో రానా, ప్రియాంకా దత్, స్వప్నా దత్ పాల్గొన్నారు. 'కల్కి 2898 ఏడీ'ను 2024 జనవరి 12న రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

రామ్‌చరణ్‌తో కలిసి నటిస్తా: ప్రభాస్

రామ్‌చరణ్‌తో కలిసి నటిస్తానని ప్రభాస్ 'కామిక్ కాన్-2023' వేడుకల్లో చెప్పారు. ఈ వేడుకల్లో 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమా ప్రస్తావన రాగా... ''భారతదేశంలో ఉన్న అద్భుతమైన దర్శకుల్లో రాజమౌళి గారు ఒకరు. 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమాలోని పాటకు ఆస్కార్ రావడం నాకు చాలా సంతోషంగా అనిపించింది. అది దేశ ప్రజలందరికీ దక్కిన గౌరవంగా భావించాం. అలాగే రామ్‌చరణ్ నాకు మంచి మిత్రుడు. ఏదో ఒక రోజు మేం కచ్చితంగా కలిసి సినిమా చేస్తాం'' అని చెప్పుకొచ్చారు ప్రభాస్.


● చిరంజీవి, తమన్నా

మిల్కీ బ్యూటీ... నువ్వే నా స్వీటీ

'అచ్చ తెలుగు పచ్చి మిర్చి మగాడు వీడే.. బొంబాటు ఘాటు హాటు హాటుగున్నాడే.. కల్లోకి వచ్చేసి కన్నెగుండెల్లో సూది గుచ్చి పిల్లా నీ ముచ్చటేంది అన్నాడే...' అంటూ రొమాంటిక్ మోడ్‌లోకి వెళ్లిపోయారు హీరోయిన్ తమన్నా. చిరంజీవి టైటిల్ రోల్‌లో నటించిన తాజా చిత్రం 'భోళా శంకర్'. ఈ చిత్రంలో చిరంజీవి సరసన తమన్నా నటించగా, ఆయన చెల్లెలి పాత్రలో కీర్తీ సురేష్ నటించారు. మెహర్ రమేష్ దర్శకత్వంలో అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 11న విడుదల కానుంది. ఈ చిత్రంలోని 'మిల్కీ బ్యూటీ.. నువ్వే నా స్వీటీ..' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను శుక్రవారం విడుదల చేశారు. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటను విజయ్ ప్రకాష్, సంజన కల్మంజేతో కలసి ఈ చిత్ర సంగీతదర్శకుడు మహతి స్వర సాగర్ ఆలపించారు.


● సుదీప్, అమలాపాల్

యాక్షన్ హెబ్బులి

సుదీప్, అమలా పాల్ జంటగా ఎస్. కృష్ణ దర్శకత్వంలో రూపొందిన కన్నడ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ 'హెబ్బులి'. ఈ సినిమాను అదే టైటిల్‌తో సి. సుబ్రహ్మణ్యం ఆగస్టు 4న తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లా డుతూ– ''ఫ్యామిలీ ఎమోషన్స్, యాక్షన్, రొమాంటిక్ సీన్స్ మిళితమై ఉన్న పక్కా కమర్షియల్ ఫిల్మ్ 'హెబ్బులి'. కన్నడంలో రూ. 100 కోట్లు సాధించింది. తెలుగులోనూ హిట్ అవు తుందనే నమ్మకం ఉంది'' అన్నారు.


● వైష్ణవ్ తేజ్


● మహేశ్‌బాబు


● టొవినో థామస్

కిక్... పంచ్...

విలన్ ముఖం మీద హీరో పంచ్ ఇవ్వాలా? కాలితో ఒక్క కిక్ కొట్టాలా? గాల్లో ఎగిరి పల్టీలు కొట్టి మరీ విలన్‌ని కొట్టాలా? ఇవన్నీ చేయాలంటే కాస్త ట్రైనింగ్ కావాలి. రెగ్యులర్ ఫైట్స్‌కి అయితే అక్కర్లేదు. బీభత్సమైన ఫైట్స్‌కి అయితే శిక్షణ తీసుకోవాల్సిందే. అది హీరో అయినా హీరోయిన్ అయినా. ఈ మధ్య రిస్కీ రోల్స్ ఒప్పుకున్న కొందరు స్టార్స్ 'మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్' నేర్చుకోవడానికి ప్రిపేర్ అయ్యారు. కిక్ బాక్సింగ్, కరాటే, కుంగ్ ఫూ, జూడో, కలరి పయట్టు వంటివన్నీ మార్షల్ ఆర్ట్స్ కిందే వస్తాయి. ఫైట్‌కి సూట్ అయ్యే ఆర్ట్ నేర్చుకుని బరిలోకి దిగనున్న స్టార్స్ గురించి తెలుసుకుందాం.

మూడు నెలలు బ్యాంకాక్‌లో...
హీరో మహేశ్‌బాబు– డైరెక్టర్ రాజమౌళి కాంబినేషన్‌లో ఓ భారీ చిత్రం రూపొందనున్న విషయం తెలిసిందే. ఆఫ్రికన్ అడవుల నేపథ్యంలో జరిగే ఈ కథలో భారీ యాక్షన్ సన్నివే శాలు ఉంటాయట. పోరాట సన్నివే శాలు సహజంగా ఉండేందుకు కెరీర్‌లో తొలిసారి ఈ సినిమా కోసం మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోనున్నారట మహేశ్ బాబు. ఇందుకోసం మూడు నెలల పాటు బ్యాంకాక్ వెళతారని టాక్. అక్కడ మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ ట్రైనింగ్, హైకింగ్, ట్రెక్కింగ్ వంటివి నేర్చుకో నున్నారట. ఈ శిక్షణ ఇవ్వనున్న బ్యాంకాక్ స్టంట్ టీమ్‌కి ఓ హాలీవుడ్ ప్రముఖ స్టంట్ కొరియోగ్రాఫర్ నేతృత్వం వహిస్తారని తెలిసింది. ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వం వహి స్తున్న 'గుంటూరు కారం'లో నటిస్తున్నారు మహేశ్‌బాబు. ఈ చిత్రం పూర్తయ్యాక బ్యాంకాక్‌లో శిక్షణ తీసుకుని, రాజమౌళి సినిమా షూట్‌లో జాయిన్ అవుతారట. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్నారు రాజమౌళి. ఈ చిత్రా నికి రాజమౌళి తండ్రి విజయేంద్ర ప్రసాద్ కథ అందిస్తున్న సంగతి తెలిసిందే.


● కాజల్

థాయ్‌ల్యాండ్‌లో...
తొలి చిత్రం 'ఉప్పెన'తో (2021) బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు వైష్ణవ్ తేజ్. ఆ తర్వాత 'కొండపొలం, రంగ రంగ వైభవంగా' వంటి చిత్రాల్లో నటిం చారు. ఈ మూడు చిత్రాల్లో సాఫ్ట్ క్యారెక్టర్‌తో ప్రేక్షకులను అలరించిన ఆయన తొలిసారి 'ఆదికేశవ' చిత్రంలో ఫుల్ యాక్షన్ రోల్ చేశారు. శ్రీకాంత్ ఎన్. రెడ్డి దర్శ కత్వం వహించిన ఈ చిత్రంలో హై ఓల్టేజ్ యాక్షన్ సన్నివేశాల కోసం థాయ్‌ల్యాండ్‌లో మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసు కున్నారు వైష్ణవ్ తేజ్. ఈ చిత్రంలో వైష్ణవ్‌కు జోడీగా శ్రీలీల నటించారు. సూర్య దేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 18న రిలీజ్ కానుంది.

కలరి మార్షల్ ఆర్ట్‌లో...
మలయాళ హీరో టొవినో థామస్ కలరి అనే మార్షల్ ఆర్ట్‌లో శిక్షణ పొందారు. టొవినో థామస్ హీరోగా నటిస్తున్న చిత్రం 'అజయంతే రండం మోషణం'. జితిన్ లాల్ దర్శకత్వం వహిస్తున్నారు. కథ పరంగా కేరళలోని కలరి అనే మార్షల్ ఆర్ట్‌కు ఈ చిత్రంలో ప్రాధాన్యం ఉండటంతో టొవినో థామస్ ఈ విద్యలో శిక్షణ తీసుకుని నటిస్తున్నారు. ఈ చిత్రంలో కృతీ శెట్టి, ఐశ్వర్య రాజేష్, సురభి లక్ష్మి హీరోయిన్లుగా నటిస్తున్నారు.

భారతీయుడు కోసం...
కమల్‌హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వం వహిస్తున్న 'భారతీయుడు 2' కోసం కాజల్ అగర్వాల్ మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకున్నారు. 'భారతీయుడు' (1996) సినిమాకి సీక్వెల్‌గా 'భారతీయుడు 2' (తమిళంలో 'ఇండియన్ 2) రూపొందుతోంది. ఈ చిత్రంలో కమల్‌కు జోడీగా కాజల్ నటిస్తున్నారు. ఈ చిత్రంలో పవర్‌ఫుల్ ఫైట్స్ చేయడం కోసం అతిపురాతనమైన యుద్ధ క్రీడ కలరి పయట్టు నేర్చుకున్నారు కాజల్. కలరి సాధన చేస్తున్న ఓ వీడియోను ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేసి, 'షావోలిన్, కుంగ్ ఫూ, కరాటే, తైక్వాండో.. వంటి క్రీడలు కలరి నుంచి పుట్టుకొచ్చినవే' అని పేర్కొన్నా రామె. ఈ మూవీ కోసం గుర్రపు స్వారీ కూడా నేర్చుకున్నారు కాజల్ అగర్వాల్.

కోలీవుడ్‌లో ఫెఫ్సీ కొత్త నిబంధనలు

● సినిమా షూటింగ్‌లకు ఫెఫ్సీ కొత్త నియమాలు ● వెల్లువెత్తుతున్న విమర్శలు

దక్షిణ భారత సినీ కార్మికుల సంఘం (ఫెఫ్సీ) కొత్త నియమ, నిబంధనలు కోలీవుడ్‌లో చర్చనీయాంశమయ్యాయి. తమిళ చిత్రాలకు స్థానిక నటీనటులు, సాంకేతిక నిపుణులు మాత్రమే పని చేయాలని, తమిళ సినిమాల చిత్రీకరణలు తమిళనాడులోనే జరగా లని, సరైన కారణాలు లేనిదే అవుట్‌డోర్ లొకేషన్స్‌లో షూటింగ్ జరపకూడదని ఫెఫ్సీ కొత్త నియమాలు చేసిందని సమాచారం. అలాగే అనుకున్న సమయంలోపు సినిమా చిత్రీకరణ పూర్తి కాకపోయినా, బడ్జెట్ పరిమితి దాటినా నిర్మాతలకు సరైన కారణాలతో లిఖిత పూర్వకమైన లేఖను సమర్పించాలని, ఒకవేళ ఓ సిని మాకు దర్శకుడే రచయిత అయితే, ఆ సినిమా కథకు సంబంధించి ఏదైనా సమస్య ఉంటే అతనే పరిష్కరించుకోవాలని, ఆ సమస్య ప్రభావం షూటింగ్, నిర్మాతలపై పడకుండా జాగ్రత్త వహించే బాధ్యత కూడా ఆ వ్యక్తే తీసుకోవా లన్నట్లుగా కొన్ని నియమాలను 'ఫెఫ్సీ' తీసుకొచ్చిందట. ఈ కొత్త నిర్ణయా లపై కోలీవుడ్‌లోనే కాదు.. సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 'ఈ నిబం ధనలు ఉన్నప్పుడు తమిళ సినిమాలను తమిళనాడులోనే రిలీజ్ చేసుకోవాలి. కోలీవుడ్‌లో హీరోయిన్లకు కొరత ఏర్పడుతుంది. సినిమాకి వాడే సాంకేతిక సామాగ్రిని కూడా తమిళనాడులోనే తయారుచేసుకోవాలి' అంటూ ఫెఫ్సీ నియమాలపై సోషల్ మీడియాలో కొందరు నెటిజన్లు వ్యంగ్యాస్త్రాలు విసురు తున్నారు. అయితే ఈ కొత్త నియమాలను కొందరు తప్పుగా అర్థం చేసుకున్నారని ఫెఫ్సీ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి పేర్కొన్నారట.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	888	66,684
నిఫ్టీ ▽	234	19,745

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	14,096	▽	33
డోజోన్స్	35,297	△	72
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,664	△	18
డాక్స్	16,177	▽	27
షాంఘై	3,168	▽	2
నికాయ్	32,304	▽	186

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

	ధర		మార్పు
బంగారం (24 క్యారట్)	59,455	▽	408
బంగారం (22 క్యారట్)	59,217	▽	406
వెండి (కేజీ)	74,622	▽	1,146

కియా కొత్త సెల్టోస్ వచ్చింది



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ కియా ఇండియా ఆధునీకరించిన సెల్టోస్ విడుదల చేసింది. పరిచయ ఆఫర్‌లో ధర ఎక్స్‌షోరూంలో రూ.10.89 లక్షల నుంచి మొదలుకుని రూ.19.99 లక్షల వరకు ఉంది. పెట్రోల్, డీజిల్ పవర్‌ట్రెయిన్స్‌తో 18 ట్రిమ్స్‌లో లభిస్తుంది. మోడల్‌నుబట్టి 26.04 సెంటీమీటర్ల పుల్లీ డిజిటల్ క్లస్టర్‌తో డ్యూయల్ స్క్రీన్ పనోరమిక్ డిస్‌ప్లే, 26.03 సెంటీమీటర్ల హెచ్‌డీ టచ్‌స్క్రీన్ నావిగేషన్, డ్యూయల్ పేన్ పనోరమిక్ సన్‌రూఫ్, ఎలక్ట్రిక్ పార్కింగ్ బ్రేక్, అడ్వాన్స్‌డ్ ఫార్వార్డ్ కొలిషన్ అవాయిడెన్స్ అసిస్ట్, లేన్ కీప్ అసిస్ట్, స్మార్ట్ క్రూజ్ కంట్రోల్, ఆరు ఎయిర్‌బ్యాగ్స్ వంటి ఫీచర్లు జోడించారు. టాప్ వేరియంట్స్ అయిన జీటీ లైన్, ఎక్స్ లైన్ అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్‌తో (ఏడీఏఎస్) రూపుదిద్దుకున్నాయి. బుకింగ్స్ ప్రారంభమైన తొలి రోజే కొత్త సెల్టోస్ కొనుగోలు కోసం 13,424 మంది కస్టమర్లు తమ పేర్లను నమోదు చేసుకున్నట్టు కంపెనీ తెలిపింది.

అశోక్ లేలాండ్ లాభం జూమ్

జూన్ క్వార్టర్‌లో రూ. 576 కోట్లు



న్యూఢిల్లీ: ఆటో రంగ దిగ్గజం అశోక్ లేలాండ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. ఏప్రిల్–జూన్(క్యూ1)లో స్టాండెలోన్ నికర లాభం 8 రెట్లు ఎగసి రూ. 576 కోట్లను తాకింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో కేవలం రూ. 68 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 7,223 కోట్ల నుంచి రూ. 8,189 కోట్లకు బలపడింది. నిర్వహణ లాభం(ఇబిటా) 10 శాతం వృద్ధితో రూ. 821 కోట్లను తాకింది. దేశీయంగా భారీ, మధ్యతరహా వాణిజ్య వాహన (ఎంహెచ్‌సీవీ) విక్రయాలు(పరిమాణం) 7 శాతం పుంజుకున్నట్లు కంపెనీ పేర్కొంది. ఈ విభాగంలో మార్కెట్ వాటా 31.2 శాతానికి చేరినట్లు వెల్లడించింది. తేలికపాటి వాణిజ్య వాహన అమ్మకాలు 3 శాతం అధికమై 14,821 యూనిట్లకు చేరినట్లు తెలియజేసింది. ఈ కాలంలో రూ. 172 కోట్ల డిఫర్డ్ ట్యాక్స్ క్రెడిట్ నమోదైనట్లు కంపెనీ పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో అశోక్ లేలాండ్ షేరు 3.6 శాతం ఎగసి రూ. 182 వద్ద ముగిసింది.


రిలయన్స్ లాభం 11 శాతం డౌన్

- క్యూ1లో రూ. 16,011 కోట్లు
- ఓ2సీ విభాగ బలహీన పనితీరు, అధిక వడ్డీలు, తరుగుదల వ్యయాలు కారణం
- ఆదాయం రూ. 2.1 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో వ్యాపార దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ నికర లాభం 11 శాతం క్షీణించి రూ. 16,011 కోట్లకు (ఒక్కో షేరుకు రూ. 23.66) పరిమితమైంది. కీలకమైన ఆయిల్–టు–కెమికల్ (ఓ2సీ) వ్యాపార పనితీరు బలహీనపడటంతో పాటు అధిక వడ్డీల భారం, తరుగుదల వ్యయాలు ఇందుకు కారణం. గత ఆర్థిక సంవత్సరంలో లాభం రూ. 17,955 కోట్లు (ఒక్కో షేరుకు రూ. 26.54). త్రైమాసికాలవారీగా జనవరి–మార్చి క్వార్టర్‌లో నమోదైన రూ. 19,299తో పోల్చినా లాభం తగ్గింది. గతేడాది ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో డీజిల్, పెట్రోల్, జెట్ ఇంధనం మార్జిన్లు రికార్డు స్థాయిలో పరుగులు తీయగా.. ప్రస్తుతం అవి సాధారణ స్థాయికి రావడంతో రిలయన్స్ వంటి రిఫైనర్ల ఆదాయంపై ప్రభావం పడింది. క్రూడాయిల్ ధరలు 31 శాతం క్షీణించడంతో ఆదాయం రూ. 2.22 లక్షల కోట్ల నుంచి రూ. 2.1 లక్షల కోట్లకు పడిపోయింది. జనవరి–మార్చి త్రైమాసికంలో ఆదాయం 2.16 లక్షల కోట్లు. 'మాంద్యం, అధిక వడ్డీ రేట్లు, చైనా మార్కెట్లు ఊహించిన దానికన్నా నెమ్మదిగా కోలుకునే అవకాశాలు ఉన్నాయన్న భయాలతో ఇంధన నిల్వలను తగ్గించుకోవడం డిమాండ్‌పై ప్రతికూల ప్రభావం చూపింది' అని సంస్థ వెల్లడించింది. 'వివిధ పరిశ్రమలు, వినియోగదారులకు సేవలు అందిస్తున్న మా పోర్ట్‌ఫోలియో సంస్థల పటిష్టమైన ఆర్థిక, నిర్వహణ పనితీరుకు ఈ క్వార్టర్ ఫలితాలు నిదర్శనం. జియో 'ట్రూ 5జీ' సేవల విస్తరణతో దేశ డిజిటల్ పరివర్తన మరింత వేగం పుంజుకోగలదు. ఎంజీ క్షేత్రంలో కార్యకలాపాలు ప్రారంభించడంతో దేశ ఇంధన భద్రతకు ఊతం లభించనుంది. అందరినీ ఆర్థిక సేవల పరిధిలోకి తెచ్చేందుకు జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ తోడ్పడనుంది' అని రిలయన్స్ సీఎండీ ముకేశ్ అంబానీ తెలిపారు.

రిటైల్ లాభం 19 శాతం అప్..

క్యూ1లో రిలయన్స్ రిటైల్ విభాగం ఆదాయం రూ. 58,554 కోట్ల నుంచి రూ. 62,159 కోట్లకు పెరగ్గా లాభం 19 శాతం పెరిగి రూ. 2,061 కోట్ల నుంచి రూ. 2,448 కోట్లకు చేరింది. తొలి త్రైమాసికంలో కంపెనీ మొత్తం స్టోర్ల సంఖ్య 18,446కి చేరింది. మెట్రో క్యాష్ అండ్ క్యారీ ఇండియా కొనుగోలు ప్రక్రియ పూర్తి కాగా.. దాన్ని రిలయన్స్ రిటైల్‌లో అనుసంధానం చేసే ప్రక్రియ కొనసాగుతోంది.



ఇతరత్రా వివరాలు...

- ప్రధానమైన ఆయిల్ రిఫైనింగ్, పెట్రోకెమికల్స్ వ్యాపార విభాగం ఆదాయం 23.2% క్షీణించి రూ. 15,271 కోట్లకు పరిమితమైంది. ముడిచమురును వివిధ ఇంధనాల రూపంలో శుద్ధి చేయడం ద్వారా వచ్చే మార్జిన్లను పరిశీలిస్తే.. ఈ జూన్‌లో డీజిల్‌పై మార్జిన్లు 16–19 డాలర్ల మధ్య, పెట్రోల్‌పై మార్జిన్లు 10–14 డాలర్ల మధ్య తిరుగాడాయి.
- సంస్థ నికర రుణభారం రూ. 1.26 లక్షల కోట్లుగా ఉంది.
- గత ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 10 ముఖవిలువ గల ఒక్కో షేరుకు కంపెనీ రూ. 9 డివిడెండ్ ప్రకటించింది.

రిలయన్స్ షేరు 3% క్షీణించి 2,536 వద్ద క్లోజైంది. మార్కెట్ ముగిశాక ఫలితాలు వెలువడ్డాయి.

జియో ప్లాట్‌ఫామ్స్ లాభం 5,098 కోట్లు

సబ్‌స్క్రయిబర్స్ సంఖ్య, యూజర్లపై ఆదాయం పెరగడంతో క్యూ1లో డిజిటల్ సర్వీసుల విభాగం జియో ప్లాట్‌ఫామ్స్ లాభం 12.5 శాతం పెరిగి రూ. 4,530 కోట్ల నుంచి రూ. 5,098 కోట్లకు చేరింది. ఆదాయం రూ. 23,467 కోట్ల నుంచి 11.3 శాతం వృద్ధి చెంది రూ. 26,115 కోట్లకు పెరిగింది. కీలకమైన టెలికం విభాగం రిలయన్స్ జియో ఇన్ఫోకామ్‌తో పాటు పలు స్టార్టప్‌లు, మ్యూజిక్.. వీడియో స్ట్రీమింగ్ యాప్‌లు జియో ప్లాట్‌ఫామ్స్‌లో భాగంగా ఉన్నాయి. విడిగా రిలయన్స్ జియో ఆదాయం రూ. 21,995 కోట్ల నుంచి రూ. 24,127 కోట్లకు పెరగ్గా లాభం రూ. 4,335 కోట్ల నుంచి రూ. 4,863 కోట్లకు చేరింది. సగటున యూజరుపై వచ్చే ఆదాయం (ఏఆర్‌పీయూ) 2.8 శాతం మెరుగుపడి రూ. 180.50కి చేరింది. నికరంగా సబ్‌స్క్రయిబర్స్ సంఖ్య 90 లక్షల మేర పెరిగి 44.85 కోట్లకు చేరింది.

గో ఫస్ట్ సేవల పునరుద్ధరణకు డీజీసీఏ ఆమోదం



న్యూఢిల్లీ/ముంబై: స్వచ్ఛందంగా దివాళా పిటిషన్ వేసిన గో ఫస్ట్ తమ కార్యకలాపాలను పరిమిత స్థాయిలో పునఃప్రారంభించేందుకు విమానయాన రంగ నియంత్రణ సంస్థ డీజీసీఏ ఆమోదముద్ర వేసింది. 15 విమానాలతో రోజూ 114 ఫ్లయిట్స్ నడిపేందుకు పలు షరతులతో కూడిన అనుమతులిచ్చింది. హైకోర్టు, నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో పెండింగ్‌లో ఉన్న పిటిషన్లపై ఉత్తర్వులకు లోబడి ఈ అనుమతులు ఉంటాయని స్పష్టం చేసింది. ప్రతిపాదిత ఫ్లయిట్ షెడ్యూల్, అర్హులైన పైలట్లు, సిబ్బంది ఇతరత్రా కీలక వనరుల లభ్యత తదితర వివరాలన్నింటినీ పరిష్కార నిపుణుడు (ఆర్‌పీ) డీజీసీఏకి సమర్పించాల్సి ఉంటుంది. ఫ్లయిట్ షెడ్యూల్ ఆమోదం తర్వాతే గో ఫస్ట్ టికెట్ల బుకింగ్‌ను ప్రారంభించేందుకు అనుమతి లభిస్తుంది. 26 విమానాలతో రోజుకు 160 ఫ్లయిట్స్ నడిపేలా జూన్‌లో ఆర్‌పీ ఒక ప్రతిపాదన సమర్పించగా.. డీజీసీఏ దాన్ని సమీక్షించి తాజా నిర్ణయం తీసుకుంది. ఆర్థిక సంక్షోభం కారణంగా గో ఫస్ట్ స్వచ్ఛంద దివాళా ప్రకటించిన నేపథ్యంలో విమాన సేవలు మే నెల 3 నుంచి నిల్చిపోయిన సంగతి తెలిసిందే.

వేదాంతా లాభం నేలచూపు



క్యూ1లో రూ. 3,308 కోట్లు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం వేదాంతా లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్ (క్యూ1)లో నికర లాభం 40 శాతం క్షీణించి రూ. 3,308 కోట్లకు పరిమితమైంది. గతేడాది (2022–23) ఇదే కాలంలో రూ. 5,592 కోట్లు ఆర్జించింది. ఆదాయం తగ్గడం ప్రధానంగా ప్రభావం చూపింది. మొత్తం ఆదాయం రూ. 39,355 కోట్ల నుంచి రూ. 34,279 కోట్లకు బలహీనపడింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 32,095 కోట్ల నుంచి రూ. 31,973 కోట్లకు తగ్గాయి. 2023 జూన్ 30 నాటికి కంపెనీ నికర రుణ భారం రూ. 59,192 కోట్లకు చేరింది.

ఫలితాల నేపథ్యంలో వేదాంతా షేరు 1.4 శాతం క్షీణించి రూ. 278 వద్ద ముగిసింది.

హిందుస్తాన్ జింక్ లాభం క్షీణత

HINDUSTAN ZINC

తొలి త్రైమాసికంలో రూ. 1,964 కోట్లు

న్యూఢిల్లీ: మెటల్ రంగ దిగ్గజం హిందుస్తాన్ జింక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్ (క్యూ1)లో నికర లాభం 36%పైగా క్షీణించి రూ. 1,964 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 3,092 కోట్లు ఆర్జించింది. ఇతర ఆదాయం తగ్గడం ప్రధానంగా ప్రభావం చూపింది. ఆదాయం సైతం రూ. 9,697 కోట్ల నుంచి రూ. 7,564 కోట్లకు బలహీనపడింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 5,025 కోట్ల నుంచి రూ. 4,954 కోట్లకు తగ్గాయి.

ఫలితాల నేపథ్యంలో హిందుస్తాన్ జింక్ షేరు 1.5 శాతం క్షీణించి రూ. 318 వద్ద ముగిసింది.

రికార్డుల ర్యాలీకి 'ఇన్ఫీ' షాక్

- సెన్సెక్స్ 888 పాయింట్లు క్రాష్
- 234 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ
- ప్రపంచ మార్కెట్ల నుంచి ప్రతికూలతలు
- గరిష్ట స్థాయిల వద్ద లాభాల స్వీకరణ
- నాలుగున్నర నెలల్లో అతిపెద్ద నష్టం



ముంబై: స్టాక్ మార్కెట్ ఆరు రోజుల వరుస రికార్డుల ర్యాలీకి ఇన్ఫోసిస్ షేరు బ్రేక్ వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరపు ఆదాయ వృద్ధి అంచనాల్లో భారీగా కోత విధించడంతో దేశీయ రెండో అతిపెద్ద ఐటీ కంపెనీ షేరు ఎనిమిది శాతం క్షీణించింది. అలాగే లార్జ్ క్యాప్ రిలయన్స్, హెచ్‌యూఎల్ షేర్ల మూడు శాతం పతనం సైతం సూచీలను నష్టాల ఊబిలోకి నెట్టాయి. అధిక వాల్యుయేషన్ల ఆందోళనలు, అమెరికా నాస్‌డాక్ సూచీ నుంచి నష్ట భయాలు ఎదురవడంతో ఇన్వెస్టర్లు గరిష్ట స్థాయిల వద్ద లాభాల స్వీకరణకు మొగ్గుచూపారు. ప్రపంచ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందుకున్న దేశీయ మార్కెట్ ఉదయం భారీ నష్టంతో మొదలైంది. ఒక దశలో సెన్సెక్స్ 1038 పాయింట్లు క్షీణించి 66,534 వద్ద, నిఫ్టీ 279 పాయింట్లు పతనమై 19,700 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. ఆఖరికి సెన్సెక్స్ 888 పాయింట్లు నష్టపోయి 66,684 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 234 పాయింట్లు పతనమై 19,745 వద్ద నిలిచింది. వెరసి సూచీలు నాలుగున్నర నెలల్లో అతిపెద్ద నష్టాన్ని చవిచూశాయి.

ఇతర ముఖ్యాంశాలు...

- దేశీయ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ ఆదాయ వృద్ధి అంచనాల్లో భారీగా తగ్గించడంతో ఈ కంపెనీ షేరు 8% నష్టపోయింది. సెన్సెక్స్, నిఫ్టీల్లో అత్యధికంగా నష్టపోయిన షేరు ఇదే. దీంతో కంపెనీ మార్కెట్ విలువ ఒక్కరోజులోనే రూ.49,159 కోట్లు ఆవిరై రూ.5.52 లక్షల కోట్లకు దిగివచ్చింది. ఈ ప్రతికూలత ఇతర ఐటీ షేర్లపై పడింది. పర్‌సిస్టెంట్ 6%, కోఫోర్జ్ 4%, హెచ్‌సీఎల్ టెక్, విప్రోలు 3%, టీసీఎస్ 2.50%, టెక్ మహీంద్రా 2%, ఎల్‌టీఐఎం, ఎల్‌టీటీఎస్ షేర్లు 1% నష్టపోయాయి.
- అంతర్జాతీయ బ్రోకరేజ్ మెక్వారీ రిలయన్స్ షేరు రేటింగ్‌ను డౌన్‌గ్రేడ్ చేసింది. ఫలితంగా బీఎస్‌ఈలో నాలుగుశాతం నష్టపోయి రూ.2,523 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. చివరికి 3% క్షీణించి రూ.2,536 వద్ద స్థిరపడింది.
- ఫలితాలు నిరాశపరచడంతో హెచ్‌యూఎల్ షేరు 4% నష్టపోయి రూ.2,603 వద్ద స్థిరపడింది. ఫలితంగా ఇదే రంగ టాటా కన్జూమర్, డాబర్ షేర్లు 3–2% చొప్పున పతనమయ్యాయి.

లిస్టింగ్ రోజే భారీ లాభాలు

లిస్టింగ్ రోజే ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు షేరు భారీ లాభాల్ని పంచింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.25)తో పోలిస్తే 59.8 శాతం ప్రీమియంతో 39.95 వద్ద లిస్టయ్యింది. 92% ర్యాలీ చేసి ఇంట్రాడే గరిష్ట స్థాయి రూ.47.94 వద్ద స్థిరపడింది.



విఘ్నేశ్‌కు 2 స్వర్ణాలు

తాష్కెంట్‌లో జరుగుతున్న ఆసియా స్కూల్స్ ర్యాపిడ్ అండ్ చెస్ చాంపియన్‌షిప్–2023లో తెలంగాణ ఆటగాళ్లు సత్తా చాటారు. దాంతో భారత్ ఖాతాలో 2 స్వర్ణాలు, ఒక కాంస్యం చేరాయి. అండర్–15 బాలుర విభాగం ర్యాపిడ్, బ్లిట్జ్ ఈవెంట్‌లలో విఘ్నేశ్ అద్వైత్ వేముల రెండు స్వర్ణాలు సాధించడం విశేషం. అండర్–15 బాలికల కేటగిరీ బ్లిట్జ్‌లో యశ్వి జైన్ కాంస్యం పతకం సొంతం చేసుకుంది.

నేడు చివరి వన్డే

భారత మహిళలు, బంగ్లాదేశ్ మహిళల మధ్య నేడు మిర్పూర్‌లో మూడో వన్డే మ్యాచ్ జరగనుంది. ఇరు జట్లు చెరో మ్యాచ్ గెలిచి 1–1తో సమంగా ఉండటంతో ఈ మ్యాచ్‌తో సిరీస్ విజేత ఎవరో తేలనుంది. భారత మహిళల జట్టు ఇప్పటి వరకు బంగ్లా చేతిలో సిరీస్ ఓడలేదు.



సెమీఫైనల్లో సాత్విక్ జోడీ



యోసు (కొరియా): భారత అగ్రశ్రేణి బ్యాడ్మింటన్ జోడీ సాత్విక్ సాయిరాజ్– చిరాగ్ శెట్టి కొరియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 టోర్నమెంట్‌లో సెమీ ఫైనల్లో అడుగుపెట్టింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ మూడో ర్యాంకు జంట వరుస సెట్లలో ఐదో సీడ్ టకురో హొకి–యుగో కొబయషి (జపాన్) ద్వయంపై అలవోక విజయం సాధించింది. 40 నిమిషాల్లో ముగిసిన ఈ క్వార్టర్స్ పోరులో సాత్విక్–చిరాగ్ జోడీ 21–14, 21–17తో జపాన్ ద్వయంపై గెలుపొందింది. గత నెల ఇండోనేసియా ఓపెన్ డబుల్స్ టైటిల్ నెగ్గి జోరు మీదున్న భారత షట్లరు ఈ టోర్నీలోనూ అదే దూకుడు కొనసాగిస్తున్నారు. తొలి గేమ్ ఆరంభంలోనే వరుసగా ఆరు పాయింట్లతో ప్రత్యర్థిపై పైచేయి సాధించిన సాత్విక్–చిరాగ్ ద్వయం గేమ్ గెలిచేందుకు ఎక్కువ సమయం పట్టలేదు. రెండో గేమ్‌లో భారత జోడీ 3–6తో కాస్త వెనుకపడినట్లు కనిపించింది. అయితే అక్కడి నుంచి సాత్విక్–చిరాగ్‌లిద్దరు తమ షాట్లకు పదునుపెట్టడంతో వరుసగా 6 పాయింట్లు గెలిచారు. అక్కడి నుంచి ఆధిక్యాన్ని అంతకంతకు పెంచుకుంటూ పోయారు.

ఇటీవలే 'యోనెక్స్' ఫ్యాక్టరీలో ల్యాబ్‌లో ఫాస్టెస్ట్ స్మాష్‌తో గిన్నిస్ రికార్డు నమోదు చేసిన సాత్విక్ సాయిరాజ్ కోర్టులోనూ ఈ సారి అలాంటి ఫీట్‌ను మళ్లీ సాధించడం విశేషం. క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో సాత్విక్ రికార్డు వేగంతో స్మాష్ బాదాడు. అతను కొట్టిన స్మాష్‌కు షటిల్ గంటకు 500 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోయింది.

పాణీరావు కన్నుమూత



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ బ్యాడ్మింటన్ సంఘం కోశాధికారి ఎస్. పాణీరావు శుక్రవారం మృతి చెందారు. హైదరాబాద్ బ్యాడ్మింటన్ సంఘానికి కార్యదర్శిగా కూడా వ్యవహరిస్తున్న 72 ఏళ్ల పాణీరావు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. సీనియర్ అడ్మినిస్ట్రేటర్‌గా దాదాపు నాలుగు దశాబ్దాలకు పైగా ఆయనకు బ్యాడ్మింటన్‌తో అనుబంధం ఉంది. ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ సంఘం రోజులనుంచి ప్రస్తుతం తెలంగాణ సంఘం వరకు వేర్వేరు హోదాల్లో ఆయన పని చేశారు. ముఖ్యంగా వివిధ వయో విభాగాలకు సంబంధించిన టోర్నీల నిర్వహణలో ప్రత్యేక అనుభవం ఉన్న పాణీరావు వర్ధమాన ఆటగాళ్లను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషించారు.

మెరిసిన యశ్, నిశాంత్

- 'ఎమర్జింగ్' ఫైనల్లో భారత్
- సెమీఫైనల్లో బంగ్లా 'ఎ'పై గెలుపు
- తుది పోరులో పాకిస్తాన్‌తో ఢీ



కొలంబో: యువ భారత జట్టు ఆసియా ఎమర్జింగ్ కప్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో భారత్ 'ఎ' 51 పరుగుల తేడాతో బంగ్లాదేశ్ 'ఎ' జట్టుపై ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ 49.1 ఓవర్లలో 211 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్, 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' యశ్ ధుల్ () అర్ధ సెంచరీ సాధించగా, అభిషేక్ శర్మ (34; 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. ఇతర బ్యాటర్లలో సాయి సుదర్శన్ (21; 3 ఫోర్లు) పర్వాలేదనిపించగా... మిగతావారంతా విఫలమయ్యారు. 137 పరుగులకే జట్టు 7 వికెట్లు కోల్పోగా... మానవ్ సుథార్ (21; 3 ఫోర్లు)తో కలిసి ధుల్ ఎనిమిదో వికెట్‌కు 41 పరుగులు జోడించడంతో జట్టు స్కోరు 200 దాటింది. బంగ్లా బౌలర్లలో మెహ దీహసన్, తన్‌జీమ్ హసన్, రకీబుల్ తలా 2 వికెట్లు తీశారు. అనంతరం సులువైన లక్ష్యమే అయినా భారత స్పిన్ బౌలింగ్ ముందు బంగ్లాదేశ్ బ్యాటర్లు తలవంచారు. దీంతో 34.2 ఓవర్లలో 160 పరుగులకే బంగ్లా 'ఎ' ఆలౌటైంది. ఓపెనర్లు తన్‌జీద్ హసన్ (51; 8 ఫోర్లు), నయీమ్ (38; 6 ఫోర్లు) తొలి వికెట్‌కు 70 పరుగులు జోడించి శుభారంభం ఇచ్చారు. కానీ తర్వాత వచ్చిన వారంతా లెఫ్టార్మ్ స్పిన్నర్లు నిశాంత్ సింధు (5/20), మానవ్ (3/32)ల ఉచ్చులో చిక్కుకున్నారు. కెప్టెన్ సైఫ్ హసన్ (22; 4 ఫోర్లు), మహ్మదుల్ (20) పోరాడినా లాభం లేకపోయింది. 90 పరుగుల వ్యవధిలో బంగ్లా పది వికెట్లూ కోల్పోయింది. అంతకుముందు జరిగిన తొలి సెమీఫైనల్లో పాకిస్తాన్ 'ఎ' 60 పరుగుల తేడాతో శ్రీలంక 'ఎ'పై గెలిచింది. రేపు చిరకాల ప్రత్యర్థులు భారత్, పాక్‌ల మధ్య టైటిల్ పోరు జరుగుతుంది.

'అంతా కోలుకుంటున్నారు'



బెంగళూరు: గాయాలకు గురై జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో రీహాబిలిటేషన్‌లో ఉన్న ఐదుగురు భారత క్రికెటర్ల ఫిట్‌నెస్‌కు సంబంధించి బీసీసీఐ మెడికల్ బులెటిన్‌ను విడుదల చేసింది. వేర్వేరు కారణాలతో ఎన్‌సీఏలో కోలుకుంటున్న వీరందరి ఫిట్‌నెస్ స్థాయి ప్రస్తుతం మెరుగ్గా ఉందని బోర్డు వెల్లడించింది. బోర్డు చెప్పిన వివరాల ప్రకారం... పేస్ బౌలర్లు జస్‌ప్రీత్ బుమ్రా, ప్రసిధ్ కృష్ణ రీహాబిలిటేషన్ చివరి దశలో ఉన్నారు. నెట్స్‌లో పూర్తి స్థాయిలో బౌలింగ్ కూడా చేస్తున్నారు. ఎన్‌సీఏ నిర్వహించే ప్రాక్టీస్ మ్యాచ్‌లలో వీరిద్దరు ఆడతారు. ప్రాక్టీస్ గేమ్‌లను పరిశీలించిన తర్వాత వీరిద్దరిపై తుది నిర్ణయం తీసుకుంటారు. బ్యాటర్లు శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్ నెట్స్‌లో బ్యాటింగ్ చేస్తున్నారు. ప్రస్తుతం స్ట్రెంత్, ఫిట్‌నెస్ డ్రిల్స్ చేస్తున్నారు. రాబోయే రోజుల్లో ఈ డ్రిల్స్ తీవ్రత పెంచి వారి పరిస్థితిని అంచనా వేస్తారు. కారు ప్రమాదానికి గురై కోలుకుంటున్న వికెట్ కీపర్ రిషభ్ పంత్ రీహాబిలిటేషన్ చాలా వేగంగా సాగుతోంది. నెట్స్‌లో బ్యాటింగ్ సాధనతో పాటు వికెట్ కీపింగ్ కూడా పంత్ మొదలు పెట్టాడు. స్ట్రెంత్, ఫ్లెక్సిబిలిటీ, రన్నింగ్‌కు సంబంధించి అతని కోసమే ప్రత్యేకంగా రూపొందించిన ఫిట్‌నెస్ కార్యక్రమాన్ని పంత్ అనుసరిస్తున్నాడు.

పట్టు బిగించిన ఇంగ్లండ్

- తొలి ఇన్నింగ్స్‌లో 275 పరుగుల ఆధిక్యం
- రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్ 113/4



మాంచెస్టర్: 'యాషెస్' సిరీస్ నాలుగో టెస్టులో విజయంపై ఇంగ్లండ్ గురి పెట్టింది. మూడో రోజు ఆట ముగిసే సరికి ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ ఓటమినుంచి తప్పించుకునేందుకు పోరాడుతోంది. రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా ప్రస్తుతం 4 వికెట్లు కోల్పోయి 113 పరుగులు చేసింది. వార్నర్ (28), ఖ్వాజా (18), స్మిత్ (17), హెడ్ (1) పెవిలియన్ చేరగా...లబుషేన్ (44 నాటౌట్), మార్ష్ (1 నాటౌట్) క్రీజ్‌లో ఉన్నారు. ఆస్ట్రేలియా ఇంకా 162 పరుగులు వెనుకబడి ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 384/4తో ఆట కొనసాగించిన ఇంగ్లండ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 592 పరుగులకు ఆలౌటైంది. హ్యారీ బ్రూక్ (61), బెన్ స్టోక్స్ (51) అర్ధ సెంచరీలు సాధించగా...జానీ బెయిర్‌స్టో (81 బంతుల్లో 99 నాటౌట్; 10 ఫోర్లు, 4 సిక్స్‌లు) త్రుటిలో సెంచరీ అవకాశం కోల్పోయాడు. హాజల్‌వుడ్ 5 వికెట్లు పడగొట్టగా, గ్రీన్, స్టార్క్ చెరో 2 వికెట్లు తీశారు. 99 వద్ద నాటౌట్‌గా ముగించిన ఏడో బ్యాటర్‌గా బెయిర్‌స్టో నిలిచాడు.

500లో 100

- టెస్టుల్లో 29వ సెంచరీ
- తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 438 ఆలౌట్
- విండీస్‌తో రెండో టెస్టు



పోర్ట్ ఆఫ్ స్పెయిన్: భారత బ్యాటింగ్ కింగ్ విరాట్ కోహ్లి 500వ అంతర్జాతీయ మ్యాచ్‌ను సెంచరీతో చిరస్మరణీయం చేసుకున్నాడు. విరాట్ కోహ్లి (206 బంతుల్లో 121; 11 ఫోర్లు) శతకానికి తోడు రవీంద్ర జడేజా (152 బంతుల్లో 61; 5 ఫోర్లు), రవిచంద్రన్ అశ్విన్ (78 బంతుల్లో 56; 8 ఫోర్లు) కూడా అర్ధ సెంచరీలు సాధించారు. దాంతో తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 438 పరుగుల భారీ స్కోరు సాధించింది.

రెండో రోజు ఆట ఆరంభమైన కాసేపటికే భారత్ స్కోరు 300 పరుగులు దాటింది. ఆ వెంటనే కోహ్లి కూడా 180 బంతుల్లో శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. ఆ ఓవర్లోనే జడేజా అర్ధ సెంచరీ పూర్తయ్యింది. కొత్త బంతితో కరీబియన్ జట్టు శుక్రవారం ఆట ఆరంభించినప్పటికీ సీమర్లు ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు. క్రితంరోజు లాగే కోహ్లి–జడేజా తొలిసెషన్‌లో క్రీజును వీడకుండా విండీస్ బౌలర్లను ఆటాడుకున్నారు. యథేచ్ఛగా బ్యాటింగ్ చేయడంతో పరుగులు సులువుగానే వచ్చాయి. ఐదో వికెట్‌కు 159 పరుగులు జోడించాక జట్టు స్కోరు 341 వద్ద కోహ్లి ఇన్నింగ్స్ ముగిసింది. స్క్వేర్‌లెగ్ దిశగా ఆడిన కోహ్లి సింగిల్ తీసే క్రమంలో కాస్త వెనకడుగు వేశాడు. అయితే ముందుకే వెళ్లినా...జోసెఫ్ డైరెక్ట్ త్రో నాన్‌స్ట్రైకింగ్ ఎండ్ వద్ద వికెట్లను తాకడంతో రనౌటయ్యాడు. మరికొద్దిసేపటికే రోచ్ బౌలింగ్‌లో జడేజా వెనుదిరిగాడు. లంచ్ విరామ సమయానికి 373/6 స్కోరు వద్ద ఇషాన్ కిషన్ (25; 4ఫోర్లు), అశ్విన్ క్రీజ్‌లో ఉన్నారు. అనంతరం టెయిలెండర్లు ఉనాద్కట్ (7), సిరాజ్ (0)లతో కలిసి అశ్విన్ జట్టు స్కోరును 400 దాటించాడు. రోచ్ బౌలింగ్‌లో రెండు వరుస బౌండరీలతో ఫిఫ్టీ పూర్తిచేసుకున్న అశ్విన్ మరో ఫోర్ కొట్టి ఆఖరి బంతికి బౌల్డ్ కావడంతో భారత్ తొలి ఇన్నింగ్స్ 128 ఓవర్లలో 438 పరుగుల వద్ద ముగిసింది. వారికన్, రోచ్ చెరో 3 వికెట్లు తీశారు.

తొలిరోజు ఆఖరి సెషన్‌లో...

రెండో సెషన్‌లో వరుస విరామాల్లో 4 వికెట్లు పడగొట్టిన వెస్టిండీస్‌కు ఆఖరి సెషన్‌లో చుక్కెదురైంది. కోహ్లి, జడేజా క్రీజులో పాతుకుపోవడంతో ఆతిథ్య జట్టుకు కష్టాలు తప్పలేదు. కోహ్లి 97 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇద్దరు మూడో సెషన్ ఆసాంతం ఆడి అబేధ్యమైన ఐదో వికెట్‌కు 106 పరుగులు జతచేశారు. 288/4 స్కోరు వద్ద తొలిరోజు ఆట ముగిసింది.



అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన వెస్టిండీస్ కడపటి వార్తలందేసరికి 4 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 7 పరుగులు చేసింది. బ్రాత్‌వైట్ (4 బ్యాటింగ్), తేజ్‌నారాయణ్ (3 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

స్కోరు వివరాలు

భారత్ తొలిఇన్నింగ్స్: జైస్వాల్ (సి) మెకెంజీ (బి) హోల్డర్ 57; రోహిత్ (బి) వారికన్ 80; శుబ్‌మన్ (సి) జొషువా (బి) రోచ్ 10; కోహ్లి రనౌట్ 121; రహానె (బి) గ్యాబ్రియెల్ 8; జడేజా (సి) జొషువా (బి) రోచ్ 61; ఇషాన్ కిషన్ (సి) జొషువా (బి) హోల్డర్ 25; అశ్విన్ (బి) రోచ్ 56; ఉనాద్కట్ (స్టంప్డ్) జొషువా (బి) వారికన్ 7; సిరాజ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) వారికన్ 0; ముకేశ్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 13; మొత్తం (128 ఓవర్లలో ఆలౌట్) 438.

వికెట్ల పతనం: 1–139, 2–153, 3–155, 4–182, 5–341, 6–360, 7–393, 8–416, 9–426, 10–438.

బౌలింగ్: రోచ్ 22–2–104–3, జోసెఫ్ 22–0– 97–0, గ్యాబ్రియెల్ 18–0–74–1, వారికన్ 39–7–89–3, హోల్డర్ 21–3–57–2, అలిక్ 4–0–12–0, బ్రాత్‌వైట్ 2–1–1–0.

29 టెస్టుల్లో కోహ్లి సెంచరీల సంఖ్య. డాన్ బ్రాడ్‌మన్ (29)ను అతను సమం చేశాడు.

76 అంతర్జాతీయ క్రికెట్‌లో కోహ్లి శతకాల సంఖ్య

5 భారత్ తరఫున టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో సెహ్వాగ్ (8586)ను దాటి కోహ్లి (8676) ఐదో స్థానానికి చేరాడు. ఈ జాబితాలో సచిన్ (15,921), ద్రవిడ్ (13,288), సునీల్ గావస్కర్ (10,122), వీవీఎస్ లక్ష్మణ్ (8781) మాత్రమే కోహ్లికంటే ముందున్నారు.

400 అంతర్జాతీయ క్రికెట్‌లో కీమర్ రోచ్ 400 వికెట్ల మైలురాయిని అందుకున్నాడు.

ప్లేట్ మీల్స్ రూ.50



జనరల్ బోగీల వద్దే భోజనం

- అల్పాహారం రూ.20కే.. భోజనం రూ. 50
- నాంపల్లితోపాటు మరో మూడు స్టేషన్‌లలో ప్రారంభం
- తీరిన సాధారణ రైల్వే ప్రయాణికుల కష్టాలు

సాక్షి, హైదరాబాద్: జనరల్ బోగీల్లో ప్రయాణించే వారికోసం జనాహార్ కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటివరకు ఈ కేంద్రాలు ప్రధాన రైల్వేస్టేషన్లలో స్టాళ్లకే పరిమితమయ్యాయి. సాధారణ బోగీల్లో ప్రయాణించేవారి భోజన ఇబ్బందులు తొలగించేందుకు దక్షిణమధ్య రైల్వే చర్యలు చేపట్టింది. జనరల్ బోగీలు ఆగేచోటనే ఈ విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. ఇప్పటికే నాంపల్లి రైల్వేస్టేషన్‌లో ఈ సదుపాయం అందుబాటులోకి వచ్చింది. విజయవాడ, గుంతకల్, రేణిగుంట స్టేషన్‌ల పరిధిలోనూ ఈ సేవలు అమలవుతున్నాయి. దేశవ్యాప్తంగా పలు రైల్వేస్టేషన్‌లలో ఈ తరహా సదుపాయం ప్రవేశపెట్టనున్నట్లు ఇటీవల రైల్వేశాఖ వెల్లడించిన విషయం తెలిసిందే. అందులో భాగంగానే మొదటివిడతగా దక్షిణమధ్య రైల్వేలో మొదట నాలుగుస్టేషన్లలో జనాహార్ విక్రయ కేంద్రాలను ప్రారంభించారు. జనరల్ బోగీ ప్రయాణికులు మాత్రం తమకు ఆహారం కావాలంటే ట్రైన్ దిగి స్టేషన్‌లో అందుబాటులో ఉన్న రెస్టారెంట్లు, ఫుడ్‌కోర్టుల నుంచి ఆహారం తెచ్చుకోవాలి. ఈ ఇబ్బందులను తొలగించేందుకే జనరల్ బోగీల వద్దకే జనాహార్ సేవలను అందుబాటులోకి తెచ్చారు.

తక్కువ ధరల్లో నాణ్యమైన ఆహారం

అన్ని రకాల నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో తయారు చేసిన శుభ్రమైన ఆహారపదార్థాలను ప్రయాణికులకు అందజేస్తారు.

- రూ.20కే ఏడు పూరీలు, కర్రీ ఇస్తారు. ఇది 250 గ్రాముల వరకు ఉంటుంది. దీనిని ఐఆర్‌సీటీసీ ఎకానమీ మీల్‌గా పేర్కొంది.
- కాంబో మీల్ రూ.50కే అందజేస్తారు. ఇందులో 350 గ్రాముల వరకు అన్నం, ఒక కర్రీతోపాటు పప్పు ఉంటుంది. ప్రస్తుతానికి ఈ రెండు రకాల ఆహార పదార్థాలను అందజేస్తున్నారు.
- ప్రయాణికులు డిజిటల్ రూపంలో చెల్లించే సదుపాయం ఉంది.

దశలవారీగా విస్తరణ

దశలవారీగా సికింద్రాబాద్, తిరుపతి, గుంటూరు, కాకినాడ, వరంగల్, కాజీపేట్ తదితర స్టేషన్‌లలో కూడా ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చే అవకాశముంది. ప్రయాణికులకు నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనం తక్కువ ధరలోనే లభిస్తుందని దక్షిణమధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్ తెలిపారు.

ప్లేట్ ఇడ్లీ రూ.1,200

గోల్డ్ ఇడ్లీని అమ్ముతున్న హైదరాబాద్ కేఫ్



బంజారాహిల్స్(హైదరాబాద్): గోల్డెన్ ఇడ్లీ.. నగరంలో అందుబాటులోకి వచ్చిన కొత్త డిష్ ఇది. ప్లేట్ ఇడ్లీ ధర రూ.1200..అందుకే ఆ ఇడ్లీ బంగారమే అనడంతో అతిశయోక్తి లేదు. తినడానికి కొందరు..చూడడానికి మరికొందరు ఇలా భారీ సంఖ్యలో ఆ హోటల్‌కు జనాలు బారులుతీరుతున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం.3 నుంచి శ్రీనగర్‌కాలనీకి వెళ్లే రోడ్డులో కర్ణాటక బ్యాంక్ ఎదురుగా రాఘవేంద్ర రెసిడెన్సీలో ఏర్పాటుచేసిన కృష్ణ ఇడ్లీ కేఫ్‌నకు తెల్లవారుజామునుంచే ఫుడ్డీలు చేరుకుంటున్నారు. బంగారు పూత పూసిన ఇడ్లీని గులాబీ రేకులతో కనువిందు చేసే రీతిలో సర్వ్ చేస్తున్నారు. ఒక ప్లేట్‌కు రెండు ఇడ్లీలు మాత్రమే ఇస్తారు. ఇక్కడ గోల్డ్ ఇడ్లీలే కాకుండా బంగారు దోశ, గులాబిజామ్ బజ్జీ, మలాయి కోవా వంటి 100కిపైగా ఫుడ్ ఐటమ్‌లు కూడా అందుబాటులో ఉన్నాయి. దక్షిణాది వంటకాలే కాకుండా చైనీస్ వంటకాలకూ ఈ హోటల్ స్పెషల్.

రూ.కోటికి పైగా వచ్చింది.. రూ.లక్షకు పైగా పోయింది

మోదం.. ఖేదం మిగిల్చిన టమాటా

వరంగల్/ కౌడిపల్లి: టమాటాకు ఎంత క్రేజీ ఉందో, ఒక్కోసారి అమ్మకాల్లేక, వర్షాలతో అంత డ్యామేజీకి గురవుతోంది. ఒకరింట సిరులు కురిపించగా, మరికొందరికి దిగులు మిగిల్చింది. మెదక్ జిల్లాలో ఓ రైతు టమాట పంట ద్వారా రూ.కోటి 20 లక్షలు సంపాదించగా, వరంగల్ లక్ష్మీపురం మార్కెట్‌లో టమాటాలు కుళ్లిపోవడంతో కొంతమంది వ్యాపారులు ట్రాక్టర్ లోడ్ మేర పారబోశారు.



లక్ష్మీపురం మార్కెట్‌లో పారబోసిన కుళ్లిన టమాటా

- వరంగల్ లక్ష్మీపురం మార్కెట్‌కు రోజుకు 1,500–2,000 బాక్సుల టమాటా వస్తోంది. బాక్సు టమాటాను రూ.1,800–2,500 హోల్‌సేల్‌గా, రిటైల్ మార్కెట్‌లో కిలో రూ.80 నుంచి రూ.120 చొప్పున విక్రయిస్తున్నారు. గతంలో ఎత్తు టమాటా(2.5 కిలోలు) రూ.30–50 విక్రయించగా, కొద్దిరోజులుగా రూ.200–300 చొప్పున అమ్ముతుండటంతో వినియోగదారులెవరూ టమాటా వైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో శుక్రవారం రూ.లక్షకు పైగా విలువైన టమాటాలను చెత్త ట్రాక్టర్‌లో తీసుకొచ్చి బయట పారబోసినట్లు వ్యాపారులు తెలిపారు.
- ఇటు మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం మహ్మద్‌నగర్‌కు చెందిన మహిపాల్‌రెడ్డి ఎనిమిదెకరాలలో టమాటా, నాలుగు ఎకరాలలో క్యాప్సికం సాగు చేస్తున్నారు. టమాటా ధర భారీగా పలకడంతో ఇప్పటికే రూ.కోటీ 20 లక్షలు సంపాదించారు. ఇంకా నలభై శాతం పంట పొలంలోనే ఉంది. నెల రోజులుగా రోజుకు రెండు వందల ట్రేల టమాటా దిగుబడి వస్తోంది. ట్రే టమాటా రూ.1,000 నుంచి రూ 3 వేలు ధర పలుకుతోంది. పంటసాగుకు ఎకరాకు రూ.2 లక్షల చొప్పన రూ.16 లక్షలు ఖర్చు అయినట్లు మహిపాల్‌రెడ్డి చెప్పారు. 'ఛత్తీస్‌గఢ్ నుంచి మొక్కలు తెచ్చి నాటడంతోపాటు ఎండను తట్టుకునేలా షెడ్ వేశా. మల్చింగ్ డ్రిప్ పద్ధతిలో సాగు చేశా. దీంతో మంచి లాభాలు వచ్చాయి'అని అన్నారు.



'అరుణాచలం'కు ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీ

అఫ్జల్‌గంజ్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్ ఆర్టీసీ) ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అరుణాచలం ఆలయ సందర్శనార్థం భక్తుల కోసం మరో ప్రత్యేక ప్యాకేజీని తీసుకువచ్చింది. ఇటీవల అమావాస్యను పురస్కరించుకొని పవిత్ర పుణ్యక్షేత్రమైన గానుగాపూర్‌కు ప్రత్యేక ప్యాకేజీని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే రానున్న పౌర్ణమి(ఆగస్టు 1వ తేదీ)కి అరుణాచలంకు ఈ ప్యాకేజీని తీసుకువచ్చినట్లు రంగారెడ్డి రీజినల్ మేనేజర్ ఎ.శ్రీధర్ తెలిపారు. ప్యాకేజీలో భాగంగా ఈ నెల 30వ తేదీ రాత్రి 9 గంటలకు మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ నుంచి బస్సు బయలుదేరుతుంది. తిరుగు పయనంలో 2వతేదీ ఉదయం హైదరాబాద్‌కు చేరుకుంటుంది.వివరాలకు 9959226257, 99592 24911 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

కవచ్ మరింత భద్రం



బాలాసోర్ ప్రమాదం నేపథ్యంలో రైల్వేశాఖ నిర్ణయం

- లూప్‌లైన్ వైపూ కన్నేసేలా పరిజ్ఞానానికి పదును
- సిగ్నల్‌కు విరుద్ధంగా, పాయింట్ తప్పుగా మరో లైన్‌కు లింక్ అయి ఉన్నా గుర్తించేలా మార్పులు
- దక్షిణ మధ్య రైల్వే పరిధిలోనే మళ్లీ ట్రయల్స్?

సాక్షి, హైదరాబాద్: రెండు రైళ్లు ఒకే ట్రాక్‌మీద ఎదురెదురుగా దూసుకొస్తున్నప్పుడు పరస్పరం ఢీకొనకుండా వాటంతట అవే నిలిచిపోయేలా సొంతగా రూపొందించిన కవచ్ పరిజ్ఞానానికి మరింత పదును పెట్టాలని రైల్వే శాఖ నిర్ణయించింది. పదేళ్ల పరీక్షలు, ట్రయల్స్ అనంతరం దాన్ని వినియోగించేందుకు గతేడాది రైల్వే బోర్డు అనుమతించిన విషయం తెలిసిందే. దక్షిణ మధ్య రైల్వేలో దాదాపు 1,500 కి.మీ. మేర ఈ పరిజ్ఞానాన్ని ఏర్పాటు చేసిన అధికారులు, దేశవ్యాప్తంగా అందుబాటులోకి తెచ్చేందుకు ఇటీవల టెండర్లు పిలిచారు. కానీ గత నెలలో ఒడిశాలోని బాలాసోర్ సమీపంలో జరిగిన ఘోర రైలు దుర్ఘటన అనంతరం కవచ్ పనితీరుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఆ దుర్ఘటనలో ఏకంగా మూడు రైళ్లు ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. దేశ చరిత్రలో ఎన్నడూ ఈ తరహా ప్రమాదం చోటు చేసుకోలేదు. ఇప్పటివరకు చోటుచేసుకున్న ఘోర దుర్ఘటనల్లో ఒకటిగా నిలిచే స్థాయిలో, 295 మంది వరకు దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. కవచ్ పరిజ్ఞానం ఆ మార్గంలో ఏర్పాటు చేసి ఉంటే, ఈ ప్రమాదం తప్పి ఉండేదంటూ అప్పట్లో కొందరు నేతలు వ్యాఖ్యానించారు. కానీ రైల్వే అధికారులు మాత్రం 'ఆ మార్గంలో ఒకవేళ కవచ్ పరిజ్ఞానం ఏర్పాటై ఉన్నా.. ఈ ప్రమాదాన్ని నిలువరించే వీలుండేది కాదు..'అని తేల్చి చెప్పారు. ఈ నేపథ్యంలోనే కవచ్‌ను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని స్పష్టమైంది.

కవచ్ ఏర్పాటు ఇక వేగవంతం..

ట్రయల్స్ స్థానికంగా నిర్వహించినందున దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 1,500 కి.మీ. మేర కవచ్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఢిల్లీతో లింక్ అయి ఉన్న మార్గాల్లో కనీసం 4 వేల కి.మీ. మేర ఏర్పాటు చేయాలని గతేడాది నిర్ణయించినా అది సాధ్యం కాలేదు. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఇక దాని ఏర్పాటు పనులు వేగంగా పూర్తి చేయాలని రైల్వే శాఖ నిర్ణయించింది. సంవత్సరానికి కనీసం 8 వేల కి.మీ. పూర్తి చేసేలా లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుంది. రెండు వేర్వేరు టెండర్ల ద్వారా 12 వేల కి.మీ. ఏర్పాటుకు సిద్ధమైంది. వచ్చే పదేళ్ల కాలంలో దేశవ్యాప్తంగా లక్ష కి.మీ. వరకు దాన్ని అందుబాటులోకి తేవాలని భావిస్తోంది.



ఒకే ట్రాక్‌పై రెండు రైళ్లు చేరువగా వచ్చినా, బ్రేక్ కొట్టాల్సిన సమయంలో లోకో పైలట్ విస్మరించినా, సిగ్నల్‌ను లోకో పైలట్ పట్టించుకోకుండా రైలును ముందుకు పోనిచ్చినా.. లోకో పైలట్‌తో ప్రమేయం లేకుండా కవచ్ పరిజ్ఞానం పని ప్రారంభించి ప్రమాదం జరక్కుండా నిలువరిస్తుంది. ఇది కవచ్ పనితీరును పరిశీలించే క్రమం (ట్రయల్స్)లో స్పష్టమైంది. అంతవరకు దాని పనితీరును శంకించాల్సిన అవసరం లేదు. కానీ బాలాసోర్ ప్రమాదం కొత్త అనుమానాలను తెరపైకి తెచ్చింది. ఆరోజు.. మెయిన్‌లైన్‌లో

కొత్త అనుమానాలు..

గ్రీన్ సిగ్నల్ ఉంది. ఎక్స్‌ప్రెస్ రైలు ఆ మేరకు దూసుకుపోయింది. కానీ ట్రాక్ పాయింట్ మాత్రం లూప్‌లైన్‌తో అనుసంధానమై ఉంది. దీంతో 127 కి.మీ. వేగంతో వచ్చిన రైలు ఒక్కసారిగా లూప్‌లైన్‌లోకి వెళ్లి.. అక్కడికి కేవలం 100 మీటర్ల దూరంలో నిలిచి ఉన్న గూడ్సు రైలును ఎనిమిది సెకన్ల (లూప్‌లైన్‌లోకి ప్రవేశించాక) వ్యవధిలోనే ఢీకొంది. దీంతో కవచ్ ఉన్నా.. ట్రాక్ పాయింట్ లూప్‌లైన్‌తో అనుసంధానమై ఉందన్న విషయాన్ని ముందుగా గుర్తించేది కాదని నిపుణులంటున్నారు. గ్రీన్ సిగ్నల్ ఉండటం, ఎదురుగా ఆ ట్రాక్‌పై మరో రైలు లేకపోవటంతో కవచ్ మిన్నకుండిపోతుందని చెబుతున్నారు. దీంతో ఇప్పుడు ఇదే కోణంలో కవచ్‌ను మరింత మెరుగ్గా తయారుచేసి, కొత్తగా పరీక్షలు నిర్వహించాలని రైల్వేశాఖ నిర్ణయించింది. సిగ్నల్‌కు విరుద్ధంగా, పాయింట్ తప్పుగా మరో లైన్‌కు లింక్ అయి ఉంటే దాన్ని కూడా కవచ్ గుర్తించేలా మార్చబోతున్నారు. కవచ్ పరిజ్ఞానాన్ని రూపొందించేందుకు దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని సనత్‌నగర్–వికారాబాద్–వాడీ సెక్షన్ల మధ్య ట్రయల్స్ చేసినందున.. తదుపరి పరీక్షలు కూడా ఇక్కడే చేసే అవకాశం ఉంది.

యూ ట్యూబ్ కలిపింది.. తల్లి, కుమారులను!



మధిర: తప్పిపోయిన తల్లి ఆచూకీ అనుకోకుండా తెలిస్తే.. చనిపోయిందనుకున్న అమ్మ ప్రాణాలతో ఇంటికి తిరిగి వస్తే.. ఆ ఇంట ఆనందమే ఆనందం ! ఆమె కుమారుల్లో సంతోషం అంతాఇంతా కాదు. ఓ యూట్యూబ్ వీడియో ఆ తల్లీకుమారులను కలిపింది. ఈ సన్నివేశం ఖమ్మం జిల్లా మధిరలో చోటు చేసుకుంది. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం పుల్లూరు శివారు కొత్తగూడెంకు చెందిన నాగేంద్రమ్మకు భర్త తిరుపతయ్య, కుమారులు ముత్తయ్య, శ్రీనివాసరావు ఉన్నారు. అయితే, నాగేంద్రమ్మకు మతిస్థిమితంలేక రెండేళ్ల క్రితం ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తప్పిపోయింది. కుటుంబీకులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. కొద్దిరోజులకు గ్రామ సమీపంలోని గుట్టపై కాలిపోయిన ఓ గుర్తుతెలియని మహిళ మృతదేహం లభించడంతో నాగేంద్రమ్మదిగా భావించి కుటుంబ సభ్యులు కర్మకాండలు పూర్తి చేశారు. ఇటీవల ముత్తయ్య విజయవాడకు చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ అనే సంస్థ ఒక అనాథ శరణాలయంపై రూపొందించిన యూట్యూబ్ వీడియోను వీక్షిస్తుండగా అందులో అకస్మాత్తుగా తల్లి కనిపించింది. వెంటనే నిర్వాహకులకు ఫోన్ చేసి ఆరా తీయగా అది ఖమ్మం జిల్లా మధిరలోని ఆర్కే ఫౌండేషన్ అనాథ శరణాలయం అని చెప్పారు. శుక్రవారం నాగేంద్రమ్మ కుటుంబ సభ్యులు మధిరకు వెళ్లి అనాథ ఆశ్రయం నిర్వాహకులు దోర్నాల రామకృష్ణ, జ్యోతిని కలిశారు. ట్రెయినీ ఐపీఎస్ అవినాశ్ కుమార్ సమక్షంలో నిర్వాహకులు నాగేంద్రమ్మను ఆమె కుటుంబసభ్యులకు అప్పగించారు. ఆమెను కుమారులు ఆనందంగా తమ వెంట తీసుకెళ్లారు.

కృత్రిమ మేధస్సుతో వ్యవసాయ సంక్షేమం

- డేటా ఆధారిత సలహాలతో రైతాంగం బలోపేతం
- సాగు బాగు ప్రాజెక్టు తొలి దశ నివేదిక విడుదల చేసిన మంత్రి కేటీఆర్



నివేదిక విడుదల చేస్తున్న మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: కృత్రిమ మేధస్సు వినియోగం ద్వారా రాష్ట్రంలో వ్యవసాయ రంగం సంక్షేమం కోసం కృషి చేస్తున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్, వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న 'సాగు బాగు ప్రాజెక్టు' తొలి దశ నివేదికను తమిళనాడు ఐటీ శాఖ మంత్రి డాక్టర్ పళనివేల్ త్యాగరాజన్‌తో కలిసి కేటీఆర్ శుక్రవారం విడుదల చేశారు. డేటా ఆధారిత సలహాలు, మార్కెట్ ఇంటెలిజెన్స్ తదితరాల ద్వారా రైతాంగాన్ని బలోపేతం చేస్తున్నట్లు వెల్లడించారు. కృత్రిమ మేధస్సుతో పాటు ఇతర అత్యాధునిక సాంకేతికతలను ఉపయోగించుకుంటూ భారత్‌లో వ్యవసాయ రంగంలో మార్పులు తెచ్చే లక్ష్యంతో 'సాగు బాగు' ప్రాజెక్టును అమలు చేస్తున్నామన్నారు.

ఖమ్మంలో మిరప రైతులకు 'సాగు బాగు'

'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫర్ అగ్రికల్చర్ ఇన్నోవేషన్' (ఏఐ4ఏఐ) నినాదంతో రాష్ట్ర ఎమర్జింగ్ టెక్నాలజీస్ వింగ్, వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. 2022లో ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని బిల్, మెలిండా గేట్స్ ఫౌండేషన్ సహకారంతో మూడు స్టార్టప్‌ల భాగస్వామ్యంతో అమలుచేస్తున్నారు. సాగు బాగులో భాగంగా ఖమ్మం జిల్లాలో 7వేలమందికి పైగా మిరప రైతులు వ్యవసాయ సాంకేతిక సేవలు, ఏఐ ఆధారిత సలహాలు పొందారు. కాగా శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, వ్యవసాయ శాఖ కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు, ఎమర్జింగ్ టెక్నాలజీస్ వింగ్ డైరక్టర్ రమాదేవి లంకా పాల్గొన్నారు.

నిమ్స్‌లో ఎంహెచ్‌ఎం కోర్సుకు దరఖాస్తు గడువు పొడిగింపు

ఆగస్టు 5వ తేదీ వరకు పెంపు

లక్డీకాపూల్ (హైదరాబాద్): నిజామ్స్ వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్)లో మాస్టర్ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ (ఎంహెచ్‌ఎం) కోర్సు దరఖాస్తుల గడువు ఆగస్టు 5వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు నిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యనారాయణ తెలిపారు. రిజర్వేషన్ ప్రాతిపదికన సీట్ల కేటాయింపు, అర్హులైన విద్యార్థులకు పూర్తిస్థాయి ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆర్టీసీ బస్‌పాస్ సదుపాయం ఉన్నాయని తెలిపారు. లోకల్, నాన్‌లోకల్ ప్రాతిపదికన తెలంగాణ అభ్యర్థులకు 85%, తెలంగాణేతరులకు 15% మేరకు సీట్ల కేటాయింపు జరుగుతుందన్నారు. www.nims.edu.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తుదారులు తమ ధ్రువపత్రాలను ఆగస్టు 9వ తేదీ లోగా నిమ్స్ డీన్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

అపోలోలో 23 వేల అవయవ మార్పిళ్లు

లక్డీకాపూల్: అపోలో ట్రాన్స్‌ప్లాంట్ ప్రోగ్రామ్‌ను 2012లో ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు 23 వేలకుపైగా అవయవ మార్పిళ్లను పూర్తి చేసినట్లు అపోలో హాస్పిటల్స్ శుక్రవారం ప్రకటించింది. అపోలో ట్రాన్స్‌ప్లాంట్ ప్రోగ్రామ్ ప్రపంచంలోని అత్యంత అధునాతన, సమగ్ర ట్రాన్స్‌ప్లాంట్ ప్రోగ్రామ్‌లలో ఒకటిగానూ, అత్యాధునిక సేవలకు ప్రసిద్ధిగాంచిందని పేర్కొంది. ఈ ప్రోగ్రామ్ ద్వారా ఏటా 1,200 అవయవ మార్పిడులను నిర్వహిస్తున్నట్లు వివరించింది. 2020లో కోవిడ్ గరిష్ఠ స్థాయిలో ఉన్నప్పటికీ 814 అవయవ మార్పిడి ఆపరేషన్లు చేపట్టామని... 2022లో అత్యధికంగా 1,641 అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు అపోలో వెల్లడించింది. ఈ ప్రోగ్రామ్ ద్వారా దేశంలోనే తొలిసారి గా 18,500 కిడ్నీ మార్పిళ్లు, 4,300 కాలేయ మార్పిళ్లు, 500 పీడియాట్రిక్ కాలేయ మార్పిళ్ల మైలురాళ్లను అధిగమించామని తెలిపింది.

గ్రామీణ యువత కోసం ఐటీ హబ్‌ల ఏర్పాటు

జాబ్ మేళాలో ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా



ఐటీ హబ్‌లో జాబ్‌మేళాకు వచ్చిన అభ్యర్థులతో సెల్ఫీ తీసుకుంటున్న ఎమ్మెల్సీ కవిత

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: గ్రామీణ యువతలో నైపుణ్యాలను వెలికి తీసేందుకే ద్వితీయ శ్రేణి నగరాల్లోనూ ఐటీ హబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా తెలిపారు. నిజామాబాద్ నగరంలో కొత్తగా నిర్మాణం పూర్తి చేసుకున్న ఐటీ హబ్‌లో ఉద్యోగాలు భర్తీ చేసేందుకు శుక్రవారం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేశ్ గుప్తా ఆధ్వర్యంలో 'టాస్క్'సంస్థ సహకారంతో జాబ్ మేళా నిర్వహించారు.

నాపై చేసిన ఆరోపణలు రుజువు చేయాలి

'తనపై ఆరోపణలు చేస్తున్న ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు 24 గంటల సమయం ఇస్తు న్నానని, ఆలోగా ఆరోపణలు రుజువు చేయక పోతే నిజామాబాద్ పులాంగ్‌చౌరస్తాలో ముక్కు నేలకు రాసి క్షమాపణలు చెప్పాలని' ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. నాకు ఎవరు ఒక్క రూపాయి ఇచ్చారో రుజువు చేయాలని, అర్థంపర్థం లేని ఆరోపణలు చేస్తే బాగోదని హెచ్చరించారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లాకేంద్రంలో కవిత విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడిరాష్ట్రంలో నిజామాబాద్ జిల్లాలో రింగ్ రోడ్డు పూర్తి చేయలేకపోతే, ఇప్పుడు మేం చేశామని చెప్పారు. నిజామా బాద్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ డబ్బులు ఏ కుటుంబం తిన్నదో ప్రజలకు తెలుసున్నారు. 'నా తండ్రిని అంటే వదిలేశా..ఇప్పుడు నా భర్తను కూడా విమర్శిస్తున్నారు..మజాక్ చేస్తే బాగుండదు. ఆయన రాజకీయాల్లో లేకున్నా పేరు ఎందుకు తీస్తున్నారంటూ' అర్వింద్‌ను ప్రశ్నించారు. అర్వింద్ ఎక్కడ పోటీ చేసినా అక్కడకు వెళ్లి ఆయన్ను ఓడించి బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపిస్తానని తేల్చి చెప్పారు. ఈ సమావేశంలో ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్యే గణేశ్ గుప్తా పాల్గొన్నారు.

31.29 గంటల్లో 72 కి.మీ. ఈత!

- ఇంగ్లిష్ చానల్‌ను రెండు వైపులా రిలేగా ఈదిన భారత పారా స్విమ్మర్లు
- ఆరుగురు సభ్యుల బృందంలో హైదరాబాద్‌వాసి శివకుమార్



కాచిగూడ: భారత్‌కు చెందిన ఆరుగురు దివ్యాంగ ఈతగాళ్లు ఇంగ్లాండ్–ఫ్రాన్స్ మధ్య ఉన్న ఇంగ్లిష్ చానల్ (అట్లాంటిక్ మహాసముద్రంలోని ఓ భాగం)ను రెండు వైపులా రిలేగా ఈది సరికొత్త రికార్డు నెలకొల్పారు. హైదరాబాద్‌కు చెందిన కోచ్ రాజోరియా తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌కు చెందిన దివ్యాంగుడు శివకుమార్‌తోపాటు ఎన్‌పి స్నేహన్ (తమిళనాడు), ఎల్విస్ అలీ హజారికా (అస్సాం), రిమో సాహా (పశ్చిమ బెంగాల్), సత్యేంద్రసింగ్ (మధ్యప్రదేశ్), జయంత్ దూబ్లే (మహారాష్ట్ర)తో కూడిన బృందం ఇంగ్లిష్ చానల్ ఈదడానికి ఈ నెల 8న లండన్‌కు వెళ్లారు. ఈ నెల 18న కెంట్‌లోని డోవర్‌లో సమీపంలో ఉన్న షేక్స్పియర్ బీచ్ నుంచి ఈత ప్రారంభించి ఉత్తర ఫ్రాన్స్‌లోని విస్సంట్ ఒడ్డును చేరుకొని తిరిగి డోవర్ వద్ద ఉన్న ఓల్డ్ సౌత్ ఫోర్‌ల్యాండ్ లైట్‌హౌస్ వద్దకు ఈ నెల 19న చేరుకున్నారు. భారీ అలలు, జెల్లీఫిష్‌లు సహా ఇతర ప్రమాదకర సముద్ర జీవుల నుంచి తప్పించుకుంటూ మొత్తం 72 కి.మీ. దూరాన్ని కేవలం 31 గంటల్లోనే ఈదారు. తద్వారా ఇంగ్లిష్ చానల్‌ను రిలేగా ఈదిన ఆసియా ప్రాంత వాసులుగా రికార్డు సృష్టించారు.

పప్పుచారులో పాముపిల్ల

- ఈసీఐఎల్ సెంట్రల్ క్యాంటీన్‌లో ఘటన
- యథావిధిగా భోజనం చేసిన ఉద్యోగులు



కుషాయిగూడ(హైదరాబాద్): ప్రతిరోజు వేలాదిమంది ఉద్యోగులకు మధ్యాహ్న భోజనం అందించే ఓ ప్రసిద్ధ కంపెనీ క్యాంటీన్ ఆహారపదార్థాల్లో పాముపిల్ల బయటపడింది. ఈ ఘటనతో ఉద్యోగులు ఒక్కసారిగా హడలిపోయారు. కుషాయిగూడలోని ఈసీఐఎల్ సెంట్రల్ క్యాంటీన్‌లో వండిన ఆహార పదార్థాలను చర్లపల్లిలోని ఈవీఎం సంస్థకు మధ్యాహ్న భోజనం నిమిత్తం ప్రతిరోజూ తరలిస్తుంటారు. అయితే శుక్రవారం మధ్యాహ్నం ఈవీఎం క్యాంటీన్లో సిబ్బంది ఆహార పదార్థాలను ఉద్యోగులకు అందించే సమయంలో పప్పుచారులో నుంచి ఓ పాముపిల్ల బయటపడింది. అయితే ఈ విషయం బయటికి పొక్కకుండా యజమాన్యం, సిబ్బంది జాగ్రత్త పడ్డారు. భోజనాల అనంతరం విషయం తెలుసుకుని ఉద్యోగులు భయకంపితులయ్యారు. కొంతమంది ఉద్యోగులు సంబంధిత క్యాంటీన్ సిబ్బందిపై మండిపడ్డారు. గతంలో కూడా ఈ క్యాంటీన్ ఆహారపదార్థాల్లో పలుమార్లు ఎలుకలు, బీడీలు, సిగరెట్లు వెలుగు చూశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేలాది మందికి భోజనం అందించే ఈసీఐఎల్ క్యాంటీన్ నిర్లక్ష్యంపై స్పందించి, బాధ్యులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కంపెనీ యాజమాన్యంపై కూడా ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని కోరారు.

నేడు పాస్‌పోర్టు స్పెషల్ డ్రైవ్

రాంగోపాల్‌పేట్ (హైదరాబాద్): హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయ పరిధిలోని ఐదు పాస్‌పోర్టు సేవాకేంద్రాలు, 14 పోస్టాఫీస్ పాస్‌పోర్టు సర్వీస్ సెంటర్లలో శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి దాసరి బాలయ్య ఓ ప్రకటనలో తెలిపారు. పాస్‌పోర్టులు, పీసీసీల స్పెషల్ డ్రైవ్ కోసం 3,700 అపాయింట్‌మెంట్లు విడుదల చేయగా అవన్నీ బుక్ అయ్యాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం 21, 22వ తేదీల్లో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలలు, విద్యాసంస్థలకు సెలవు ప్రకటించినప్పటికీ షెడ్యూల్డ్ ప్రకారం అన్ని కేంద్రాల్లో ఈ స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని తెలిపారు.

పంచాయతీ సమస్యలపై నేడు మంత్రితో చర్చలు

సాక్షి, హైదరాబాద్: గ్రామపంచాయతీ సిబ్బంది సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. శనివారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో పంచాయతీ రాజ్ శాఖమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో గ్రామపంచాయతీ జేఏసీ నాయకత్వంతో చర్చలు జరగనున్నాయి. జీపీ సిబ్బందిని పర్మినెంట్ చేయడం, ప్రభుత్వమే వేతనాల బడ్జెట్ కేటాయించడం, పీఆర్సీలో నిర్ణయించిన మేరకు రూ.19 వేల బేసిక్ పే, జీవో 60 ప్రకారం మున్సిపల్ సిబ్బంది లాగా గ్రామ పంచాయతీసిబ్బందికి కూడా సమాన వేతనాలు, కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా పదోన్నతుల కల్పన, వంటి డిమాండ్లపై 21 రోజులుగా జేఏసీ ఆధ్వర్యంలో సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సమ్మె పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, ఈనెల 16 నుంచి కురుస్తున్న వర్షాల వల్ల తలెత్తిన ఇబ్బందులను పరిష్కరించాలని మంత్రి ఎర్రబెల్లికి సీపీఎం మాజీ ఎమ్మెల్యే జూలకంటి, జేఏసీ చైర్మన్ పాలడుగు భాస్కర్ వినతిపత్రం అందించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి.. శనివారం తమను చర్చలకు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారని జేఏసీ నాయకులు వెల్లడించారు. ప్రభుత్వ అధికారులతో జరిపే చర్చల్లో జేఏసీ చైర్మన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, జేఏసీ కన్వీనర్లు, కో–కన్వీనర్లు, జేఏసీలోని భాగస్వామ్య యూనియన్ల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొనాలని కోరారు.

ప్రతి ఘర్షణలో స్త్రీలే యుద్ధ ట్రోఫీలు

- మణిపూర్ హింసపై సీఎం కార్యదర్శి స్మితా సబర్వాల్ ఆవేదన
- రాజ్యాంగ అధికారాలను వినియోగించాలని రాష్ట్రపతికి విన్నపం



సాక్షి, హైదరాబాద్: 'ప్రతి సంఘర్షణలోను స్త్రీలను యుద్ధ ట్రోఫీలు (విజిత వస్తువులు)గా పరిగణించారు అన్న విషయానికి చరిత్రే సాక్ష్యం. 70 రోజుల మణిపూర్ హింసాకాండ తర్వాత బయటికొస్తున్న భయంకరమైన దృశ్యాలు మనల్ని నిలువునా కదిలించి వేస్తాయి. 50 లక్షల మంది నిర్వాసితులయ్యారు. స్త్రీలను వివస్త్రలను చేసి ఊరేగించారు. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభం అయిన మీడియా ఏం చేస్తోంది? ఎందుకు ఒక రాష్ట్రాన్ని తగలబడిపొమ్మని వదిలేశారు?' అని సీనియర్ ఐఏఎస్ అధికారి, సీఎం కార్యదర్శి స్మితా సబర్వాల్ ట్విట్టర్ వేదికగా ఆక్రోశం వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల కోసమే తనకు దత్తమైన రాజ్యాంగ అధికారాన్ని వినియోగించాలని (పరోక్షంగా రాష్ట్రపతి పాలన విధించాలని సూచన) రాష్ట్రపతిని కోరారు. హద్దులు, నైతికత లేని మెజారిటీ మనోభావాలు మన ఘనమైన నాగరికతను ఎలా భ్రష్టు పట్టించగలవనే విషయానికి ఇదో తార్కాణం అని పేర్కొన్నారు. ఆమె ట్వీట్ వైరల్ కావడంతో చాలా మంది స్మితా సబర్వాల్‌కు మద్దతు తెలిపారు. కాగా, మరికొందరు ఆమెపై తీవ్ర విమర్శలు చేస్తూ ట్రోల్ చేశారు. దేశంలో ఎక్కడో జరిగిన సంఘటనలపై ఆమె స్పందిస్తున్నారని, రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై స్పందించడం లేదని విమర్శిస్తున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే దుర్గం చెన్నయ్య లైంగికంగా వేధించారని షేజల్ అనే మహిళ ఫిర్యాదు చేసినా ఆమెకు న్యాయం లభించలేదని, ఈ విషయంలో స్మితా సబర్వాల్ మౌనంగా ఉండటం సబబు కాదని పేర్కొంటున్నారు. దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న దురాగతాలపై స్మితా సబర్వాల్ గత కొంతకాలంగా ట్విట్టర్ వేదికగా తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.